37/10

# వీరభద్రవిజయము

## సవిమర్శక పరిశీలనము

# A CRITICAL STUDY OF
# VEERABHADRA VIJAYAMU

55667



భాషాప్రవీణ :

**డా॥ కొల్లిబాబూ రాజేంద్రప్రసాద్ M.A., Ph D.,**
తెలుగు లెక్చరర్
ప్రభుత్వజూనియర్ కళాశాల – పెనుమూరు.
చిత్తూరు జిల్లా.

37/10

# వీరభద్రవిజయము సవిమర్శక పరిశీలనము

# A Critical Study of Veerabhadra Vijayamu

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము నుండి
పిహెచ్.డి. పట్టమును 1989వ సంవత్సరమున
పొందిన సిద్ధాంతవ్యాస గ్రంథము

గ్రంథకర్త
"భాషాప్రవీణ"
డా॥ కొల్లిబాబూ రాజేంద్రప్రసాద్
ఎం.ఏ , పిహెచ్.డి.,
ఆంధ్రోపన్యాసకులు
ప్రభుత్వజూనియర్ కళాశాల
పెనుమూరు, చిత్తూరు జిల్లా, - 517 126

PLACED ON THE SHELF
Date........

ప్రథమ ముద్రణము : **1991**
ప్రతులు : 1000
సర్వస్వామ్యములు : గ్రంథకర్తవి.

ప్రతులకు :
**శ్రీమతి కె. విజయలక్ష్మి**
కాకులపాడు - పోస్టు,
బాపులపాడు మండలం,
జిల్లా.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No 55667
Date........
TIRUPATI.

**వెల : 75-00 రూ॥లు**

ముద్రణ.
**పూర్ణిమా ప్రింటింగ్ & బైండింగ్ వర్క్స్, పాకాల,**
చిత్తూరు జిల్లా.


# అంకితము

జన్మనిచ్చిన తండ్రి మధుర స్మృతి చిహ్నముగ
జగన్మాత దుర్గామాతకు



సీ॥ ఏ తల్లి కరుణాంబు స్రోతస్సు సరస సాహిత్యానుషంగంబు హెచ్చుఁగూరు
ఏ తల్లి మధురామృతేక్షణ జ్యోత్స్నలు జ్ఞాన సందీప్తులు నాకు నిచ్చు
ఏ తల్లి పాద ద్వయీ సేవనంబది కామితార్థంబులు గలుగ నిచ్చు
ఏ తల్లి శాబ్దసంఘాత స్నేహప్రభలు దేహ సంచాలనాదృఢత నిచ్చు

తే॥ అమ్మహా దేవి దుర్గ మాయమ్మ నేను
హృత్కమల మందు నిల్పుచు హెచ్చుభక్తి
నియ్యదర్పించి తనియెద నిష్ఠమెసగ
స్వర్గమందున్న నా తండ్రి సంతసింప



ఎందరో మహానుభావులు అందరికీ అభినందనములు

# కృతజ్ఞతలు

నా యీ గ్రంథముద్రణమునకు 10,000రూ॥లు ...రి విరాళము నొసంగిన తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి వారికి హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పించుకొనుచున్నాను.



తెలుగు శాఖలోనాకు ఈ పరిశోధనావకాశమును కల్పించిన మదనపల్లి బి.టి.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీడి, కోదండపాణిగారికి నావినయపూర్వక కృతజ్ఞతాభి వందనములు. "వీరభద్ర విజయము - సవిమర్శక పరిశీలనము" ను పరిశోధ నాంశముగ నిర్ణయించి, తగు సలహాలనిచ్చి, సిద్ధాంత వ్యాసమును త్వరలో ఆ మూలాగ్రము పరిశీలించి, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయమునకు సమర్పించుటకు కారకులైన డా॥సి. రమణయ్య రీడర్-తెలుగు విశ్వవిద్యాలయము-రాజమహేంద్రి గారికి కృతజ్ఞతాభివందనములు.

పరిశోధనయందు సలహాలనొసగి ఆశీర్వదించిన ఆచార్య జీరెడ్డిచెన్నారెడ్డి గారికి, ఆచార్య బాడాలరామయ్య గారికి, ఆచార్య సర్వోత్తమరావు గారికి నానమ స్సుమాంజలులు

"వీరభద్రవిజయము" తాళపత్రప్రతులను పరిశీలించుటకు అనుమతి నిచ్చిన **S.V.U.O R.I** డైరెక్టర్‌గారికి, పరిశోధనకవసరమగు గ్రంథముల నొసగి సహకరించిన డా॥ ఆనంద్‌గారికి, వీరశైవ పూజా సంప్రదాయములను సేకరిం చుటకు సాయపడిన మైసూరు సంస్థాన విద్వాంసులు శ్రీ కె.ఏ. నరసింహచార్యులు గారికి, శ్రీరేవణ సిద్ధాంతిగారికి, ప్రణవానంద స్వాములవారికి,

పరిశోధనా విషయమున నన్నెంతగనో ప్రోత్సహించి సహకరించిన శ్రీ జి. విశ్వనాథ నాయుడు, శ్రీ జి. అన్నయ్య నాయుడు, శ్రీమతి కె. ద్వారకమ్మ, డా॥ ఏ. పద్మబాల, శ్రీ టి. పెరుమాళ్ గార్లకు.

నా పరిశోధన యందు అడుగడుగున సహకారము నందించిన నా శ్రీమతి కె. విజయలక్ష్మి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

సకాలములో గ్రంథమును ముచ్చటగ ముద్రించి అందించిన పూర్ణిమా ప్రెస్ పాకాల నిర్వాహకులు పి. శ్రీ ఆంజనేయులునాయుడు గారికి, ప్రెస్‌స్టాఫ్ చిరంజీవి యస్. ఉమాపతి, కుమారి ఉమ గార్లకు కృతజ్ఞతాభినందనలు.

ఎందరో మరెందరో మహానుభావులు అందరికి నా కృతజ్ఞతాంజలులు.

ఇట్లు

**గ్రంథకర్త**

# విషయసూచిక


1. ప్రకరణము - 1

బమ్మెరపోతన వంశవృక్షము – కాలము - కృతులు

2. ప్రకరణము - 2

వీరభద్రవిజయము – కర్తృత్వము పరిష్కరణ

3. ప్రకరణము - 3

వీరభద్రవిజయము – ఇతివృత్తము

మూలము – మార్పులు చేర్పులు

4. ప్రకరణము - 4

వీరభద్రవిజయము – కవితారీతులు

5. ప్రకరణము - 5

పోతన కృతులు - తులనాత్మక పరిశీలనము

6. ప్రకరణము - 6

వీరభద్రవిజయము - భక్తితత్త్వము

7. ప్రకరణము - 7

వీరభద్రవిజయము - సమకాలీన సాంఘికపరిస్థితులు

8. ప్రకరణము - 8

ఆంధ్రసాహిత్యమున పోతన స్థానము

# ప్రకరణము - 1

## బమ్మెరపోతన వంశము
## కాలము - కృతులు

# బమ్మెర పోతన వంశవృక్షము కాలము - కృతులు

శ్రీ మదాంధ్ర సాహిత్య గంగాలహరి వేయేండ్లకు పూర్వము రాజరాజ నరేంద్రుని ఆస్థానమున సర్వాంగ సుందరముగ ఆవిర్భవించి దర్శనమిచ్చినది. ఎందరో మహాకవులు ఈ మహాతీర్థమునకు౧ంకులిడి తరించిరి. వీరందరును అపార మైన లౌకికప్రజ్ఞ, కూలంకషమైన వైదికసంపత్తి, అనన్య సాధారణమైన ఆర్ష విభూతి కలిగి అలౌకికానందమును సాహిత్యము వలన కల్గించిరి, పోతన ఈ కోవలోని వాడే.

'నానృషిః కవిరిత్యుక్తమృషిశ్చకిల దర్శనాత్
విచిత్రభావ.. ..... ... ...... . . .

నోదితా కవితాలోకే యావజ్జాతావన వర్ణనా'' (కావ్య॥ సంగ్ర॥ పు 89) అనినటుల ఋషికానివాడు కవికాడు. ఋషియన ద్రష్ట తత్త్వ దర్శనముగల వాడు. లోకమున దర్శనము, వర్ణనము అనువానివలన కవిగ ప్రసిద్ధినొందునని విజ్ఞులైన ఆలంకారికుల అభిప్రాయము. ఏ తల్లక్షణమునకు లక్ష్యప్రాయుడును తత్త్వదర్శనముగలవాడును, త్రివర్గయుత మోక్షమునుకోరి కలముచేపట్టిన పరమ భక్తాగ్ర గణ్యుడును అయినవాడు బమ్మెరపోతన. తన సాహితీ గంగాఝరిని ప్రవహింపజేసి తెలుగుదేశమును పునీతముగావించిన మహాభాగ్యశాలి. మహాయోగి మహామనీషి బమ్మెరపోతన.

పోతన 'వీరభద్రవిజయము', 'భోగినీదండకము' 'నారాయణశతకము' 'భాగవతము'-అను నాల్గు కృతులను రచించి చిరస్మరణీయుడయ్యెను.

## పోతన నివాసము:-

బమ్మెరపోతన నివాసస్థల విషయమై చాలా కాలము పండితులలో వివాదము చెలరేగినది. పోతన మాత్రము 'భాగవతము 'కృత్యాదిలో, "ఇట్లు భాసిల్లెడు,

శ్రీమహాభాగవతపురాణ పారిజాత పాదప సమాశ్రయంబున హరికరుణా విశేషం బున గృతార్థత్వంబు సిద్ధించెనని బుద్ధి నెఱింగితేచి మరలి కొన్ని దినంబులను నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురు వృద్ధబుధబంధు జనాను జ్ఞాతుం డనై" (శ్రీమదాంధ్ర మహా భాగవతము - ప్రథమస్కంధము - పుట-21) అని ఏక శిలానగరమును పేర్కొనెను.

క్రి. శ. 1848లో భాగవతమును ముద్రించిన పురాణం హయగ్రీవశాస్త్రి గారు పోతన స్వగ్రామము ఏకశిలానగరమని తెలుపుచు, 'దీనికి మారుపేరు 'ఒంటిమిట్ట' అది కడపకు దక్షిణముగ దగ్గరలో ఉన్న' దని తెల్పిరి. దీని నాధారముగ గొని వావిలికొలను సుబ్బారావు గారు పోతన నివాస మును ఒంటిమిట్ట యని ప్రబలముగా వాదించినారని (పోతన వైచిత్రి - పుట-5) డా॥ నిడదవోలు రామకోటిశాస్త్రి గారు వివరించిరి. క్రి.శ. 1935 లో ప్రచురింపబడిన ఆంధ్ర మహా భాగవతమున ఉపోద్ఘాతములో శ్రీ నాగపూడి కుప్పు స్వామయ్యగారు కూడా "బమ్మెరపోతనామాత్యుండు కడప మండలములో నున్న యేకశిలానగరము నామాంతరముగల యొంటిమిట్ట యందుండినవాడు" (ఆంధ్ర మహాభాగవతము - ఉపోద్ఘాతము - పుట-41) అని వ్రాసియిచ్చిరి.

శ్రీ గురజాడ శ్రీరామమూర్తి తమ 'కవిజీవితములు' లో 'ప్రతాపరుద్రుని రాజధానియగు నోరుగల్లునకే యీ నామమున్న (కవి జీవితములు - పుట-593) దని తెలంగాణమునందలి ఓరుగల్లును (ఇప్పటి వరంగల్లు) చూపిరి. శ్రీ జయంతి రామయ్యపంతులు గారు దీనిని బలపరచిరి. కందుకూరివీరేశలింగం పంతులు గారు "ఇంటిపేరును బట్టి పోతన పితృపితా మహాదుల వాసస్థానము బమ్మెరయను గ్రామమయినట్టు సులభముగ తెలిసు కొనవచ్చును. అతడా గ్రామములోనే పుట్టిన వాడైనను రాజధానియైన ఓరుగల్లు చేరి భాగవత రచనచేసి యుండును. ఈ బమ్మెర గ్రామము ఓరుగంటికి సుమారు ఘూడామడల దూరములో నల్లగొండ మండలమునందున్నది. ఇక ఒంటిమిట్టకు దగ్గరలో బమ్మెర అను ఊరెక్కడను లేదు అసలు కడప మండలములోనే లేదు.

కనుక ఏకశిలానగరము నైజాము రాజ్యములోని ఓరుగల్లే కాని ఒంటిమిట్ట కాదు "(ఆంధ్ర కవులచరిత్ర — పుట - 552) అని చెప్పిరి. ఒంటిమిట్టకు ఏకశిలానగరము సంస్కృతీకరణము వారనుగలరు' మిట్ట యనగ పర్వతమగుటచే అది సరియగు సంస్కృతీకరణము కాజాలదు. శ్రీధూళిపాళ శ్రీరామమూర్తి గారు 'ఒంటడు' 'మిట్టుడు' అను బోయుల వలన ఒంటిమిట్టకు ఆ పేరు వచ్చినది (శ్రీమదాంధ్ర భాగవతానుశీలనము - పుట-5)" ని తెల్పిరి. కాని ఏకశిలానగరము ఓరుగల్లేనని వీరు నిర్ధారించిరి.

ఇక కాకతీయ చక్రవర్తుల నాటి శాసనముల వలనను, 'సింహాసన ద్వాత్రింశిక' మొదలగు గ్రంథముల వలనను ఓరుగల్లునకు ఏకశిలానగరమని వ్యవహారమున్నటుల స్పష్టముగ తెలియుచున్నది. విద్యానాథుడు,

"భూరేవభువనం స్వయంభూరేవ పార్థివః"

ప్రతాపరుద్ర ఏవైక శిలైనగరేశ భూ.. జగత్సువసుధాభాతితస్యామేక శిలాపురీ (ప్రతాపరుద్రీయమ్ - పుట-390-404)

కాకతీయాన్వయస్తత్రతస్మిన్ రుద్రనరేశ్వరః ("ప్రతాపరుద్రీయమ్ - పుట – 390-404) అని అనేక పర్యాయములు కాకతీయుల రాజధాని ఓరుగల్లును ఏకశిలానగరమని పేర్కొనెను. కనుక ఓరుగల్లే ఏకశిలానగరమని తెలియనగును.

పోతన కృతమైన నారాయణ శతకము సందలి 97వ పద్యములో 'ధర్మపురి లక్ష్మినారాయణా" అని పేర్కొని యుండుట గమనింపదగినది. 'ధర్మపురి తెలంగాణమున ఓరుగల్లునకు సమీపమున నున్నది. ధర్మపురిలో లక్ష్మినారాయణాలయమున్నదని' శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు తెలిపిరని (ఆంధ్రకవితరంగిణి - సం: 5 – పుట 198) చాగంటి శేషయ్యగారు వివరించిరి. ఆ శతకరచనకు ఆభగవంతుడే ప్రేరణయనియు వారి అభిప్రాయము. కావున దీనిననుసరించి చూచినను పోతన నివాసము ఓరుగల్లు అనియే స్పష్టము.

పోతన భాగవతము కృత్యాదిలో 'ఒక్కరాకానిశాకాలం బునసోమోప రాగంబురాకఁగని సజ్జనానుమతంబున నభ్రంకష శుభ్రసముత్తుంగ భంగయగు గంగకుంజని క్రుంకులిడి వెడలిమహనీయ మంజుల పులిన తలమండప మధ్యం బున మహేశ్వర ధ్యానంబుసేయుచు . . కృతార్థత్వంబు సిద్ధించెనని నెఱింగి లేచి మరలి కొన్నిదినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి (శ్రీమదాంధ్ర భాగవతము - ప్రథమస్కంధము - పుటలు 3-4) అని పేర్కొనియున్నాడు. దీనిని పరిశీలించినను, ఓరుగల్లునకు సమీపమున గోదావరిగలదు. "గోదావరికి గంగ అను వ్యవహారము ఆంధ్రమహాభారతము, కాశీఖండము, భాస్కర రామాయణము, పద్మపురాణము మొదలగు పెక్కు గ్రంథములందు కనిపించు చున్నటుల" (శ్రీమదాంధ్ర భాగవతానుశీలనము – పుట 4) తెలియుచున్నది. శేషాద్రిరమణ కవులు యీ విషయమునే, "గంగా గోదావరీ పదములు భాస్కర రామాయణ మతాను సారము సమానార్థకములు" (ఆంధ్రమహాభాగవత విమర్శనము - పుట 68) అని పేర్కొనిరి. మరియు వీరు మడికి సింగన పద్మపురాణములోని కొన్ని ఉదాహరణములను చూపి, "మడికి సింగన్న ఓరుగల్లు చెంతనున్న రామగిరి నివాసి, రామగిరిగోదావరి తీరముననున్నది. నిజాము దేశమున గంగయని గోదావరిని వ్యవహరించుటయును గలదు" (ఆంధ్రమహాభాగవత విమర్శనము - పుట 68) అని చక్కగ వివరణనిచ్చి యున్నారు.

ఓరుగల్లునకు గోదావరి పది ఆమడల దూరమున నున్నది. నేటికిని గోదావరీస్నానార్థమేగువారు నాలుగైదు రోజులు ముందుగనే బయలుదేరి తీరమును చేరు కొనుట గలదు. కావుననే పోతన 'మఱలి కొన్ని దినంబులకు నేకశిలా నగరంబునకుం జనుదెంచి' అని అవతారికలో చెప్పుకొను ట జరిగినది.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు 'పోతనామాత్యుని శిష్యులైన వెలిగందుల నారయ, ఏర్చూరి సింగన కవుల యింటి పేళ్లఁబరగిన వెలిగందుల ఏర్చూరి గ్రామములు కూడ తెలంగాణము నందే యున్నవి' అని పేర్కొని ఓరుగల్లే పోతన నివాసముగ స్థిరపరచిరి.

శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ గారు, 'ఏకశిలానగరమన్నది కాకతీయుల రాజధానియైన యోరుగంటికే రూఢియైన పేరు' (అంధ్రభాగవతోపన్యాసములు - పుట 10) అని చెప్పియున్నారు.

శ్రీవానమామలై వరదాచార్యులు వారు మాత్రము, ఓరుగల్లు, ఒంటిమిట్ట రెండు చోటుల పోతనగారు వాసము చేసినటుల కథను కల్పించి కావ్యమును (పోతన చరిత్రము) సంతరించి. విమర్శకులలో గల వాదములను సమన్వయపరచిరి. కాని వీరు కావ్యమునకు ముందు వ్రాసిన 'విజ్ఞప్తి' లో. "ఓరుగల్లు - ఏకశిల' అనుపదముల యందలి సరియైన పోలిక నరసి బమ్మెర దగ్గర ఓరుగల్లు వాడే అను చారిత్రక సిద్ధాంతమును విశ్వసించి నటులనే వ్రాసితిని" (పోతన చరిత్రము - విజ్ఞప్తి పుట 74) అని పేర్కొనిరి.

"పోతన వంశీయులు నేటికిని ఓరుగల్లు దగ్గర నున్న బమ్మెరగ్రామములో నున్నటుల" (పోతన వైచిత్రి) శ్రీకేతవరపు రామకోటిశాస్త్రి గారు పేర్కొనెరి. ఓరుగల్లే పోతన నివాసమని శాస్త్రి గారు విశ్వసించి, యీ విషయమునకు సంబంధించిన సమస్త వాద ప్రతి వాదములను వివరించిరి. (పోతన్న వైచిత్రి - పుటలు 5-9-10).

కావున పైపరిశీలనములను బట్టి, ఏకశిలానగరము ప్రస్తుత ఓరుగల్లే యనియు, ఏకశిల' 'ఒంటిమిట్ట' కు సరియైన సంస్కృతీకరణము కాజాలదనియు, మరియు పోతన భాగవతములో పేర్కొనిన 'గంగ' ఓరుగల్లు సమీపమున ప్రవహించు గోదావరీనది యనియు వివరింపవచ్చును. పోతన శిష్యులు నారయ్య, గంగనలు తెలంగాణా వాసులగుటచేతను, బమ్మెర వంశీయులు నేటికిని బమ్మెర గ్రామములో నుండుటచేతను, పోతన పౌత్రులును, "దాక్షాయణీ పరిణయ" కావ్యకర్తలును అయిన కేసన, మల్లనలు తెలంగాణ మందుండిరని తెలియుట చేతను, పోతన ఓరుగల్లునకు సమీపమున గల 'బమ్మెర' వాసియని నిర్ధారింపవచ్చును.

## పోతన వంశవృక్షము:-

పోతన కృతులను బట్టి ఆయన వంశమును గూర్చి సవిస్తరముగ తెలిసుకొనుటకు అవకాశము గలదు. పోతన బాల్య కృతియైన 'వీరభద్ర విజయము'న విపులముగను, వయః పరిపాకమున వ్రాసిన భాగవతమున స్థూలముగను తన వంశ వర్ణనము గావించియున్నాడు.

## వీరభద్ర విజయమును బట్టి పోతన వంశ వివరములు:-

వీరభద్రవిజయమునందలి 'పీఠిక' లో 'స్వకవివంశాభివర్ణన' లో పోతన తన వంశవృక్షమును పదునెనిమిది పద్య, గద్యములలో క్రింది విధముగ వివరించియున్నాడు.

మాధవుని నాభికమలమున బ్రహ్మ జన్మించెను. బ్రహ్మవలన వశిష్ఠుడుద్భవించెను. వశిష్ఠునకు పుత్రుడు కౌండిన్యుడు. అట్టి కౌండిన్యుని గోత్రమునందాపస్తంభ సూత్రమున పోతనగారి వంశ మూల పురుషుడు 'మల్లన' జన్మించెను. మల్లనకు భీమన - భీమనకు అన్నమ జన్మించెను. అన్నయ భార్య గౌరమ. వీరికి సోమన జన్మించెను. సోమన సజ్జన విధేయుడని కీర్తిని పొందెను.

సోమన భార్య మల్లమ. సోమన మల్లమలకు, రేచన, అన్నయమంత్రి ఎల్లన, అయ్యలు ప్రెగడ, మాచయనాగడు - అను ఐదుగురు తనయులుదయించిరి. వీరిలో పెద్దవాడైన రేచన నీతి యుగంధరుడనియు, నిర్మలుడనియు పేరుపొందియున్నాడు. ఎల్లన సర్వ శైవలోకాతుర హరుడని, నీతిమంతుడని, వనితాకందర్పుడని ప్రసిద్ధి నొందెను. మాచయ దయాగుణ విభూషణుడని వన్నెకెక్కెను. ఈ సోదర పంచకములోని మూడవవాడైన ఎల్లన సతీమణి మాచాంబిక. ఎల్లనకు మాచాంబికకు కేసన, మాధవుడు, ఇమ్మడి నాగయ్య అను పుత్రత్రయము ఉదయించెను. వీరుమువ్వురును, ధర్మజ భీమ పార్థులను పోలిన వారట. ఇమ్మడి నాగయ్య దానశీలమును, పోతనగారు అవతారికలో ఘనముగ శ్లాఘించిరి.

"ఇమ్ములవర్థికోటి ధనమిమ్మని పల్కవ పల్కకంటెఁ దా
నిమ్మడినిచ్చు నిచ్చమది నిమ్మడి పుణ్యముఁబొందు భాతి లో
కమ్ములఁ గీర్తి జెందగణక్షవజమాన్యుడు మానికంబు మా
యిమ్మడి సర్వమార్గమ్ముల నిమ్మడిగాక తలంప నల్పమే" (32) అని
పోతన కీర్తించెను.

ఎల్లన, మాచాంబిక ప్రథమపుత్రుడైన కేసనయే పోతన తండ్రి. కేసన

కం॥ "సాధుగుణాఢ్యుడు కేసన.
మాధవనందనుడు రూపమహితవిభూతిన్
మాధవతల్పము దక్షత
మాధవుడనుకంప వృత్తి మాధవుడయ్యెన్" (33) అని కీర్తింపబడి యున్నాడు.
కేసన భార్య లక్మి (ఈమె భాగవతము నందు లక్కమాంబ, లక్కసావిగ పేర్కొనబడినది). వీరిరువురి నోముల పంటయే తిప్పన, పోతనలు. ఈ పోతనయే వీరభద్రవిజయ కర్త.

పోతన తన తల్లి లక్ష్మని, గౌరీ, లక్ష్మి, భారతీ దేవుల తోడను, భూదేవి, గంగాదేవి, కుంతీదేవి, శచీదేవి మొదలగు వారల తోడనుపోల్చి మాతృభక్తిని ప్రకటించుకొనెను. తన తల్లి దండ్రులు నిరంతర సంతోష చిత్తులని, దయాపాదితగుణులని, శంకరపాదయుగాంభోజ భక్తి పారీణులని, పోతన ప్రస్తుతించెను. అగ్రజుడైన తిప్పన పవిత్రాచారుడని, కాంతివైభవమున సంపూర్ణ చంద్రుడని, దక్షతలో ఆదిశేషుడని, మహా ధర్మకరుఁడని, రూపురేఖా విలాసములలో కందర్పుడని పోతన వివరించెను. తన పెద్దల గుణగణములను వివరించిన పోతన తనను గూర్చి గొప్పగ ఏమియు చెప్పకుండుట అతని వినయ సంపదకు తార్కాణమనవచ్చును.

## వీరభద్రవిజయము – వంశవృక్షము

మల్లన
↓
భీమన
↓
అన్నయ్య - గౌరమ (భార్య)
↓
సోమయ - మల్లమ (భార్య)
↓

- రేచన
- అన్నయ
- ఎల్లన – మాచమ్మ (భార్య)
  - కేసన – లక్ష్మి (భార్య)(భాగవతమున లక్కసాని)
    - తిప్పన
    - పోతన
  - మాధవుడు
  - ఇమ్మడి నాగయ్య
- అయ్యలుప్రెగడ
- మాదయ నాగడు

## భాగవతము - వంశవివరములు:-

పోతన భాగవతము నందు కృత్యాదిలో 'గ్రంథకర్తవంశ వర్ణనము' అని నాలుగు పద్యములలో వంశ వర్ణనము గావించియున్నాడు. భాగవతము నందలి వంశవర్ణన వీరభద్రవిజయము నందలి వంశ వర్ణన కంటె సంక్షిప్తమన వచ్చును.

భాగవతము నందు భీమన కుమారుడు అన్నయ, అన్నయ అర్ధాంగి గౌరమాంబ. అన్నయ గౌరమ పుత్రుడు సోమన సోమన సతీమణి మల్లమ. సోమన మల్లమల సంతానము ఎల్లన. ఎల్లన యిల్లాలు మాచమ. ఎల్లన మాచమల తనయుడు కేసన. కేసన ధర్మగేహిని లక్కమాంబ. కేసన లక్కమాంబలకు తిప్పన, పోతన అను యిరువురు తనయులు' అని పోతన తన వంశ వర్ణనము గావించియున్నాడు.

వీరభద్రవిజయము నందు వలె పోతన భాగవతము నందు మాతా పితలను, సోదరుని నుతించియున్నాడు. పోతన తన తండ్రి కేసనను, లలిత మూర్తియని, బహుళకళానిధియని, దానవ్రతుడని, నీతియుతుడని, శైవశాస్త్ర మతమును కనినవాడని ప్రస్తుతించెను. తల్లి లక్కమాంబ గుణవతియని, మంచి యిల్లాలని,

కం॥ "నడువదు నిలయము వెలువడి.
తడవదు పరపురుషగుణముఁ దనపతినుడువుం
గడవదు వితరణ కరుణలు
విడువదు లక్కాంబ విబుధ విసరము వొగడన్" (1 స్కం–25)

అని ఆమె సకల సద్గుణ సంపన్నురాలని శ్లాఘించెను. తన తల్లిదండ్రులిరువురు నిరంతర మహేశపాద పద్మయుగళ ధ్యాన నిమగ్నులని తెల్పెను. పోతన తన అన్నయగు తిప్పనను ఈశ్వర సేవాకాముకుడని తెల్పెను. పోతన మాత్రము సాధునయ యుక్తుడని తెలియు చున్నది.

## భాగవతము – పోతన వంశవృక్షము

భీమన
↓
అన్నయ గౌరమాంబ (భార్య)
↓
సోమన మంత్రి మల్లమ (భార్య)
↓
ఎల్లన మాచమ (భార్య)
↓
కేసన లక్కమాంబ/లక్కసాని (భార్య)
↓
తిప్పన | పోతన

పోతన కృతులైన భోగినీదండకము, నారాయణశతకములందు పోతన వంశ వర్ణనము కానరాదు వీరభద్రవిజయము, భాగవతముల ననుసరించి పోతన వంశమును పరిశీలించిన వీరిది శైవ కుటుంబమని, వీరందరు ఆది నుండి ఈశ్వర సేవాకాముకులని తెలియుచున్నది. కావుననే పోతన బాల్య దశలో శైవమత సంప్రదాయ యుక్తమైన వీరభద్రవిజయమును రచించెనని చెప్పవచ్చును.

ఇక పోతన తరువాతి వంశమును తెలిసి కొనుటకు కేసన మల్లనల కృతమైన 'దాక్షాయణీ పరిణయము' అను కావ్యమాధారముగనున్నది. దాక్షాయణీ పరిణయమున తత్కావ్య కర్తలైన కేసన మల్లన కవులు కావించిన సుకవిస్తుతిలో "నెఱిగుఱిగల్గు. మత్పితా మహుని బమ్మెరపోతన నో భిల్లగన్" అని చెప్పుటచే వారికి పోతన పితామహుడని తెలియుచున్నది కాని అదే కావ్యము ఆశ్వాసాంత గద్యాలలో, 'ఇది .. .పోతయామాత్య పౌత్ర మల్లయామాత్య పుత్ర సంస్కృతాంధ్ర భాషాచమత్కార కవితాధురీణాత్మ బుధ విధేయ ప్రౌఢ సరస్వతి కవి నామధేయ వరతనూభవ కేసన కవి మల్లన కవి ప్రణీతంబైన దాక్షాయణీ వివాహంబను మహాప్రబంధంబు నందు "అని వ్రాసి యున్నారు. దీనిని బట్టి పోతన పుత్రుడు మల్లన, మల్లన పుత్రుడు ప్రౌఢ సరస్వతి. ప్రౌఢ సరస్వతి పుత్రులు కేసన, మల్లనలు అని తెలియుచున్నది. కనుక కేసన, మల్లనలకు పోతన ప్రపితామహుడని విదితము.

## దాక్షాయణీ పరిణయము – పోతన తరువాతి వంశవృక్షము:–

పోతన
↓
మల్లన
↓
ప్రౌఢ సరస్వతి (కేసన అని నిడదవోలు వేంకటరావుగారనిరి)
(ఆంధ్ర మహాభాగవత విమర్శనము – పుట-9)
↓
కేసన | మల్లన

పై విధముగ పోతన పూర్వ (వంశము వారిని)లను, తరువాతి (వంశము వారిని) వారిని. వివరించుట జరిగినది.

## పోతన గురువు:-

పదునైదవశతాబ్దమున ఐదారు దశాబ్దముల పాటు సాహిత్య కేదారమున పసిడిపంటలు పండించిన పోతన మహాకవి గురువును గురించి పరిశీలించుట ఎంతేని సమంజసమని పించును. పోతన తన కృతులలోని 'వీరభద్రవిజయము' నందు మాత్రమే తన గురువును గురించి ప్రస్తావించియున్నాడు. వీరభద్ర విజయము నందలి,

సీ॥ "పరమ భద్రాసనప్రముఖ మార్గంబుల యోగీంద్రులిత డాది యోగియనగ
వీరవ్రతంబున వీరమాహేశులు వీరమాహేశ్వర విభుడనంగ
సంతతానుష్ఠానసత్కర్మనిరతిమై బ్రాహ్మణులుత్తమ బ్రాహ్మణుడన
వేదాంత సిద్ధాంత విమలుడైచెలగుచో జనులెల్ల ధర్మశాసనుడనంగ

ఆ॥ వెలయు శంభుమూర్తి వీరమాహేశ్వరా
చారవిభుడు భక్తి సాగరుండు
యనఘుడివ్వటూరి యారాధ్యచంద్రుండు
సోమనాథసముఁడు సోమగురుడు" (పీఠిక - 15ప) - అను

పద్యమును బట్టి ఇవటూరి సోమనాథుడు యోగిపుంగవుడని, వీర శైవాచార పరాయణుడని, సత్కార్మనుష్ఠాన నిరతుడైన విప్రుడని, వేదాంత సిద్ధాంతములు తెలిసిన ధర్మజ్ఞుడని, మహేశు సన్నిభుడని, భక్తాగ్రేసరుడని, అపరసోమనాథుడని తెలియుచున్నది. కావుననే ఇవటూరి సోమనాథుడు పోతనగారికి వీరశైవ మత గురువుగ నిర్ణయించుటకు వీలుగలుగుచున్నది.

వీరభద్ర విజయము నందలి నాల్గాశ్వాసముల అంత్యగద్యములందు 'ఇది శ్రీమన్మహామహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్య శ్రీపాద పద్మారాధక, కేసనామాత్య పుత్ర పోతయనామధేయ ప్రణీతంబైన వీరభద్రవిజయంబను మహాపురాణ కథ.. ...' అని గలదు, 'వీరమాహేశ్వర' అను పదమునకు పర్యాయముగ 'మహామహేశ్వర' అని గద్యమున చెప్పబడినది. ఈ పదమును సోమనాథునకు పోతనగారు ఉద్దేశ పూర్వకముగనే ఉపయోగించినటుల విదితమగుచున్నది. కనుకనే ఇవటూరి సోమనాథుడు పోతనకు వీరశైవమత గురువని చెప్పవచ్చును.

పోతన ఇతరకృతులైన, భోగినీదండకము, నారాయణశతకము, ఆంధ్ర మహాభాగవతము లందు ఎచ్చటను గురుప్రసక్తి కానరాదు. శ్రీగురజాడ శ్రీరామ మూర్తిగారు. ఆంధ్రభాగవత మచ్చొత్తించిన పండితులు పోతనకు చిదానంద యోగి అను యోగిపుంగవుడు కరుణించి, శ్రీరామ మంత్రరాజంబనుగ్రహించె నని వ్రాసిరి" (కవి జీవితములు - పుట 595) అని పేర్కొనిరి. శ్రీవానమామలై వరదాచార్యుల వారు చిదానందయోగి పోతనకు రామ మంత్రమును, శారదా మంత్రమును ఉపదేశించినటుల చక్కని కథను కల్పించి వ్రాసిరి. (పోతన చరిత్రము - ఆశ్వా 11-2-15 నుండి 64 ప॥ వరకుగల కథ). కాని భాగవతములో చిదానందయోగి ప్రస్తావన ఎందును కనిపించుట లేదు. ఆంధ్రభాగవత పరిష్కర్తలైన ఆచార్య రాయప్రోలుసుబ్బారావు, శ్రీదివాకర్ల వేంకటావధాని, ఆచార్య బిరుదురాజు రామరాజు, శ్రీతాపీ ధర్మారావు, శ్రీదీపాలపిచ్చయ్యశాస్త్రిగార్లు "చిదానందయోగి పోతనకు రామ మంత్రమున నుగ్రహించెననుట కల్పిత కథ" అని శ్రీగురజాడ శ్రీరామమూర్తి వాక్యములను, వానమామలై వరదాచార్యుల వారి అభిప్రాయములను త్రోసిపుచ్చిరి. కనుక పోతనకు చిదానందయోగికి ఎటువంటి సంబంధమును లేదు.

ఇక వీరభద్రవిజయమున పేర్కొన బడిన ఇవటూరి సోమ నారాధ్యుడే గురువని తేలుచున్నది. మరి యీ గురువు విద్యా గురువా? కవితా గురువా? మత గురువా? అను విషయములను గురించి యించుక పరిశీలింప వలసి యున్నది

వీరభద్రవిజయమున వంశవర్ణనా నంతరమున పోతన, "పోతయ నామ ధేయుడనై బరగిజనక శిక్షిత విహితాక్షరా భ్యాసుండనై వీరభద్రప్రసాదలబ్ధ కవితాతిశయంబున" (ఆ 1- 40 వచ॥) అని చెప్పియుండుట వలన, పోతన తన తండ్రి కేసన వద్దనే అక్షరాభ్యాసము కావించు కొనియెనని స్పష్టమగు చున్నది. కనుక ఇవటూరి సోమనాథుడు పోతనకు విద్యా గురువు కాదని చెప్పవచ్చును. తండ్రియే విద్యాగురువు.

ఇవుటూరి సోమనాథుడు పోతనకు కవితా గురువనుటకును వీలుకల్గుట లేదు. ''వీరభద్రప్రసాదలబ్ధ కవితాతిశయంబున'' అని చెప్పుట వలన, వీరభద్రేశ్వరుని అనుగ్రహమున అతిశయమగు కవిత అబ్బినటుల తెలియుచున్నది. మరియు భాగవతమున అశ్వాసాంత గద్యము లందు, 'ఇది శ్రీపరమేశ్వర కరుణా కలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర' (ప్రథ॥ సం్క॥ 529 వచ॥) అని చెప్పబడి యున్నది. కావున పరమేశ్వర కరుణా సంపదతోడనె పోతనగారు కవితా సంపన్నుడైనటుల స్పష్టమగుచున్నది. కనుక కవితావిషయమున పోతనకుగురువు ఎవరును లేరనియే చెప్పవచ్చును. అందు చేత ఇవటూరి సోమగురుడు పోతనకు కవితా గురువు కాదు.

ఇక ఇవుటూరివారు పోతనకు మత గురువగునా? కాదా? అను విషయమును పరిశీలింప వలసి యున్నది.

"పాల్కురికి సోమనాథుడు పాలకుర్తి నివాసి. ఇది నైజాము రాష్ట్రములో నున్నది. పాలకుర్తికి రెండు మైళ్ల దూరములో బమ్మెర" గ్రామమున్నదని కందుకూరి వీరేశలింగముపంతులు గారు గోల్కొండ దేశములో వాడుకలో నున్న,

"పాలకుర్తి నిలయాసోమయలింగా పాదములకు శరణు
వురవుగ బమ్మెర పోతరాజుకు మీరు కోరినవరములు
కృపచేసినారట పాలకుర్తి నిలయా............" (ఆంధ్రకవుల చరిత్రము - పుట 558) అను ఒకపాటను పేర్కొనిరి. "నిజాం రాష్ట్రములోని పాలకుర్తి యుత్సవములలో జనసామాన్యము సోమనాథుని గూర్చి పాడును" (అంధ్రభాగవత విమర్శ - పుట 72) అని శ్రీనేలటూరి వేంకటరావు గారు కందుకూరి వారు పేర్కొనిన పాటనే ఉదాహరించిరి. కనుక పాల్కురికి సోమనాథుని వీరశైవము బమ్మెర గ్రామములో ప్రచారము కాబడినదని తెలియుచున్నది. శ్రీ ఆరుద్ర గారు, "పాలకుర్తి ప్రాంతాలలో ఆ రోజులలో ఇవటూరి వారు శైవమత గురువులుగ ఉంటూవుండేవారు. వీరు బమ్మెర వారికి తదితరులకూ వంశ క్రమాను

గతంగా గురువులు. పోతరాజు గారి కాలంలో ఇవుటూరి సోమనాథుడు మత బోధచేస్తుండే వాడు." (సమగ్రాంధ్ర సాహిత్యము - సం॥ 5 - పుట 192) అని పేర్కొనుటను బట్టి, వీరభద్రవిజయము కృత్యాదిలో, వీరమాహేశ్వరవ్రతుడు, భక్తిసాగరుడైన ఇవుటూరి సోమగురుని ఆదేశాను సారము తత్కావ్యమును రచించుటను బట్టి, ఇవుటూరి సోమన పోతనకు మతగురువే యని స్పష్టమగు చున్నది. నాడు మతగురువుల వాక్కులు వేదవాక్కులు. వారి ఆదేశమే భగవదనుగ్రహము. కనుకనే పోతన సోమగురుని ఆదేశాను సారము వీరభద్ర విజయమును రచించెను. అని చెప్పవచ్చును.

పై పరిశీలనమును బట్టి పోతనకు తండ్రియైన కేసన విద్యా గురువని యు, ఇవుటూరి సోమనాథుడు వీరశైవమత గురువనియు తెలియు చున్నది.

## పోతన బిరుదము:-

భాగవతదివిజగంగను పారించి, తనను కనిన భూమిని పునీతము గావించిన పోతనార్యునికి "సహజపాండిత్యుడ" ను అతిలోకసామాన్యమగు బిరుదము కనిపించుచున్నది. పోతన తన "నారాయణ శతకము" న అంత మందు గల గద్యలోను, భాగవతము నందలి స్కంధాంత గద్యములందును, "ఇది శ్రీపరమేశ్వర కరుణా కలిత ........సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన ... ..."అని సహజ పాండిత్యుడ' ను విశేషణమును తనకు ప్రయోగించు కొని యున్నాడు 'వీరభద్రవిజయము', 'భోగినీదండకము' లందు యీ విశేషణపదము కనిపించదు. బహుశ ఇవి తొలినాటి కృతులగుట కారణము కావచ్చును. తుది రచనలైన నారయణశతకము, భాగవతముల నాటికి తనలో సహజపాండిత్యము వెల్లివిరియుటను బట్టి యీ కృతులలో యీ బిరుద నామమును ప్రయోగించుకొని యుండునని తలంపవచ్చును.

వయోపరిపక్వత, అనుభవసంపత్తి, బహుశాస్త్ర పరిజ్ఞానముతో కూడిన తత్త్వదర్శనము మొదలగు అంతర్మథన ఫలితప్రతిభా వ్యుత్పత్తులతోడ పోతన

సహజపాండిత్యుడై యుండవచ్చును. ఫలితము పరబ్రహ్మస్వరూప మైన కృష్ణ తత్త్వమును శ్రీ మదాంధ్ర మహాభాగవతమున అరటిపండును ఒలిచి చేతనిడి నటులుగ అందించుట జరిగినది.

సహజపాండిత్యమును గురించి శ్రీ విశ్వనాథ వారు, ''మహాబుద్ధి మంతుడు, వేదోపనిషత్తులను జదివి సహజముగ నర్థము జేసికొని, తానే మన నముచేసి, తానే యుపాసించును. అది సహజపాండిత్యము''- (పోతన్న గారి సహజపాండిత్యము - పుట - 2) అని వ్రాసిచ్చిరి.

శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వర శర్మ గారు, ''పండాగలవాడు పండి తుడు. పండితుని కర్మ పాండిత్యమగుచున్నది, పాండిత్యమనగ పరతత్త్వ వేతృత్వమన్న మాట'' (పోతన్నగారి సహజపాండిత్యము - పుట 2) అని చెప్పు చు, బృహదారణ్యకవార్తికములను పరిశీలనము చేసి 1. పదార్థవిజ్ఞానము 2. విశేష ణవిశేష్యత్వ సంబధము, 3 విరోధస్ఫూర్తి పరిహారము 4. వాక్యార్థబోధనము అను చతుర్విధజ్ఞానమును పాండిత్యమని చెప్పవచ్చునని చెప్పి, భాగవతములో ని తొలిపద్యమైన "శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ ............ మహా నందాంగనాడింభకున్" అను దానిని వ్యాఖ్యానించి చూపిరి (పోతన్నగారి సహజ పాండిత్యము - పుట 5-6-7).

డా॥ ప్రసాదరాయకులపతి గారు, "గురుకులక్లిష్టముగ శబ్దశాస్త్రాధ్యయ నము లేకుండ, శిష్టజన వ్యవహారమున నుసరించి భాషనుపయోగించుచు, కవిత్వ మును చెప్పఁగల్గుటయే" (ఆంధ్రభాగవతవిమర్శ - పుటలు 514-515) సహజ పాండిత్యమునకు అర్థముగ భావించిరి

డా॥ కేతవరపు రామకోటిశాస్త్రిగారు సహజ పాండిత్యమునకు, "1. సహ జవాసనారూపమగు యోగసిద్ధినే సహజ పాండిత్యమని" అనవచ్చుననియు, 2. "పరబ్రహ్మము యొక్క సహజ స్వాభావిక దివ్యరూపమును గుఱించిన విజ్ఞాన వివేకమే సహజ పాండిత్యము" అనియు, 3. "కవిచేసే పనితనానికి అలంకార మని పేరు. అలంకారమే ఆహార్యము. వస్తు స్వాభావికతదీప్తిమంతం కావటానికి

మాత్రమే ఆహార్యాన్ని ప్రయోగించగల కవి యొక్క కౌశలం సహజాహార్యం, ఈ సహజాహార్య పరికల్పనా పాండిత్యమే సహజ పాండిత్యం" (పోతనగారి వైచిత్రి- పుటలు 63-64) అనియు నిర్వచనముల నొసగిరి.

డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి గారి నిర్వచనములన్నియు సమర్థవంత ములుగనే యున్నను మూడవ నిర్వచనము పటిష్టమైన తీరులో పోతనగారి సహజ పాండిత్యమును వివరించుచున్నది. సహజాహార్య పరికల్పనా పాండిత్య ము పోతన భాగవతమున నిండారి యున్నది. వేదాంతములను చదువుట, తెలిసి కొనుట, తెలియజేసెడు నేర్పు, విషయముల కూర్పు, జ్ఞానవిజ్ఞానముల నందిం చు చక్కని తీరు పోతన గారిలో సమపాళ్లులో జతకూడి కానవచ్చుచున్నవి. కనుక పోతన సహజ పాండిత్యుడని చెప్పవచ్చును

భాగవతమున పరిఢవిల్లిన ఈ సహజ పాండిత్యము వీరభద్రవిజయము న రేఖామాత్రముగ కానవచ్చుచున్నదని క్రిందివిధముగ వివరింపవచ్చును. వీర భద్రవిజయమున కావ్యారంభ పద్యమున సహజ పాండిత్యమును రేఖామాత్ర ముగ గమనింప వచ్చును.

ఉ॥ "శ్రీలలితాంపు భూతియును శేషవిభూషణమున్ శిరంబుపై
వేలుపుటేరు పాపటను వెన్నెలపాపడు మేన గొంతరా
చూలియుఁగేల మువ్వొనలశూలము నీలగళంబు గల్గునా
వేలుపు శ్రీమహానగము వేలుపుమామ "ప్రసన్నుడయ్యెడున్" (వీ॥ వి-1ప).

కావ్యములలో ఆదిమధ్యాంతములు మంగళాచరణములై యుండవలె నని ఆర్యులు వక్కాణింతురు. విజ్ఞుడైన పోతన శ్రీకారముతోడ కావ్యారంభ ము గావించి "శివుడున్న చోటనే శివతరము వినుతిచేయగనుండు" నను విధ మున యాగకర్తయైన మహేశుధ్యానముతో మంగళాచరణము చేయుట స్మృతి సిద్ధము.

శివతత్త్వ ప్రతిపాదన రూపమైన యీ కావ్యారంభములో మహేశుస్తుతి చేయుట ప్రతిపాద్య వస్తువును సూచించుట యగుచున్నది. శుభోదర్కమైన గణము లెన్నియున్నను, "భగణము" ను ఆదిమగణముగ వాడుటలో ఒక ప్రత్యేకత కానవచ్చుచున్నది "భ" అనగ శివుడని యర్థము. అందున భగణమున ఒక గురువు, రెండు లఘువులుండును. గురువు మహేశ్వ రాకృతియని, లఘువు గిరికుమారి ఆకృతియనియు ఛందశ్శాస్త్రవేత్తల అభిప్రాయము. "గురువు పరమేశ్వరాకృతి యరయలఘువు గిరికుమారికాకృతిగణముల్ .. ..." (అప్పక॥ 4 ఆ॥ 46 ప) అని నటుల పోతన ఒక్క భగణము తోడనే జగత్పితరులను స్ఫురింపజేసెను. ఇక "లలితము" అను మనోజ్ఞమైన పదప్రయోగములో "మాధుర్యమును'' కావ్యగుణముగ తెలియజేసెను.

మరియు, "భూతి" - "భూషణము", "వేలుపుపేరు – వెన్నెలపాపడు" ''చూలియు - శూలము", "వేలుపు'' అను పద ప్రయోదములతో శాబ్దికమైన యింపు సొంపులను గూర్చి పద్యసడకకు ఒక వింత అందమును పోతన సంతరించెను.

ఇటుల భాగవత మహా కావ్యమున వ్యక్తముకానున్న సహజ పాండిత్యము వీరభద్రవిజయమున పొడ సూపినదన వచ్చును. ఇదియే వయసుతోబాటు వృద్ధినొంది భాగవతరచనా కాలమునకు పరిణితినొంది యలరారినదన వచ్చును.

సహజ సుందరమైన శైలీ సౌభాగ్యముతో కావ్యమందారముల నందించి, తత్కావ్యామృతరస పానమున ఆంధ్రప్రజను, ఆంధ్ర దేశమును పునీతము గావించి పోతనార్యుడు "సహజపాండిత్యుడ" ను బిరుదమును సార్థకమొనరించు కొనెనని చెప్ప వచ్చును.

## పోతన కాలము:-

శ్రీమధురస్వర స్ఫురదశేషవచో సంపన్నుడు, సలలితశైలీ సౌభాగ్యుడు, సంస్కృతాంధ్ర భాషా యోషామతల్లుల గారాల బిడ్డడు అయిన బమ్మెర పోతన

నార్యుని కాలమును గూర్చి విమర్శకులు పలుపలు విధములుగ భావించిరి. క్రీ. శ. 14 వ శతాబ్దము చివరివాడని కొందరు, క్రీ. శ. 15 వ శతాబ్దము తొలికాలమందు న్నవాడని కొందరు, క్రీ. శ. 15వ శతాబ్దము ఉత్తరార్థములోని వాడని మరి కొందరు వాదించిరి. ఇందులకు శాసనాధారములు మాత్రము మృగ్యము. పుక్కిటిపురాణ కథలను విడిచి పరిశీలించిన పోతగానరి కాలము నకు ముఖ్యముగ రెండు సరియైన ఆధారములు కన్పించు చున్నవి. అవి 1. కేసన మల్లన కవులు వ్రాసిన దాక్షాయణీపరిణయము 2. సర్వజ్ఞసింగ భూ పాలునకు అంకితముగ పోతన వ్రాసిన "భోగినీదండకము".

శ్రీకందుకూరి వీరేశలింగం పంతులుగారు, "దాక్షాయణీ పరిణయము" నందు ఆశ్వాసకర్త లైన కేసన, మల్లన కవులు చేసిన సుకవిస్తుతిలోని పద్య మున "నెఱిగుఱిగల్గు ........మత్పితామహుని బమ్మెరపోతన........శోభిల్లగన్" అను దానిని, ఆశ్వాసాంత గద్యమున, ''ఇది....పోతయామాత్య పౌత్ర........... కేసనమల్లనకవిప్రణీతంబైన దాక్షాయణీ వివాహంబను మహాప్రబంధంబు నందు" అను దానిని చూపి, వీనిననుసరించి పోతన కాలమును అంచనా వేసిరి. కందు కూరివారి వాదన సారంశము క్రింది విధముగ నున్నది.

''కేసన మల్లనలు దాక్షాయణీ పరిణయమున'' కృత్యాదిలో సుకవి స్తుతిగావించుచు, "మత్పితామహుని బమ్మెరపోతన" అని స్తుతించిరి. దీనిని బట్టి పోతన కేసన మల్లనలకు తాతయని తెలియుచున్నది. కాని ఆశ్వాసాంత గద్యమున, "ఇది శ్రీమద్భవానీశంకర పర్వతాల గురు ప్రాసాదాసాదిత సారస్వ త బమ్మెరకులపవిత్ర కౌండిన్యముని గోత్ర పోతయామాత్య పౌత్ర మల్లయామా త్యపుత్ర సంస్కృతాంధ్ర భాషా చమత్కార కవితాధురీణతా బుధ విధేయ ప్రా జ్ఞసరస్వతి కవి నామధేయ వర తనూభవ కేసన మల్లనకవి ప్రణీతంబైన దాక్షా యణీ వివాహంబను మహాప్రబంధంబు నందు'' అని ఉండుటచే కేసనమల్లన లకు పోతన్న ప్రపితామహుడని తెలియుచున్నది. దాక్షాయణీ పరిణయమునకు కృతిపతి చిన్నమల్లన సోమయాజి మల్లన సోమయాజి మనుమనికి మనుమడైన

పేరమంత్రికి, పోడూరి పెదరామకవి అను ఆయన, శాలివాహన శకము 1678 లో అనగ క్రీ. శ. 1756 వ సంవత్సరములో ధాతాశ్వాయుజ కృష్ణదశమి ఇందు వారమునందు "దాక్షాయణీ వివాహము" ను తాటాకుల ప్రతిని ఒక దానిని వ్రాసి యిచ్చినటుల దాని యడుగున గల సీస పద్యము తెలుపుచున్నది.

సీ॥ ధాతాశ్వయుజకృష్ణ దశమీందు వారంబువఱకు దాక్షాయణీ పరిణయంబు
తత్కృతినాథుడై తనరినగురుజాల చినమల్లనసోమయాజికి, దనూజు
డగు లింగఘన సుతుడైన నట్టి యజ్ఞ సత్ప్రభునకుఁ దనయుడౌపార్వతీశ్వ
రునకుఁదిమ్మమకుఁ బుత్రుడయి షోడశమహాదానములప్త సంతానములును
జేసి వంశవర్ధనుడయి సిరులవెలయు
పేరమంత్రీశ్వరునకుఁ బోడూరిపెద్ద
రాముడెనుబది సంవత్సరముల నాటి
ప్రతివిమర్శించి వ్రాసిచ్చెఁ బక్షమునకు" అను పద్యమునను గురించి చినమల్లన సోమయాజి తరువాతి వంశము నిట్లుచూపవచ్చును.

చినమల్లన సోమయాజి
↓
లింగరాజు
↓
యజ్ఞన్న
↓
పార్వతీశ్వరుడు
↓
పేరమంత్రి

చివరివాడైన పేరమంత్రి ధాత సంవత్సరమున అనగ క్రీ. శ. 1756వ సంవత్సరములో నుండెను. కేసన, మల్లనలు చినమల్లన సోమయాజికి సమ కాలికులు (వీరికావ్యమును అంకితముగ గొనెను).

మల్లన సోమయాజికి పేరమంత్రికి నాలుగు పురుషాంతరములు. అనగ కేసన, మల్లనలకు పేరమంత్రికి నాలుగు పురుషాంతరములు. పోతనకు కేసన

మల్లనలకు మధ్యమూడు పురుషాంతరములున్నవి. వెరశి ఏడు పురుషాంతరములు. పురుషాంతరమునకు నలుబది సంవత్సరములు అనుకొనిన, ఏడు పురుషాంతరములకు 280 సంవత్సరములు. పైన పేర్కొనిన పేరమంత్రి కాల. ము 1756 నుండి 280 సంవత్సరములు తీసివేసిన (1756-280 = 1476) క్రీ శ 1476. అందుండి పది లేక పదునారు సంవత్సరములు తీసివేసిన (1476-16 = 1460.) క్రి శ. 1460వ సంవత్సము. అప్పటి వరకైనను పోతన జీవించియుం డవలెను. పోతన జీవితకాలము 60 సంవత్సరములు అనుకొనిన ఆయన జన్మిం చినది క్రీ. శ. 1400 సంవత్సర ప్రాంతమై యుండు"నని (ఆంధ్రకవుల చరిత్ర ము - పుటలు 558 నుండి 560) కందుకూరి వారు అభిప్రాయపడిరి.

"ఆంధ్రకవితరంగిణి" కర్త చాగంటి శేషయ్యగారు, కందుకూరి వీరేశ లింగము పంతులు గారి వాదనలో రెండు దోషములను చూపిరి. అవి ఒకటి "పురుషాంతరమునకు 40సంవత్సరములు లెక్కకట్టుట" రెండు "పోతనకు పేర మంత్రికి మధ్య అరు పురుషాంతరములుండగ ఏడు పురుషాంతరములని చెప్పుట" (ఆంధ్రకవి తరంగిణి - సం॥ 6 - పుట 173) చాగంటి శేషయ్యగారు చూపిన పై రెండింటి లోను వాస్తవము లేకపోలేదు. ఎట్లనగ,

శ్రీనాథమహాకవి "కాశీఖండ" కావ్యమున పురుషాంతరమునకు సంబం ధించిన కాల విషయమును సూచించి నట్లు తెలియుచున్నది. భిక్షదొరకలేదని వ్యాసుడు కోపించి కాశికానగరము నిట్లు శపించెను.

"ధనము లేకుండెదరు మూడు తరములందు
మూడుతరములఁ బెడుఁగాక ముక్తిలక్ష్మి
విద్యయును మూఁడు తరముల వెడలవలయుఁ
బంచజనునకుఁగాశికా పట్టణమున" (కా॥ ఖం॥ - 7 ఆ॥ - ప 158)

అని ఈ పద్యమునకు మూలమున, "మాభూ : త్రైపూరుషీవిద్యా.... ......." అని యున్నట్టుల తెలియుచున్నది. ఇచట మూడు తరములు(పురుషాంతరములు)అనగా ఒక శతాబ్దముపాటు కాశీవాసులు శాపమునసనుభవింప వలెనని వ్యాసుని పలుకు లకు భావమునై కన్పించుచున్నది. కావున శతాబ్దమునకు మూడు పురుషాం

తరములని స్పష్టపడుచున్నది. కనుక చాగంటి వారు చూపిన మొదటికారణము సమంజసమని పించుచున్నది.

కందుకూరివారు పురుషాంతరముల కాలమును తీసివేసి 1476 వ సంవత్సరముగ తేల్చి, అందు 10 లేక 16 సంవత్సరములను తీసివేసి 1460వ సంవత్సరమును చూపిరి. ఇట్లు చేయుట గూడ సరికాదని చెప్పవలసి యున్నది. మరియు 1460 వ సంవత్సర ప్రాంతము మాత్రమే పోతన అంత్యదశయని నిర్ణయించుట గూడ యుక్తముగ కన్పట్టుట లేదు.

చాగంటి శేషయ్యగారు, "దాక్షాయణీ పరిణయము ప్రతిని వ్రాసియిచ్చునప్పటికి పేరమంత్రి షోడశమహాదానములను, సప్తసంతానములను జేసినవాడై యున్నాడు. కావున అప్పటికి పేరమంత్రికి కనీసము 56 సంవత్సరములుండును, 1756 సంవత్సరములలో 56 సంవత్సరములు తీసివేయగ 1700 వ సంవత్సరములగును. పోతనకు పేరమంత్రికి మధ్య అరు పురుషాంతరము లున్నవి. శతాబ్దమునకు మూడు పురుషాంతరములనిన పక్షమున 200 సంవత్సరములగును. 1700 సంవత్సరములలో 200 సంవత్సరములు తీసివేయగ 1500 వ సంవత్సరమగును. కావున పోతనగారు క్రీ. శ. 1450 ప్రాంతములో జన్మించి యుండును పోతన జననకాలము క్రీ. శ. 1450 వ సంవత్సరమునకు వెనుకకు నెట్టుటకు సాధ్యము కాదు" (ఆంధ్రకవి తరంగిణి - సం 6 - పుట 173.) అని వాదించిరి. మరియు శేషయ్యగారు వేఱొక ఆధారమును గూడజూపి క్రింది విధముగ తన వాదమును సమర్థించుకొన చూచిరి.

"దాక్షాయణీ పరిణయము కావ్యకర్తలైన కేసన మల్లనలకు బావమరిది పేరయలింగము. ఈ పేరయలింగకవి పూర్వుడైన కొండుభట్టునకు గజపతి అజ్జరపును గ్రామమును అగ్రహారముగ నిచ్చెనని పేరయలింగము "ఒడయనంబివిలాసము" అను తన కావ్యమున అవతారికలో వివరించెను. ఈ ఒడయనంబి విలాసము ననుసరించి అజ్జరపువంశము ఇట్లు తెలియుచున్నది.

కొండుభట్టు
↓
మల్లమంత్రి
↓
హరిమంత్రి
↓
పేరన
↓
కొండయ
↓
పేరయలింగము

కేసన, మల్లనలకు పేరయలింగము బావమఱది కావున వీరు సమకాలికులు. కేసన మల్లనలకు మూడు తరముల ముందు పోతన ఉండెను. అటులనే పేరయలింగమునకు మూడు తరముల ముందు హరిమంత్రి యుండెను. కావున హరిమంత్రి పోతనలు సమకాలికులు కావలెను. హరిమంత్రి కొండుభట్టునకు మనుమడు. కొండుభట్టునకే గజపతి అగ్రహారమును దానమిచ్చియుండెను. కాని క్రీ. శ. 1450 వ సంవత్సరమునకు ముందు గజపతి కపిలేశ్వరుని అధికారము ఆంధ్రదేశమున సాగలేదని చారిత్రకులు తెల్పుచుండిరి. కొండుభట్టునకు అగ్రహారము నిచ్చినది, ఆంధ్రావనిని ప్రథమమున కాలుమోపినది, కపిలేశ్వర గజపతియేనని తలచిన దానకాలము (అగ్రహార) క్రి. శ. 1450 వ సంవత్సర ప్రాంతముగ భావింపవచ్చును. నాటికి కొండుభట్టునకు 50 సంవత్సరములను కొనినను, మనుమడు హరిమంత్రి పుట్టెనో లేదో పుట్టినను ఒకటి, రెండు సంవత్సరముల వయసు వాడై యుండును. హరిమంత్రి సమకాలికుడైన పోతనయును ఒకటి లేక రెండు సంవత్సరములు వయసు కలిగి యుండును. కావున పోతనగారి జననకాలము క్రీ. శ. 1450 వ సంవత్సరము" (ఆంధ్రకవి రంగిణి - పుట 174-175 - సం 6) అని పోతన జననకాలమును నిర్ణయించిరి.

శేషయ్యగారు చెప్పినటులనే దాక్షాయణీ పరిణయము వ్రాసియిచ్చు నాటికి పేరమంత్రికి 56 సంవత్సరములని తలచిన క్రీ. శ. 1756 నుండి 56 సంవత్సలములు తీసివేయగ 1700వ సంవత్సరములు. ఆరు పురుషాంతరములకు

200 సంవత్సరములు తీసివేయగ 1500 వ సంవత్సరమగును. పోతన జీవిత కాలము 70 సంవత్సరములు లేదా 75 సంవత్సరములను కొనిన క్రి. శ. 1425 లేదా 1430 వ సంవత్సర ప్రాంతమున పోతన జననమొంది యుండునని చెప్ప వచ్చును. లేకున్న శేషయ్యగారి వాదన ప్రకారము చూడగ పోతన జీవితకాలము 50 సంవత్సరములలోపు నిర్ణయింపవలసి యుండును. కాని ఆమహాకవి నిండు జీవితమును గడిపినటులే మనకు కనిపించును గాని అర్థ జీవితమును గడిపి నటుల ఆధారములు కనిపించుట లేదు. కనుక శేషయ్య గారి నిర్ణయము సరి కాదనిపించుచున్నది.

పోతనగారి కాల నిర్ణయమునకు మనకున్న మరియొక ఆధారము, పోతన సర్వజ్ఞసింగ భూపాలునకు అంకితముగ వ్రాసిన భోగినీదండకము. భోగినీదండకము పోతన కృతమనుటకు చాగంటి శేషయ్యగారు అనుమానించిరి. కాని భోగినీదండక మందలి రచనారీతి, శైలీవిధానము యిది పోతనకృతమను టను స్పష్టముచే యుచున్నవి. దండకాంతమున తత్కావ్యకర్త పోతనయని తెలుపు పద్యమొకటి గలదు. యుక్తవయసులో పోతన భోగినీదండకమును రాజాస్థాన ప్రవేశకాంక్షతో వ్రాసినట్లు తోచుచున్నది. విలాసముగ పోతనగారీకృ తిని వ్రాసెనని చెప్పినంత మాత్రమున అభక్తకవి ప్రతిష్ఠకు భంగమేమియు నుండదు. కావున సర్వజ్ఞసింగ భూపాలుని కాలము ననుసరించి పోతన జన నము క్రి. శ. 1425 వ సంవత్సర ప్రాంతముగ చెప్పవచ్చును.

గురజాడ శ్రీరామమూర్తి గారు, "శాలివాహన శకము 1300 నుండి 1350 వ సంవత్సరము వరకు సర్వజ్ఞ సింగమనీడు ప్రభుత్వమును వ్యవహరించినట్లుగ వేంకటగిరి వంశావళి గ్రంథము వలన కనిపించుచున్నది. పోతన కాలమిదియ కావచ్చును" (కవి జీవితములు – పుట 595) అనిరి.

దీనిని క్రీస్తు శకములోనికి మార్చుకొనిన (1300+78 = 1378), 1350+78 = 1428) 1378 - 1428 మధ్య కాలమగు చున్నది. కాని శ్రీ

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు, "సింగభూపాలురు ముప్వురు కలరని, వారు

"1. అనవోతమాదనాయకుల తండ్రి – మొదటి సింగభూపాలుడు

2. అనవోతనాయుని కుమారుడు – కుమార సింగభూపాలుడు – ఇతడే "రసార్ణవసుధాకరము" ను వ్రాసినవాడు – రెండవ సింగభూపాలుడు

3. కుమార సింగభూపతి పౌత్రుడు – కుమారన్నపోత భూపాలుని పుత్రుడు – మూడవ సింగభూపాలుడు.

ఈ మూడవసింగ భూపాలుడు క్రీ. శ. 1430 వ సంవత్సరము నుండి 1475 వ సంవత్సరము వఱకు రాజ్యము నేలినటుల శాసనములున్నవి. ఈ సింగభూపాలునికి "సర్వజ్ఞ" బిరుదమున్నది. ఈ సింగభూపాలుని కోరినమీద గనే పోతనార్యుడు భోగినీదండకమును రచించినాడు" అని చెప్పి "పోతన 15వ శాతాబ్దము ఉత్తరార్థములో ఉన్నాడు" (ఆంధ్రభాగవతోపన్యాసములు – పుట 15) అని చెప్పిరి. కాని 15 వ శాతాబ్దము ఉత్తరార్థములో ఉన్నాడనుట సరికాదు.

మూడవసింగభూపాలుడే భోగినీదండకమును అంకితముగొనిన సర్వజ్ఞ సింగభూపాలుడను విషయము "రావుసింగక్షమానాథ పౌత్రున్" (భోగినీదండక ము – పుట 16) అను పోతనవాక్యము ఋజువు చేయుచున్నది.

భోగినీదండకమును పోతన నిండు జవ్వనమున వ్రాసియుండునని విజ్ఞుల అభిప్రాయము. అనగ 25 సంవత్సరముల ప్రాయమున పోతనగారీ దండకము చెప్పియుండురు. చాగంటివారు వాదించిన విధముగ పోతన జననము క్రీ. శ. 1450 వ సంవత్సరము తరువాత అని విశ్వసించిన, మరి ఇరువది ఐదు సంవత్సరములకు అనగ క్రీ. శ. 1475 వ సంవత్సరము తరువాతనే పోతన భోగినీ దండకమును రచించి యుండవలయును. క్రీ. శ 1475 వ సంవత్సరము తరువాత సర్వజ్ఞ సింగభూపాలునకు కావ్యాంకితము జరిగి యుండవలయును. కాని

సర్వజ్ఞ సింగభూపాలుడు క్రీ. శ. 1475 వ సంవత్సరము తరుపాత పరిపాలనము న లేడు. కనుక చాగంటివారు చెప్పినట్లు పోతన జనన కాలము క్రీ. శ.1450 అనుటకు వీలులేదు.

క్రీ. శ. 1425 వ సంవత్సర ప్రాంతము పోతన జననమని తలంచిన క్రీ.శ. 1450 వ సంవత్సరము తరువాత పాలనలో నున్న సర్వజ్ఞ సింగమనీనికి పోతన భోగినీదండకమును అంకిత మిచ్చియుండునని భావించుట సమంజస మన వచ్చును.

ధూళిపాళ శ్రీ రామమూర్తి గారు "సర్వజ్ఞసింగభూపాలుడు ప్రౌఢ దేవ రాయలకును, కోమటి వేమారెడ్డికిని సమకాలికుడు. ప్రౌఢదేవరాయలు చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున దొరికిన "శ్రీశైల తులాభారము శాసనమును బట్టి శాలివాహన శకము 1380 కి పూర్వమే రాజ్యమునకు వచ్చినటుల విదిత మగుచున్నద"నిరి. (శ్రీ మద్భాగవతాను శీలనము - పుటలు - 11-14.) అనగా క్రీ.శ. 1458వ సంవత్సరమునకు పూర్వము ప్రౌఢదేవరాయలు రాజ్యమునకు వచ్చినాడు. భోగినీదండకమును క్రీ.శ. 1450వ సంవత్సర ప్రాంతమున సింగ భూపాలున కంకితమిచ్చె ననుకొనిన ఆయన జనన కాలము ఇరువది యైదు వత్సర ములు వెనుకకు పోవును. అపుడును పోతన గారి జనన కాలము క్రీ.శ. 1425 వ సంవత్సరము ప్రాంతమనియే తేలును. ధూళిపాళవారు, "పోతన క్రీ.శ. 1450 వ సంవత్సరము నాటికి 25 ఏండ్లవాడై యుండవచ్చును." (శ్రీ మద్భాగవతాను శీలనము - పుటలు - 11-14.) అని పేర్కొనియున్నారు. ఇది గమనించదగినది.

కనుక, సర్వజ్ఞసింగమనీని కాలము ననుసరించి పోతన క్రీ.శ. 1425వ సంవత్సర ప్రాంతమున జన్మించి క్రీ.శ. 1450వ సంవత్సరము తరువాత సింగ మనీనికి భోగినీదండకమును రచించి అంకితమిచ్చి యుండునని చెప్పవచ్చును. కేసన, మల్లనలు రచించిన దాక్షాయణీ పరిణయము ననుసరించియు పోతన క్రీ.శ. 1425 ప్రాంతమున జన్మించెనని చెప్ప వచ్చును. క్రీ.శ. 1475వ సంవత్సర

ప్రాంతమున భాగవత రచన గావించి యుండును. క్రీ.శ. 1490 – 1500 మధ్య కాలములో పోతన జీవితము ముగిసియుండునని చెప్పవచ్చును. దాదాపు డెబ్బది సంవత్సరముల పాటు పోతన మహాకవి నిండు జీవితమును గడిపెనని యు నుడువ వచ్చును.

## పోతన కృతులు :-

ఆంధ్రసాహిత్యమున చిరస్మరణీయుడు, పురాణ కథాకావ్య నిర్మాణ దక్షుడు, విశిష్టపదవాక్యామోఘ చతురుడు, మహనీయ భక్తాగ్రగణ్యుడునైన పోతన కృతులుగ నేడు నాలుగు ప్రచారములో నున్నవి. అవి 1. వీరభద్రవిజయము 2. భోగినీ దండకము, 3. నారాయణ శతకము, 4 శ్రీ మదాంధ్రమహాభాగవతము.

వీనిలో శ్రీ మదాంధ్ర మహాభాగవతము తప్ప, తక్కిన మూడు కృతుల కర్తృత్వ విషయము వివాదాస్పదమై యుండుట కడుశోచనీయము. పోతన నాల్గు కృతులను గురించి క్రింది విధముగ పరిశీలన జరుగుచున్నది.

## 1. వీరభద్ర విజయము :-

వీరభద్రవిజయము నాల్గాశ్వాసములు గల మనోజ్ఞమైన కావ్యము. ఇందు 1046 గద్య, పద్యములున్నవి. ఆరుద్ర గారనినట్లు పోతన "నూనూగు మీసాల నూతన్నయౌవనములో వ్రాసిన కావ్యమిది." (సమగ్రాంధ్ర సాహిత్యము – సం. 5 పుట – 192) వీరశైవమత ప్రబోధాత్మకమైనదీ కావ్యము. శైవమత కుటుంబములో పుట్టిన పోతన ఆశైవ సంప్రదాయములను సర్వము జీర్ణించుకొని యుక్త వయసు రాకపూర్వమే ఆవేశపూరితుడై కవితాగానము చేసెను.

ఆంధ్ర భాగవతము వలన పరమవైష్ణవునిగ సమస్తాంధ్రావళికి సుపరిచితుడైన పోతన, "వీరభద్ర విజయము" అను శైవ కావ్యమును వ్రాసియుండుటను విశ్వసించుటకు కొందరు విమర్శకులు సంశయించిరి. అవతారికలోని

వంశవర్ణనము, ఆశ్వాసాంత గద్యములలోని పోతన నామము మొదలగు సర్వ విషయములు వీరభద్రవిజయము పోతన కృతమేనని స్పష్టము చేయుచున్నను, గురజాడ శ్రీరామమూర్తి, ధూళిపాళ శ్రీరామమూర్తి మొదలగువారు వీరభద్రవిజయము పోతన కృతముకాదని వాదించిరి. కాని వీరభద్రవిజయము పోతనకృతమేననుటకు ప్రబలమైన ఆధారములను లెక్కకు మిక్కిలిగ చూపవచ్చును. "వీరభద్రవిజయము - కర్తృత్వము" అను ప్రకరణమున యీ విషయము విపులముగ చర్చించుట జరిగినది.

వీరభద్రవిజయమును పోతన తన మతగురువైన ఇవటూరి సోమనాథుని ఆదేశాను సారము రచించెను. వ్యాసుని "వాయుపురాణము" దీనికి మూలము. పురాణ కథా సారమును గ్రహించి పోతన దీనిని స్వతంత్ర కావ్యముగ రచించెను. ఇది పరమేశ్వరునకంకితము.

## ఇతివృత్తము :-

వీరభద్రవిజయమున దక్షయాగవినాశనము ప్రధానకథ, పోతన వీరభద్రవిజయమున దక్షుడు రెండు పర్యాయములు యాగమొనరించి నటుల అపూర్వ కథా కల్పనము గావించి వర్ణించెను.

ప్రథమాశ్వాసమున దక్షుని ప్రథమ యాగము వర్ణింప బడియున్నది, ఆహ్వానము లేక పోయినను సతీదేవి యాగమునకు వచ్చి, తండ్రిచే తిరస్కృతయై, ఆతడు గావించిన శివనిందనువిని, మిక్కిలి ఖేదపడి, యోగాగ్నిని కల్పించుకొని దేహత్యాగ మొనరించు కొనినది. సతీదేవి మరణవార్తవినిన శంకరుడు దక్షుని రెండవ యాగమున కడతేర్తునని శపించెను.

ద్వితీయ, తృతీయాశ్వాసములలో పార్వతీ పరమేశ్వరుల వివాహము సుందరముగ, శృంగారరస సమంచితముగ వర్ణింపబడినది.

చతుర్థాశ్వాసమున దక్షుని రెండవయాగము వర్ణితము. ఇదియును జగత్పితరులు లేనియాగమే దధీచివలన యాగమును గూర్చి విని శివుడు వీరభద్రోత్పత్తిని గావించెను. వీరభద్రుడు దక్షయాగమును నాశమొందించి, దేవత

లను శిక్షించి, దక్షుని శిరమును ఖండించెను. పిదప అష్టమూర్తి అను గ్రహ ముతో దివిజవరులు రక్షింపబడిరి. దక్షుడు, మేకతలతో పునర్జీవితుడాయెను. వీరభద్రునకు పట్టముగట్టుటతో కథ సంపూర్ణమగును,

వీరభద్రవిజయము లలితమనోజ్ఞమైన పదగుంఫనముతో, సంపూర్ణ కావ్య లక్షణములతో సాగి, పరమేశ్వరుని దివ్యతత్త్వమును ప్రతిపాదించు చున్న కావ్యము.

## భోగినీదండకము :–

"భోగినీదండకము" పోతనచే నిండుజవ్వనమున వ్రాయబడిన శృంగా రరసప్రధానమైన లఘుకృతి."దండకకావ్యము"నకు పోతనయేశ్రీకారము చుట్టిరన వచ్చును. దండకాంతము నందు గల క్రింది పద్యము ననుసరించి పోతన సర్వజ్ఞ సింగభూపాలునకు అంకితముగ ఈ కృతిని రచించినటుల తెలియుచున్నది.

ఉ॥ "పండితకీర్తనీయుఁడగు బమ్మెరపోతనయా సుధాంశుమా
ర్తాండకులాచలాంబు నిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకురావుసింగభూ
మండల భర్తకున్ వినుతమానవనాథమదాప హర్తకున్."

## భోగినీదండకము - కర్తృత్వము :–

భోగినీదంతకము పోతన కృతముగాదని, దండకాంతమందుగల పద్య ము ప్రక్షిప్తమని, పోతనకు దంపక కర్తృత్వము నంటగట్టుటకై, "పండితకీర్త నీయుడగు బమ్మెరపోతన ..........." అను పద్యమును గ్రంథాంతమున చేర్చి రని కొందరు విమర్శకులు వాదించిరి.

శ్రీ చిలుకూరి వీరభద్రరావు భోగి. దండ. ము పోతన కృతము కాదను టకు ప్రధానముగ రెండు కారణములను చూపినటుల తెలియుచున్నది. భోగినీ దండకములోని "పండితకీర్తనీయుడగు బమ్మెర పోతన............'' అను పద్య

ములో పోతన "పండితకీర్తనీయుడు" అని తనను ప్రథమపురుషలో చెప్పుకొను ట "రెండవ కారణముగను" (ఆంధ్రుల చరిత్ర - సం. 3) చిలుకూరివారు పేర్కొనిరి.

కాని వీరేశలింగము పంతులుగారు తమ ఆంధ్రకవుల చరిత్రలో చిలుకూరివారు చూపిన పై రెండు కారణములు సరియైనవి కావని, "నన్నయ ఎఱ్ఱనాదులు కూడ తమను ప్రథమపురుషలో చెప్పుకొనిన సంఘటనలను వివరించి, చిలుకూరివారి అభియోగములను త్రోసిపుచ్చి, భోగినీదండకము పోతనకృతమని స్పష్టపరచిరి." (ఆంధ్రకవుల చరిత్ర - పుట 582-83)

చాగంటి శేషయ్యగారు తమ కవితరంగిణిలో, "సింగభూపాలురిద్దరున్నారు. ఒకడు సర్వజ్ఞ సింగభూపాలుడు. ఇతడు రసార్ణవ సుధాకరాది గ్రంథకర్త. ఈ సింగభూపాలుని తల్లి అన్నమాంబ. రెండవ సింగభూపాలుడు పోచమాంబా సద్గర్భసంజాతుడు ఈతని సోదరుడు వసంతావనీనాథుడు. ఈ రెండవసింగభూపాలుని జననము క్రీ. శ. 1400 ప్రాంతము. పోతనామాత్యుని జననము క్రీ.శ. 1450. అనగా ఈ సింగభూపాలుడు క్రీ. శ. 1475 వరకు జీవించి యుండినటుల అధారములులేవు. ఒకవేళ ఉండినను వృద్ధాప్య దశయందు ఈ శృంగారదండకమును వ్రాయించుకొని యుండడు. కావున భోగినీదండకము పోతనకృతము కాకపోవచ్చును" (ఆంధ్రకవితరంగిణి - సం. 6 - పుటలు 182, 183, 186) అను సందేహమును వ్యక్తము చేసి, చివరలో "చిన్నప్పటి వయసులో పోతన వ్రాసియుండవచ్చు" (ఆంధ్రకవితరంగిణి - సం. 6 - పుటలు 182,183, 186) నను అభిప్రాయమును వెలిబుచ్చిరి.

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు, "సింగభూపాలురు ముప్పురుండిరని తెల్పి మూడవ సింగభూపాలుడు, కుమారసింగభూపతి పౌత్రుడు, కుమారాన్నపోతభూపాలుని పుత్రుడు. ఈతడు క్రీ. శ. 1430 నుండి క్రీ. శ. 1475 వఱకు రాజ్యపాలనము గావించి నటుల శాసనాధారములున్నవి. ఈతని కోరికమీదనే పోతన భోగినీదండకమును వ్రాసెనని" (ఆంధ్రభాగవతోపన్యాసములు-పుట 15)

పేర్కొనిరి. ఈ వాక్యములు చాగంటి వారి అనుమానమును నివృత్తి చేయ గలవు. "భోగినీదండకము" నగల "రావుసింగక్షమానాథ పొత్తున్" (పుట - 16) అను వాక్యము శ్రీ మల్లంపల్లి వారి పైమాటలను బలపరచు చున్నదన వచ్చును.

పరమ భక్తాగ్రగణ్యుడైన పోతన వేశ్యనువర్ణించుచు, శృంగారరస ప్రధానమైన దండకమును వ్రాసెననుట యసంగతమని కొందరి అభిప్రాయము. ఇందులకు శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు, "ప్రాతఃకాల స్మరణీయులలో నొకడగు వ్యాసమహర్షి పురాణములందు కథానుసారముగనెన్ని విధములగు శృంగారమును వర్ణించలేదు. మహర్షియగు వ్యాసునంతటి వాడిట్లు వర్ణింపడు కావునఁబురాణములు వ్యాసుడుగాక యెవరో వ్యాసుని పేరు పెట్టి రచించియుందురని యెవ్వరైనా నందురా" (పోతన) అని ప్రశ్నించి, "ప్రతిఫలాపేక్షలేకుండనే యీ దండకమును వినోదముగ పోతన చెప్పియుండు" (పోతన) నను విశ్వాసమును ప్రకటించిరి

భోగినీదండమును పోతనయే రచించి యుండునని అభిప్రాయపడుచు శ్రీ ఆరుద్రగారు, "ఆయన ప్రాయమా పైలా పచ్చీసు. ఆయన ఉంటున్నదా ముఖ్య పట్నం (ఓరుగల్లు) ..వారవనితల నృత్త్యావధానాలతో ..... శృంగారగానాలతో వెల్లివిరిసే కాలం. పోతరాజు కూడ సానివాడను పావనం చేసేవారు కాబోలు" (సమగ్రాంధ్రసాహిత్యం - సం. 5 - పుట 206) నని చెప్పిరి. ఇందులో కొంతవాస్తవము లేకపోలేదు. "సానివాడ పావనము" సంగతి మినహాయించినను, పోతరాజు కోడెప్రాయమున నున్నవాడు. రాజాస్థాన ప్రవేశము నాకాంక్షించుట, ప్రవేశము లభించిన తొలిరోజులలో రాజాజ్ఞను తు. చ. తప్పక పాటించుట మొదలగు విషయములేమంత ఆశ్చర్యకరములు కావు. అది వయసు తెచ్చెడి మార్పు. దీనికి పోతన గూడ అతీతుడు గాడు. కనుకనే యీ దండకమును వ్రాసి తన ఏలిక రసికహృదయమును ఆనందాబ్ధిలో నోలలాడించుట జరిగినది.

భోగినీదండకమును 1949 లో ప్రకటించిన వావిళ్లవారు, "అతడిది యొక మహాగ్రంథమును తలంపుఁగొనక విలాసముగ రచించినట్లు తోచెడి" నని

వ్రాయుచు, మరల ఉత్తమోత్తముడగు నాసింగ భూపాలుడు ఈ దండకమును విని తానొక వేశ్యకు లోనయితిఁగదాయని గొంకు వడగా,

ఆ॥ "రసికులైనవారు రమణులకొకవేళ
వంగుటెల్ల ధర్మవర్తనంబు
ఈ రసమున విల్లు నారికి వంగదా
చిత్తజాతరూప సింగ భూప" అను పద్యము జెప్పి చమత్కరించి పోతన యాతనిఁబరితోష పెట్టి నట్లు తెలియనయ్యెడు" (భోగినీదండకము - భూమిక - పుట 3) అని భోగినీదండకము "భూమికలో వ్రాసిన వాక్యములు స్మరణావశ్యకములు.

"ఇమ్మనుజేశ్వరాధములు " అని రాజులనీసడించి పోతన నరాంకితముగ భోగినీవర్ణనాత్మకమైన కావ్యమును వ్రాసెననుటను కొందరంగీకరించక భోగినీదండకము పోతనకృతము కాదని వాదించిరి.

అనుభవము కానిదే గుణము తెలియదు కదా! కనుక నరాంకితముగ కావ్యమునల్లి స్వానుభవముతో అందలి సాధక బాధకములు, రాచరికపు వ్యవస్థ లోని అహంకారయుతమైన నైచ్యమును పోతన గుర్తించి యుండునని భావింప వచ్చును ఐనను భోగినీదండకమున రాజులను గూర్చిన తన అభిప్రాయముల ను నిర్భయముగ ప్రకటించి యున్నాడు పోతన. "రాజుల్ బహువ్యాజులే? చంచలచ్చిత్తులే? మత్తులే? వ్రేతకాయత్తులే? నూతనాసక్తులే? లోభసంయుక్తులే? దోషసంసిక్తులే? రంధ్రసంపాదులే? వీతమర్యాదులే? వారి సేవింప భేదింప జీవింపఁబోరామి గావింపగారాదులే........" (భోగినీదం॥ పు 10) అని పోతన వ్రాసి యున్నాడు. కనుకనే భాగవతమును రామాంకితము గావించెనని చెప్పవచ్చును

డా॥ కేతనవరపు రామకోటిశాస్త్రిగారు, భోగినీదండకము పోతనకృతమను అభిప్రాయముతో నేకీభవించుచు, 'భోగినీదండకము లభించిన కారణముగనే పోతన్నకాల నిర్ణయమునకు నిర్దుష్టమైన ప్రమాణము దొరికినది." (పోతన్న వైచిత్రి - పుట 17) అని వ్రాసిరి.

పోతన చరిత్రమును కావ్యముగ వెలయించిన శ్రీవానమామలై వరదాచార్యులవారు భోగినీదండకము పోతన కృతముగ నంగీకరించి ఆకథను వారు తన కావ్యమున,

"ఉ॥ ముద్దులుమూటగట్టు పదముల్ జతగూర్చి సుధారసమ్ములో
నద్దికడాని క్రొమ్మెఱుంగుటద్దములో నవభావవైఖరుల్
దిద్దియలంకృతుల్ కొనలుదీరిచి పూచి ఫలించివచ్చితా
వద్దననేని పైకొనగ వ్రాసెను భోగినీదండకమ్మొగిన్" (పోతనచరిత్రము - 4-339) అని వ్రాసియున్నారు.

తానురచింపబోవు భాగవతపు కవనమును మచ్చు చూపనెంచి యెల ప్రాయమున నీదండకమును పోతన ప్రౌఢరస భావచమత్కృతులతో, అంత్యానుప్రాససంధానచతురతతో రచించెనని చెప్పవచ్చును.

## భోగినీదండకము – ఇతివృత్తము :–

గోపాల దేవుని రథోత్సవములో సర్వజ్ఞసింగభూపాలుడు పాల్గొనెను. అటియొక వారకాన్త తనూజ యొకతె మేడ పై నుండి ప్రభువును చూచినది వలపు గొనినది తనమనమును తల్లికి తెల్పి, ప్రభువునకు నచ్చజెప్పి రమ్మని కోరినది. తల్లి వలదని కూతునకు సుద్దులు చెప్పినది. కాని వారవధూటి వినక తల్లిని బ్రతిమాలినది. బలవంతము పెట్టినది. తప్పని పరిస్థితులలో వారకాన్త రాజు కడకేగి కుమార్తె కోరికను వివరించినది. రాజు సుముఖతను వ్యక్తముచేసినాడు, వారకాన్త తనూజనేలుకొనినాడు. భామినికి భోగినీ పట్టము కట్టుట, ఏనుగు నెక్కించుట మొదలగు కథాంశములు భోగినీదండకమున వర్ణింపబడియున్నవి.

భాష, భావము, సమపాళ్లలో కూర్చబడి భోగినీదండకము వీనులకు విందై మనమునకు పొందునై అలరారుచున్నది.

## నారయణ శతకము :-

"నారాయణా" అను మకుటముతో, మొత్తము 105 శార్దూల, మత్తేభవృత్తములుగల శతకము నారాయణ శతకము. ఈ శతకమును శ్రీ వంగూరి సుబ్బారావుగారు ప్రకటించి, దీనిని పోతన కృతముగనే తెలిపిరి. శతకమున చివరలో కవినామముతో కూడిన గద్యమొకటి యున్నది. భాగవతమున గల ఆశ్వాసాంతగద్యలతో యీ గద్యము సంవదించు చున్నది. సర్వ సాధారణముగ శతక కవులు కర్తృనామాదులను పద్యములో చెప్పు కొనుట గలదు. కాని నారాయణశతకము నందు గద్యము పొందు పరుపబడి యున్నది.

"వ్రాతప్రతులలోను, తాళపత్రప్రతులలోను ఈ గద్యము లేదు. రెండు కాగితముల ప్రతులలో మాత్రము ఈ గద్యమును పరులెవరైన చేర్చిరేమోనని కొందఱనుమానించి" (శ్రీమద్భాగవతాను శీలనము - పుట 51) రని ధూళిపాళ వారనిరి. కాని నారాయణశతకములోని,

"అపరాధమ్ములు నిన్ను నమ్మి వినుమే నాజన్మ పర్యంతమున్
విపరీతంబుగఁ జేసినాడనికనీవే దిక్కు నాలోనికిన్
కపటంబింతయులేక దండ ధరునుంగట్టిక రక్షింపుమీ
కృపకుం బాత్రుడనయ్యధర్మపురి లక్ష్మీనారాయణా" (నారా॥ శ॥ 97 ప.)

అను పద్యములో "ధర్మపురి" ప్రస్తావనగలదు. ఇది తెలంగాణములో నున్నది. ధర్మపురిలో నున్న లక్ష్మీనారాయణుని పై ఓరుగల్లు వాడైన పోతన నారాయణ శతకమును చెప్పియుండెనన వచ్చును.

ఆంధ్రసాహిత్య అకాడమీవారు. పోతన కృతమను తలంపు ననే నారాయణశతకమును శతకసంపుటములో చేర్చిరి.

"ఈశతక పద్యభావములే మెఱుగు పెట్టబడి భాగవతమున ప్రవేశించినవి" (పోతన్నవైచిత్రి - పుట 20) అని డా॥ కేతవరమువారు పేర్కొనిరి. ఇందు వాస్తవము లేకపోలేదు. నారాయణ శతకమందు గల

"వరకాళింది తరంగడోలికలలో వైకుంఠధామంబులో
వెరవొప్పార నయోధ్యలో మధురలో వ్రేపల్లెలో ద్వారకా

పురిలోనాడెడు భంగినాడుమదిలో భూరి ప్రసన్నాననాం
బురుహంబొప్ప నటించు టొప్పును సితాంభోజాక్ష నారాయణా" (59 ప)

అను పద్యము భాగవతమున, "గజేంద్రమోక్షము" ఘట్టమున గల "అలవైకుం ఠపురంబులో నగరిలో.... .." అను పద్యమునకు మూలమన వచ్చును. ఇట్టి వనేకములు గలవు.

శ్రీఆరుద్రగారు, నారాయణశతక మందలి, "నీమూర్తుల్ గననీ గథల్ వినఁదుదిన్ నీపాదనిర్మాల్యని ష్ఠామోదంబు........" శ్రీమించన్ బహుజన్మజన్మ లకున్ శ్రీయాదినారాయణా" (105 ప) అను పద్యమునుదాహరించి, "జన్మజన్మ లకున్" అను మాట పోతన తత్త్వమునకు విరుద్ధము. పునర్జన్మలేకుండ జన్మ సాఫల్యమును గోరి భాగవతరచన చేసిన పోతన మరల "జన్మజన్మలు" అను మాటపలుకుట అసాధారణం. కనుక ధర్మపురివాఁడు ఎవడో వ్రాసియుంటాడు కాని పోతనగారు కాదు" (సమగ్రాంధ్రసాహిత్యం - సం. 5 - పుట 241) అని పల్కిరి. కాని నారాయణశతకరచన తరువాత భాగవతరచన జరిగినదను విష యమును మనము యిట విస్మరింపరాదు. శతకరచనాకాలమునకు పునర్జన్మ రాహిత్యమునకు సంబంధించిన ఆలోచన పోతన మహాశయునికి యుండి యుం డదు. "జన్మజన్మలకు" అను దానిని, "నిరంతరము" అను సామాన్యర్థమున పోతన ప్రయోగించెనని చెప్పవచ్చును.

పై పరిశీలనమును బట్టి నారాయణశతకమును పోతనయే రచించెనని నుడవచ్చును.

నారాయణశతకమున, ఆదిదశకము, అవతారదశకము. దివ్యరూపదశ కము, నామదశకము, కృష్ణావతారవింశతి, జ్ఞానవింశతి, మోక్షవింశతి, అను విభా గములుగావించు కొని పోతన రచించినటులుగ, శేషాద్రిరమణ కవులు భావించి (నారాయణశతకము - పీఠిక - పుట 3)" యున్నారు. ఇందు అద్వైతమునకు చెందిన పద్యములెన్నియున్నవో, విశిష్టాద్వైతమునకు చెందిన పద్యములును అ న్నియున్నవి. అన్నియును సంకీర్తనారూపములే.

## ఆంధ్రమహాభాగవతము :-

అశేషవిషయ విశేషజ్ఞాన పరిపూర్ణుడు, పరమభాగవతనైష్ఠికుడు, నారాయణపరబ్రహ్మతత్త్వవేత్త, పురాణకథకుడైన శుకమహర్షి మృదు మధుర వచన విలాసము నిండుగ గల పోతనగారి కీర్తిభవనమునకు ముఖ్యాధారభూతమైనదీ ఆంధ్రమహా భాగవతము పోతన కృతమనుటలో వివాదములేని కృతియు నిదియే. వేదవిభజన చేసి, వేదవ్యాసునిగ ప్రసిద్ధి నందిన కృష్ణద్వైపాయన మహర్షి సంస్కృత భాషలో దాదాపు 22,000. సంఖ్యతో భాగవత పురాణమును రచించెను. అదియే పోతనగారిచేతిలో, కమ్మని తెలుగులో 30,000 పైగ గద్యపద్యములకు విస్తరింపబడుట జరిగినది.

నేడు మనకు లభ్యమగుచున్న భాగవతము సంపూర్ణముగ పోతనకృతముగాక, పరకవిప్రణీతములైన కొన్ని భాగముల కలయికగల సంకీర్ణ రూపమున వెలయుచున్నది. ఆ పరకవులే 1. వెలిగందులనారయ, 2. బొప్పరాజుగంగన 3. ఏల్చూరిసింగన. ఈ ముగ్గురు కవులు పోతన అనుమతితో భాగవతమున ఆయాభాగములను అనువదించుట జరిగినదా? లేక కొన్ని విశేషమైన కారణాంతరముల వలన లుప్తమైన లేదా శిథిలములైన భాగములను పూరించియుండిరా? అను విషయములను ఇతిమిత్థముగ తెలుపుటకు నిర్దుష్టమైన ఆధారములు లభ్యమగుటలేదు. అయినను విజ్ఞులైన పరిశోధకులు యీ విషయమున శ్రద్ధవహించిరి కాని వీరితీర్పునను భిన్నస్వరములు వినిపించుచున్నవి.

నారయాదుల రచనకు ప్రస్తుతము రెండు కారణములు ప్రధానముగ వినవచ్చుచున్నవి. ఇందు మొదటిది కూచిమంచి తిమ్మకవి "సర్వలక్షణసార సంగ్రహము" అను గ్రంథమున, గల (రేఫఱకారప్రక॥ 266)

"మనుడుపోతనమంత్రిమును భాగవతమురచించి చక్రికి సమర్పించునెడల
సర్వజ్ఞసింగమక్ష్మావరుండది తనకిమ్మని వేడగా నీయకున్న
నలిగి యాపుస్తకంబవనిఁ బాతించిన జివికి యందొక కొంతశిథిలమయ్యె
గ్రమ్మఱనది వెలిగందుల నారప్పరాజును మఱి బొప్పరాజుగంగ

రాజు మొదలగు కవివరుల్ తేజమెసగ
జెప్పిరా గ్రంథములయందె తప్పులొదవెఁ
గాని పోతన కవీంద్రుని కవితయందు
లక్షణంబెందుఁ దప్పునా దక్షహరణ" అను పద్యము వలన తనకు అంకితమివ్వలేదను కోపమున సింగభూపాలుడు పోతన భాగవతమును పాతిపెట్టించినట్లు, శ్రీరామచంద్రుని సందర్శనము ఫలితముగ పాతిపెట్టించిన భాగవతమును వెలికి తీయించినట్లు, అప్పటికి గ్రంథమందొక కొంత శిథిలమగుటయును జరిగెను. ఆచెడిన భాగములను నారయ గంగన సింగనలు పూరించినటుల తెలియుచున్నది. కాని పై కథను తిమ్మకవి భాగవతమున అల్పముగ కన్పించు "అ" "ర" లకు ప్రాసలు కూర్చుట పూర్తిగ శిథిలములైన భాగములలోని ప్రయోగములేకాని పోతరాజుగారి రచనలోనివి కావని నిరూపించుటకు చెప్పినట్లుగ తోచుచున్నది

సర్వజ్ఞసింగమనీడు, పోతన తనకు కావ్యమంకిత మివ్వలేదని కోపించినయెడల గ్రంథమును పాతిపెట్టించక ఏదోవిధముగ నాశమొందించి యుండును. కనుక పాతిపెట్టించుట, వెలికితీయించుట అనునది అర్థరహితముగ తోచుచున్నదని చెప్పవచ్చును.

శ్రీ చాగంటి శేషయ్యగారు, "సింగభూపాలుడు నిజముగ గ్రంథమును పాతిపెట్టించిన బాధాదగ్ధ హృదయుడైన పోతనమహాకవి నోట ఆవేదనావేశయుక్తమైన పద్యమొకటియైన రాకుండునా? భయకంపితుడై మిన్నకుండెననుట పొసగదు. నరేంద్రులను "అధము" లని వర్ణించిన ధైర్యశాలి పోతనకదా! పోతనగారు చెప్పకున్నను నారయాదులైనను ఆకథను గ్రంథస్థము కావించియుందురు కదా" (ఆంధ్రకవితరంగిణి – పుట 180 – సం. 6) అని వివరించిరి. కనుక సింగభూపాలుడు గ్రంథమును పాతిపెట్టించెననుట సరికాదు.

"జానపదులకు చిక్కిన పాడగునని పోతన తన భాగవతమును పూజాద్రవ్యముగ ఒక మూలనుంచి యున్నందున క్రిమిదష్టమై యుండునని క్రీ. శ. 1848 వ సంవత్సరమున భాగవతమును మొదట ముద్రించిన పురాణం హయ

# వీరభద్ర విజయము - కర్తృత్వము

రమణీయార్థ ప్రతిపాదకమగు శబ్దజాలముతో రసాన్వితమైన వాక్యని ర్మాణము గావించి, చమత్కార జనితభావనా విషయార్థముల సహృదయుల నలరించు కావ్యములను సృజించిన కవులెందరో వాఙ్మయ ప్రపంచమున ఘన యశస్కులై వెలుగొందుచున్నారు వారిలో చాలమంది శ్రీకైవల్యము నాశించి కావ్య రచన గావించిరేగాని యశమునకై అర్రులు చాచలేదు. కావ్యములలో కర్తృత్వాది విషయ వివరణమునకు అంతగ ప్రాధాన్యత నివ్వలేదు. కొన్ని కావ్యములకు కర్తలుగూడ నేడు తెలియుట లేదనిన అత్యుక్తికానేరదు. కొన్ని కావ్యముల రచనావిషయములు వివాదాస్పదమై పండిత చర్చలలో నిమిడి పో యినవి, అట్లు కర్తృత్వ వివాదమునకు పాత్రమైన కావ్యములలో "వీరభద్ర విజయము" ఒక్కటియై యున్నది.

వీరభద్రవిజయము క్రీ.శ. 1924 వ సంవత్సరములోను, క్రీ.శ. 1942 వ సంవత్సరములోను, క్రీ.శ 1960 వ సంవత్సరములోను వావిళ్లవారిచే మూడు మారులు ముద్రింపబడినది. ఈ కావ్యప్రతుల ముఖభాగమున "బమ్మెరపోతనా మాత్యప్రణీతము" అని ముద్రింపబడియున్నది. వీరభద్ర విజయము కృత్యాది లోని అవతారికన్లో పోతన వంశము విపులముగ వర్ణింపబడి యున్నది. ఆశ్వా సాంతగద్యము లందును, "ఇది శ్రీమన్మహామహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్య శ్రీపాదపద్మారాధక కేసనామాత్య పుత్ర పోతయ నామధేయ ప్రణీతంబైన వీరభద్ర విజయంబను మహాపురాణ కథ ...." అని పోతన పేరు స్పష్టముగ పేర్కొనబడి యున్నది. అయినను కొద్దిమంది విమర్శకులు పరమభాగవతునిగ ఆంధ్రదేశమునకు సుపరిచితుడైన పోతనగారు వీరశైవమును ప్రతిపాదించు వీర భద్రవిజయమును రచించె ననుటను సందేహించిరి. ఆ సందేహముతో అస్పష్ట ముగ నున్న, హేతుబద్ధముకాని కొన్ని విషయములను జోడించి వీరభద్రవిజయ ము పోతనకృతము కాదని వాదించిరి.

వీరభద్ర విజయము పోతనకృతము కాదని శ్రీగురజాడ శ్రీరామమూర్తి

ఆచార్య పింగళి లక్ష్మీకాంతము, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, ధూళిపాళ శ్రీరామమూర్తి ప్రభృతులు వాదించి యున్నారు. వీరు చూపిన కారణములను పరిశీలించి, వీరభద్రవిజయము పోతనకృతమని క్రింది విధముగ నిరూపించడ మైనది

గురజాడ శ్రీరామమూర్తిగారు తమ "కవి జీవితములు" అను గ్రంథ మున వీరభద్రవిజయము పోతనకృతము కాదని చూపిన కారణములను క్రింది విధముగ పరిశీలించడమైనది.

గురజాడ శ్రీరామమూర్తిగారు, వీరభద్రవిజయము నందు,

"ఆ॥వె॥ వెలయు మహిమయుంగల్గు వీరమాహేశ్వరా
చారపరుల ధీర సత్యవ్రతుల
వీర సచ్చరితుల వీర విక్రములను
బరగ మ్రొక్కి దలచి భక్తితోడ" (వీర॥ భ॥ వి॥ - 1 - 11 ప) అనియు, మరియు 'తత్ప్రసాద కరుణావిశేష ప్రవర్ధమాన కవితా మహత్త్వ సంపన్నుండనై" (వచనము - 12) అనియు వీరమాహేశ్వరులకు శైవభక్తుల కరుణచేత పోతన తనకు కవితా ప్రజ్ఞయొదవినట్లు చెప్పుకొనియెను కాని భాగవతమున ఇది పరమేశ్వర కరుణా కలిత కవితావిచిత్ర " (భాగవతము - వచ॥ 4?2) అని పరమేశ్వరుని కరుణతో కవిత అబ్బినటుల చెప్పబడియున్నది. వీరభద్రవిజయమును వ్రాసిన పోతనయే భాగవతమునకు కృతికర్తయైన యిట్లువిరుద్ధమైన అభిప్రాయములేల వెలువరించును?" (కవిజీవితములు - పుట 6?3) అని వాదించియున్నారు

శైవభక్తుల దయాసంపదతో ప్రవర్ధమాన కవితా మహత్వ సంపత్తి కలిగినదేకాని కవితకాదు కవితముందుగనే అలవడినది. అలవడిన కవిత శైవ భక్తుల ప్రోత్సాహమున అభివృద్ధినందినదని కవిభావన. ఇంతియేగాక వీరభద్ర విజయము నందలి 40వ వచనమున "వీరభద్రప్రసాదలబ్ధ కవితాతిశయంబున" అని వీరభద్రుని అనుగ్రహముతోడ కవిత్వమున అతిశయము సాధించినటుల,

చెప్పుకొనుట గూడ జరిగినది. మరియొక విషయమును మనమిటగుర్తింప వలసి యున్నది. వీరశైవులు నిత్యలింగార్చనకాలములో తమయింటికి వచ్చిన జంగ మునియందే పరమేశుని గాంచెదరు. సేవించెదరు. శ్రీనాథుని హరవిలాస కావ్య ములోని సిరియాలుని కథ యిందులకు తార్కాణము. కనుక మహేశుభక్తుల కృపతో కవిత యొదవుట మహేశుని ప్రసాదముతో అబ్బినటులే. కనుక గురజాడ శ్రీరామమూర్తిగారి వాదమునకు యీ సమాధానము చక్కగ సరిపోవును. వీర మాహేశ్వరులు అను శివభక్తులైనను, వీరభద్రేశ్వరుడైనను. మహేశ్వరుడైనను అందరిలో పోతనకు కనిపించినది సర్వేశ్వరుడైన పరమేశ్వరుడే. ఆయన అను గ్రహముననే పోతనకు కవితఅబ్బినదని చెప్పవచ్చును. కనుక గురజాడవారి వాద ము హేతుబద్ధముకాదు.

గురజాడ శ్రీరామమూర్తిగారి రెండవ కారణమిట్లు గలదు. "వీరభద్ర విజయము కృత్యాదిలో ఇవటూరి సోమనాథుని కోరికపై వీరభద్రుని అనుగ్రహ ముతో బాలపోతన వీరభద్ర విజయమును వ్రాసినటుల తెలియుచున్నది. కాని అదే అవతారిక అంతమునగల

"ఉ॥ బాగవతప్రబంధమతి భాసురతన్ రచియించి దక్షదు
ర్యాగకథాప్రసంగమున నల్పవచస్కుడనైతి తన్నిమి
త్తాగతవక్త్రదోష పరిహారముకై యజనైకశైవశా
స్త్రాగమ వీరభద్రవిజయంబు రచించెదవేడ్కనామదిన్" (41 ప) అను పద్యము ననుసరించి భాగవతమున దక్షాధ్వరకథా ప్రసంగమున చేసిన, శివనింద వలన వచ్చిన, పాపపరిహారము కారణముగ వీరభద్రవిజయమును రచించినటుల చెప్పుట పరస్పర విరుద్ధముగదా"? (కవిజీవితములు - పుట 623-624) అనిరి.

శ్రీరామమూర్తిగారు చూపిన పై పద్యము మూలప్రతులందు కానవ చ్చుట లేదు. క్రీ. శ. 1924, 1942, 1960 సంవత్సరములలో వీరభద్రవిజయ మును ముద్రించిన వావిళ్లవారు మూడు మారులు పై పద్యమును నక్షత్రపుమా ర్కుతో గుర్తించి పుట క్రింద, ఈ పద్యము పెక్కుమాతృకలందు కాన్పింపదు"

అని వ్రాసియున్నారు. శేషాద్రిరమణ కవులు "పై పద్యము వీరభద్రవిజయము లిఖిత ప్రతు లందు కానరాదు. ఆంధ్రసాహిత్య పరిషత్తులో గల తాళపత్రములలోని వీరభద్రవిజయ ప్రతులందు, ఆంధ్ర పరిశోధక మండలిలోని లిఖితప్రతుల యందు నీపద్యము లేదని వినియున్నారము" (ఆంధ్రమహాభాగవతము విమర్శనము - పుట 73) అని పేర్కొనియున్నారు. వీరు, "వీరభద్రవిజయము పోతరాజు బాల్యగ్రంథమనుటకు మాకెట్టి సంశయములేదు" (ఆంధ్రమహాభాగవతము-విమర్శనము - పుట 73) అని తమ నిశ్చితాభిప్రాయమును వెలిబుచ్చియున్నారు.

శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు, "ఎవరో శివపక్షపాతులు కల్పించిన పద్యముకాని యదిపోతనదికాదు" (పోతన - పుట 11) అని చెప్పిరి.

డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి గారు, 'భాగవతంలో వ్రాసినదానికి ప్రాయశ్చిత్తంగా వీరభద్రవిజయం వ్రాసినట్లున్న పద్యం పోతనగారిది కాదు. భాగవతం అర్థంకాని వీరశైవుడెవడో వ్రాసింది" (పోతన్నవైచిత్రి - పుట 15) అని పేర్కొనిరి.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారి ఓరియంటల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్‌లో వీరభద్రవిజయము తాళపత్రప్రతు ఏడుగలవు. అందు చదువుటకు వీలు కలిగివున్నవి 5 ప్రతులు గలవు. వీనిలో 1ప్రతియందు మాత్రమే పై పద్యమున్నది. మిగిలిన 4 ప్రతులలో పై పద్యము కానరాదు. పద్యములేని ప్రతులు శిథిలావస్థలో నున్నవి. పట్టు కొనిన ఆకులు పొడిపొడిగ రాలిపోవుచు తమ ప్రాచీనతకు గుర్తుగ మిగిలయున్నవి. పద్యమున్న ఒక్క తాళపత్రప్రతి చక్కని ఆకులతో స్పష్టమైన వ్రాతతోఆర్వాచీనతను చాటుకొనుచున్నది. కావున ఈ ఒక్క ప్రతిలో గూడ పై పద్యమును అనంతర కాలమున చేర్చియుందురని చెప్పవచ్చును.

పరిశీలనప్రతుల వివరములు :-

**R** - 282 = "భాగవత ప్రబంధమతి ..........." అను పద్యమున్న ప్రతి

**R** - 292 , **RD** - 792., **D** - 793; **D** - 795 = పద్యములేని ప్రతులు.

కనుక పై పద్యము ప్రక్షిప్తమనినుడవవచ్చును. భాగవతాంతరము వీరభద్ర విజయ రచనజరిగినదను సమస్య తలఎత్తుచున్నది. కావ్యారంభమున పోతన, "పిన్నవాడననియు, పెక్కు సంస్కృతులను విననివాడననియు వెఱపుమాను'' (21 ప) మని గురువు చెప్పినటుల పేర్కొనెను. కనుక కులగురువు, మతగురువుఐన సోమగురుని ఆదేశాను సారమే పోతన వీరభద్రవిజయమును రచించెనని చెప్పవచ్చును. కనుక గురజాడ శ్రీరామమూర్తిగారి వాదనసరికాద నియు, "భాగవతప్రబంధ........" మను పద్యము ప్రక్షిప్తమనియు, వీరభద్ర విజయము పోతన బాల్యకృతి యనియు నుడువవచ్చును.

గురజాడ శ్రీరామమూర్తిగారు, మూడవ కారణముగ. "వీరభద్రవిజయ కర్త వీరభద్రోపాసకుండు. వీరభద్రవిజయము, భాగవతములకు కర్త ఒక్కరే యైన విభిన్న దైవములను పాసించు చున్నటుల ఎందులకు చెప్పును. కావున భాగవతమును వ్రాసిన పోతన వీరభద్ర విజయమును వ్రాసెననుట సంగతము కాదని" (కవిజీవితములు - పుట 625) వాదించియున్నారు.

ఇందులకు సమాధానమిట్లు చెప్పవచ్చును :- వీరభద్ర విజయమును సంపూర్ణముగ పరిశీలనముచేయగ, కవి తాను వీరభద్రోపాసకుండనని ఎచ్చటను చెప్పలేదని తెలియుచున్నది. 'వీరభద్రేశ్వరప్రసాదంబు గలదు" (22 - వచ॥ పీఠిక) అని వీరభద్రుని అనుగ్రహము ఉండినట్లు చెప్పుకొనెను. కావ్యము వీరభద్రుని విజయవృత్తాంతము కావున ఆ భగవంతుని స్తుతించుట జరిగినది. ఇంతియేగాని వీరభద్రోపాసనను గూర్చి కావ్యమున ఎచ్చటను పోతన నుడవలేదు. వీరభద్రుని అనుగ్రహమును గూర్చి చెప్పిన పై వచనమున "వీరభద్రేశ్వరు" అని చెప్పుటలో గల మర్మమును మనము గుర్తించవలెను. వీరభద్రవిజయమున "భుజగేంద్ర చిహ్నంబు పాల్చువాడు," "మంట లెగయు నొసలికంటి వాడు" (ఆ-4-54 ప) "భుజంగరుద్రాక్ష మాలికా త్రిపుండ్ర శార్దూల చర్మాంబర సామజ చర్మాంబరు"డు (4 ఆ-55 వచనము) అని పేర్కొనుటనుబట్టి వీరభద్రేశ్వరుల కభేదము కల్పింపబడుచున్నది. కావున బాలపోతన వీరభద్రేశ్వరునిలోనే మహే శ్వరతత్త్వమును గాంచినాడనవచ్చును. వీరభద్రవిజయమున గాని, భాగవతమున

గాని పోతన అసలు హృదయము సర్వేశ్వర ధ్యానము. శ్రీరామచంద్రుని సాక్షాత్కారముతో అద్వైతియై, భాగవతమున తిక్కనగారి ధర్మాద్వైతము ప్రబోధించెను. కనుక వాదన సరికాదని, వీరభద్రవిజయము పోతన కృతమని నుడవవచ్చును.

శ్రీ గురజాడ శ్రీరామమూర్తి గారు, వీరభద్రవిజయము పోతన కృతము కాదనుటకు, "పోతన భాగవతమును వ్రాసినాడను కోపమున వీరశైవుడెవరో వీరభద్రవిజయమును రచించి పోతన పేరు పెట్టి యుండును, (కవి జీవితములు - పుట-630.) అని మరియొక కారణము చూపిరి. కాని ఇది నిరాధారము. ఊహా కల్పితము. ఊహలతో కావ్యకర్తృత్వమును కాదని వాదించుట అసమంజసము. కనుక వీరభద్రవిజయము పోతన కృతమే నని చెప్పవచ్చును.

"భాగవతములో గల దక్షాధ్వర కథా సందర్భము, వీరభద్రవిజయము లోని కథా సందర్భము ఒక్కటిగ లేవు" (కవి జీవితములు - పుట - 641-42) కనుక వీరభద్రవిజయము పోతన కృతము కాదని శ్రీగురజాడవారు వాదించిరి

వీరభద్రవిజయము నందు భాగవతము నందు గల దక్షాధ్వర వృత్తాంతము ఒక్కటిగ లేని మాట వాస్తవమే. కాని కావ్యముల రెండింటికిని మూలములు భిన్నముగ నున్నపుడు కథలు ఒకేవిధముగ నుండుట పొసగనేరదు గదా! వాయుపురాణానుసారము వీరభద్రవిజయము, భాగవత మహా పురాణానుసారము ఆంధ్ర మహాభాగవతము రచింపబడెనను విషయము ఆయా కావ్యముల కృత్యాదులలో పేర్కొనుట జరిగినది. కనుక గురజాడ శ్రీరామమూర్తి గారి పై వాదన సరికాదని చెప్పవచ్చును.

శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారు, కేవలము ప్రక్షిప్తమగు ఒక పద్యమును, మరికొన్ని నిరాధారమైన ఊహలను ఆధారముగ జేసికొని వీరభద్రవిజయము పోతన కృతము కాదని వాదించిరని పై విధముగ వివరించి, వీరభద్రవిజయము పోతన చిన్ననాటి రచనయని నుడువవచ్చును.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతము గారు "తెలుగు విజ్ఞాన సర్వస్వమున" వీరభద్రవిజయము పోతన కృతము కాదని చూపిన కారణములను క్రింది విధముగ పరిశీలించుటమైనది.

మొదటి కారణము :-

"భాగవత ప్రబంధమతి భాసురత .........." అను వీరభద్రవిజయములోని (41 వ) పద్యము ననుసరించి భాగవతమున దక్షుని కథా సందర్భముగ గావించిన శివనింద పాపపరిహారార్థముగ వీభద్రవిజయము పోతన వ్రాసినటుల విదితమగుచున్నది. కథలోని శివనింద దక్షునిది గాని కవిది కాదుగదా! మఱి అట్లు వ్రాయుట అసంగతము. కనుక వీరభద్రవిజయము పోతన కృతము కాకపోవచ్చును" (తెలుగు విజ్ఞాన సర్వస్వము - సం. – 3 – పుట - 602) అని పింగళివారు అభిప్రాయపడిరి.

పింగళివారి ఆక్షేపణకు కారణమైన పై పద్యము తాళపత్ర ప్రతులందు లేదని నిరూపించి ప్రక్షిప్త పద్యముగ వివరించుట జరిగినది. వీరభద్రవిజయమున గూడ దక్షుడు గావించిన శివనింద గలదు. మరి దీనికి గూడ ప్రాయశ్చిత్తముగ మరియొక గ్రంథమును వ్రాయవలయును కదా! కావున కథలోని శివనింద తత్పాత్రకే పరిమితముగాని కవికిగాదు. వ్యాసుడు అనేక కథా సందర్భములను పురస్కరించుకొని శివుని, కేశవుని, మరి యితరదేవతలను నిందించెను గదా! అటులనే భాగవతమున గూడ, శివనింద జరిగినది. అంతమాత్రమున పాపము వచ్చుట, దాని పరిహారార్థము వేరొక కావ్యమును రచించుట-మొదలగు వాక్యములలో సత్యము లేదు. కనుక ఆరుద్రగారని నట్లు "నూనూగు మీసాల నూత్నవయస్సులో పోతన గారు వీరభద్రవిజయమును వ్రాసియుండును" (తెలుగు విజ్ఞాన సర్వస్వము - సం 3 - పుట 602) అని చెప్పి పింగళివారి వాదనను త్రోసిపుచ్చవచ్చును.

రెండవ కారణము :-

"శైలి, కవి ఆత్మీయత వెలువరించు ఇతర అంశములను బట్టి చూచి

నను ఇది పోతనకృతము కాదు" - అని పింగళివారు మరియొక కారణము చూపి వీరభద్రవిజయము పోతనకృతము కాదని వాదించిరి.

పోతన గారి శైలికి, ఆత్మీయతకు మనకు ప్రధానాధార భూతము శ్రీ మదాంధ్ర మహాభాగవతము. ఇందు మృదుమధుర మైనశైలి, శుద్ధవైష్ణవ భక్తి రసావతారము మనకు సాక్షాత్కారించును. శ్రీ కైవల్య సాధనకు, పునర్జన్మ రాహిత్యమునకు హరిభక్తి యనెడు నావను జీవుడు చేపట్టవలెనను తత్త్వము భాగవతమున స్పష్టమగుచున్నది. కావుననే అష్టోత్తర సహస్రనామ సంకీర్తనము వలె అనేక పర్యాయములు విష్ణునామ సంకీర్తనచేయు పోతన ఆత్మమనకు భాగవత కథలో దర్శనమిచ్చును.

వీరభద్రవిజయమున కూడ మెత్తని శైలికి లోటులేదు. కాని భాగవత రచనలో నున్న నిండుదనము వీరభద్రవిజయమున కొంత లోపించి యుండనోపు. ఇందులకు కారణము వీరభద్రవిజయము పోతన బాల్యకృతి యగుటయే. భాగవతమున వయసా, మనసా పండిన పరిపక్వత, వైష్ణవభక్తితత్త్వము, "నదైవం కేశవాత్పరం," 'సర్వం విష్ణుమయం జగత్" అనెడు పరమ భాగవతుని ఆత్మీయత గోచరించును. వీరభద్రవిజవిజయమున "భువి నగ్రదైవము మహేశుడు" "దేవుండీశ్వరుడు కాక దేవుఁడు గలఁడె", రుద్రమహిమ తెలియ సాధ్యమె, "దాతకైన అతని తాత కైన" (ఆ 4 - 33 - 30 పద్యములు) అనెడు వీరశైవుని ఆత్మీయత తెలియనగును, వయోపరి పాకమున భాగవతము నందు సంయమన ము సంతరించుకొనగ, వీరభద్రవిజయమున వయో బాంపల్యమున ఆవేశము వీరరసావతారము దాల్చినది.

కావ్యరచనా ఫలము భాగవతమున జన్మరాహిత్యము కాగ, వీరభద్ర విజయమున "శంభుని కొల్వుచేరుట" (ఆ 4 - 227 ప). ఇట్లు ఓకే విధమగు భావములను శైవవైష్ణవముల కనుగుణమగు పదజాలమున వ్యక్తము చేయుట జరిగినది. అకుంఠితమైన మోక్షేచ్ఛ పై రెండు కావ్యముల రచనాఫలముగ పోతన ఆశించెనని చెప్పవచ్చును.

శైలి :- వీరభద్రవిజయమున, బ్రహ్మచారిగ వచ్చిన మహేశుని గురించి పార్వతి చెలులు చెప్పుకొనిన విధము ఇట్లు గలదు.

చ॥ "సదమలమైనవాడు కడుచక్కని రూపమువాడు కాంతిచే
బొదలిన మోమువాడుమెయి భూతి నలందినవాడు దివ్యమై
యొదవిన బ్రహ్మచారిగతి నొప్పిన వాడిటు వచ్చుచున్నవాఁ
డదెయొక గుజ్జుతాపసుడహా వనితామణులార కంటిరే॥ (ఆ 2 - 257 ప)

భాగవతమున గోపికలు శ్రీకృష్ణుని వెదకిన విధమిట్లు గలదు.

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వురా
జిల్లెడు మోము వాఁడొకడుచెల్వల మానధనంబుఁదోచెనో
మల్లియలార! మీ పొదలమాటున లేడుగదమ్మ! చెప్పరే" (10స్కం-1010)

పై రెండు పద్యములందు అలతి అలతి పదముల పొందికతో చక్కని భావమును ఒకే విధముగ అందించుట జరిగినది. వీరభద్రవిజయమున "వనితా మణులార కంటిరే" అనియు, భాగతమున "మల్లియలారా చెప్పరే" అనియు మనోజ్ఞముగ కూర్పబడినది,

వీరభద్రవిజయమున మన్మథుడు మహేశుని పై పూబాణ ప్రయోగము చేయునెడ,

మ॥ విలుజూచున్ వెలిజూచుఁ జూచు సురలన్ విశ్వేశ్వరుంజూచు గ్రొం
దలమందుం దలపోయ జొచ్చుఁ గడిమిన్ దర్వీకరాలం కృతో
జ్జ్వల విభ్రాజిత నిత్యనిర్గుణ తపోవారాన్నిధింజెచ్చెరం
గలఁపం జూఁచుఁగలంప లేక తలకుం గాముండు నిశ్చేష్టుఁడై" (2-101ప)

భాగవతమున సత్యభామ నరకాసురునితో యుద్ధముచేయు సందర్భమున,

"పరుఁజూచున్ వరుజూచు నొంప నలరింపన్ రోషరాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గనులఁ గెంపు సొంపుబరగన్ జండాస్త్ర సందోహమున్

సరసాలోక సమూహమున్ నెఱపుచున్ చంద్రాస్య హేలాగతిన్" (10–178)

పై రెండు పద్యములకు నాచన సోమన ఉత్తరహరి వంశములోని, "అరిఁజూచున్ హరిఁజూచు........" అను పద్యము మార్గదర్శకమని చెప్ప వచ్చును.

పై విధముగ పోతన వీరభద్రవిజయమున గూడ మృదుమధుర శైలికి కొరతలేదని చూపవచ్చును.

ఆత్మీయత :- భక్తిభావ ప్రకటనావసరమునను, భగవత్ తత్త్వమును ప్రస్తుతించు సందర్భమునను, భక్తులచరిత్రల వర్ణనలలోను పోతన మహాకవి ఆత్మప్రతి ఫలించుచుండును. భక్తుల(పాత్ర)లలో పోతన తన్మయుమై కన్పించుట విశేషము. ఆపాత్రలనోటి నుండివెలువడు ప్రతిబావము పోతన భావముగనే తెలియనగును. భాగవతమున ప్రహ్లాదుడు మొదలగు పాత్రలు విష్ణుభక్తి నెట్లు ప్రకటించునో, వీరభద్రవిజయమున దధీచి మొదలగు పాత్రలు శివభక్తినంతగ ప్రకటించుట జరుగును.

వీరభద్రవిజయమున, బ్రహ్మాదిదేవతలు మహేశునిస్తుతించిన విధమును చూడవచ్చును :-

"సీ భుజగేంద్ర భూషాయ భూతాధినాథాయ నిత్యానురాగాయ నిర్మలాయ
గంగావతంసాయ ఖండేందుజూటాయ, దేవాధిదేవాయ దిక్పటాయ
వేదాంతవేద్యాయ వీరప్రతాపాయ, కైవల్యనాథాయ మనమునాసు
రణరంగవీరాయ రమణీయరూపాయ, భువనాభిరామాయపురహరాయ

ఆ॥ ఓం నమశ్శివాయ ఓంకారరూపాయ
శంకరాయ రిపు భయంకరాయ
మదన సంహారాయ మానితకైలాస
మందిరాయ నీలకంధరాయ" (4ఆ – 217ప)

బాగవతమున శ్రీహరిస్తవము క్రింది విధముగ గలదు.

"సీ॥ పంకజనాభాయ సంకర్షణాయ శాంతాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేంద్రియాత్మనే సూక్ష్మాయ, వాసుదేవాయ పూర్ణాయపుణ్యాయనిర్వి
కారాయ కర్మనిస్తారకాయత్రయీపాలాయ త్రైలోక్యపాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వయంజ్యోతిషేదురంతాయ కర్మ
సాధనాయ పురాపురుషాయ యజ్ఞ
రేతసే జీవ తృప్తాయ పృథ్వీరూప
కాయలోకాయ నభసే౽ స్తకాయ విశ్వ
యోనయే విష్ణవే జిష్ణవే నమోస్తుతే" (4 స్కం॥ - 702 ప).

కొన్నియెడల ఒకే విధమైన భావములను వివరించుట గూడ గలదు.
వీరభద్రవిజయమున మహేశుతత్త్వమును గూర్చి,

కం॥ భావించి జగములన్నియు
గావింపగ వానినన్ని ఖండింపఁగ బ్ర
హ్మవిష్ణుమహేశ్వరులన
నీవైతివికాదె దేవనిఖిలాధిపతీ" (3 - 241ప). అనియు,

కం॥ పుట్టింపనీవె నేర్తువు
నెట్టనరక్షింపనీ వెనేర్తువు గడిమిం
గిట్టింపనీవె నేర్తువు
యిట్టిదయారసమె చెల్లునీకు మహేశా". (4 - 194ప) అనియు పోతన
వర్ణించియున్నాడు.

భాగవతమున, బ్రహ్మాదిదేవతలు మహేశుని కీర్తించిన విధము క్రింది
విధముగ గలదు.

"సకలసృష్టి స్థితి సంహారకర్తవై బ్రహ్మవిష్ణుశివాఖ్య పరగుదీవు"(8స్కం-
222) అనియు,

"కం॥ నీయందె సంభవించును
నీయందె వసించియుండు నిఖిలజగంబుల్
నీయందెలయముఁ బొందును
నీయుదరము సర్వభూతనిలయము రుద్రా" (8 స్కం - 223) అనియు గలదు. పైవిధముగ పోతన సర్వేశ్వరుడైన పరబ్రహ్మను ధ్యానించి తృప్తిపడు చుండును. ఇట్టితత్త్వము వీరభద్రవిజయము. భాగవతము లందు కాననగును కనుక శైలి, ఆత్మీయతలనుబట్టి చూచినను వీరభద్ర విజయము పోతనకృత మని నుడువవచ్చును...

మూడవ కారణము :- "భాగవతములోనివలె అను ప్రాసలులేవు. శబ్దాలంకార ములులేవు. మాధురిలేదు. కావున వీరభద్రవిజయము పోతన కృతముగా"దని (తెలుగు విజ్ఞానసర్వస్వము - సం. 3 - పుట 603) పింగళివారు పల్కిరి.

వీరభద్రవిజయమును సమగ్రపరిశీలనము చేయకయే ఆచార్యుల వారు పై అభిప్రాయమును ప్రకటించినటులతోచును. శబ్దాలంకార విన్యాసము వీరభద్ర విజయమున విస్తృతముగ ప్రవర్తింపబడినది. ఒక్కమాటలో చెప్పవలెననిన ప్రతిసీస పద్యమునందును ఏదో ఒకశబ్దాలంకారము ఉండితీరును. అనుప్రాసలు లెక్క కుమిక్కిలిగ గలవు

వృత్త్యను ప్రాసము :- వీరభద్రవిజయమున పార్వతి అవస్థను వర్ణించుచు,

"కం॥ వడవడ వడకుచు నుడుగుచు
జిడిముడిపడుచునొంది కలఁగిచింతాకులయై
వెడగుడసంబున నిలుచుచుఁ
గడువాడినపువ్వుభంగిఁగాంతి దొఱంగున్" (1 - 107ప). ఈ పద్యమున వ డ అను వర్ణములు పలుమార్లు ఆవృత్తియైనవి. మరియు,

"పెదవులు ఁడదవుచుఁగొంకుచు, నదరుచు బెగడుచును నడుగులల్లన నిడుచున్, వదనమువంచుచు నడగుచు, దుదినాలుకతొట్రు వడగ.... .." (1 - 108) అను పద్యమున ద, డ, చు, న అను వర్ణముల ఆవృత్తిగలదు.

55667



లాటానుప్రాసము :- వీరభద్రవిజయమున లాటానుప్రాసమునకు

"జగములోలగల జంతురాసులబట్టి, మనసులగలచు నీమహిమ మహిమ

నాటుచోగంటు గానగరాకవాడియై, సరిలేకనాటు నీశరము శరము

పరమేష్ఠి సృష్టిలోపలి పురుషులకెల్ల, దీపమై వెలుగునీ రూపురూపు

అఖిలంబునెందాక నందాక నందమై, పృథుతరంబైననీ బిరుదు బిరుదు (2-58)

అను పద్యము, మరియు,

"పట్టిసంబులద్రుంచి పలుబాణములనొంచి ముసలాయుధంబుల మోది మోది

అలుగులనాటించి యరచేతులనువ్రేసి ముష్టిఘాతంబుల ముంచి ముంచి (4-130), అను పద్యములను ఉదాహరణములుగ చెప్పవచ్చును. ఇట్టివెన్నియో గలవు.

అంత్యానుప్రాసము :- అంత్యాను ప్రాసమునకు,

"కుంభినిద్రెంతునో జముని గుండెలు చెండుదునో సురాచల

స్తంభముద్రెంతునో సురలచట్టలుచీరుదునో కడంగిది

కుంభులద్రుంతునో యజునిక్రొవ్వణగింతునొ ... ...(4 - 64)అను పద్యమును

కాయజసంహరాయ శశిఖండధరాయ నమశ్శివాయ కా

లాయహరాయ భీషణబలాయ కపాల ధరాయ.... ..." (3 - 64) అను పద్యమును ఉదాహరణముగ చెప్పవచ్చును.

పైవిధముగ శబ్దాలంకారములకు వీరభద్రవిజయము ఆలవాలమైయున్నదని చెప్పవచ్చును

పోతన భాగవతమున చూపినమాధుర్య గుణముగూడ వీరభద్రవిజయమున సువ్యక్తము కాకపోలేదు.

భాగవతమున మూడువ స్కంధము నందు (203) పదియవ స్కంధ నందు చక్రముని మాధుర్యగుణవ్యంజకములైన రెండు దండకములను పోతన

[library stamp]

కూర్చియున్నాడు. ఈ దండకములు తగణములతో, అంత్యమున గురువుతో నున్నవి. వీరభద్ర విజయమున నాలుగవ ఆశ్వాసమున గల దండకము కూడ "తగణము" లచే సంతరింపబడి అంత్యమున గురువుతో అలరారుచున్నది. "శ్రీ నీరరూపాశివద్రోహ గండప్రచండప్రతాపాను పర్వాణ సంఘాత......" నమస్తే నమః"(4-180)అను దండకము చక్కని పదవిన్యాసముతో, అర్థబోధనము గావించుచు, చిత్తద్యుతిని కల్గించుచు. మాధుర్య గుణశోభితమై అలరారు చున్నది. కనుక పింగళివారి వాదము హేతుబద్ధము కాదని చెప్పవచ్చును.

నాల్గవకారణము :- "భాగవతకవి శ్రీరామప్రసాదలబ్ధ కవితా విలాసుడు. వీరభద్రవిజయకవి వీరభద్ర ప్రసాదమున కవిత అబ్బినటుల చెప్పు కొనియెను. రెండు కావ్యముల కర్త ఒక్కరేయైన పరస్పర విరుద్ధమైన అభిప్రాయములను ప్రకటించడు. కనుక వీరభద్రవిజయము పోతనకృతము కాదు. (తెలుగువిజ్ఞాన సర్వస్వము - సం 3 - పు. 604)" అని పింగళివారు వాదించిరి.

గురజాడ శ్రీరామమూర్తిగారికి వచ్చిన సంశయము వంటిదే యిదికూడ. పోతనగారిది శైవటుంబము. పోతన తల్లి ఈశ్వర పాదారాధనాసక్తచిత్త. తండ్రి శైవశాస్త్రములను గనినవాడు. సోదరుడు శివారాధకుడు అట్టికుటుంబమున జన్మించిన పోతనలో పుట్టుకతో శైవము పాదుకొనినది. "పోతనమహేశ్వర పూజా దురంధరుడు. పంచాక్షరీమంత్రోపాసకుడు. భాగవతరచనకు పూర్వము చేసిన శివధ్యానము. సాక్షాత్కరింపినది శ్రీరామచంద్రుడు పోతనకు శివకేశవ భేదములేదు అనియిందు వలన చెప్పనగును. "శివునకు శ్రీమన్నారాయణునకు భేదములేదు. ఎవరిని ధ్యానించినను ఫలితమొకటే. శివుడేకేశవుడు. కేశవుడే శివుడు అని లోకమునకు ప్రకటించుటయే పోతన అభిప్రాయము" (తంజావూరు తెలుగు కవులు – పుట 24) అని చెప్పిన శిష్టాలక్ష్మీకాంతశాస్త్రిగారి మాటలు గమనార్హములు. పోతన భాగవతమునందలి ఆశ్వాసాంత గద్యములందు, "శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితా విచిత్ర .. " అని పరమేశ్వరుని కరుణతో కవిత అబ్బినదని చెప్పుకొని యున్నాడు. పోతనకు శివకేశవ భేదము లేదు గనుకనే భాగవతమును శ్రీరామునికంకితమిచ్చెను. వీరభద్రుడైనను, ఈశ్వరుడైనను,

శ్రీరాముడైనను, పోతనకు ఒక్కటేనని చెప్పవచ్చును.

పై పరిశీలనమును బట్టి పింగళివారు వీరభద్రవిజయము పోతనకృత ము కాదనుటకు చూపిన కారణములు, కొన్ని ఆ కావ్యము నెడ సమగ్రమైన అవగాహన లేనివిగను, మరికొన్ని హేతుబద్ధము కానివిగను తెలియుచున్నవి. కనుక పింగళివారి వాదన సమంజసము కాదనియు, వీరభద్రవిజయము పోతన కృతమనియు చెప్పవచ్చును.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు, తమ "ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము"న వీరభద్రవిజయము పోతనకృతము కాదనుచు చూపిన కారణ ములను క్రింది విధముగ పరిశీలింప వచ్చును.

మొదటి కారణము :-

భాగవతము నందలి వంశవర్ణనమును బట్టి పోతన తల్లి లక్కసాని/లక్క మాంబ/లక్కసానమ్మ, వీరభద్రవిజయము నందలి వంశవర్ణనమును బట్టి పోతన తల్లి "లక్ష్మి" అని తెలియుచున్నది. కనుక భాగవత కర్త పోతన లక్కసానమ్మ కుమారుడు. వీరభద్రవిజయ కర్త లక్ష్మి కుమారుడైన పోతన వేరొక్కడు. ఈ రెండు గ్రంథముల కర్త ఒక్కడు అనుటతగదు" (ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము – పుట 67-68) అని ఖండవల్లి వారు వాదించిరి.

"పోతన వంశము"అను ఉపప్రకరణమున పోతన వంశమును వివరించు ట జరిగినది. లక్ష్మికి గౌరవ సూచకముగ "అమ్మ" చేరిన లక్ష్మమ్మ. "లక్ష్మమ్మ" యనునదే లక్కమాంబ, లక్కసాని లక్కమ్మగ మారియుండును. కావున "లక్కమ" అను పదమునకు సంస్కృతీకరణము లక్ష్మియని చెప్పవచ్చును. వీరభద్రవిజయమున తన తల్లి లక్ష్మిని గూర్చి పోతన,

అట్టి ఘనుండు మంచికి దయాగుణ ధీమణి మాచమాంబకుం
బుట్టిన లక్ష్మికన్య యనఁ బొల్పగు గోపనకూర్మిచెల్లెలిన్

నెట్టనఁ బెండ్లియాడె మహనీయుడు కేసనమంత్రి శ్రీసతిన్
దట్టపు వేడ్కఁగేశవుడు తాను వరించిన భంగిపొంగుచున్" (1-35)

అనియు, "పావనగంగ భోగశచి భాగ్యపుగౌరి గభీరభూమి సం
భావనకుంతి రూపగుణభారతి సంపదలక్ష్మిదేవి సం
సేవింత సంజ్ఞ నిశ్చల విశేషయరుంధతి యైన లక్కమాఁ
గేవలకన్యయే తలపఁగీర్తన సేయదగున్ ధరాస్థలిన్" (1-37)

అనియు వివరించెను. మొదటి పద్యమున, శ్రీ మహావిష్ణువు శ్రీలక్ష్మిని చేపట్టిన రీతి కేసన లక్ష్మిని వరించెనని రెండవ పద్యమున ఆమె సంపదలలో లక్ష్మియని చెప్పబడియున్నది. అనగ రెండు పర్యాయములు లక్ష్మీదేవితోడనే పోలిక చెప్ప బడియున్నది. కనుక లక్కమ్మను లక్ష్మిగ సంస్కృతీకరించి పోతన చెప్పెనని భావింపవచ్చును. పోతన తల్లి పెండ్లియయిన కొద్దికాలము వరకు లక్ష్మిగ పిలు వబడి, వయసు పెబడినతఱి లక్కమ్మ, లక్కసానమ్మగ పిలువబడి యుండు ననుటలో బాధకముండదని చెప్పవచ్చును. ఇట్టి మార్పులు లోకానుభవమున ఎల్లరకును గోచరమగుచుండును. కనుక లక్ష్మియే, లక్కసాని/లక్కమాంబ యని వివరించి, భాగవత కర్తయైన పోతనయే వీరభద్రవిజయ కర్తయని ఋజు వు చేయవచ్చును.

రెండవ కారణము :-

"భాగవతమున పోతన యింటి పేరు 'బమ్మెర'' అని చెప్పబడెను వీరభద్రవిజయమున యింటి పేరును ప్రస్తావించి యుండలేదు కనుక వీరభద్ర విజయమును పోతన పేరుగల వేరొకవ్యక్తి వ్రాసియుండు"నని (ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము - పుట 68) ఖండవల్లివారు వాదించిరి

భాగవతము నందలి, వీరభద్రవిజయము నందలి పోతన వంశము, తల్లిదండ్రులు మొదలగు సమస్త అంశములును అను సంధించుచుండుట నిర్వి వాదము. అందున వీరభద్రవిజయమున పోతన వంశవర్ణనము విపులముగ

వర్ణింపబడి యున్నది. ఇట్టియెడ యింటిపేరును ప్రత్యేకముగ చెప్పవలసిన అవసరము పోతనకు కన్పించలేదు. భాగవతమున వంశవర్ణన స్థూలముగ చెప్ప బడినది. సంక్షిప్తతలో స్పష్టతకై ఇంటిపేరును భాగవతమున చెప్పియుండును' అంతియేగాని యిట్టి అల్ప విషయమును ఆధారముగ గొని సాహిత్య చరిత్రలో పోతన లిరువురుండిరని చెప్పుట సమంజసముకాదు. కనుక వీరభద్ర విజయ మును, భాగవతమును రచించినవి బమ్మెరపోతనయేనని చెప్పవచ్చును.

మూడవకారణము :- "భాగవతమున పోతన 'సహజపాండిత్యు' డని చెప్పు కొనుటజరిగినది. వీరభద్రవిజయము కావ్యకర్తకు గురువు ఇవటూరిసోమనాథు డుండెను. పోతనకు గురువు కలిగిన సహజపాండిత్యుడనని యుండడు. కావున వీరభద్రవిజయకర్త భాగవతమును వ్రాసిన పోతనకాడు" (ఆంధ్రసాహిత్యచరిత్ర సంగ్రహము - పుట 68) అని లక్ష్మీరంజనము గారు మరియొక కారణమును చూపివాదించిరి.

"ఇవటూరి సోమనాథుడు పోతనకు కేవలము మతగురువు మాత్రమే" నను విషయమును "పోతనగురువు" అను ఉపప్రకరణమున వివరించుట జరిగి నది. పోతనను తమ ప్రపితామహునిగ చెప్పుకొనిన దాక్షాయణీపరిణయ కర్త లైన కేసన, మల్లనలు శైవాచార పరాయణులే. వీరికి గూడ ఇవటూరి వంశ మువారే మతగురువులుగ ఉండిరని తెలియుచున్నది. కనుక ఇవటూరి సోమ నాథుడు పోతనకు మతగురువేనని స్పష్టపడు చున్నది. జనకశిక్షిత విహితాక్షరా భ్యాసుండై, పోతన స్వయముగ కావ్యశాస్త్రములను పఠించి, మననము గావించు కొని, సంపూర్ణ ప్రతిభావ్యుత్పత్తులను సంపాదించుకొని, భాగవతరచనా కాలము నాటికి సహజపాండితీ సంపన్నుడైనాడు. అందుచేతనే చిన్ననాటిరచనయైన వీర భద్రవిజయమునందు పేర్కొనక, ప్రౌఢనిర్భరవయోపరిపాకమున వ్రాసిన భాగ వతమున "సహజ పాండిత్యు" డని పోతన చెప్పుకొనెను. కనుక ఖండవల్లి వారి వాదన సరికాదనిచెప్పవచ్చును

నాల్గవకారణము :- "భాగవత ప్రబంధమతి భాసురతన్ రచియించి........"

అను పద్యమునుబట్టి భాగవతరచన తరువాత వీరభద్రవిజయరచన జరిగినటుల తెలియుచున్నది. కానిరచనలు పోల్చిచూచిన భాగవతానంతర రచనమని వీర భద్రవిజయమును చెప్పవీలుపడ"దని (ఆంధ్రసాహిత్య సంగ్రహము - పుట 68) ఖండవల్లివారు అభిప్రాయపడిరి,

ఆచార్య ఖండవల్లివారు ఉదాహరించిన పై పద్యము పెక్కుతాళపత్ర ప్రతులందును, లిఖితప్రతులందును లేదని, అది ప్రక్షిప్తమని యింతకుమును పే వివరించుట జరిగినది. కనుక ఖండవల్లివారి వాదనకు ఆస్కారము లేదని చెప్పవచ్చును.

<u>ఐదవకారణము :-</u> "భాగవతము పాండితీవిలసితము. వీరభద్ర విజయము పేలవము. ఈ కావ్యముల రెండింటికిని కవి యొక్కరేయయిన రెండు కావ్యముల మధ్య రచనలో స్పష్టమైన వైరుధ్యమెట్లుండును?" (ఆంధ్రసాహిత్యచరిత్ర సం గ్రహము - పుట69) అని ఆచార్యులవారు వాదించిరి.

వీరభద్రవిజయము పోతన పిన్ననాటి రచన. భాగవతము వయోపరిపా కమున రచింపబడినది. తొలి, మలిరచనల మధ్య వ్యత్యాసము సహజము. కనుక భాగవతముతో వీరభద్రవిజయమును పోల్చిచూచుట సరికాదనిపించును. కాని భాగవతమును వదలి పరిశీలించిన వీరభద్రవిజయము కూడ చక్కని జిగి బిగిగల కవితగ మనకు కానగును. కనుక ఖండవలివారి వాదన సరికాదని చెప్పవచ్చును.

<u>ఆరవకారణము :-</u> "పోతన తండ్రి కేసనకు లక్కసానమ్మ, లక్ష్మి అను యిద్ద రు భార్యలుండి యుండును. వారిద్దరకు జన్మించిన ఇద్దరు మగబిడ్డలకు "పోతన" అనియేనామమిడుట జరిగియుండును. ఈ ఊహసాగనిచో ఇవటూరి సోమనాథుడు లేదా ఆతని ప్రేరణతో నాతని శిష్యులలోనే ఒక్కరో వీరభద్రవిజ యమును వ్రాసిన గ్రంథ ప్రశస్తినికోరి పోతనామాత్యున కారోపించి యుందురని

తలంపవలయుననని" (ఆంధ్రసాహిత్యచరిత్ర సంగ్రహము - పుట 69) ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు వాదించిరి.

పోతన తండ్రికేసనకు ఇద్దరు భార్యలుండిరనుట అసంగతమైన విషయము. లక్ష్మి-లక్కసాని అను పేర్లకు సంబంధించిన చర్చ యింతకుమునుపే జరిగినది. కనుక లక్ష్మి, లక్కసానమ్మ అని యిద్దరుండుట అసంభవము. ఆచార్యులవారనినట్లు అదికేవలము ఊహామాత్రమే. కనుక ఊహలతో కథల ల్లుట సత్యసమ్మతముకాదు. ఇక ఇవటూరి సోమనాథుడు కాని లేక అతని శిష్యులలో ఎవరైననుకాని కావ్యమువ్రాసి పోతనపేరు పెట్టెననుట పొసగదు. ఎందుకనగ, ఇవటూరివారు పోతనవంశమునకు మతగురువులు కనుక [ఈ విషయముగూడ యింతకు పూర్వమే చర్చింపబడియున్నది.] ఇట్టి నీచమైన పనికి ఒడిగట్టి యుండరని చెప్పవచ్చును. కావున మతగురువైన ఇవటూరి సోమన ప్రేరణతో పోతన వీరభద్ర విజయమును చిన్నవయసులో రచించి యుండునని చెప్పవచ్చును కేసనకు ఇద్దరు భార్యలుండుట సత్యదూరము.

పై విధముగ, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు వీరభద్రవిజయము పోతనకృతము కాదని చూపిన కారణములను ఊహలను త్రోసిపుచ్చి, కేసన పుత్రుడైన పోతన చిన్నవయసులో ఇవటూరి సోమగురువుని ఆదేశాను సారము వీరభద్రవిజయమును రచించెనని, ఈ పోతనయే వయోపరిపాకమున భగవతమును రచించెనని, పోతనతల్లి లక్ష్మి (లక్కసానమ్మ) యని చెప్పవచ్చును.

శ్రీధూళిపాళ శ్రీరామమూర్తిగారు, వీరభద్ర విజయము పోతనకృతము కాదని తమ "శ్రీమద్భాగవతాను శీలనము" న కొన్ని కారణములను చూపి వాదించియున్నారు. వానిని క్రిందివిధముగ పరిశీలింపవచ్చును.

<u>మొదటికారణము</u> :- "భాగవతమున ఇష్టదేవతాస్తుతిలో వీరభద్రుని స్తుతిలేదు వీరభద్రుని పేరనొకకావ్యమును వెలయించిన పోతన యిష్టదేవతాస్తుతిలో మర

చినాడనుటవీలులేదు. కావున భాగవత కర్తయైన పోతన వీరభద్ర విజయము ను రచించి యుండడు" (శ్రీమద్భాగవతానుశీలనము - పుటలు 22, 23) అని ధూళిపాళవారు ఆరోపించిరి.

భాగవతరచననాటికి పోతన అద్వైతి రామకృష్ణులకభేదమును పాటిం చిన పోతన వీరభద్రరుద్రులకును అభేదమును కల్పించెననవచ్చును. కావున పరమేశ్వరస్తుతిలోనే వీరభద్రునిస్తుతియిమిడి యున్నదనవచ్చును. శివకేశవులకే భేదమును పాటించని పోతన వీరభద్రరుద్రులకు భేదము నెట్లు పాటించును? కనుక వీరభద్రుని ప్రత్యేకస్తుతి భాగవతమున లేనందున వీరభద్ర విజయము పోతనకృతము కాదనుట సముచితము కాదనిపించును.

<u>రెండవకారణము</u> :- "గురువుగ వీరభద్ర విజయమున పేర్కొనిన ఇవటూరి సోమనాధుని ప్రసక్తి భాగవతమునకనింపిచదని" (శ్రీమద్భాగవతాను శీలనము - పుట 24) దూళిపాళవారి మరియొక వాదన.

ప్రతివంశమునకు ఒక కులగురువుండును. అటులనే ఇవటూరి సోమ నాథుడు పోతన వంశమునకు మతగురువు · వీరశైవప్రతి పాద్యమగు కావ్యము వీరభద్రవిజయము. ఈ మతగురువు అనతితోడనే పోతన వీరభద్ర విజయము నురచించెను. కనుక ఈకావ్యమున పోతన ఇవటూరి సోమనకు మ్రొక్కులు చెల్లించుకొనెను. వీరశైవము సడలినదశలో భాగవతనైష్ఠికుడైన పోతన భాగ వతములో సోమగురుని పేర్కొనక పోయెనని చెప్పి ధూళిపాళవారి వాదమును త్రోసిపుచ్చవచ్చును.

<u>మూడవకారణము</u> :- "వీరభద్రవిజయమును గూర్చి భాగవతమున చెప్పలేదు" (శ్రీమద్భాగవతానుశీలనము - పుట 24) అని శ్రీరామమూర్తిగారి మరియొక అభి యోగము.

భాగవతమునందు వీరభద్రవిజయమును గూర్చియేగాక, భోగినీదండక ము, నారాయణశతకములను గూర్చి గూడ పోతన ప్రస్తావించలేదు. కనుక

ధూళిపాళవారి అభియోగము అసంగతమనవచ్చును. ఒకరచనను ప్రస్తావించి మరియొక దానిని పేర్కొనకున్న పై సందేహము కలుగునుగాని ఏ యితర కావ్యములను గూర్చి ప్రస్తావించనందున పైప్రశ్న ఉత్పన్నముకాదని చెప్పవచ్చును

నాల్గవకారణము :- "భాగవతమునకు వీరభద్రవిజయము అనుకరణ ప్రాయమే కాని అంకురప్రాయము కాదు. అదియును శాబ్దికముగనే కాని ఆర్థికముగ కాదు" (శ్రీ మద్భాగవతాను శీలము-పుట 24) అని వీరుఆరోపించిరి.

వీరభద్రవిజయము భాగవతమునకు అంకురప్రాయ మనుటకు క్రింది పద్యములను తార్కాణముగ చూపవచ్చును.

చం॥ సదమలమైనవాడు కడుచక్కని రూపమువాడు కాంతిచే
బొదలినమోమువాడు మెయి భూతినలందినవాడు దివ్యమై
యొదవిన బ్రహ్మచారిగతి నొప్పినవాడిట వచ్చుచున్నవాఁ
డదెయొక గుజ్జుతాపసుడహా వనితామణులార కంటిరే" (వీ॥ వి. 2-28)

భాగవతమున దశమస్కంధమున,

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వురా
జిల్లెడుమోమువాడొకడు చెల్వల మానధనంబుదోచెనో
మల్లియలార మీ పొదలమాటునలేడు గదమ్మ చెప్పరే" (10-1010) అను

పై పద్యముల రెండింటిలో శివకేశవుల వర్ణన జరిగినది. శివుడు ధవళస్వరూపుడుకావున సదమలమైనవాడని, వీరభద్రవిజయమున చెప్పగ, భాగవతమున కృష్ణుని కృష్ణవర్ణమును "నల్లనివాడు" అని చెప్పబడినది. పద్యరచనా విధానమే మెరుగులుదిద్దబడి భాగవతమందలి పద్యముగ ప్రయుక్తమైనదని చెప్పవచ్చును. కావున భాగవతమునకు మూలబీజము వీరభద్రవిజయమన వచ్చును. శ్రీ నిడదవోలు వేంకటరావుగారు "భాగవతమహావృక్షమునకు వీరభద్రవిజయము బీజప్రాయము" (పోతన - 29-42) అని చెప్పినమాటలు యిప్పట్టున గమనార్హములు.

అర్థసంబంధముగ వీరభద్రవిజయములోని పద్యములు భాగవతమునకు అంకురప్రాయమనుటకు క్రింది పద్యములను కూడ పేర్కొనవచ్చును.

పార్వతిగ పర్వతునింట పెరుగుచున్న ఆదిమభామ యుక్త వయస్సు వచ్చిన తర్వాత నిరంతర శివధ్యానతత్పరయైనది. ఆ వియోగవర్ణనమ్ము క్రింది పద్యమున చెప్పబడి యున్నది.

"సీ॥ శృంగారములుసేయ శృంగారియొల్లదు పువ్వులు దురుమదుపువ్వుఁబోడి
పలుకంగనేరదు పలుకనేరనిభాతిఁజంచలత్వము నొందుఁ జంచలాక్షి
సరసులఁగ్రీడింప సరసి జాననపోదు మౌనంబుతోఁగుందు మానవిభవ
గంధంబు పూయదు గంధవారణయాన చెలుపలఁ బిలువదు చెలులచెలియ

తే॥ ముకురమేప్రొద్దుఁ జూడదు ముకురవదన
తరుణిమణియును సర్వకృత్యములు మఱచి
హరునితోడిదె గొండాటయై లతాంగి
యుగ్రతాపంబు సైరింపకున్నఁజూచి" (1-202).

ఇదియే భావమును, భాగవతమున రుక్మిణీదేవివిరహవేదన సమయమున కూర్చుటజరిగినది

"సీ॥ మృగనాభియలఁదదు మృగరాజమధ్యమ జలములనాడదు జలజగంధి
ముకురంబుఁజూడదు ముకురసన్నిభముఖి పువ్వులదుఱుమదుపువ్వుఁబోఁడి
వనకేళిఁగోరదు వనజాతలోచన హంసంబుఁబెంపదు హంసగమన
లతలపోషింపదు లతికాలలితదేహ తొడవుల దొడవదు తొడవుతొడవు

ఆ॥ తిలకమిడదు నుదుటఁదిలకసతిలకంబు
కమలగృహముఁజొరదు కమలహస్త
గారవించితన్నుఁగరుణ జేకొనవన
మాలిరాడు తగవుమాలియనుచు" (10స్కం - పు. 1729).

వీరభద్రవిజయములోని "పువ్వులదుఱుమదు పువ్వుఁబోఁడి" అను వాక్యము యథాతథముగ భాగవతపద్యమున కూర్చ బడినది. కొన్ని వాక్యముల భావములను చిన్నచిన్న మార్పులతో కూర్చుట జరిగినది. భాగవతపద్యములోని కొన్నిపాదములలో మాత్రము వీరభద్ర విజయములోని పద్యపాదములకన్న కొంచెము ప్రౌఢత్వము కన్పించుచున్నది. అర్థపరముగ రెండుపద్యములును సమానమే. ఈ విధముగచాల పద్యములను ఉదహరింపవచ్చును.

శాబ్దికముగగూడ భాగవతమునకు వీరభద్రవిజయము అంకురప్రాయమని క్రిందిపద్యముల వలన నిరూపింపవచ్చును.

వీరభద్రవిజయమున, భర్తతో తెలిసినవిషయము చెప్పి ఏదో అడుగవలయునని సతీదేవి తటపటాయించుట,

కం॥ వడవడ వడకుచు నుడుగుచుఁ
జడిముడిమయినొంది కలఁగి చింతాకులయై
వెడగుడనంబున నిలుచుచుఁ
గడువాడినపువ్వుబంగిఁగాంతి దొఱంగన్" (వీ॥ వి - 1-107) అను పద్యమునను, భాగవతమున భర్తఎక్కడకు పోవుచుండెనో తెలియనడుగుటకు తటపటాయించు లక్ష్మీదేవిస్థితిని,

కం॥ అడిగెదనని కడువడిఁజను
నడిగిన దను మగడు నుడువడని నడయుడగన్
వెడవెడ సిడిముడి తడఁబడు
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్" (8 స్కం - 103) అను పద్యమునను కవిప్రదర్శించెను. పైపద్యములు రెండును లఘువులతో ఏర్పడిన అందమైన కందములు. ఈ లఘ్వక్షరముల తోడనే సతీదేవియొక్కయుఁ లక్ష్మీదేవియొక్కయు అప్పటి మానసికస్థితులను తెలియజేయుట పోతనగారి ప్రత్యేకత. వీరభద్రవిజయము నందలి పద్యమున నాలుగైదు గురువులుండగ, భాగవత

మందలి పద్యము సర్వలఘుకందమైనది (రెండునాలుగు పాదముల అంతమున గురువులుండుట కందపద్యలక్షణము కావున, అవిమాత్రము గురువులుగ కూర్చ బడినవి). ఇటుల శబ్ద సంబంధముగను భాగవతమునకు వీరభద్ర విజయము బీజప్రాయముగ చెప్పుకొన వచ్చును.

కావున పై పరిశీలనము ననుసరించి అర్థపరముగను, శబ్దపరముగను వీరభద్రవిజయము భాగవతమునకు అంకురప్రాయమని నిరూపించి, ధూళిపాళ వారి వాదనను త్రోసిపుచ్చవచ్చును.

ఐదవకారణము :- వీరభద్ర విజయము వెనువెంటనే రచించిన భోగినీదండకములో భాషాదోషములు లేవు. వీరభద్రవిజయమున భాషాదోషములున్నవి. మరి యు భోగినీ దండకము రచన ప్రౌఢము, రసవంతము. వీరభద్ర విజయము ప్రౌఢతరము గాదు. ఈరెండు రచనలు ఏకకవికృతములైన భేదమంతయుండ రాదు. కావున వీరభద్రవిజయము అన్యకృతము కావచ్చును. (శ్రీమద్భాగవ తానుశీలనము – పుట 34-35) అని ధూళిపాళవారు మరియొక కారణమును జూపిరి.

భోగినీ దండకమును వ్రాయు నప్పటికి పోతన 25-30 సంవత్సరముల మధ్యవయస్కుడని విజ్ఞులైన విమర్శకులు భావించిరి. దానికి కొద్దికాలము ముందుగనే వీరభద్రవిజయము రచించెననుట తగదు. "పిన్నవాడననియుఁబెక్కు సంస్కృతులను, వినని వాడ"ననియు (1-12) పోతన చెప్పుకొనుట జరిగినది. పోతన పెక్కు సంస్కృతులను తెలియని పిన్నవయసున వీరభద్రవిజయమును రచించెను. "పిన్నవయసు" అనగ పదునైదు వత్సరములకు మించని ప్రాయముగ భావించుట సమంజసము కనుకనే భాషానియమములను ఉల్లంఘించుట జరిగియుండును. వీరభద్ర విజయము ఒక మహాకవి బాల్యరచనమను విషయమును మనము విస్మరింపరాదు. ఈ దృష్టితోడచూచిన వీరభద్రవిజయము రసవంతము, వయసునకు మించిన ప్రౌఢరచనయని తెలియనగును. వీరభద్రవిజయము రచనానంతరము ఒకదశాబ్దము తరువాత వ్రాసిన కవిత్వము

భోగినీదండకము. అప్పటికి పాండిత్యపరమైన జ్ఞానమును పోతన పొందియుం డును. కనుక ధూళిపాళవారి వాదన సరికాదనవచ్చును.

ఆరవకారణము :- "వీరభద్రవిజయమున కథాకథనప్రౌఢిమ, ఔచిత్యములేదు. భాగవతమున యీ రెండును మిక్కిలిగ పోషింపబడినవి. కావున వీరభద్రవిజ యము పోతనకృతముకాదు" (శ్రీమద్భాగవతానుశీలనము - పుట 36) అని ధూ ళిపాళవారు వాదించిరి.

కథాకథనప్రౌఢిమ అనుభవమునుబట్టి కావ్యములలో సంతరింపబడుట జరుగును. సహజపాండిత్యమును అనుభవముతో పొందిన పోతన భాగవతమున కథాకథనప్రౌఢిని ప్రదర్శించెను. వీరభద్రవిజయము తొలి ప్రయత్నము, అప్ప టికి పోతన సహజపాండిత్యుడుకాడు. అనుభవముగూడ శూన్యమే. కవితాపరి చయముమాత్రమే ఆతడు కలిగియుండెను. కనుక భాగవతములో కనపరచిన ప్రౌఢిమ వీరభద్రవిజయమున లేకపోయినదనవచ్చును. కాని బాల్యకృతిగ పరి శీలించిన వయసుకు మించిన అనుభవము, అందులకు తగిన కథాకథన పటిమ ఆశ్చర్యము, అనిర్వచనీయమైన అనుభూతిని తప్పక కలిగించి తీరుననవచ్చును. కావున ధూళిపాళవారి వాదము సత్యదూరమనవచ్చును.

పై పరిశీలనమునుబట్టి శ్రీధూళిపాళ శ్రీరామమూర్తి వీరభద్రవిజయము పోతనకృతము కాదనుటకుచూపిన కారణములు నిరాధారములు, సత్యదూర ములు అని తెలియుచున్నవి. కనుక వీరభద్రవిజయము పోతన బాల్యకృతియ నిచెప్పవచ్చును.

పైవిధముగ, వీరభద్రవిజయము పోతనకృతముకాదనుటకు, గురజాడ శ్రీరామమూర్తిగారు, ఆచార్య పింగళిలక్ష్మీకాంతంగారు, ఆచార్య ఖండవల్లిలక్ష్మీ రంజనముగారు, శ్రీధూళిపాళ శ్రీరామమూర్తిగార్లు చూపిన కారణములు నిరాధా ములని, సత్యదూరములని వివరించి, వీరభద్రవిజయము పోతన బాల్యకృతి

యని నిరూపించవచ్చును.

మరియు, భాగవతమున సాంస్కృతిక ఛందమునకు ప్రాముఖ్యతని చ్చినటులనే వీరభద్రవిజయమున గూడ (614 పద్యములు) సాంస్కృతిక ఛంద మునకు ప్రాధాన్యమిచ్చుట జరిగినది భాగవతము నందువలెనే యతి, ప్రాస నియమములును కన్పించుచున్నవి. సాధుశకటతేపములకు యతిప్రాసలు బా హాటముగ వాడబడియున్నవి. యతికి, వీరభద్రవిజయములోని తృతీయాశ్వాస ములోని "ఋతుసంవత్సరమాస పక్షజనితారుఢాయ నానాధ్వర.. ....." (239 ప) అను పద్యమును, ప్రాసకు, "మఱియును దక్కనసురలును

గరుడోరగయక్షదైత్యగంధర్వాధీ

శ్వరులెల్ల...... ... . ..." (1 ఆ - 112 ప) అను

పద్యమును, 144 వ పద్యమును ఉదాహరణములుగ చూపవచ్చును.

వీరభద్రవిజయము నందు ద్విప్రాస, త్రిప్రాస, చతుష్ప్రాస, పంచ ప్రాసలు గూడ గలవు. [వీనినిగూర్చి "కవితారీతులు" అను ప్రకరణము నందలి 'అలంకారములు" అను ఉపప్రకరణమున చర్చించుట జరిగినది]. ఇట్లు అనే కములైన ఆధారములతో వీరభద్రవిజయము పోతనకృతమని కొందరు విమర్శ కులు తెల్పిన తమ తమ నిశ్చితాభిప్రాయములను క్రింది విధముగ వివరించుట జరిగినది.

శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు, "పోతన్నగారు రచించిన గ్రంథము లలో వీరభద్రవిజయము మొదటిదనవచ్చును ..ఈ కృతి ఆయనరచింపనేలే దనుటకు సాహసింపలేను. జాగ్రత్తగ పరిశీలించినచో భాగవతములోని పద్య ములకును, వీరభద్రవిజయములోని పద్యములకును పోలికలు కలవు" (ఆంధ్ర భాగవతోపన్యాసములు – పుట 11) అని అభిప్రాయపడిరి.

శ్రీఆరుద్రగారు, "పోతనగారి తొలిగ్రంథము వీరభద్రవిజయము" (సమగ్రాంధ్రసాహిత్యము – సం. 5 – పుట 21) అని వ్రాక్రుచ్చిరి.

శ్రీదివాకర్ల ప్రభృతులు, "వీరభద్ర విజయము పోతనగారి పిన్నతనపు రచన" (ఆంధ్రమహా భాగవతము - పుట 21) అని నుడివిరి,

శ్రీనిడదవోలు వేంకటరావుగారు, "ఓరుగల్లుకుపడమట 'కొలవి' యందు వీరభద్రాలయముండుట కూడ వీరభద్రవిజయమునకు తోడ్పాటుకావచ్చును. ఇయ్యది పోతన గారి బాల్యకవితయైనను భాగవతము నందలి ధారాశుద్ధి కుద్ది యైన పద్దియము లిందు లేకపోలేదు" (పోతన-పుట 29) అని అభిప్రాయపడిరి.

డా॥ కే. గోపాలకృష్ణారావు గారు, వీరభద్రవిజయము పోతనకృతమే నని విశ్వసించి వ్రాసిన వాక్యములివి. "ఇది బాల్యమున రచించిన కావ్యమైనను విమర్శకులనను మానించి నంత పేలవముగా లేదు. "అతి మోహనాకారుడై వెలింగెడువాని నభినవ శృంగారుడైన వాని" - "జంకించి మైపెంచి శంఖంబు పూరించి గగనభాగం బెల్లగలయ దిరిగి" - మున్నగు పద్యము లందు భాగవత శైలి బీజ ప్రాయముగ నిందు గలదు. పాలకురికి సోమన భక్త్యావేశముల ననుకరించిన పద్యములిందు కొన్నిగలవు." (బమ్మెరపోతన - ఆంధ్రభాగవత అవతారిక - పుట 86.)

డా॥ సి. నారాయణరెడ్డి గారు, "వీరభద్రవిజయము పోతన్న చేయనున్న సేద్యానికి తొలిచాలు'' (వికాసలహరి - పుట 59) అని పల్కిరి,

డా॥ కేతవరపు రామకోటి శాస్త్రి గారు, "వీరభద్రవిజయము ప్రబంధాన్ని ఇవుటూరి సోమనారాధ్యుల వారు కోరి పోతన చేత వాయు పురాణాను సారముగ వ్రాయించు కున్నారు" (పోతన్న వైచిత్రి-పుట 86) అనినుడివిరి.

శ్రీ చాగంటి శేషయ్య గారు, "ఈ క్రింది పద్యమును బట్టి భాగవత రచనా నంతరమున వీరభద్రవిజయమును రచించినట్లు గన్పట్టు చున్నది. కాని యది సత్యము కాదు అనిరి. (ఆంధ్ర కవి తంరగిణి-సం 6 - పుట 196)

మరియు వారు "ఉ॥ భాగవతప్రబంధమతి భాసురతన్‌రచియించి దక్షదు.... ..
.. ...... వీరభద్రవిజయంబు రచించెద వేడ్క నామదిన్.
ఈ పద్యము కొన్ని తాళపత్త్రప్రతులలో మాత్రమే కలదు లేఖకులెవరో యీ పద్యమును రచియించి యందుఁ జేర్చియుందురు. కావున నీ పద్యమును విడిచివేసి పోతనామాత్యుడే వీరభద్రవిజయ కర్తయనియు, భాగవతమునకు ముందు దీనిని రచియించెననియు నిశ్చయింప వలసియున్నది. (ఆంధ్రకవి తరంగిణి - సం. 6 - పుట 192-193) అని నుడివియున్నారు.

శ్రీచాగంటి శేషయ్యగారు, 'ఇప్పుడు ముద్రితమైయున్న వీరభద్రవిజయమందలి నాల్గవ యాశ్వాసము పోతనామాత్యవిరచితము కాదనియు, ఎవరో రచియించిన భాగము నిందెవ్వరో జేర్చిరనియు, నాల్గవ యాశ్వాసములోని పద్యములు కొంచెము నీరసములుగ నున్నవనియు" శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు, భారతి పత్రికలో (రక్తాక్షి - ఆషాఢము - పుష్పాంజలి) వ్రాసి యున్నారనియు, వీరభద్రవిజయము తాటియాకుల ప్రతియొకటి కవి గారికి లభించెననియు, ఇందు నాల్గవ యాశ్వాసమున శివపార్వతీకైలాసవిహార వర్ణనము, కుమారజననము, తారకాసురసంహారము కలవనియు చెప్పి, శ్రీకవిగారి యొద్దనున్న తాళపత్త్రప్రతిని నేను చూచుట తటస్థింపలేదు. ముద్రితప్రతిలోని నాల్గవ యాశ్వాసమునకు బదులుగా నీతాళపత్త్రప్రతియందున్న గ్రంథము 4వ యాశ్వాసమై, ముద్రిత ప్రతిలోని 4వ యాశ్వాసమై దవయాశ్వాసముగాదగునని యునిశ్చయింప వలసియున్నది అట్లు కావున గ్రంథమునకు వీరభద్రవిజయమను పేరు సార్థకము గాకపోగా కుమారసంభవమని పేరుపెట్ట వలసి యుండును. ముద్రిత ప్రతియందలి నాల్గవ యాశ్వాసమును దీసివైచినచోఁ దక్కిన గ్రంథములో వీరభద్రప్రశంస యుండదు. ముద్రితప్రతియందలి నాల్గవ యాశ్వాసములోని పద్యములు నీరసములుగ నున్నవని శ్రీకవిగారనుచున్నారు కానినాకట్లు తోఁచుటలేదు భాగవతములోని కవిత్వమునుబట్టి చూచినప్పుడది కొంత నీరసముగఁగనుపట్టినను, వీరభద్రవిజయమందలి తక్కిన భాగముతోఁబోల్చి చూచినప్పుడది నీరసముగాఁ గాన్పింపదు" అని చెప్పియున్నారు

శ్రీమానవల్లి వారికి లభించిన వీరభద్రవిజయము తాళపత్రప్రతి లభ్య కానందున ఆశ్వాసమునకు సంబంధించిన వారి అభిప్రాయమును అంగీకరించుటకు వీలులేదు. కాని, శ్రీమానవల్లివారు గూడ వీరభద్ర విజయము పోతన కృతమనియే నుడివిరి.

పైన వివరించిన విధముగ విజ్ఞులైన పలువురు విమర్శకులు వీరభద్ర విజయము పోతనకృతముగనే పేర్కొనిరి.

శైవకుటుంబములో జన్మించి శంభుదాసుడని బిరుదు వహించిన ఎఱ్ఱన "నృసింహపురాణము", "హరివంశముల" రచించెను. వైష్ణవుడైన అనంతాచార్యుడు "భోజరాజీయమ" ను కావ్యమున శివునిస్తుతించెను. అటులనే పోతన గూడ శైవకుటుంబమున జన్మించి వీరశైవమును ప్రతిపాదించు వీరభద్రవిజయము రచించి, తరువాత వైష్ణవతత్త్వము వివరించుచు భాగవతము రచించెనని చెప్పవచును.

పై పరిశీలనమును బట్టి వీరభద్ర విజయము పోతన బాల్య కృతియని నిర్ణయింపవచ్చు.

# తాళపత్రప్రతులు - పరిష్కరణ

అదిమ కాలము నుండియు తెలుగు సాహిత్యము తాళపత్రప్రతు లందు లిఖితమై అలరారుచున్నది. అనంతర కాలమున పండితులచే పరిష్కరింపబడి ప్రకటింపబడుచున్నది. ప్రాచీన తాళపత్రప్రతులను యథాతథముగ ప్రకటించుటకు వీలుపడదు. సాహిత్యసృష్టికర్త గ్రంథకర్తకాగా, అద్దానిని గ్రంథస్థము గావించువాడు లేఖకుడు. లేఖకుని జ్ఞానాజ్ఞానముల బట్టి లేఖనమున పాఠాంతరములు, కొన్నిదొసగులు దొర్లుటజరుగు చుండును. కనుక తాళపత్రప్రతులు ప్రకటించుటకు ముందు పండితపరిష్కృతి తప్పని సరియగుచున్నది.

పరిష్కరణయనునది యొక అసాధారణమైన కార్యము. ఇదియొక శాస్త్రీయమైన వ్యాసంగము. బహుగ్రంథపరిజ్ఞానము, ప్రతిభావ్యుత్పత్తులు, శాస్త్రజ్ఞానము - పరిష్కర్తకు అవసరము. పాఠములను సావధానముగ పరిశీలించి, సంస్కారవంతముగ పరిష్కరించు నేర్పు, ఓర్పు పరిష్కర్తకు మిక్కిలి అవసరము.

ఆచార్య జి యన్. రెడ్డిగారు, "ఒకకావ్యమునకు మహాకవి ఒకడు కర్త కావచ్చును. కాని ఆకావ్యమునకు కాలాంతరమున వివిధప్రతులేర్పడి దేశమునవ్యాప్తి కలిగినపుడు వ్రాయసగాండ్ర యొక్క అప్రమత్తత వలనను, అజ్ఞానముచలనను, భాషాపరిణామ కారణము వలనను మూలమునందులేని భాషాదోషములు, పాఠభేదములు, లేఖనదోషములు వివిధ రూపములలో మనకు కనిపించును. నేడు మనకు లభించు తాళపత్రప్రతులలో లేఖనదోషములు అధికముగగలవు. ఛందోబద్ధముగ ఉన్న కావ్యప్రబంధ ప్రతులలో గూడ లేఖనదోషములు అనేకములుగలవు" (శ్రీమద్భగవద్గీత తెలుగుభాషాను వాదము - పీఠిక) అని తాళపత్రప్రతుల పరిష్కరణావశ్యకతను గూర్చి తెల్పియున్నారు.

బమ్మెరపోతనామాత్య ప్రణీతంబైన వీరభద్రవిజయము తాళపత్రప్రతులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఓరియంటల్ రీసర్చి ఇన్స్టిట్యూట్‌లో ఐదు గలవు. చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము నందును, తంజాపూరు తాళపత్ర గ్రంథాలయములందును మరికొన్ని ప్రతులుండి నటులవారి కేటలాగుల ననుసరించి తెలియుచున్నది. ఈ తాళపత్రప్రతులలో గల తప్పొప్పులను కీ॥శే॥ ఉత్పల వెంకటనరసింహాచార్యులవారు పరిష్కరించిరి. ఈ పరిష్కరణ గ్రంథమును వావిళ్ల రామశాస్త్రులు అండ్ సన్స్‌వారు క్రి. శ. 1924వ సంవత్సరమున ప్రకటించిరి పరిష్కరింపబడి ప్రకటింపబడిన అచ్చుప్రతిని. తాళపత్రప్రతులతో పోల్చి చూచిన లేఖ నదోషములు, పరిష్కరణ విశేషములు కొన్ని విదితమగుచున్నవి. వానిని నాలుగు విధములుగ విభజించి క్రింది విధముగ పరిశీలించుట జరిగినది.

1. లేఖనదోషములు. 2. లేఖనసంప్రదాయద్యోతకరూపములు. 3. లాక్షణిక దోషములు. 4. పరిష్కరణదోషములు,

1. లేఖనదోషములు :- వ్రాయసగాండ్ర తొందరపాటు, ఏమరుపాటు, అనవధానతల కారణముగ ప్రవేశించిన దోషములను లేఖనదోషములన వచ్చును.

| తాళపత్రప్రతిరూపములు | — | పరిష్కరింపబడినరూపములు |
|---|---|---|
| 'మతి" (2-190) | — | 'గతి" |
| "యరుగన్" (2-205) | — | "యనియెన్" |
| "వినువల్లభా" (2-262) | — | "మునివల్లభా" |
| "ఫణీంద్రజ" (4-50) | — | "ఫణివ్రజ" |
| "అన్నియుందినములు" (1-2) | — | "అన్నియుందిరములు" |
| "ఇంపారదనరదురిమి" (2-28) | — | "ఇంపారతలనుదురిమి" |

ఇట్టివి మఱియెన్నియో గలవు. అర్థరహితము, అసంబద్ధము, దోషభూయిష్ఠము నైన తాళపత్రప్రతులందలి రూపములను పరిష్కర్త సరసముగను, అర్థవంతముగను పరిష్కరించియున్నారు.

లేఖనసంప్రదాయద్యోతకరూపములు :- కావ్యకర్త కాలమునాటి లేఖన సంప్రదాయ ములను వీనివలన గ్రంహిప వీలగుచున్నది.

(i) వలపలగిలక ప్రాచుర్యము :- నాడు రేఫకుబదులు వలపలగిలక "ౕ" వాడుకలో నుండినది.

| తాళపత్రరూపములు | - | పరిష్కరించినరూపములు |
|---|---|---|
| "వనిౕంత్తు" (1-9) | | "వర్ణించి" |
| "గవిౕంప" (2-83) | | "గర్వింప" |
| "నిదౕగ్ధున్" (3-231) | | "నిర్దగ్ధున్" |

| | | |
|---|---|---|
| "పాపకమ్ముఁండు" (1-162) | | "పాపకర్మ్ముండు" |
| "తాత్పయ్యఁంబు" (1-178) | | "తాత్పర్యంబు" |
| "హరణాథఁంబు"(4-108) | | "హరణార్థంబు" |

ఇత్యాదులనేకములు గలవు. వీనివలన పోతన కాలమున వలపలగిలకను "ర"కారమునకుబదులు ఎక్కువగ వాడుచుండినటుల వ్యక్తమగుచున్నది.

(ii) పూర్ణబిందుపూర్వక ద్విత్వహల్లు :- నాడు, పూర్ణబిందువు పూర్వమందున్న హల్లును ద్విత్వముతో వ్రాయునట్లు కన్పించుచున్నది.

| తాళపత్రప్రతిరూపములు | - | పరిష్కరింపబడినరూపములు |
|---|---|---|
| "నెయ్యియుఁబిండ్డి" (1-5) | - | "నెయ్యియుఁబిండి" |
| "విరించ్చి" (1-174) | - | "విరించి" |
| "త్రుంచ్చు" (2-51) | - | "త్రెంచి" |
| "కాంచ్చి" (2-207) | - | "కాంచి" |

వలపలగిలక, పూర్ణబిందు పూర్వకమైన హల్లును ద్విత్వముతో వ్రాయుట పోతన కాలమునాటి లేఖనసంప్రదాయమై యుండును. కావుననే నాటి వ్రాయసగాండ్రు ఆ సాంప్రదాయమునను సరించి వీరభద్రవిజయ తాళపత్రప్రతులలో పైవిధముగ వ్రాసిరనవచ్చును. పరిష్కర్త వీనిని తగువిధముగ పరిష్కరించిరి.

3 లాక్షణికదోషములు :- లక్షణసంబంధమైన దోషములు లాక్షణిక దోషములు. వీరభద్రవిజయము పద్యకావ్యము. కావున పద్యములందలి యతిప్రాసలు భిన్నములై అసంబద్ధముగ గోచరించు వానిని పరిష్కర్త పరిశీలించిన విధము పరిశీలనార్హము.

| తాళపత్రప్రతిరూపము | - | పరిష్కరించినరూపము |
|---|---|---|

1. ''హృదయంబునగాడిపారనుగతద్నన్'' (2-106) - ''హృదయంబునఁగా డిపారనీశుడుదన్నున్''

తాళపత్రప్రతిలో 'ఋ' 'ఉ' లకు యతికల్పింపబడి యుండగ, పరిష్కర్త శాస్త్రబద్ధమగురీతిని ''ఋ - ఈ'' లకు యతిమైతిని చూపెట్టెను.

"కఱకంఠమిమ్ము బలువక .......అరిమురియగము" (1-110) కఱకంఠ.... . ..అఱిముఱి''

తాళపత్రప్రతియందుగల "అరిమురి'' అను రూపమును ''అఱిముఱి'' యని పరిష్కరించి శకటరేఫమునే ప్రాసస్థానము నందుంచి లక్షణమును కాపాడుట జరిగెను.

లక్షణవిరుద్ధమైన భాషాప్రయోగములను కూడ పరిష్కర్త కొన్నింటిని అర్థవంతముగ పరిష్కరించెను.

| తాళపత్రప్రతియందలిరూపము | - | పరిష్కరించినరూపము |
|---|---|---|
| "కూతురిగౌరిన్'' (1-222) | - | ''కూతుంగౌరిన్'' |

పై విధముగ పరిష్కర్త సాధ్యమైనంతవరకు శాస్త్రసమ్మతముగ పరిష్కరించి ఆయాపద్యభావములకు, పద్యలక్షణములకు మెరుగులు దిద్దెను.

4 పరిష్కరణదోషములు :- పరిష్కర్త కీ॥ శే॥ ఉత్పల వేంకటనరసింహాచార్యుల వారు పరిష్కరణలో ఎంతటి శ్రద్ధాసక్తులు కనపరచినప్పటికిని, దక్షతతో వ్యవహరించి నప్పటికి దోషయుక్తముగ పరిష్కరించిన రూపములు కొన్నికన్పట్టు చున్నవి.

''వైవస్వతమన్వునాడు ముదమొప్పన్ జన్నముంజేయగా" (1-165) అని తాళపత్రము లందు గలదు. దీనిని పరిష్కర్త "వైవస్వతమన్వునాడు

ముదమొప్పన్ రాజ్యముంజేయగా" అని తాళపత్రము నందుగల ''జన్మమునకు అను పదమునకు బదులు ''రాజ్యము'' అను పదమును కూర్చెను. కాని అంతము వరకు పరిశీలనము గావించిన వైవస్వతమన్వంతరమున దక్షుడుచేసినది "జన్మమే" కాని రాజ్యముకాదు. కనుక మూలమందలి రూపమే అర్థవంతము. మరియు ఇయ్యది కావ్యకథకు ప్రధానమైన మహేశుశాపాక్షరములందలి ముఖ్యమైనమాట. ఈ మాట కారణముగనే వీరభద్రవిజయమునందు చతుర్థాశ్వాస కథ సాగినది. కావున పరిష్కరణలోదోషము దొరలినదని గ్రహింపవచ్చును.

మఱియొకచోట "ప్రేమతోడన బలపాణి గ్రహణమ్ముఁజేసె కపటనాటకుండు" (2-196) అని తాళపత్రప్రతు లందుండగ పరిష్కరణమున "అబల" కుబదులు "అడల" అని కూర్చుట జరిగినది. "అబలపాణిగ్రహణము" అనునది అర్థవంతముగాని, "అడల" అనునది అసంబద్ధమని పించును. ఇటులనే

| తాళపత్రప్రతిరూపములు | - | పరిష్కరించినరూపములు |
|---|---|---|
| "కమలనేత్రి" (2-192) | - | "కమలనేత్ర" |
| "శాలక్రంతలన్" (4-190) | - | "శాశక్రంతలన్" |

మొదలగునవికలవు. ఇవి ఆచార్యులవారికి అప్రయత్నముగ దొరలిన దోషములు కావచ్చును. ఇట్టి రెండు, మూడు చోటులందు తప్ప మిగిలిన కావ్యమునంతటిని పరిష్కర్త కీ॥ శే॥ ఉత్పలవారు చక్కని ఓర్పుతోడ, సామర్థ్యముతోడ పరిష్కరించి యున్నారు కావ్యార్థమును దోషరహితముగ, స్పష్టమగు విధమున గ్రహించుటకు వీలుకల్పించిరి. పరిష్కరణ శాస్త్రీయముగను, సరసముగను సాగినదనవచ్చును. ఆచార్యులవారి కృషి ప్రశంసనీయము. పరిష్కరించి ప్రకటించిన వీరభద్రవిజయము సర్వవిధముల అర్థవంతముగను, పఠనయోగ్యముగనున్నది. కనుక వీరభద్రవిజయమునకు తాళపత్రప్రతుల పరిష్కరణ అవసరమనియు, అపరిష్కరణ కావ్యము శ్రీ ఉత్పలవారిచేతిలో సఫలమైనదనియు వక్కాణింపవచ్చును.

# ప్రకరణము - 3

## వీరభద్రవిజయము - ఇతివృత్తము
## వీరభద్రవిజయము - మూలము
## వీరభద్రవిజయము - మార్పులు-చేర్పులు
## పోతనకు పూర్వమందున్న వీరభద్రుని కథలు

1. శివపురాణము
2. ఆంధ్రమహాభారతము
3. కుమారసంభవము
4. శివతత్త్వసారము
5. కాశీఖండము
6. ఆంధ్రమహాభాగవతము
7. జానపదవాఙ్మయము
8. అనుశ్రుతగాథలు

# వీరభద్రవిజయము - ఇతివృత్తము మూలము - మార్పులు - చేర్పులు

శ్రీ వాయుమహాపురాణసారమైన దక్షయజ్ఞకథను గ్రహించి బమ్మెర పోతనామాత్యుడు వీరభద్రవిజయము అను కావ్యమును 1046 గద్యపద్యములతో రచించెను. ఇయ్యది నాల్గాశ్వాసముల కావ్యము. ఇందలి ఇతివృత్తమును క్రిందివిధముగ పరిశీలింపవచ్చును.

సకలమునిజన స్తోత్రపాత్రమగు నైమిశారణ్య పుణ్యక్షేత్రమున మహామునుల అభీష్టముమేరకు వాయుదేవుడు వీరభద్ర విజయాకరసార సుధారసము చిలికించినాడు.

తొల్లి యుగాదులందు శంకరుడు దాక్షాయణీసమేతుడై రజతధరణీధర శిఖరమున కొలువుదీరియుండెను. అట్టియెడ దేవాసురగంధర్వాది మునిగణములువచ్చి దేవదేవుని దివ్యగోష్ఠిలో సుఖముగఉండిరి. అంత దక్షప్రజాపతియును యజ్ఞనాధుని దర్శింప రజతగిరికి విచ్చేసెను. సర్వేశ్వరుడైన మహేశ్వరుడు మునులకువలెనె మామను సామాన్యరీతిలో గౌరవించినాడు. శంభుడు విశిష్టమగు రీతిలో తనను సంభావించలేదని, కుమార్తె గౌరీదేవియును ఎదురేగి తగు మన్నన చేయలేదని కర్మప్రేరితుడైన దక్షుడు కోపించినాడు. దేవదేవునిమహిమ తెలియక వృథావైరమున నిజనివాసమునకరిగినాడు.

మదాంధుడైన దక్షుడు పరాభవమునకు తగు ప్రతీకారము తీర్పనెంచి శివరహితమైన యాగమును ప్రారంభించినాడు. బ్రహ్మాదిదేవతలను, దాక్షాయణీతప్ప తక్కిన కూతులను, అల్లుండ్రను దక్షుడాహ్వానించినాడు. వారందరును విచ్చేసిరి. పిలువకున్నను తండ్రిచేయు యాగమునకు పోవలయునను కోరికను దాక్షాయణి మహేశునకు విన్నవించుకొనినది. "మెచ్చని మామలిండ్లకు శోభన వేళ అల్లుండ్రు పోదగదు, కన్నవారిండ్లకు ఆడుబిడ్డలు పోవుటను లోకము

మెచ్చును. కావున నీవు పోదగు"నని మహేశుడు వివరించెను. అందులకాతల్లి మిక్కిలిఖేదపడినది. భర్త ఓదార్పుతో మనసుకుదుట పరచుకొని ఒంటరిగనే దివ్యవిమానమునెక్కి తండ్రియాగమంటపమున కరిగినది. అందరిని గౌరవించు చున్న దక్షుడు సతీదేవిని చూచియు మిన్నకుండెను. అప్పటికి నయ్యాదిమభామకు పరిస్థితి అవగతమైనది. అపుడు దాక్షాయణి తండ్రి గావించిన నిరాదరణమునకు కారణమడిగెను. అంత దక్షుడు రక్తారుణలోచనుడై, "నీకంటెను నెక్కుడు ననిశము నీయున్న కూతులందఱుగౌరీ" యని "కట్టకోకలులేని కపాలి నీభర్త యాగశాలకురాన నర్హుడు" అని పలురీతుల శివుని తూలనాడినాడు. మరియు, "పిలువనిపేరంటము పనిగలవారును బోలెసిగ్గుగాదెరాగన్" యని అందరిలో అయమ్మను అవమానించినాడు. అప్పుడమ్మహాదేవి కోపించినది. యాగభూమిలోని బ్రహ్మాదిదేవతలు వినుచుండగ పరమేశుదివ్యమహిమను గ్గడించినది. కన్నతండ్రియనియు వెనుకాడక దక్షుని నీచముగ నిందించినది. యాగమునసహ్యించుకొనినది. ''సకల చరాచర ప్రాణికోటి యాత్మలకాత్మయైన దేవదేవుని నిందించిననీయజ్ఞమును చెరుప తప్పక ఆదేవదేవుడురాగలడ'' ని దక్షుని హెచ్చరించినది. "నీపుట్టినదేహముతోడను, పట్టునశివుజేరరాదు'' అనియు, "ఈయొడలు రోతగాదే, పాయక పరమేశునొందఁబని సేయంగా, వేయును నేటికిమాటలు, పోయెదరా కీడునొందిపొగిలి దురాత్మా'' అనియు పల్కి, మహేశ్వరి శంకరుశ్రీపాద పంకజములనుమనమున నిలిపి, యోగాగ్నిని మేల్కొలిపి, అందు శరీరమును భస్మము గావించుకొనెను. ఇది గాంచిన యాగశాలలోని దివిజవరులు భీతిల్లిరి. బ్రహ్మాదులు దక్షుని నిందించుచు తమ తమ లోకముల కరిగిరి. దేహత్యాగానంతరము సతీదేవి బాలయై మంచుకొండ కరిగినది

సతీదేవి మరణవార్తవినినరుద్రుడు కోపించినాడు. "వైవస్వతమన్వంతరమున జన్మముచేయునిన్నుకడతేర్తును'' అని శంకరుడు దక్షుని శపించినాడు.

హిమవంతుడు కాళీసుందరిని కూతుగగోరి తపమాచరించుచుండ, ముచ్చటయైనబాలిక కనిపించినది. అతడు సంతోషపులకితాంకగాత్రుడైనాడు. అప్పుడాబాలికతాను అభవుని దేవేరిననిచెప్పి, హిమవంతుని ప్రార్థనపై నిజరూపమును

జూపినది. ఈరేడు భువనములకునెల్ల మహితమై వెలుగు ఆతల్లి తేజోరూపము నుజూచి హిమవంతుడు పరమానందభరితమానసుడైనాడు. తనివితీర ఆజగన్మా తనుస్తుతియించినాడు. తిరిగి బాలికగమారిన ఆకల్యాణిని నిజమందిరమునకు గొంపోయినాడు. హిమవంతుని అర్ధాంగి మేనక అబిడ్డనుజూచి ఆనందమున మిన్నందినది.

ఇటుల పర్వతరాజు ఇంటికి కూతునిగజేరిన సతీదేవి పార్వతిగ ప్రసి ద్ధిపొందినని పెరిగి పెద్దదైనది. భవుని ఆరాధనముతప్ప మరియొకటి ఆతల్లికి తెలియకుండెను. హిమవంతుడును బిడ్డహృదయము నెరిగినవాడై తపమాచరిం చుచున్న శివునకు శుశ్రూషచేయుటకై పార్వతీదేవిని నియమించెను. ఇపుడు భవాని భవునిచేరినది. నిజనాథునిసేవలో తరించుచున్నది. ఇంతవరకుగల కథ ప్రథమాశ్వాసమున పోతనగారిచే వర్ణింపబడినది. ద్వితీయాశ్వాసమునగల కథ క్రిందివిధముగ నున్నది.

తారకాసురుడు అనురక్కసుడు తపమాచరించి, బ్రహ్మదేవుని మెప్పిం చి, లోకములనెల్ల పరిమార్చునట్టి బలపరాక్రమాదులను సంపాదించెను. వరగర్వ ముతో నాతడు అమరేంద్రాదుల పై దండెత్తి వారలను హింసింపదొడగెను. అ పుడు ఇంద్రాదినిలింప వరులు బృహస్పతిని ముందిడుకొని బ్రహ్మలోకమున కరిగిరి. బృహస్పతి తారకుడొనరించు అకృత్యములను బ్రహ్మకెరింగించి తరు ణోపాయము జూపుమని ప్రార్థించెను. అంతబ్రహ్మ ''పార్వతి యిప్పుడు పర మేశునకు సపర్యలు చేయుచున్నది. మీరలు భావజునటకు పంపి, వారిరువురిని యొక్కటిగఁగూర్పుడు. వారికుదయించు కుమారుడే తారకుని వధించగలడు'' అని చెప్పివారలనోదార్చి పంపెను.

అనంతరము ఇంద్రుడు నిండు కొలువుచేసి మన్మథుని తలచెను. మారుడు విచ్చేసెను. ఇంద్రుడు కర్తవ్యము నెరింగించి శివపార్వతులపై పూ బాణప్రయోగమునకు సుమశరునిపపించెను. రతీదేవి వలదనినను లక్ష్యపెట్టక, ఆమెకు ధైర్యము జెప్పి కందర్పుడు సపరివారముతోడ దేవదేవుని తపోవనము నకరిగెను.

ఆసమయమున పూజ చేయవచ్చిన గౌరీహస్తము మహేశుని శిరమును తాకినది. అదే అదనుగ నెంచిన కాముడు కుసుమబాణ ప్రయోగమును గావించెను. పూబాణము మనమున తాకుటవలన శివుని హృదయము గతిదప్పెను సర్వజ్ఞుడైన మహేశుడు మారినస్థితిని పరికించినాడు. మదనుడు ఎదురుగ వింటిని ఎక్కుపెట్టియున్నాడు. రుద్రుడంత అగ్రహోదగ్రుడైనాడు. మూడవ కన్ను తెరచినాడు. మరుక్షణమున మారుడు బూదియైనాడు. అమరుల హాహారవములు మిన్నుముట్టినవి. ఈవార్త తెలిసిన రతీదేవి కన్నీరు మున్నీరుగ విలపించినది. శివుడు తపోవనమునువీడి రజతాద్రికరిగినాడు. హిమవంతుడు పార్వతీ దేవిని నిజమందిరమునకు కొనిపోయెను. రతీదేవి సహగమనము చేయనెంచినది కాని, ఆకాశవాణి, "ఉమామహేశుల వివాహానంతరము అనంగుడు పునర్జీవితుడగు" నని చెప్పినందున, అప్రయత్నమును విరమించుకొన్నది.

కైలాసముననున్న మలహరునకు అద్రిరాజతనయ పై ప్రేమకడు నంకురింపగ ఎఱుకలసానివేషము ధరించి ఓషధిప్రస్థమున కేతెంచెను. పార్వతీదేవి, చెలుల వలన ఎఱుకలమ్మను అంతఃపురమునకు పిలిపించు కొనియెను. ఎఱుకత పార్వతికి, "తపమాచరించి మృడుని పతిగ బొందగలవు. ఆరు మొగముల సుతినిగాంచి మోదము నందగల"వని వివరించి, నిజరూపమును జూపి కైలాసమున కరిగెను

పార్వతీదేవి తల్లిమేనకనొప్పించి, తండ్రియాజ్ఞగొని, తాపస వేషమును దరించి తపోవనమున కరిగెను. ముక్కారుల రాత్రింబవళ్లు ఆమె ఘోరతపమాచరించినది. అంతమహేశుడు మాయావటుని వేషమున ఏతెంచెను. గౌరి యెదుట శివనింద యొనర్చెను. తనను వివాహమాడుమని కోరెను. శివనిందకు కోపించిన గౌరీదేవి తనను వివాహమాడుమనిన మాటకు మండిపడెను. "వటుని మెడబట్టినూకు" మని చెలులకనుజ్ఞ యిచ్చెను. చెలులందుకుసిద్ధమై వటున్ని పట్టుకొనబోవగ, మహేశుడు నిజరూపముతో ప్రత్యక్షమాయెను. అందరు ఆశ్చ

ర్యపడిరి. ఉమామహేశులు ఒండొరులు చూచుకొనిరి. సిగ్గులుమొగ్గలుతొడుగ మనసులు మాటలాడుకొనెను. అపుడు చెలులు, "ఆర్యా! హిమవంతునింటికి ఉంకువనీదగువారిఁబంపుటతగు"ననిరి. అందులకు శివుడు "తగినపెద్దల నంపుదును. నిన్నువిడిచి నేనుమాత్రము నిలువగలనా''? యని గౌరీదేవితోడపలికియనుగ్రహమును ప్రకటించి కైలాసమున కరిగెను.

గౌరీదేవియును తపము ఫలింప ప్రమోదమాన హృదయాంతరంగయై వనవాసముచాలించి హిమవత్ శిఖరమున కరిగెను.

తృతీయాశ్వాసమునగల కథయిట్లుగలదు. తపోవనమునుండి ఓషధిప్రస్థమున కరుదెంచిన పార్వతీదేవిని కనుగొని ధరాధరేంద్రుడు భార్యాసమేతముగ కౌగిలించుకొని దీవనలందించెను మరియు పుత్రికలో కనిపించు శుభలక్షణములకు కారణమడిగెను. అప్పుడుచెలులు భవాని కావించిన తపమును, శివసాక్షాత్కార విశేషమును సమస్తమును వివరించిరి. తనూజ తపఃఫలమును పడసినందులకు హిమశైలేంద్రుడానందించెను. పరమేశునకు మామయగుభాగ్యము బ్బినందులకు హిమవంతుడు తనకుతాను కీర్తించుకొనెను. పుత్రికను అభినందించెను.

కైలాసమున ఈశ్వరుడు శిష్టనైపుణమానసులైన సప్తమహర్షులను, అరుంధతీదేవిని రావించి, "శీతాచలేంద్రుని కుమార్తె పార్వతిని మాకునడిగి, ఎంతైనఉంకువనిచ్చి, ఉంగరముఁబెట్టి, పాలకూళ్లుకుడిచి, బాలను మనసొమ్ముచేసిరండు" అనిచెప్పెను. అంతమహామునులు అరుంధతీదేవి సమేతులై శివునికడ సెలవుగైకొని తుహినశిఖరమునకు బోయిరి.

తన మందిరమునకు విచ్చేసిన పెండ్లి పెద్దలను హిమవంతుడు వినయవినమిత గాత్రుడై అర్ఘ్యపాద్యాది విధుల పూజించెను, మృదుమధురాలాపముల వారి రాకకు కారణమునడిగెను. వారు హిమవంతునికి విశ్వేశ్వరుని నిర్ణయమును వినిపించిరి. అందులకు గిరిరాజు హర్షామోదములదెలిపి, కుమార్తె నలంకరింప

జేసి, శుభలక్షణములను పరికింపవలసినదిగ కోరుచు తనయను మహర్షులకు చూపెను. అయ్యాదిమభామ జగదభినవ కల్యాణరూపమునకు సంయమీంద్రులు ఆశ్చర్యామోఘహృదయులై మంచిముహూర్తమున ముదితకు ముద్రారోహణము గావించి, గిరీంద్రునకు ఉంకువనిచ్చి, పాలకూళ్లనుకుడిచి, పార్వతిని ఈశ్వరు నికునిశ్చయించిరి. మరునాడు పయనమై కైలాసమునుచేరిరి.

కైలాసమునుచేరిన మహర్షులు హిమవంతుని భక్తివినయ సంపదను, గౌరీదేవి అపూర్వ సౌందర్య సంపదను శివునకు వివరించిచెప్పిరి. ఇకలగ్నము ను నిర్ణయించి శుభలేఖలు హిమవంతునికి పంపవలసినదిగ విన్నవించిరి. అపు డు మహేశుని తలంపున్న పరమేష్ఠివచ్చెను. ముహూర్తమును నిర్ణయించెను. చతుర్దశభువనములకును ఉమామహేశుల వివాహవర్తమానములందెను. బ్ర హ్మాది దేవతలు భార్యాసమేతులై ఆదిమ దంపతుల వివాహమునకు విచ్చేసిరి. వీరందరును కొలుచుచు వెంటనడువగ మహేశుడు పెండ్లికుమారుడై వృషభా రూఢుడై పెండ్లికితరలివెళ్లెను.

హిమవంతునింటికి సమస్త బంధువులు వచ్చిరి. నూతన వరుడైన శంక రునిరాకతో సమస్త సృష్టియును ఒక్కచోట చేరుట జరిగినది. అపుడు భూమి ఒకవంక క్రుంగినది. అంతఈశుడు అగస్త్యుని దక్షిణదిక్కునకు పంపెను. భూ మి సమత్వము నొందెను. పిమ్మట ముహూర్తము సమీపించగనే మంగళస్నా నాదులు. వధూవరులు వివాహవేదిక నలంకరించుట, కన్యాదానము, తలంబ్రా లు, హోమము మొదలగు పెండ్లితతంగములతో పార్వతీపరమేశ్వరుల వివా హము అతివైభవముగ జరిగెను.

వివాహానంతరము బ్రహ్మాదిదేవతల కోరికపై శివుడు అనంగుని పునర్జీ వితుని గావించెను. దేవతలందరు సంతసించి తమతమ నెలవుల కరిగిరి.

పార్వతీదేవిని హిమవంతుడు శివునకప్పగించెను. మహేశుడు పార్వతీ దేవితో కైలాసమునకువచ్చి సుఖముగనుండెను. అంతయొక్కనాడు ఆ జగన్మాత

నీలగళమునకు కారణమడుగగ, శివుడు క్షీరసాగరమథన కథను వివరించి. గరళము కంఠమునందుండుట వలన నీలగళుడనితాను ప్రసిద్ధినందె నటుల తెల్పెను.

చతుర్థాశ్వాసము నందలి ఇతివృత్తము క్రిందివిధముగనున్నది.

వైవస్వతమన్వంతరమున దక్షుడు ఘోరపాపాత్ముడుగ జన్మించెను. అతడు ప్రాలేయాచలమున, ఆకాశగంగ ప్రాలినచోటున శివరహితమైన యాగము నారంభించెను. యాగశాలకు బ్రహ్మాదిదేవతలు, మునిగణము, సిద్ధసాధ్యభుజంగ రుద్రగణములు విచ్చేసిరి. శివుడులేకుండుటను చూచి దధీచి దక్షుని మందలించెను. కాని దక్షుడు దధీచిమాటలు లెక్కచేయక శివనింద యొనర్చెను. దధీచి శివుని మహిమను వర్ణించెను. దధీచిమాటలు దక్షుని చెవికెక్కలేదు. అపుడు దధీచి శివరహితయాగమునకు విచ్చేసిన దేవాదులను నిందించి, యాగశాలనువీడి కైలాసమును చేరెను. శివునకు దక్షదుర్యాగమును వివరించి, "యాగముసంతమొందించి, దక్షుని కడతేర్చి, ఆత్మానందమును గూర్చుమని" ప్రార్థించెను. అంతరుద్రుడు క్రుద్ధుడై హుంకారము సలుపగ అఖండతరప్రళయాగ్ని సన్నిభాకారుడైన వీరభద్రుడు రౌద్రముతోడ జన్మించెను. రుద్రాణియును రోషాత్మయై భాసింప ఘనకరాళాననయైన భద్రేశ్వరిజని యించెను. అంత జగత్పితరులు, "దక్షుని జంపి, యాగమునుహరించి, ఇంద్రాదులను దండించి రావలసినదిగ" వీరభద్రునికి, భద్రేశ్వరికి ఆజ్ఞలిడిరి.

అనంతరము వీరభద్రుడు వీరయాగము చేయనెంచి రోమకూపముల నుండి రణోత్సాహులు, మహావిక్రములునైన వారిని సృజించెను. కొదమసింగములవంటి ప్రమథగణములు వెంట వచ్చుచుండ భద్రేశ్వరితోడ వీరభద్రేశ్వరుడు సమస్తాయుధసహితుడై దక్షుని యాగశాలకరిగెను. విపులవీరావేశ కోపాటోప సంరంభుడును, కరాళవదనుడునై వీరుడు చెలగి యార్చిన యాగశాలలోనివారలు భీతిల్లిరి. ఇది, "సృష్టిసంహారమా" యని నివ్వెరగందిరి. సింగనాదంబు జేసి విజృంభితుడైయున్న వీరేశ్వరుని గని వెరచియు వెరవని చందమున దక్షు

డు, "నీవెవ్వడవు? ఏమి కార్యమైవచ్చితివి? ఎవ్వడు పంపగవచ్చితివి?" యని ప్రశ్నించెను. అపుడు వీరుడు, "నేను ఈశ్వర దూతను, వీరభద్రుడనువాడను, నీ జన్నమున మహేశునకుంబాలుంగొనంజనుదెంచిన వాడను. యాగభాగమునిచ్చి నిన్నునీవు రక్షించుకొను" మని పల్కెను. "యాగములోపలశివునకు భాగము గలదని శ్రుతులుపలికిన భాగమునిత్తు" నని దక్షుడు పల్కెను. అంత చతుర్వేదములు "నిఖిలతంత్రములకు నీలకంఠుడువేల్పు భువినగ్రదైవము మహేశుడు, యాగభాగమునిమ్ము" అని చెప్పెను. దక్షుడా మాటలను పెడచెవిని పెట్టెను. అంతవేదములుభయమున బ్రహ్మలోకమున కరిగెను.

శ్రుతులపలుకులు వినియు యాగశాలను వీడని దివౌకసులపై వీరభద్రుడు విరుచుకపడెను అనేకవిధములవారలను హింసించెను. కరచరణాదులను, నేత్రదంతాదులను భిన్నముగావించెను. విష్ణుదేవుని యుద్ధమున ఓడించెను. మహేశుచెలికాడని మన్నించివదలెను. దక్షునిశిరముచు ఖండించెను. సమస్త సురలను బంధించెను బ్రహ్మాదిదేవతలు తమ్ముక్షమించుమని వీరభద్రుని శరణుజొచ్చిరి. వీరభద్రుడు వారల బంధనములనుద్రెంచి శివునికడకు గొంపోయెను తానుగావించిన దక్షాధ్వరధ్వంసమును తండ్రికి వివరించి, దివిజులనప్పగించెను. బ్రహ్మాదులు తమతప్పుల నంగీకరించి, తమను కాపాడుమని శంకరుని సంస్తుతించిరి. మహేశుడు వారలననుగ్రహించి, తెగినకరచరణాది అవయవములను వారలకు తిరిగిప్రసాదించెను. వారానందించిరి.

పిదప దక్షుని మేకతలతో ఈశ్వరుడు పునర్జీవితుని గావించెను. తన తప్పును గ్రహించిన దక్షుడు భక్తిమీరశంకరుని స్తుతించెను. పిమ్మట జగత్పితరులు భద్రకాళీవీరభద్రులను ఆదరముగచెరబిలుచుకొని గారవించిరి. "ముల్లోకములకు కర్తారుడై వీరభద్రుడు వెలుగును. మీకునీతడే దైవము." అని త్రిదశులకు చెప్పి, వీరభద్రునకు పట్టముగట్టిరి. వీరభద్రుడు సమస్త భువన భారధురంధరుడై జగములన్నిటిని పరిపాలనముచేయ దొడగెను.

ఈకథవినినవారు, చదివినవారు, లిఖితప్రారంభులైనవారు శంభుకొలు

వువారని, పంచమహాపాతకములు పాయునని పోతనఫలశ్రుతిని జెప్పి "వీరభద్ర విజయము" కథనుముగించెను. పై విధముగ వీరభద్ర విజయము నందుగల నాల్గాశ్వాసములలోని కథను వివరించుట జరిగినది.

## వీరభద్రవిజయము - మహాత్మ్యము

శ్రీవేదవ్యాసభగవానునిచే విరచితమైన శ్రీవాయుమహాపురాణము వీరభద్రవిజయమునకు మూల గ్రంథము. వాయుపురాణము అష్టాదశపురాణములలో నొకటి. ఇయ్యది శివతత్త్వమును ప్రతిపాదించుచు, అనేక చారిత్రకాంశములను దెలుపు ఉభయ తారకమైనపురాణము. ఇది పూర్వార్థమని, ఉత్తరార్ధమని రెండు భాగములు. అందు పూర్వభాగమున ముప్పదియవ అధ్యాయమున దక్షాశ్రయమైనకథ చెప్పబడినది. సూతుని వలన విని తెలిసికొనిన దక్షశాపకథను వాయుదేవుడు మునులకు వివరించినట్లుల తెలుపబడినది. 319 శ్లోకములలో ఈ కథ వర్ణింపబడినది. అసలుకథ 41వ శ్లోకమునుండి ప్రారంభమగును. ఇందు శివుని అష్టోత్తర సహస్రనామావళి, జ్వరవర్ణనలు అధికముగ గలవు. దాదాపు 140 శ్లోకములలో మాత్రమే కథ సంక్షిప్తముగ చెప్పబడినది.

దక్షప్రజాపతికి ఎనిమిదిమంది తనయలుకలరు. దక్షుడాయువిదలను ఆత్మీయుభవనమునకు కొనివచ్చి చక్కగ ఆదరించుచుండెను. కాని జ్యేష్ఠురాలైన సతీదేవిని మాత్రము అనాదరించుచుండెను. సతీదేవి భర్త, ప్రథమజామాతయైనశివుని, దక్షుడు దూష్యునిగతలపోసి శుద్ధకుమార్తెను పిలువకుండెను. శంకరుడును ఏ యిబ్బందులేక తత్త్వవిదుడై మామను గౌరవింపడాయెను. సహజాతచెల్లెరు తండ్రియింటనుండుటవిని, తనను పిలువకున్నను సతీదేవి కన్నవారింటికరిగినది. కాని ఆమెకు తండ్రి తిరస్కారమెదురయ్యెను. అందుకు సతీదేవి క్రుద్ధురాలై, "తండ్రీ! పెద్దబిడ్డనైన నన్నేలనీవు అవజ్ఞాన్వితదృష్టితో చూచుచుంటివి? ఇయ్యది నీకు తగ"దనిపల్కెను. ఆమాటలువిని దక్షుడు కోపముతో, "నీ చెల్లెండ్రును, వారి భర్తలునుదలప మిగుల గుణోన్నతులు, నీపతికంటెను సద్గుణైశ్వర్య సంస్తవనీయులు అందున వశిష్ఠభృగ్వాదులు నాయల్లుండ్రలో శ్రేష్ఠత

తపోధనవరులు చుండిరి. నీ భర్త వీరికి భిన్నుడు. అట్టివానిని సంబంధము గలిగిన నిన్ను నేను ఆదరించలేను" అని మూర్ఖుడై పలికెను. తండ్రిమాటలకు దాక్షాయణి ఆగ్రహోదగ్రురాలయ్యెను. "త్రికరణముల పవిత్రులమైన మమ్ముల నీవు గర్హించినావు. కావున నీవలన జన్మముపొందిన నేను ఈ తనువును త్యజింపదలచితిని" అని మిక్కిలిగ కలతనొంది మనమున మహేశుదలచి నమస్కరించి, "మరల నేను తేజోవంతమైన తనువును బొంది ధర్మము నాశ్రయించి, జ్ఞానసంయుక్తనై శంకరుని ధర్మపత్ని నగునటుల యనుగ్రహింపు" మని పలికి యున్నచోటనే యుపవిష్టయై, యోగసమాధిపొంది యాత్మయందగ్నిని రగుల్కొల్పినది, వాయువుతో సముద్దీపితమైన ఆయగ్ని సర్వాంగముల నావరించి ఆ తల్లి తనువును భస్మము గావించెను.

సతీదేవి మరణ వృత్తాంతము నంతటిని ఎఱింగిన శంకరుడు ఆగ్రహించి, దురాత్మా! నాకారణముగ తన్ను కూతుని అవమానపరచితివి. నీతనయులందరును, వారిభర్తలనుచూచుచునుండ, వైవస్వతమనువు జగములను గను వేళ, మహర్షులెల్లరును అయోనిజులుగ జన్మించి నీయజ్ఞమున నిలుతురు. ఆయజ్ఞము చాక్షుషుడను మనువునంతరమున చెడును. అదెటులన చాక్షుషుడను మనువు మనుజుడై యొప్పెడునప్పుడు ప్రాచీన బర్హికి పౌత్రునిగ, మారిషయను ఆమెకు నీవు దక్షప్రజాపతియనుపేర నుద్భవింతువు. అత్తఱిని యజ్ఞమును ధ్వంసము గావింతు"నని దక్షుని శపించెను. దక్షుడు ఆశాపమునెరింగి కోపించి, "పాపాత్మా! భూసురులు యజ్ఞకల్పమున యజ్ఞభాగము నిచ్చునపుడు నిన్నువర్జింతురు. ఆహుతినియిడిన నిర్మలహస్తములు మలినములైనటుల నీటగడిగి కొందురు. ఇంక భూతలమునసే నీవు పూజ్యుడవని సురలు హోమమంత్రావళి వేల్వకుందురుగాక" అని మహేశునకు ప్రతిశాపమిచ్చెను. "భూలోకమునేగాదు జగములన్నియు స్థిరముగనుండును. కావున నేనిందేయుందును. కాని నీకు తెలియదు" అని శంకరుడు దక్షునకు సమాధాన మిచ్చెను. అనంతరము ప్రజాపతి తనువును త్యజించి మర్త్య తనువునుబొంది, దక్షుడు యజ్ఞకర్తయై

అనేకములైన యాగముల నాచరించెను.

వైవస్వతమనువు వసుధను పాలించువేళ సతిగతేను చాలించిన ఆది శక్తి మేనాహిమవంతులకు ముద్దులపట్టిగ జన్మమునందెను. ఉమయనుపేర ప్రసిద్ధినందినది పరమేశు రాణియైనది. చాక్షుషమన్వంతరమున దక్షుడు మారిషయను వామెకుద్భవించెను. మహేశుశాపఫలితముగ భృగ్వాది మహర్షులును అయోనిజులుగ జన్మించిరి. దక్షత్ర్యంబకులకు శాపంబులు పరస్పర శాశ్వతవైరకారణము లాయెను. శుభాశుభ కర్మంబులు జన్మాంతర మందును ప్రాణులను వదలకుండునుగదా!

అనంతరము శంకరుడు గౌరీసమేతుడై మేరుధరణీ ధరశిఖరంబున కొలువైయుండెను. బ్రహ్మవిష్ణుమహేంద్రాది సకల దేవలోకవాసులు, సిద్ధసాధ్యాదులు, మునులు ఆయాగమునకు వచ్చిరి. ఆహ్వానములేకునికి యజ్ఞనాథుడైన మహేశుడు యాగమునకు రాలేదు. మహేశుడులేని యాగమాచరించుచున్న దక్షుని దధీచి మందలించెను. దక్షుడా మాటలను లక్ష్యపెట్టక "పైడి పాత్రలందలి హవ్యముఁగొన సరోజనేత్రుడు అర్హుడుగాని పరమేశ్వరుడు కాడు. కావున నేనతనికి యజ్ఞభాగము నివ్వను" అని పల్కెను.

దేవతలందర ఆకసమున వేడుకతో పోవుటను కాంచిన అద్రిరాజ తనయ, ప్రభూ! దేవనికరమెచ్చటకు పోవుచున్నారు. సర్వజ్ఞులైనమీరు తెలుపవలయు"నని భర్తనడిగెను. మహేశుడప్పుడు దక్షయాగ విషయము నామెకు వివరించెను. అపుడా జగన్మాత, "మీరేల యాగమునకు పోకుంటిరి" అని ప్రశ్నించెను. యజ్ఞభాగమునొందనే నర్హుడనుగానని యొక విధి కల్పింపబడినది. కావున ఋత్విజులునాకు యాగభాగమునివ్వరు" అని శంకరుడామెకు తెలియజెప్పెను. ఈ సమాధానము గౌరీదేవి మనమునకు తృప్తినొసగలేదు. ఆమెవ్యథచెందినది. "యాగభాగము నొందుటకు నన్నేమిచేయుమన్నను చేసెదను, కాని యిట్లు యాగభాగము లేకుండుటనుచూచి సహించలేను" అని

పలుకగ, సర్వేశ్వరుడామెను ఓదార్చెను.

"పూర్వమువలెనె యాగభాగము వచ్చునటుల చేసెదను చూడు" మని ముక్కంటి భవానికిచెప్పి, క్రోధవహ్నినుండి అఖండప్రళయాగ్ని సన్నిభాకారుడైన మహావీరుని సృజించెను. అతడే అపర రుద్రుడు. రౌద్ర సముద్రుడు, వీరభద్రుడు. అంతటరుద్రాణియుక్రుద్ధురాలై భద్రకాళిని సృష్టించెను. వీరభద్రుడంత రోమకూపముల నుండి వీర్యవంతులనేకులను సృజించెను. వారందరితోడ దక్షయాగమునకు బోయి, వీరవిహారముగావించి, దక్షుని నేలపడగొట్టి బాధించి, సురలోకమును బంధించెను. అపుడు దేవగణము దక్షుడును వీరభద్రుని ప్రార్థించి శరణుజొచ్చిరి. అపుడు మహేశుడవతరించి వారికి బుద్ధిచెప్పెను. దక్షుడపుడు సబాష్పవదనుడై మహేశుని శరణు జొచ్చెను. భక్తవత్సలుడైన ఈశుడు యజ్ఞసంబారాదులను పూర్వము వలె దక్షునకొదవునటుల అనుగ్రహించెను. దక్షుడు శివుని అష్టోత్తర సహస్రనామముల కీర్తించి సంతుష్టపరచెను అంత మహేశుడు దక్షునకు, "వేయి అశ్వమేధములను, నూరువాజపేయములను ఒనరించిన కలుగు ఫలమును పొందగల"వని వరమనిచ్చెను.

పరమేశ్వరుడు పాశుపతవ్రతదీక్షను వివరించి, ఆవ్రతము నాచరించుమనిచెప్పి, దక్షునిమానసికజ్వరమునుదిపి అదృశ్యుడాయెను

దక్షప్రోక్తమైన పరమేశు అష్టోత్తర సహస్రనామ సంకీర్తన గావించినవారికి "అశుభములుండవు. దీర్ఘాయువు, కీర్తి, ఐశ్వర్యము, రాజ్యమును కలుగును. కోరికలు సిద్ధించును. విద్యాభివృద్ధి జరుగును. జ్వరకీర్తనచేసినవారికి మృత్యుభయము, రోగభయములుండవు. ఈ కథావిషయమును వినుటవలన రుద్రలోకము నొందుదురు" అని ఫలశ్రుతి చెప్పబడియున్నది.

పై విధముగ వివరింపబడిన వాయుపురాణము నందలి ఇతివృత్తము, ప్రస్తుత వీరభద్రవిజయమునకు ఆధారముగనున్నది.

పోతన వీరభద్రవిజయము నందలి పీఠికలో, "కావున వాయుపురాణ

సారంబగు నీకథావృత్తాంతంబంతయుఁదెలుంగున రచియింపుమని యానతిచ్చిన మద్గురునిమధురవాక్యంబులకు నత్యంతానురాగ సంతుష్టుండనై" (1–22 వచ) అని, వీరభద్ర విజయము వాయుపురాణాను సారము రచింపబడినదని చెప్పి యున్నాడు. కనుక వాయుపురాణ మందలి కథయే వీరభద్ర విజయమునకు మూలమని చెప్పవచ్చును.

# వీరభద్రవిజయము - మార్పులు-చేర్పులు

వేద విభజనగావించి, భారత భాగవతములను నుడికారము తప్పక రచించిన మహామనీషి, పరమేశ్వరాంశ సంభూతుడైన కృష్ణద్వైపాయన మహర్షి రచించిన అష్టాదశ పురాణములలో శ్రీవాయుపురాణ మొక్కటి. ఈ వాయుపురాణమునందలి కథనుగ్రహించి బమ్మెరపోతన వీరభద్రవిజయ కథను కూర్చినాడు. మూలకథకు పోతన తనగ్రంథమైన వీరభద్ర విజయమున కొన్ని మార్పులను, చేర్పులను గావించి యున్నాడు. వానిని క్రింది విధముగ పరిశీలించుటమైనది.

## మార్పులు :-

వాయు పురాణమున దక్షాధ్వరకథ పరిమితముగ చెప్పబడియున్నది. వీరభద్రవిజయమున యీ కథ విస్తృతముగ చెప్పబడియున్నది. వాయుపురాణమున, దక్షుడు గావించిన యాగము ఒక్కటియే గాని రెండు కావు.

"దక్షస్యాసన్ సుతాహ్యష్టాకన్యాయాః కీర్తితామయా
స్వేభ్యోగృహేభ్యోహ్యానాయ్యతాః పితాభ్యర్చయద్గృహే
తతస్త్వభ్యర్చితాః సర్వాన్యవసంస్తాః పితుర్గృహే" (అధ్యా - 30 - 40శ్లో)

"తాసాంజ్యేష్ఠా సతీనామపత్నీయాత్ర్యంబక స్యవై
నాజుహావాత్మజాంతాంవై దక్షోరుద్రమభిద్విషన్" (అధ్యా. 30 - 41 శ్లో)

"తతోజ్ఞాత్వాసతీసర్వాః స్వస్రః ప్రాప్తాః పితుర్గృహమ్"
జగామ సాప్యనాహూతాసతీతత్స్వంపితుర్గృహమ్" (అధ్యా30 - 43 ) అని.

మూలమునచెప్పబడి యున్నది. అనగ దక్షుడు కూతులందరను గౌరవించుచు, పరమేశ్వుపైగల కోపకారణముగ సతీదేవిని అవజ్ఞచేసెను. చెల్లెండ్రందరు తండ్రి యింట వారిభర్తలతోగూడి ఉండుటను విని, తనను పిలువకున్నను సతీదేవి కన్న వారింటికరిగినది. తండ్రిచే అవమానింపబడి, యోగాగ్నిలో దేహత్యాగ మొనరించినది.

కాని పోతన యీ విషయమును మార్చి దక్షుని తొలియాగమును వివరించెను. ఈ యాగమునకు తనను పిలువకున్నను సతీదేవివెళ్లి, తండ్రి తిరస్కారమునకు గురియై దేహత్యాగమొనరించి నటుల వర్ణించెను. ఈ కథా భాగము వీరభద్రవిజయము నందలి ప్రథమాశ్వాసమున వర్ణింపబడి యున్నది. మరల నాల్గవా శ్వాసమున దక్షుడు రెండవ యాగమును గావించినట్లు పోతన వర్ణించెను. ఆసమయముననే వీరభద్రోత్పత్తి జరిగినది.

సతీదేవి మరణానంతరము దక్షత్ర్యంబకుల శాపములు వాయు పురాణమున వ్యాసుడు వివరించెను. పోతన ఈ సంఘటనమును గూడ కొంతమార్పు గావించెను. శివుడు దక్షునకిచ్చిన శాపమును వివరించెనుగాని, దక్షుడు శివుని కిచ్చిన శాపమును పరిత్యజించెను. ఇందులకు వీరశైవ మతాభిమానము కారణము కావచ్చును.

సతీదేవి దేహత్యాగానంతరము,

"అథదేవీసతీయాతు ప్రాప్తేవైవస్వతేంతరే
మేనాయాంతాముమాందేవీం జనయామాస శైలరాట్" (అధ్యా 30 – 71 శ్లో)

అను శ్లోకమునుబట్టి వైవస్వత మన్వంతరమున మేనాహిమవంతులకు "ఉమ" యనుపేర జన్మించినది. శివునకుదేవేరియైనది, అని మూలమున వర్ణింపబడినది, పోతన వీరభద్రవిజయమున ఉమాదేవిని అయోనిజగ వర్ణించెను, మేనాహిమవంతులకు ఆమె కన్నకూతురుగాదు, స్వాయంభువ దేహత్యాగానంతరము ఆదిశక్తి బాలయై హిమవత్ శిఖరమునుఁ జేరినది. ఆదుఖిద్దకై తపమాచరించు

చున్న హిమవంతుడా బిడ్డనుచూచి ముచ్చటపడి నిజవాసమునకు గొంపోయెను. పెంచి పెద్దజేసెను, జగన్మాతను బిడ్డగపెంచి పెద్దచేయుట హిమవంతుని అదృష్టము కాదు, పోతనగారి అదృష్టమనవచ్చును. మూలమందు సతీదేవి ఉమగ జన్మించి భవుని దేవేరియైనదని ఒక్క శ్లోకమున చెప్పబడియుండగ, పోతన దానిని రెండాశ్వాసములకు పెంచి, వీరభద్రవిజయమును, రచించి పురాణకథకు కావ్యత్వసిద్ధిని కల్పించెను.

మూలమున వీరభద్రుని సృష్టికి, మహేశుడు దక్షునికిచ్చిన శాపము, గౌరీమాత వ్యథ అనునవి కారణములుగ కన్పించుచున్నవి.

"భగవన్ సర్వదేవేషు ప్రభావానధికోగుణైః
అజేయశ్చాప్య ప్యృష్యశ్చతేజసాయశసాశ్రియా" (అధ్యా, 30 - 114 శ్లో)
"అనేనతు మహాభాగ ప్రతిషేధేననామతః
అతీవదుఃఖ మాపన్నావేపథుశ్చమమానఘ" (అధ్యా, 39 - 115 శ్లో) అను శ్లోకములనుబట్టి, గౌరీదేవి మహేశుతోడ, దేవతలందరిలోను అధికమైన ప్రభావమును కలిగి, అజేయుడవై, పరాక్రమయశస్సంపదల వెలుగొందుమీకు యజ్ఞబాగము నిషేధింపబడుట నాకు దుఃఖమును కలిగించుచున్నది. మనము వ్యథ చెందుచున్న"దని పలుకును. అంతరుద్రుడు డామెను ఓదార్చుటకై వీరభద్రుని సృష్టించి దక్షయాగ ధ్వంసమునకు పంపినటుల మూలమునగలదు.

కాని పోతన వీరభద్రవిజయమున, శివునిశాపము, దధీచిపలుకులు కారణములుగ తెలియుచున్నవి. శివరహిత యాగము మంచిదికాదని దధీని ఎంత చెప్పినను, మందలించినను దక్షుడు వినక శివనింద యొనర్చెను. అందులకు కోపించిన దధీచి శివునికడకువచ్చి 'సర్వమును వివరించి, దక్షయాగము నంత మొందించి, అచ్చటివారిని దండించి, నామనమునకు ప్రమోదమును గూర్పు" మని పలుకుటతో మహేశుడు రౌద్రాకారుడై వీరభద్రోత్పత్తిగావించెను. కనుక వీరభద్రవిజయమున దధీచి కోపోపసంహారమునకు, అభక్తుని మానసిక ప్రమోదమునకు వీరభద్రసృష్టి జరిగినట్లు వర్ణింపబడియున్నదని చెప్పవచ్చును. ఇది పోతన గావించిన మార్పు,

మూలమున వీరభద్రుడు దక్షుని సంహరింపలేదు. నేలఁబడగొట్టి, పాదపీడనమున హింసించెను. కాని పోతన వీరభద్ర విజయమున దక్షుని శిరః ఖండనము గావించెను. అప్పటికిగాని ఆయన వీరశైవహృదయమునకు ఊరట కలిగినట్లులేదు. ప్రబంధ కథకు అందముచేకూరుటకు, కావ్యము సుఖాంత మగుటకు పోతన, బ్రహ్మాదుల ప్రార్థనపై మరల మేకతలతో దక్షుని శివుడు పునర్జీవితుని గావించినటుల వర్ణించెను.

మూలమున దక్షుడు ప్రాంజలుడై శరణు వేడి అష్టోత్తర సహస్రనామ సంకీర్తనచేయగ ముక్కంటి వరమునను గ్రహించినట్లు క్రింది శ్లోకమునుబట్టి తెలి యుచున్నది.

"అశ్వమేధ సహస్రస్యవాజపేయ శతస్యచ
ప్రజాపతే మత్ప్రసాదాత్ ఫలభాగేభవిష్యసి" (అధ్యా 30 – 290 శ్లో)

పోతన వీరభద్ర విజయమున, మహేశ్వరుడు దక్షుని అనుగ్రహించి నటుల చెప్పెనేకాని, వరమును గూర్చి ప్రస్తావించలేదు. దక్షాధ్వర ధ్వంసమే కాని తిరిగి అధ్వరఫలము లభింప నీయకుండుటయే పోతన అభిమతము కావచ్చును. శివద్వేషికి అంతమాత్రము శిక్షయుండ వలయునని శివతత్త్వ ప్రతిపాదకుడైన పోతన భావించియుండు ననవచ్చును.

పై విధముగ పోతన, వాయుపురాణము నందలి కథను అనేక విధ ములుగ మార్పులు గావించుకొని, కావ్యకథగ మలచుకొని ఔచిత్యశోభితముగ, రస సమంచితముగ వీరభద్ర విజయమును రచించెను. పోతన గావించిన మార్పులు కావ్యకథకు బిగిని, జిగిని కల్గించుచున్నవని నుడువవచ్చును.

## చేర్పులు :-

పోతన వీరభద్రవిజయమునందు, మూలమైన వాయుపురాణమునలేని కొన్నివిషయములను చేర్చి వర్ణించియున్నాడు. పోతన తన వీరభద్ర విజయమున గావించిన చేర్పులను క్రింది విధముగ వివరించుట జరిగినది.

వీరభద్ర విజయమున ఉమా మహేశ్వరుల వివాహమును పోతన ద్వితీయ, తృతీయాశ్వాసములందు వర్ణించెను. ఈ వివాహ సన్నివేశములన్నియును పోతనగారి కల్పనచేనని చెప్పవచ్చును. వాయుపురాణమున వివాహ వర్ణన ప్రసక్తియే కానరాదు జగత్పితరుల యెడలగల అనన్యమైన భక్తిని ప్రకటించు కొనుటకు, పురాణకథను కావ్యకథగ తీర్చిదిద్దుకొనుటకు, సమగ్ర రసపరిపోషణమునకు పోతనచే ఈ వివాహవర్ణన వీరభద్రవిజయమున చేర్పబడినదని చెప్పవచ్చును. ఈ చేర్పు వీరభద్రవిజయమునకు శోభను చేకూర్చినదన వచ్చును

మూలములో కన్పించని "క్షీరసాగరమథనము" అను ఉపాఖ్యానము వీరభద్రవిజయమునందలి తృతీయాశ్వాసాంతమున వర్ణింపబడినది. బ్రహ్మాదులకు అలవిగాని గరళమును అరచేతదెచ్చి మ్రింగి చతుర్దశభువనములను గాచిన గరళకంఠుని మహోన్నతిని చాటుటకై యీ ఉపాఖ్యానమును పోతన వీరభద్ర విజయమున చేర్చెనని చెప్పవచ్చును. "బ్రహ్మాదులకునైన బ్రహ్మదానె" అను భావమును వ్యక్తపరించుటకు పోతన ఈ కథను చేర్చెననియు చెప్పవచ్చును.

మూలకథలో విఘ్నేశ్వరుని ప్రసక్తిలేదు. పోతన వీరభద్రవిజయమున పార్వతీ పరమేశ్వరుల వివాహమునకు విఘ్నేశ్వరుడు వెళ్లినటుల చెప్పబడియున్నది దీనిననుసరించి విఘ్నేశ్వరుని జనని దాక్షాయణి యని చెప్పవలసియున్నది పిదప ఉమామహేశులకు జన్మించిన వాడు కుమారస్వామి యని నుడువవచ్చును.

మూలకథలో దక్షుని యాగశాలలో వీరభద్రుని విజృంభణము కొంత భయంకరముగనే వర్ణింపబడియున్నది. కాని పరస్పర యుద్ధములు వర్ణింపబడలేదు. పోతన వీరభద్రవిజయమున వీరభద్రుడు ఇంద్రునితోడను, విష్ణువు తోడను యుద్ధము గావించి నటుల వర్ణించి వీరభయానక రసములను పోషించెను.

వీరభద్రునకు పట్టముగట్టుట కూడ పోతన గారు వీరభద్రవిజయమున నూతనముగ చేర్చెను. కావ్యనామౌచిత్యమును వీరభద్రుని పట్టాభిషేకముతో పోతన సార్థకమొనరించెనని చెప్ప వచ్చును.

పై విధముగ మూలమైన వాయుపురాణమునలేని కొన్ని సన్ని వేశ ములను పోతన వీరభద్రవిజయమునచేర్చి, ఒకవంక రసభావములను చిత్రించి, వేరొకవంక శైవవాతావరణమును ప్రకల్పనముగావించి, వీరభద్రవిజయమును స్వతంత్రకావ్యముగ తీర్చిదిద్దెనని చెప్పవచ్చును.

పోతన వీరభద్రవిజయమున గావించిన మార్పులు, చేర్పులు కావ్య మున్నకు నూత్నశోభను చేకూర్చినవని నుడవవచ్చును.

# పోతనకు పూర్వమందున్న వీరభద్రుని కథలు

పోతన వీరభద్రవిజయమును రచించుటకు పూర్వము కొన్ని కావ్య ములలో వీరభద్రుని వృత్తాంతము వర్ణింపబడియున్నది. ఆ కథలను స్థూలముగ పరిశీలించి, పోతన గారి కథతోగల భేదసాదృశ్యములను వివరించుట ఈ ఉపప్రకరణమున జరుగుచున్నది.

**శివపురాణము :-**

జగత్కల్యాణము కొరకు చెలికారపునుడుల వ్యాసభట్టారకుడు రచించిన అష్టాదశపురాణములలో శివపురాణము ప్రసిద్ధమైనది. ఇందు ద్వితీయ ఖండము "సతీఖండము". ఇందు దక్షయాగము, విరభద్రుని జననము. దక్షా ధ్వారధ్వంసము మొదలుగాగల కథ కూర్పబడి యున్నది. ఆ కథ క్రింది విధ ముగ గలదు

ప్రయాగలో మహర్షులు చేయుచున్న యాగమున కెల్లరును వచ్చిరి. దక్షప్రజాపతియును విచ్చేసెను. దక్షునకు అచ్చటి వారందరును మ్రొక్కి గౌర వించిరి. కాని అల్లుడైన ఈశుడు నమస్కరించలేదు. అందులకు దక్షుడు కినుకజెంది, "యజ్ఞభాగమునీకు లేకుండుగాక" అని ఈశుని శపించెను. అంత నంధీశ్వరుడు కోపించి, "బస్తమౌఖివైతీరుదుగాక" అని దక్షునకు ప్రతి శాప మిచ్చెను. అపుడు దక్షుడు రుద్రభక్తులైన నందీశ్వరాదులను తిరిగి శపించెను. భృగ్వాది విప్రవరులు ఆమాటలను వినుచు మిన్నకుండిరి. అంత వారలను గూడ

నందీశ్వరుడు శపించెను. పిదప శివుడు నందీశ్వరుని కోపముడిపి అతనిని కైలాసమునకు గొంపోయెను.

నీలకంఠునిపై ప్రతీకారము తీర్చుకొనదలచి దక్షుడు శివరహితమైన యాగము నారంభించెను. బ్రహ్మాదిదేవతలు, సమస్త మునిజనము ఆయాగమునకు విచ్చేసిరి. తత్త్వవిదుడైన దధీచి శివుడులేడుకుండుటనుచూచి దక్షునిమందలించెను. దధీచి మాటలను దక్షుడు నిర్లక్ష్యము చేసెను. అంత దధీచి కోపించి. పరమేశుడులేని యాగము భగ్నమగును. మీరు దుఃఖితులగుదు" రని శపించి శిష్యగణముతోడ యాగశాలను వీడిపోయెను. దక్షుడు మాత్సర్యముతోడ యాగమును కొనసాగించెను. పిలువకున్నను తండ్రి యాగమును చూడవచ్చి దాక్షాయణి దక్షునిచేత తిరస్కృతయై దేహత్యాగ మొనరించుకొనినది. దాక్షాయణి వెంట వచ్చియున్న రుద్రగణములు దక్షునిపై పడబోవ భృగుడు ఋభులను బుట్టించి వారిని తరిమెను. అంత ఆకాశవాణి, "రుద్రవైరముతో యాగముజేయు నీతల తెగిపడును. యాగము నాశమగునని చెప్పెను. ఇంతలో నారదునివలన దాక్షాయణి దేహత్యాగ వార్తనువినిన రుద్రుడు ఆగ్రహోదగ్రుడై జటనుపెరికి పర్వతాగ్రమేదిని గొట్టెను. ఫలితముగ భద్రకాళీదేవితో వీరభద్రుడావిర్భవించెను. వీరితోడనే భూతతతి, ఘోరజ్వరములును అవతరించినవి. శివుని యాజ్ఞగొని వీరభద్రుడు దక్షుని యాగశాలపై దండెత్తిపోయెను. దక్షుని శిరమును ఖండించి దక్షిణాగ్నిలో వగ్ధమొనరించెను. బ్రహ్మవిష్ణు దేవేంద్రులు యుద్ధమున వీరునితో ఓడిపోయిరి. వీరభద్రునకు విజయము చేకూరినది.

బ్రహ్మాదిదేవగణము శివుని ప్రసన్నముచేసికొనిరి. వీరి అభ్యర్థనపైననే శివుడు దక్షుని పునర్జీవితుని గావించెను. జరిగినతప్పిదమును తెలిసికొని దక్షుడు కుమార్తె దాక్షాయణికై దుఃఖింపగ పరమేశ్వరు డూరడించెను.

సతిగ దేహమును చాలించిన దాక్షాయణి పార్వతిగ చలికొండల ఱేనికి బిడ్డయైనది. ఈశుని నాథునిగ పొందినది.

పై కథను పరిశీలించగ, శివపురాణమున దక్షుడొనరించిన యాగ

మొక్కటియే. అది వీరభద్రుని వలన ధ్వంసము గావింపబడినది. దక్షునకు శివశాపము ఈ పురాణములో చెప్పబడలేదు. దక్షునకు నందీశ్వర, దధీచులిచ్చిన శాపములు వర్ణితములు. ఈశ్వరు జటాహతినుండి వీరభద్రుడు, భద్రకాళి జని యించినటుల చెప్పబడి యున్నది. శివపురాణకథయందు దక్షుడు మామూలు గనే బ్రతికింపబడినట్లుగలదు.

పోతన వీరభద్రవిజయమున, దక్షుడు రెండు యాగములు నిర్వహించి నట్లు, రుద్రునిహుంకారము నుండి వీరభద్రుడు, జగన్మాత కోపమునుండి భద్ర కాళి ఆవిర్భవించినట్లు, దక్షుడు మేకతలతో పునర్జీవితుడైనట్లు వర్ణించెను. దక్షునకు శివుడు శాపమిచ్చినట్లు పోతన వర్ణించెను. పురాణము నందువలెగాక విష్ణ్వీశ్వ రుడు పార్వతీశ్వరుల కల్యాణమునకు వెళ్లినట్లు పోతన వర్ణించెను పార్వతీ పరమేశ్వరుల పరిణయము, వీరభద్రుని విజృంభణము మొదలగు కథావిషయ ములు శివపురాణ కథ ననుసరించి వీరభద్ర విజయమున పోతనచే చేకూర్చబడిన వని చెప్పవచ్చును.

# ఆంధ్రమహాభారతము - శాంతిపర్వము

ఆంధ్రమహాభారతము నందలి శాంతిపర్వములోని పంచమాశ్వాసమున దక్షమఖధ్వంసకథ ఏడుపద్యములు, రెండు వచనములలో సంక్షిప్తముగ తిక్క నచే చెప్పబడియున్నది.

దివిజులు దక్షాధ్వరమున కేగుటనుగాంచి భవాని తత్క్రతువును గూర్చి శివుని అడిగి తెలిసికొనినది. యజ్ఞభాగము యజ్ఞనాథుడైన మహేశునకు లేదను పరికల్పనము పూర్వము కావింపబడి యుండుటచే, దక్షుడు శివుని తన యాగ మునకు ఆహ్వానింపలేదని తెలిసికొని పార్వతి మిక్కిలి పరితాపమునందినది. ఆమె దక్షునిపై కినుకవహించినది. దేవేరిహృదయము నెరిగిన దేవదేవుడు ప్రమథులతో దక్షక్రతువును చెరుపనరిగెను. ప్రమథులు రక్తము జల్లికేకలువేయగ యజ్ఞ పతి మృగరూపుడై గగనమున కెగసెను. ఇంతలో కోపమువలన మహేశునుదుట

పుట్టిన చెమట బిందువులు భూమి మీదబడగ పెనుమంట లెగసినవి. అందు నొక భయంకరాకారుడైన పురుషుడుదయించెను. అపుడు బ్రహ్మాదులు భీతిల్లి "యాగభాగపరికల్పనము గావింతు" మని పలికి కోపము నుపసంహరింప వలసి నదిగ ఈశుని వేడుకొనిరి. సర్వేశ్వరుడు ప్రసన్నుడాయెను. దేవతలాయనకు యాగభాగమును కల్పించిరి. అపుడు శతానందుడు, "దేవా! నీనుదుటి చెమటఁ బుట్టిన పురుషుడు జ్వరంబను నామంబున ప్రసిద్ధుడగును. ఈ జ్వరము ఏక ముఖంబున పృథివికి దుర్భరమగును. బహువిధములుగ సృజింపుము" అని ప్రార్థింపగ, హరుడును అటులనే వివిధములుగ జ్వరములను విభాగించెను.

పై భారతకథలో సతీదేవిని దక్షుడు తిరస్కరించుట, సతీదేవి దేహత్యా గాదులు కాన్పింపవు. కాని వాయుపురాణములోవలెనె భవాని హృదయతాపము, దక్షాధ్వర ధ్వంసమునకు కారణముగ చెప్పబడెను. భారతమున శివుడే స్వయ ముగ దక్షయజ్ఞ వినాశమునకు ప్రమథులతోడ వెళ్లినటుల చెప్పబడినది. వీరభద్రుని ప్రసక్తియిందు కానరాదు

పై పరిశీలనమునుబట్టి భారతకథకు, వీరభద్రవిజయ కథకు పూర్తిగ భిన్నత్వము గోచరించుచున్నదని చెప్పవచ్చును.

## కుమారసంభవము :-

ఉద్భటుని కుమార సంభవమాధారముగ నన్నెచోడుడు ఆంధ్రమున కుమారసంభవమును రచించెను. ఈ కావ్యమున ప్రథమ, ద్వితీయాశ్వాసము లలో దక్షాధ్వరధ్వంస వృత్తాంతము వివరింపబడినది. ఆ కథక్రింది విధముగ నున్నది.

శంకరుడు దక్షుని కుమార్తెయైన సతీదేవినిచేపట్టి సద్యోగర్భమున గజా ననుని పుత్రునిగబొందెను పుత్రోత్సవమును జరిపి గజాననునికి యువరాజు పట్టముగట్టి వారు సుఖముగనుండిరి.

ఒకసారి దక్షుడు కుమార్తెలందరు యిండ్లను సందర్శించుచు మహేశునింటికేతెంచెను. అహంకరించియున్న దక్షునిచూచి విరూపాక్షుడు మిన్నకుండెను. మహేశుడు ఎదురేగి తనను గౌరవించలేదని దక్షుడు అలిగి, శివునకు ప్రత్యపకారము చేయనెంచి శివరహితమైన యాగమును తలపెట్టెను బ్రహ్మాది దేవతలందరును తమ తమ భార్యలతో యాగమునకు వచ్చిరి. ముందుగనే తనవైభవము నెరింగించుటకు దక్షుడు కొంతమంది యువతులను కైలాసమునకు బంపెను. వారు దక్షుని ప్రభావమును, యాగమును గూర్చిచెప్పి సతీదేవిని తోడ్కొని యాగశాలకు వచ్చిరి అచ్చటి వారందరిని చూచి సతీదేవి, "నా నాథునేలయాగమునకాహ్వానింపలేదు" అని దక్షునడిగెను. అప్పుడు దక్షుడు శివుని క్రిందుపరచి సతీదేవిని తూలనాడెను ఆమె కోపించినది. యోగాగ్నిలోదేహత్యాగ మొనరించుకొనినది

దాక్షాయణీ దేహత్యాగము నారదుని వలన విని రుద్రుడు ప్రళయతాండవమొనరించుచు భీకరరూపమును దాల్చెను. ఇదిచూచి గణాధినాథులుద్రేకులైరి. "ఇప్పుడే సృష్టి సంహారము గావించి దక్షునిబట్టిదెచ్చెద"మని పంతములు పలికిరి అంత గణాధీశ్వరుడైన వినాయకుడు వారల వారించి తండ్రిని సమీపించి, "నన్నుబంపుడు దక్షుని బట్టిదెచ్చెద"ననెను. పరమేశ్వరుడందుల కనుజ్ఞనిచ్చెను. ఆక్షణమే గజాననుడు సమస్త ప్రమథగణములతో యాగశాలకరిగి, అందున్న వారలబట హింసించెను. దక్షాధ్వరమును నాశమొందించెను. పారిపోవు దక్షుని నిందించి బంధించెను. విజయలక్ష్మితో గజాననుడు బంధీకృతుడైన దక్షుని శివునికడకు తెచ్చెను. దక్షునిభార్య శివుని పురుషభిక్ష వేడినది. బ్రహ్మాదులు శరణుజొచ్చిరి. శివుడు ప్రసన్నుడయ్యెను. "బ్రాహ్మణోనహంతవ్య" అను వేద వాక్యమును బ్రహ్మవినిపింపగ శివుడు దక్షుని బంధముల నూడ్చుటకంగీకరించెను. దక్షుడు రుద్రుని పాదములతాకి సచేతనుడాయెను దక్షుడు శంకరుని స్తుతించెను.

పిదప, దేహత్యాగమొనరించిన సతీదేవి మేనాహిమవంతులకు పార్వతిగ జన్మించుట, పార్వతీపరమేశ్వరుల వివాహము, మొదలగు కథగలదు.

పై కథను పరిశీలించగ, యాగ విషయమును దక్షుడే సతీశంకరులకు యువతులవలన తెలియజేసెనని తెలియుచున్నది వీరభద్రుని ప్రసక్తియిందు

లేదు. గజాననుడు దాక్షాయణికి సద్యోగర్భమున జన్మించినబిడ్డ. దక్షుని యాగమును గజాననుడు ధ్వంసము గావించి, దక్షుని బంధించి తెచ్చినట్లు యిందు వర్ణితము. ఇందు "బ్రహ్మణోనహంతవ్యః" అను వేద వచనమునను సరించి దక్షుని సంహారము జరుగలేదు.

పోతన వీరభద్ర విజయమునకు, కుమారసంభవ మందలి దక్షాధ్వర వృత్తాంతమునకు చాల బేదము కన్పించుచున్నది.

"కుమారసంభవకథలో దక్షయాగమును గజాననుడు ధ్వంసముచేయు నపుడు వీరభద్రుడున్నాడని వేంకటరావు గారు వ్రాసినది పొరపాటు" అని వేద ము వారు తెల్పిరి. ప్రమధులతో గజాననుడు దండెత్తిపోయినపుడు, "పుష్పదంత భృంగిరిటి ఘంటాకర్ణమహాకర్ణ విభోగ వీరశంకర వీరభద్ర రుద్రగణాధినాథులు" ఉండినట్లు (కుమారసంభవము - ఆ 2 - 53 వచ) చెప్పబడియున్నది. వీరిలో నున్న వీరభద్రుడు, వీరభద్రవిజయములోనున్న వీరభద్రుడు ఒక్కటి యగునా? అను విషయము ఆలోచనీయము. వేంకటరావుగారి మాటలలోని వీరభద్రుడు ప్రమథులలోని వీరభద్రుడు కావచ్చును.

## శివతత్త్వసారము :-

ఆంధ్రదేశమున శైవ సంప్రదాయములను. శైవతత్త్వమును ప్రబలముగ ప్రతిపాదించి ప్రచారమొనర్చిన వారిలో మల్లిఖార్జున పండితారాధ్యుడు. సుప్రసిద్ధుడు వీరశైవభక్తి ప్రతిపాదకమైన కావ్యమిది. ఇందు దక్షయాగ కథ ప్రత్యేకముగ చెప్పబడకున్నను దక్షయాగ సందర్భమున వీరభద్రుడు వీరావేశముతో విజృంభించి దివిజగణమును హింసించిన విధము చెప్పబడియున్నది.

మారారిద్రోహునింటికి పేరంటమునకు వచ్చిన భారతీదేవి ముక్కును, అగ్నిదేవుని పత్ని స్వాహాదేవిముక్కును, ఎడమ చనుమొనను వీరభద్రుడు మహా రౌద్రమున త్రుంచివైచెను. చంద్రుని పాదాంగుష్ఠమున నేల ప్రామెను. దక్షు శిరమును, యజ్ఞపురుషుని శిరమును ఖండించెను. అగ్నినాలుకలను తరిగెను.

దేవగణముల దేహములను కోసివైచెను. విష్ణుశిరముసు(దుంచి ఆహవనీయాగ్ని బడవైచి సటుల శివతత్త్వసారమున పండితుడు వర్ణించియున్నాడు (శివతత్త్వ సారము - పండితుడు - 309 నుండి 319 పద్యములగల కథ).

పోతన వీరభద్రవిజయమున, వీరభద్రుని విజృంభణమును, అతడు దేవతలను హింసించిన విధమును పండితుని పద్యముల భావములనే యథాతథ ముగ గ్రహించియున్నాడని చెప్పవచ్చును. వీరభద్రవిజయము, చతుర్థాశ్వాస మున, భారతి, స్వాహాదేవులను, చంద్రుడు, అగ్నిదేవుడు మొదలగు వారలను వీరుడు హింసించిన విధము వర్ణింపబడినది, (వీరభద్రవిజయము - 4 ఆ – 119, 120, 124, 113 పద్యములు) ఈ పద్యము లన్నింటికి పండితుని పద్యములే మూలమన వచ్చును. ఉదాహరణములకు క్రింది పద్యములను గమనింప వచ్చును.

కం॥ మారారిద్రోహునింటికి (i)
బేరంటము తనుచుఁబెలుచను గోసెన్
వైరము నదితి ముక్కును
భారతినాసికయు వీరభద్రుడు రుద్రా" (శివతత్త్వసారము - 309 ప).

కం॥ హరుడఖిల గురుండనియు
ర్వర(మోయగ నిచ్చటికేల వచ్చితిచెపుమా
వరదయనుచుఁ దుదిగోరున
సరసాకృతి వాణిముక్కుసయ్యనఁజిదిమెన్" (వీరభద్రవిజ॥ ఆ 4-118)

ఇటులనే యితర పద్యములకును సాదృశ్యమున్నది.

**కాశీఖండము :-**

ఆంధ్రసాహితీ ప్రపంచమున పుంభావ సరస్వతియై, కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ మహాకవిచే రచింపబడిన మహత్తర కావ్యము కాశీఖం డము. ఈకావ్యమున ఏడవ ఆశ్వాసమున కాశీఖండమునగల "దక్షేశ్వరలింగ

ప్రాదుర్భావము" ను కూర్చి వివరించుచు శ్రీనాథుడు దక్షాధ్వరధ్వంస వృత్తాంత మును వర్ణించియున్నాడు. ఆ కథావిధానము క్రింది విధముగ పరిశీలింపబడినది.

ఒకప్పుడు మహేశుడు బ్రహ్మాదిదేవతలతో కొంతతడవు కొలువుండి అనంతరమెల్లరను వీడుకొల్పెను. కాని మామయైన దక్షప్రజాపతిని పనుపమర చెను. అంత దక్షుడు ఖిన్నుడై నిజవాసమున కరుదెంచి వ్యథచెందెను. శివుని నిందించెను. మరియు ప్రతీకారముగ శివరహితమైన యాగమును ఆరంభించెను. యాగమునకు బ్రహ్మాది సకల నిర్జరగణము విచ్చేసెను. పుణ్యవంతుడైన దధీచి శివుడు లేకుండుటను చూచి దక్షుని మందలించెను. శివమహిమం దెలియజేసెను. అందులకు దక్షుడు కోపించి, "ఈ యవనీసురుని వెడలద్రోయుడు" అని మత్స రముతోడ పల్కెను. దధీచి తానే యాగశాలను వీడిపోయెను. దూర్వాసాది మహర్షులును దధీచిని అనుసరించిరి.

నారదుని వలన తండ్రిచేయు యాగమును గూర్చి సతీదేవి వినినది. తండ్రికి బుద్ధిచెప్ప వలయునని యెంచి ఆమె యాగమునకు బయలుదేరినది. తండ్రిచేత తిరస్కృతయై దేహత్యాగ మొనరించినది. పారిషదుల వలన భవునికి సతీదేవి దేహత్యాగము తెలిసినది. శివుడు కోపించి భృకుటి ముడిచెను. అప్పు డాయన ఫాలమునుండి తేజము జనించి, అందుండి మహాప్రళయ భయంక రుడైన వీరభద్రుడుద్భవించెను. భవుని ఆనతిమేరకు దక్షయాగశాలపై భద్రుడు దండెత్తిపోయెను. దేవతలను మూడుచెఱువుల నీళ్లు త్రాగించెను. దక్షునిశిర మును ఖండించెను. విజయలక్ష్మితో తిరిగివచ్చెను. బ్రహ్మాదుల ప్రార్థనలకు శివుడు ప్రసన్నుడై వారల మన్నించెను. దక్షుని మేకతలతో శివుడు పునర్జీవి తునిగజేసెను. దక్షుడు కాశీకాక్షేత్రమున తపమాచరించెను. అచ్చట తనపేర ప్రతిష్ఠించిన లింగమే దక్షేశ్వరలింగము.

పై కథను పరిశీలించగ, పోతన వీరభద్రవిజయకథ చాలవరకు కాశీ ఖండ కథను పోలియున్నదని తెలియుచున్నది. దధీచి దక్షుని మందలించిన దగ్గరనుండి దక్షుడు పునర్జీవితుడగు వరకును గల వీరభద్ర విజయ కథ కాశీ

ఖండమార్గములోనే సాగినది. కాశీఖండమున మహేశఫాల ప్రదేశ తేజోసము ద్భవుడు వీరభద్రుడు. వీరభద్రవిజయమున మహేశుహుంకారమున వీరభద్రుని ఆవిర్భావము జరిగినది. ఏమైనను ఈశ్వరుక్రోధము వలననే వీరభద్రుని పుట్టుక జరిగినదనే విషయము మాత్రము వాస్తవము. కాశీఖండమున, కథా సంవిధానము కొరకు పోతన దక్షునిచే రెండుయాగములు చేయించెను. వీరభద్రుడు దక్షుని యాగ శాలలో దేవతలను బాధించిన తీరు శ్రీనాథుడెట్లు వర్ణించెనో పోతనయు అట్లే వర్ణించెను. కాశీఖండ మందలికథను చాలవరకు అనుకరించెనని చెప్పవచ్చును

## ఆంధ్రమహా భాగవతము :-

సంస్కృతభాషలో కృష్ణద్వైపాయన మహర్షి రచించిన మహా భాగవత పురాణమును ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున బమ్మెర పోతన తెనిగించెను. ఈ భాగవతమున చతుర్థ స్కంధమున దక్షక్రతుధ్వంసమును వర్ణించుటగలదు. బాల్యకృతియైన వీరభద్రవిజయము నందలి కథకును భాగవత దక్షాధ్వర ధ్వంస కథకును చాల వ్యత్యాసము గోచరించుచున్నది. వేరు వేరు మాతృకలనాధార ముగ పోతన వ్రాసినందు వలన ఈ భేదము కన్పించుచున్నదన వచ్చును. భాగ వతము నందలి దక్షక్రతుధ్వంస కథ క్రింది విధముగనున్నది.

ఒకపుడు తనను శివుడు తగువిధమున గౌరవించలేదని మామయయిన దక్షప్రజాపతి కోపించి, "మఖములహవిర్భాగమును దేవతలంగూడి పొందకుండు గాక" అని శివుని శపించెను. ఇందులకు నందీశ్వరుడు దక్షునిపై కోపించి "అచిరకాలములో నీవు మేషముఖుండవగుదు" వని తిరిగి శపించెను. అంతియ గాక దక్షుననుసరించియున్న ద్విజులను గూడ నందీశ్వరుడు శపించెను. అందు లకు నందీశ్వరుడును వారి వలన శాపమును పొందెను.

అనంతరము దక్షుడు శివరహిత యాగము నారంభించుట, బ్రహ్మాదులు విచ్చేయుట, పిలువకున్నను దాక్షాయణీ దక్షయాగమునకు వచ్చుట, దక్షునిచే తిరస్కృతయగుట, దేహత్యాగమొనరించుట, జరిగెను. భృగుడు ఋభునామక దేవతలను సృజించి యాగశాలపై విజృంభించిన రుద్రపార్శ్వాదులను పరాజితు

లను గావించెను. ఇంతలో నారదుని వలన సతీదేవి దేహత్యాగమును వినిరుద్రుడాగ్రహించెను. జటను పెరికి నేలపైకొట్టగ, అందుండి సింహబలుడైన వీరభద్రుడుదయించెను. వీరుడు ప్రమథగణములతో దక్షుని యాగశాలపై దండెత్తిపోయి, యాగమును నాశమొందించి, దివిజగణమును హింసించి, దక్షుని శిరమును ఖండించి దక్షిణాగ్నిలో వ్రేల్చెను. విజయముతో వీరుడు కైలాసమునకు మరలివచ్చెను. బ్రహ్మాదుల ప్రార్థనలతో శివుడు ప్రసన్నుడై, వారిననుగ్రహించి మేకతలతో దక్షుని బ్రతికించెను. దక్షుడు మహేశుని శరణు వేడుకొనెను. తెలివొంది దక్షుడు పుత్రికా వియోగమునకు పరితపించెను. శివాజ్ఞతో అతడు తిరిగి యాగమును పరిసమాప్తి గావించెను.

పై కథను పరిశీలించగ, దక్షసందెకేశ్వర భృగ్వాదుల శాపముల వరకునున్న యితివృత్తము పూర్తిగ వీరభద్రవిజయమునకు భిన్నముగ నున్నది. కొంత వరకుసునిది శివపురాణకథను పోలియున్నది. సతీదేహత్యాగమునుండి యున్న కథ మాత్రము వీరభద్రవిజయకథను కొంతవరకు పోలియున్నది. వీరభద్రుడు యజ్ఞవాటికలో దేవతలను బాధించిన తీరును వీరభద్ర విజయము ననుసరించి భాగవతమున చెప్పినట్లుతోచును వీరభద్రవిజయమున రుద్రహుంకారము నుండి వీరభద్రుడు జన్మించినట్లు చెప్పబడగ, భాగవతమున రుద్రుని జటనేలపై కొట్టుటవలన వీరభద్రుడు జన్మించినట్లు భిన్నముగ చెప్పబడి యున్నది. భాగవతమున దక్షుడొనరించిన యాగము ఒక్కటియే వీరభద్ర విజయమున కాననగు భద్రకాళీప్రసక్తి భాగవతమునలేదు. భాగవతమున దక్షుడు యాగమును పరిసమాప్తినొందించుట విశేషము. ఇట్లు ఒకేకవి ఒకేకథను వేర్వేరు గ్రంథములలో చెప్పినను, వాని మాతృకలు భిన్నములగుటచేతను, భిన్నత్వము చోటుచేసికొనినదని చెప్పవచ్చును.

పై విధముగ దక్షయాగకథను విభిన్నకాలములలో విభిన్నకవులు విభిన్న మాతృకలననుసరించి, మార్పులను, చేర్పులను, కూర్పులను గావించి వర్ణించి యున్నారు.

వాయుపురాణానుసారముగ వ్రాయబడిన పోతన వీరభద్ర విజయము

నందలికథ తదితర కథలకన్న పరిపూర్ణమైనదని చెప్పవచ్చును. స్పష్టమైన రీతిలో ఇది విపులముగ సాగినకథయని చెప్పవచ్చును. దక్షునిచేత రెండు యాగములు చేయించిన ఘనత కూడ పోతనదే ననవచ్చును. కాని యాగములు రెండును పరిసమాప్తములు కానివిగనే చెప్పబడెను. తొలియాగమున సతీదేవి దేహత్యాగమును, దక్షునకు శాపమిచ్చుటను వర్ణించి, మలియాగమున దక్షశిక్షణమును వివరించుట చక్కని కథా సంవిధానమునకు నిదర్శనము. ఇందు వలన రెండు యాగముల మధ్యలో పార్వతీ పరమేశ్వరుల వివాహ వర్ణన వైభవముగ వర్ణించు అవకాశము పోతనకు కలిగెను. కాశీఖండ, కుమార సంభవములను, ఇతివృత్తము నందును, కథాకథనము నందును పోతన కొంతవరకు అనుసరించెనని చెప్పవచ్చును. శివతత్త్వ సారమునందలి పద్యభావములను కొన్నింటిని యథాతథముగ అనుసరించెననియు చెప్పవచ్చును. మొత్తము మీద వీరభద్ర విజయము బిగి, జిగిగల కావ్యము అని, ఔచితీ శోభితము అని చెప్పవచ్చును.

పోతనకు పూర్వమందు గల కావ్యములలోనే గాక జానపద వాఙ్మయమునందును, అనుశ్రుత గాథలందును వీరభద్రుని కథ మనకు గోచరమగుచున్నది. దానిని క్రింవిధముగ వివరించుటగలదు.

## జానపదవాఙ్మయము - వీరభద్రునికథ :-

జానపదగేయ వాఙ్మయమునందు "దక్షయజ్ఞము" అను పేర కొన్ని గేయములు కనవచ్చుచున్నవి. శైవమత సంబంధమైన కథగ గూడ ప్రసిద్ధమై యున్నది. ఇందలి కథా విధానమిట్లు గలదు.

దక్షుడు యాగముసేయ సమకట్టి తొలుత సతీమహేశులను ఆహ్వానింప కైలాసమునకు వచ్చెను. అపుడు శివుడు తపోనిష్ఠలో లగ్నమై యుండెను. కనుక చెంతకు వచ్చి నమస్కరించిన మామకు ప్రతినమస్కారము చేయలేదు. మాటాడనులేదు. అందులకు దక్షుడు కోపించెను కుమార్తె సతీదేవిని సమీపించి శివుని దూషించెను ఆమెను తూలనాడి నిజమందిరమునకు వెడలిపోయెను.

సతీశ్వరుల వలన తనకు జరిగిన పరాభవమును దక్షుడు భార్యకు చెప్పెను. దక్షసతియును కుమార్తె పై అలిగి కొంత దుఃఖించెను. సతీదేవిపై మమతాను రాగములు వీడుమని దక్షుడు భార్యకు చెప్పెను. శివరహితమైన యాగము నారంభించెను. దేవగణము దక్షయాగమునకు తరలివచ్చుటను గని, సతీదేవి భర్తవలదనినను వినక, భర్తను బ్రతిమాలాడి యాగమునకు వచ్చెను. అపుడు దక్షుడు,

"అక్షంతలు గంధాన అర్చించి పిలిచితిన?

శోభనానికి మీకు సొంపు బుట్టాదనీ........" అని నిందించి, శివదూషణ గావించి సతీదేవిని తిరస్కరించెను. అపుడు సతీదేవి,

"దుష్ట దక్షుని పుత్రికనగుకంటె

అడవిలో మ్రానునయి యుండుటేమేలు

దక్షపుత్త్రిననే లోకనిందయు" బాపుకొందునని భావించి,

"భస్మంబు చేయుమని పావకుని ప్రార్థించి" యోగాగ్నిలో దేహత్యాగ మొనరించినది. నందీశ్వరుని వలన ఈ వృత్తాంతము శివునకు తెలిసినది. ప్రళయ మూర్తియై రుద్రుడు,

"శీఘ్రాన లలాటముపై చెమటలూదీసి

శీఘ్రాన చట్రాతిపై చినుకూలెచల్లె" అంత వీరభద్రుడు అతి గర్వ సముద్రుడు అవిర్భవించెను. వీరభద్రుడు ప్రమథుల తోడపోయి దక్షాధ్వరధ్వంసము గావించి దక్షుని సంహరించెను. బ్రహ్మాదిదేవతల ప్రార్థనపై మహేశుడు గొఱ్ఱె తలతో దక్షుని పునర్జీవితుని గావించెను. యజ్ఞమును నెరవేర్చెను.

దేహత్యాగానంతరము సతీదేవి మేనాహిమవంతులకు పార్వతిగ జన్మించెను. శివభక్తితోడ పెరిగి పెద్దదియై ఘోరతపమాచరించి సర్వేశ్వరుని భర్తగ పొందుటతో ఈ కథ సమాప్తమగును. (తెలుగు జానపదగేయ సాహిత్యము-300 311 పుటలు).

ఈకథ చాల వరకు వీరభద్రవిజయము కథతో పోలియున్నది. వీరభద్రవిజయమున "శంభుకొల్వుచేరుడ" ఫలశ్రుతిగ చెప్పబడగ, "ఇష్ట సంపదలిచ్చు ఈశ్వరులాదేవి కైలాసంబిచ్చునూ" అని ఈ జానపదగేయ మందు చెప్పబడియున్నది. "ఈ పాటను రచించిన కవి యెవరో తెలియదు, దీనిని 1905వ సంవత్సరములో కాకినాడ వాసులు శ్రీ మంగు రంగనాథరావుగారు ముద్రించిరి........ రాయలసీమ మాండలికములుండుటచే కవి యక్కడివాడై (రాయలసీమవాడై) యుండుననుకొందు"నని ఆచార్య బి. రామరాజుగారు పేర్కొనిరి. (తెలుగు జానపదగేయ సాహిత్యము – పుట 311)

**అనుశ్రుతగాథలు :-**

తెలుగునాట అనుశ్రుతముగ వినవచ్చు దక్షక్రతు ధ్వంసమను కథయును వీరభద్రవిజయము నందలి కథనే పోలియున్నది. ఈ అనుశ్రుతకథలో దక్షుడు ఒక్క యాగమును మాత్రమే చేసినటుల చెప్పబడియున్నది. జానపదులలో వినిపించు ఈకథలలో రుద్రుని జడదెబ్బనుండి వీరభద్రుడు ద్భవించినటుల గలదు.

పై విధముగ తెలుగు సాహిత్యములో పోతనకు పూర్వ మందుగల వీరభద్రుని కథలుగల రచనలను పరిశీలించుటమైనది. కావ్యము లందలి కథలనే గాక, జానపదగేయములందలి వీరభద్రుని కథను, అనుశ్రుతగాథలను గూర్చి చర్చించుటమైనది.

వీరభద్ర విజయము నందలి ఇతివృత్తమును, మూలమును, పోతన గావించిన మార్పులు, చేర్పులు, పోతనకు పూర్వ మందుగల వీరభద్రుని కథలను ఈప్రకరణమున వివరించుట జరిగెను.

# ప్రకరణము - 4

## వీరభద్రవిజయము - కవితారీతులు

1. అవతారిక
2. ఛందస్సు
3. రసరామణీయకత
4. పాత్రపోషణము
5. వర్ణనలు
6. అలంకారములు
7. భావనాపటిమ
8. ధ్వన్యనుకరణ పదప్రయోగము
9. వ్యంగ్యరచనము
10. ఆత్మీయత
11. ఔచిత్యా నౌచిత్యములు
12. సామెతలు – జాతీయములు

# వీరభద్రవిజయము - కవితారీతులు

శ్రీపరమేశ్వర కరుణావిశేష ప్రవర్ధమాన కవితామహత్త్వ సంపన్నుం డును, నవనవోన్మేష ప్రజ్ఞావిలసితుండును, సహజపాండిత్య సముదీర్ణుండును, సులలిత కావ్యనిర్మాణ దక్షుండును, విశిష్టపురాణ కథాకథన కుశలుండును, సుకవి సంపూజ్యుండును నయిన పోతనార్యుని కవితోద్యానవనమున వినూత్నపరి మళముతోడ వికసించిన తొలి కావ్యకుసుమము వీరభద్రవిజయము. ఇది సం పూర్ణకావ్యలక్షణ సమంచితమైనది. భవిష్యత్ప్రబంధ ప్రక్రియా లక్షణములను గూడ పోతన యీకృతియందు పొందు పరచినాడు. అట్టి వీరభద్ర విజయము నందలి కవితారీతులను ఈప్రకరణమున పరిశీలించుట మైనది.

వీరభద్రవిజయము నందలి కవితారీతులను, 1. అవతారిక, 2. ఛంద స్సు, 3. రసరామణీయకత, 4. పాత్రపోషణము, 5. వర్ణనలు, 6. అలంకారములు 7. భావనాపటిమ, 8. ధ్వన్యనుకరణ పదప్రయోగము, 9. వ్యంగ్యరచనము, 10. ఆత్మీయత, 11. ఔచిత్యానౌచిత్యములు, 12. సామెతలు, జాతీయములు అను అంశములుగ విభజించి పరిశీలింప వచ్చును.

## 1. అవతారిక :-

"అవతారయతీతి అవతారికా" అనగ కథను దింపుచున్నది. కనుక అవతారిక అని పేర్కొనబడినది. కథలోనికి దిగుటకు పూర్వము చేయబడిన స్తుతి పూర్వకమగు పద్యరచన అవతారిక" (తెలుగు కావ్యావతారికలు - పుట 1) అని డా॥జి. నాగయ్యగారనిరి. ఈ అవతారికను "పీఠిక" అను పేర కూడ కావ్యము లందు కూర్పబడియున్నది. కవి జీవితములు, కవితారీతులు, రాజులు, పరి పాలనము మొదలగు ఎన్నియో విషయములు ఈ అవతారికల వలన వ్యక్తమగు చున్నవి. "ఆంధ్రసాహిత్యతత్త్వమును, సంప్రదాయమును, చరిత్రను తెలిసి కొనుటకునివి ఉపయోగ పడుచున్నవి (తాళ్ళపాకచిన్నన్నకృతులు - సవిమర్శక పరిశీలనము - పుట 120)" అని డా॥ సి. రమణయ్యగారు తెల్పిరి.

వీరభద్రవిజయము సంధలి అవతారికా లక్షణములను క్రింది విధముగ పరిశీలించుటమైనది.

## శ్రీకారము :-

కృతిఆరంభమున ఆద్యక్షరము, ఆదిమగణము మంగళ దాయకముగ ప్రయోగింపవలెనని ప్రాచీన ఆంధ్రలాక్షణికులు తెల్పిరి. శ్రీకార ప్రయోగము శుభదాయకమని విశ్వసించిరి. కావ్యాదిని శ్రీకారముతో నిలిపిన సకల దోషములు తొలగి శ్రేయస్కరమగునని అప్పకవి శ్రీకారప్రభావమును తెల్పెను.

"తే॥ వేదములకెల్ల నోంకారమాదియైన
కరణి కృతులకు నెల్ల శ్రీకారమాది
గాన కవివరులెల్లరు దాని దక్క
నితరవర్ణంబు లిడరు సంస్కృతులమొదల" (అప్ప. కవీ – 2-354).

పోతన వీరభద్రవిజయమున "శ్రీలలితంపుబూతియును. ... .. ప్రసన్నుడయ్యెడున్" అని శ్రీకారప్రయోగము కావించెను. గణములలో మ, భ, స, త గణములు శుభకరములని చెప్పియుండుటచేత, పోతనఆదిమగణము "భగణము" ను ప్రయోగించెను. "భ" అనగ శివుడను అర్థమును గలదు. కనుక శ్రీకార విషయమున పోతన అవతారికాలక్షణమును పాటించెనని విదితము.

## దేవతాస్తుతి :-

పోతన వీరభద్రవిజయమున మొదటి పద్యమున పరమేశ్వరుని స్తుతించెను. పరమేశ్వరధ్యానమే "నిఖిల దేవతా ప్రార్థనమని" పోతన పేర్కొనెను పిదప ఇష్టదైవతములైన వీరభద్రేశ్వరుని, విఘ్నేశ్వరుని, పద్మపాణియైన వాణిని స్తుతించెను. ఇందును పోతన అవతారికాలక్షణమును పాటించెను.

## గురుప్రశంస :-

వీరభద్రవిజయ కావ్యరచనకు వెన్నుగట్టి తన్ను ప్రోత్సహించిన ఇవటూరి సోమగురుని పోతన,

"పరమ భద్రాసన ప్రముఖమార్గంబుల యోగీంద్రులిత డాదియోగియనగ, వీరవ్రతంబున వీరమాహేశులు వీరమాహేశ్వర విభుడనంగ .......సోమనాథ సముడు సోమగురుడు" (1-15) అని ప్రస్తుతించెను.

## పితృప్రశంస :-

పోతన తన తల్లిదండ్రులను భక్తితో కీర్తించియున్నాడు.

"భూసురవంద్యునిన్ సుగుణభూషణు నాశ్రిత కల్పవృక్షమున్
దాసజనప్రసన్ను శివతత్త్వమనోరథ కౌతుకోన్నతున్
కేసనమంత్రి . . ...... " అని తనతండ్రి కేసనను పోతన ప్రశంసించెను. తనతల్లి లక్ష్మి (లక్కసాని) ని గౌరీదేవితోను, లక్ష్మీదేవితోను, భారతీదేవితోను పోల్చి శ్లాఘించెను.

## సుకవిస్తుతి :-

పోతన వీరభద్రవిజయమున, వాల్మీకి, వ్యాసుడు, బాణుడు, కాళిదాసు నన్నయ్య, తిక్కన, రంగనాథుడు, వేములవాడ భీమకవి మొదలగు తెలుగు కవులను స్తుతించి యున్నాడు.

## కావ్యోత్పత్తిప్రశంస :-

కావ్యోత్పత్తిక్రమమును, కావ్యరచనోద్దేశ్యాదులను గూడ కవులు ప్రధానముగ అవతారికలో చెప్పియుండిరి. పోతన వీరభద్రవిజయ కావ్యోత్పత్తిని అవతారికయందు వివరించియున్నాడు. "ఏకథనుచెప్పి ఈశునాదిదేవునిగ ఎఱుగవచ్చు" నని పోతన ఊహించుచున్న తరుణమున సోమగురుడు, "వీరభద్ర విజయమెల్ల వినఁగడు వేడ్కయయ్యెనది తెలుంగు నరచియింపు మభిమతముగ" అని చెప్పి, మరల

"పిన్నవాడననియుఁ బెక్కు సంస్కృతులను
విననివాడననియు వెఱపుమాను
మత్ప్రసాద దివ్యమహిమచే నెంత్తైన
కవితజెప్పలావుగలదు నీకు" (1-21)

"అదియునుంగాక నీకు వీరభద్రేశ్వరు ప్రసాదంబు గలదు
కావున వాయుపురాణ సారంబగు నీకథావృత్తాంతంబంతయుఁ
దెలుంగున రచియింపు" (1-22) మని ధైర్యము చెప్పి అనతిచ్చి నట్లు చెప్పబడినది.

## కృతికర్తృవంశవర్ణన :-

"కవివంశాభివర్ణనము" అనుపేర పోతన వీరభద్రవిజయమున 23 వ పద్యము నుండి 40 వ పద్యము వరకు తనవంశవర్ణన గావించియున్నాడు. ఈ వివరములు "పోతన వంశము" అను ఉపప్రకరణమున విపులముగ పేర్కొనుట జరిగినది.

## షష్ఠ్యంతములు :-

షష్ఠ్యంత సంప్రదాయము సంస్కృతమున లేదు. ప్రాకృత, కన్నడ, తమిళములందు కానరాదు. కావ్యకథారంభమునకు ఉపక్రమించుటకు ముందు షష్ఠ్యంతము లుండుట తెలుగు కావ్యములకున్న ఒక ప్రత్యేక విశిష్టత. షష్ఠీవిభక్త్యంతములుగావున వీనికి షష్ఠ్యంతములని పేరు. షష్ఠ్యంతములనగ కృతిపతిని లేక కృతిప్రేరేపకుని గూర్చి షష్ఠీవిభక్త్యంతములుగ పద్యములను రచించుట కృతిపతిని సంబోధించుచు స్తోత్రనామావళీ పఠనమువలె చేయబడిన పద్యములరచన షష్ఠ్యంతములని కొందరందురు షష్ఠ్యంతరచన చేసిన మొట్టమొదటి తెలుగుకవి నన్నెచోడుడు.

పోతన వీరభద్రవిజయమున, పరమేశ్వరునిపేర షష్ఠ్యంత పద్యములను చెప్పియున్నాడు.

క॥ కరుణాంచిత గుణమణికిని
సురుచిర బాలేందు బింబచూడామణికిన్
వరదైవ శిఖామణికిని
జిరతర ధీమణికి భక్తచిన్తామణికిన్" (42 ప)

క॥ "హాలాహల భక్షునకును
శైలాదిప్రముఖ దేవజనరక్షునకున్
ఫాలానల చక్షునకున్
శ్రీలలిత విచక్షణకును జితదక్షునకున్'' (43 ప)

క॥ "ముకుళితకర సురపతికిని
సకల బ్రహ్మాండ భాండచయ మాయానా
టక తంత్ర సూత్రధారికిఁ
బ్రకటితవిస్ఫారమతికిఁ బార్వతిపతికిన్'' (44 ప)

## కథాసూత్రప్రశంస :-

తెలుగు కావ్యావతారికలయందు షష్ఠ్యంతముల తరువాత కథావతారిక ఒక వచనములోగాని, పద్యములోగాని ఉండుట సంప్రదాయము. ఈ సంప్రదాయమును పోతన పోషించియున్నాడు. వీరభద్రవిజయమున, "మత్సమర్పితంబగు వితత విస్ఫురిత వీరభద్రవిజయాంచిత కథా ప్రసంగ ప్రారంభంబెట్టిదనిన" అని కథను ప్రారంబించెను

## అవతారికను ఉత్తమపురుషలో చెప్పుట :-

సోమగురుని అనతిని, వీరభద్రవిజయమును రచించినటుల పోతన స్వయముగ చెప్పుకొని యున్నాడు "మద్గురుని మధురవాక్యంబులకు సత్యంతానురాగ సంతుష్టుండనై తదీయానుమతంబున మదీయ వంశావళి వర్ణనంబొనరించెద''నని వంశవర్ణనగావించి, 'తపనుజుండనై పరగి జనకశిక్షిత విహితాక్షరాభ్యాసుండనై వీరభద్రప్రసాదలబ్ధ కవితాతిశయంబున" అని వీరభద్రవిజయమును రచించినటుల చెప్పుకొని యున్నాడు.

## ఆశ్వాసవిభాగము :-

తెలుగు కావ్యములందు ఆశ్వాసవిభాగము సామాన్యముగ కనిపించుచున్నది. ''కథాంశానాంవ్యవచ్ఛేద ఆశ్వాస ఇతి కథ్యతే'' అని ఆర్యోక్తి కథాంశ

ముల యొక్క విభాగము ఆశ్వాసము. ఈ ఆశ్వాస విభాగము ప్రాకృతభాషా సాహిత్య సంప్రాదాయము ననుసరించి తెలుగులోనికి వచ్చినదని చెప్పుదురు. పోతన వీరభద్రవిజయమును కథా సంవిధానము ననుసరించి నాలుగు ఆశ్వాస ములుగ విభజించి రచించి యున్నాడు.

## ఫలశ్రుతి :-

తెలుగు కావ్యములందు గ్రంథాంతమున ఫలశ్రుతిని కొందరు కవులు చెప్పిరి. గ్రంథమును వ్రాసినను, చదివినను, వినినను, సంగ్రహించినను చిరతరాయువులు, సకల సుఖములు కల్గునని, పరమేశ్వరుడు వారికి యీప్సి తార్థము లీడేర్చునని కవి పాఠకుల నుద్దేశించి ప్రబోధించుట ఈ ఫలశ్రుతిలోని ప్రధానాంశము. ఈ ఫలశ్రుతిని గ్రంథాంతమున చెప్పుట వలన ఆగ్రంథ మాహా త్మ్యమును పాఠకుల చిత్తమునకు సన్నిహితము చేయుటయే పరమప్రయోజన ముగ కవులు భావించి యుందురు.

పోతన వీరభద్ర విజయమున ఫలశ్రుతినిచెప్పి కావ్యలక్షణము ననుస రించి యున్నాడని తెలియుచున్నది.

"శ్రీరమ్యమైన యీకథ
వారక వినువారు చదువువారును లిఖిత
ప్రారంభులైనవారును
వారు గదా శంభుకొల్చువారు సమీరా" (4-225)

"క॥ పంచానన చరితము ని
శ్చంచల భక్తిమెయి. విన్నఁజదివినఁజాలున్
కించి న్మాత్రంబైనను
పంచమహా పాతకములు పాయు మహాత్మా" (4-227).

మ॥ "ఇలయెందాక సురేంద్రపర్వత విభుండెందాక బృందారకా
వలియెందాక రవీందుమండలములున్ వారాసులెందాకని
చ్చలు నానందకరంబులై త్రిజగతిం సంధిల్లునందాకని
ర్మలమై యీకథసర్వలోకనుతమై మానిత్యమై యుండెడున్" (4-231)

పోతన "ఇరయెండాక........" అను పై పద్యమున ఆశీర్వాద పూర్వకముగ ఫల శ్రుతిని చెప్పియున్నాడు.

## ఆశ్వాసాంతగద్య :-

ఆశ్వాసాంత మందు కవిని గూర్చిన గద్యముండును. ఆశ్వాస పరి సమాప్తిని గద్యముతో చెప్పునాచారము తెలుగు కావ్యములందు కలదు. ఆశ్వా సాంత గద్యలందు కవినిగురించియు, అతని కావ్యమును గురించియు పెక్కు విషయములు తెలియుచున్నవి. కావ్యావతారికల వలెనే ఆశ్వాసాంత గద్యలు గూడ సాహిత్యచరిత్రకు చాల ముఖ్యమైనవి. ఆశ్వాసాంత గద్యలలో ఆ ఆశ్వా సములోని విషయసూచిక వివరింపబడి యుండును.

పోతన వీరభద్ర విజయమున నాల్గాశ్వాసాంతము లందు గద్యమును పొందుపరచి యున్నాడు. ఈ గద్యములందు కవిని గురించియే గాక, ఆయా ఆశ్వాసములలోని విషయసూచిక గూడ వివరింపబడి యున్నది.

"ఇది శ్రీమన్మహా మహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్య శ్రీపాద పద్మారాధక కేసనామాత్యపుత్ర పోతయనామధేయ ప్రణీతంబైన వీరభద్రవిజయం బను మహాపురాణ కథయందు .. .." అను వచనము అన్ని ఆశ్వాసములందలి కథావిషయము పిదప చెప్పబడి యున్నది.

పై విధముగ పోతన వీరభద్రవిజయము నందలి అవతారికా లక్షణము లను, కావ్యస్వరూపలక్షణములను పరిశీలించుట జరిగినది.

## ఛందస్సు :-

పాదాది నియమముగల పద్యముల లక్షణములను గూర్చి చెప్పునది ఛందస్సు. భావము లెంత ఉన్నతములో వానిని అందమైన తీరులో వ్యక్తము చేయు ఛందస్సుగూడ అంత ఉత్కృష్టమని చెప్పవచ్చును. వేద ప్రతిష్ఠకు

ప్రఖ్యాతికి సాధనము చందస్సు. చందోవేత్తకానివాడు కావ్యవేత్త కాజాలడని చందశ్శాస్త్రజ్ఞుల అభిప్రాయము. వేదమునకు వలెనే కావ్యమునకును ఛందము అంగమే. తెలుగు పద్యరచనాకృషి దాదాపు వేయి సంవత్సరముల నుండి జరుగుచున్నది. ప్రతిభాశాలురైన కవులు లెక్కకు మిక్కిలిగ పద్యకావ్యముల ను వ్రాసిరి. సందర్భశుద్ధిగ పద్యమునుగూర్చి, వైవిధ్యమును, వైచిత్రిని కన పరచుచు పద్యశిల్పమునకు కవులు వినూత్నశోభను సంతరించిరి. ఆకోవలోని వాడే బమ్మెర పోతన. వీరభద్రవిజయమున పోతన ప్రయోగించిన ఛందస్సును క్రింది విధముగ పరిశీలించుట మైనది.

వీరభద్రవిజయమున పోతన, దండకము, జాతులు, ఉపజాతులు, వృత్తములను ప్రయో ంచి యున్నాడు

**దండకము :-**

దెశికవితాశాఖకు చెందిన పలువిదములగు పదపద్య కవితా విభాగము లలో పద్యకవితా విభాగమునకు చెందినదే దండకము. దండకమునందు ప్రదా నముగ అంత్యలఘువగు తగణమునకే ప్రయోగమదికము తగణ సముచ్చయ మున సాగు ఈ దండకము గుర్వంతమై యుండును. "కృతినాదిన నహంబు లొండెందకారంబులొండెం బ్రకల్పించి యామీదనెల్లందకార ప్రధానంబు గుర్వం తమై క్రాల నిచ్చాను రూపావదింబేర్మి నిర్మింపగా" బడునని కావ్యాలంకార చూడామణి కారుడు (8 - పుట 112) వివరించెను.

పోతన వీరభద్రవిజయమున తకారదండకమునే ప్రయోగించెను. ఇది గుర్వంతమైయున్నది "శ్రీనీరరూపాశివద్రోహగండా ప్రచండప్రతాసాను పర్వాణ నమస్తే నమస్తే నమః" (4-180) అని పోతన దండకమును స్తుతిరూప కముగ వ్రాసియున్నాడు.

**జాతులు :-**

మత్రాగణనిబద్ధములైన పానిని జాతులనీయు," జాతులలో ప్రాసనియ

మము లేనివానిని ఉపజాతులనియు లాక్షణికులు వర్గీకరించి యున్నారు. జాతులలో, కందము, ఉత్సాహము, తరువోజ, అక్కరలు, ద్విపద మొదలగునవి గలవు.

పోతన వీరభద్రవిజయమున కందములను, ఉత్సాహములను ప్రయోగించియున్నాడు.

**కందము :-**

కందము "స్కంధ" శబ్దభవము, స్కందుడనగ కుమారస్వామి. "కందము" నీతులు తెలుపుటకు ప్రాయికముగ ఉపయుక్తమైనను అది శివసంబంధమైనది. "కందము చెప్పినవాడు కవి పందినిబొడిచిన వాడు బంటు" అను సామెతవలన కందపద్యరచన కష్టమే. ఐనను తెలుగు కవులు కందపద్యములను నధికముగ ప్రయోగించి యున్నారు.

పోతన వీరభద్ర విజయమున కంద పద్యములను విరివిగ రచించి యున్నాడు. ప్రథమాశ్వాసమున - 76 కందపద్యములు, ద్వితీయాశ్వాసమున 80 కందపద్యములు, తృతీయాశ్వాసమున - 72 కందపద్యములు, చతుర్థాశ్వాసమున - 86 కందపద్యములు గలసి మొత్తము - 313 గలవు.

పోతన వీరభద్రవిజయమున కందపద్యములను దైవస్తుతికి, నీతిబోధకతకు ఉపయోగించి దాని ప్రయోగసార్ధక్యమును సాధించియున్నాడు. ఉదా :-

"కం॥ రక్షింపుము కరుణాకర
రక్షిపుము లోకనాథ రమ్యాకారా
రక్షింపుము రిపు సంహర
రక్షింపుము వీరభద్ర రౌద్రసముద్రా" (4-186).

**ఉత్సాహము :-**

పోతన వీరభద్రవిజయమున, తృతీయాశ్వాసమునందు "ఉత్సాహము"

ను ప్రయోగించి యున్నాడు. "సాహచర్య పద్మమిత్ర సప్తకంబు గురువును, త్సాహవృత్తమునకెచెల్లు జలజదళ విలోచనా" అనునది దీని లక్షణము.

వివాహమున కేతెంచిన పరమేశున కెదుర్గేగి హిమవంతుడు ఉత్సాహముతో "ఉత్సాహము"న స్తుతిచేయుట ఔచితీ సమంచితముగ మన్నది.

"విదిత తంత్ర మంత్రవాద వేదధర్మమర్మముల్
వెదకుఁగాని నిన్నుఁగాన లేవుయిట్టిసెకు స
మ్మదముతోడఁగన్నె నిచ్చి మామనైతిఁబుణ్యసం
పదలు గంటిఁ గీర్తిఁగంటిఁ బంచవదన శంకరా" (3-131).

**ఉపజాతులు :-**

సీసము, గితము, ఆటవెలదులు, ఉపజాతులు, పోతన తన వీరభద్ర విజయమున సీసములను, ఆటవెలదులను ప్రయోగించియున్నాడు

**సీసము :-**

వర్ణన, వ్యక్తి, స్థల, నామ ప్రకటనములకు, విషయ విస్తరణమునకు సీస పద్యములుచితముగ నుండును. సీస పద్యములను స్వీకరించుట వలన కవియొక్క దేశీయ ఛందో ఽభిమానము వ్యక్తమగును

పోతన వీరభద్రవిజయమున, ప్రథమాశ్వాసమున - 26 సీసములను, ద్వితీయాశ్వాసమున - 42 సీసములను, తృతీయాశ్వాసమున - 31 సీసములను, చతుర్థాశ్వాసమున - 20 సీసములను, మొత్తము-119 సీసపద్యములను ప్రయోగించి యున్నాడు పోతన సీసపద్యములను పాడుకొనుటకు వీలగునట్లు కూర్పబడియున్నవి ఉదా :-

"సీ॥ తరళాక్షి యాతండు ధనవంతుఁడందమా
కోరివేడినగానిఁ గూడులేదు

చిన్నారి వయసున చిన్నవాడందమా
యెన్నటి వాడొకోయెఱుగరాదు
ఆకారసంపద నతిమేటి యందమా
యాకారమెట్టిదో యరయరాదు
కులగోత్రములురెండుఁ దెలియుదమందమా
తలిదండ్రులెవ్వరు ధరణిలేరు

ఆ॥ తిరిపరొంటిగాఁడు దేవుండు చూడడే
మాయమందు కపట మంత్రములను
మగువనిన్నునెట్లు మరగించు కొన్నాఁడొ
కాని తగినవాడు కాడు కాఁడు" (2-273)

## ఆటవెలది :-

"ఆటవెలది" పేరు సార్థకమగునట్లు రెండు పాదములుగలది. ఈనాడు నాలుగు పాదములలో వ్రాయుటయే ప్రాచీన సంప్రదాయము లాక్షణికులసమ్మతము. ఆటవెలది వేమనచేతిలో సర్వాలంకార భూషితమైనది. పూర్వము సీస పద్యమునకు ఆటవెలదులనే అను సంధించిరి.

పోతన వీరభద్రవిజయమున, ప్రథమాశ్వాసమున – 9 ఆటవెలదులను ద్వితీయాశ్వాసమున – 12 ఆటవెలదులను, తృతీయాశ్వాసమున – 12 ఆటవెలదులను, చతుర్థాశ్వామున – 6 ఆటవెలదులను ప్రయోగించి యున్నాడు. మొత్తము – 39 పోతన పార్వతిని ఆటవెలదిలో వర్ణించిన తీరు మచ్చునకు,

"ఆ॥ చెలువకరము కెంపు చిరుతరారుణ కోమ
లంబులైన పల్లవంబు లందు
నందమైన యట్టి చెందామరలయందు
గలుగ నోపుఁగాని గలుగ దెందు" (3-70) అని గలదు.

## వృత్తములు:-

తెలుగులో అక్షరగణ నిబద్ధములైనవానిని వృత్తములందురు.

పోతన వీరభద్రవిజయమున, చంపకమాలలు – 43 ఉత్పలమాలలు –

118, మత్తేభవృత్తములు - 49, శార్దూలము వృత్తములు - 55, మత్తకోకిలలు 19, తరలములు - 5, మాలిని వృత్తములు - 4, లయగ్రాహి వృత్తములు - 6 ప్రయోగించి యున్నాడు

1. పోతన వృత్తౌచిత్యమును పోషించెననుటకు మచ్చునకు కొన్ని పద్యములను చూపుట జరుగుచున్నది.

తనను తిరస్కరించిన తండ్రిపై దాక్షాయణి క్రుద్ధురాలై,

"శా॥ ఏరాదక్ష యదక్ష మానస వృథా యీదూషణంబేలరా
యోరీ పాపములెల్లఁబో విడువరా యుగ్రాక్షుఁజేపట్టరా
వైరంబొప్పదురా శివుందలపరా వర్ణింపరా రాజితో
త్కారాత్ముండగు నీలకంఠుఁదెగిడంగా రాదురాదుర్మతీ" (1-146) అని

ఆడపులి గాండ్రించినట్లు పల్కిన పల్కులు పై శార్దూలవృత్తమున వర్ణించి పోతన వృత్తౌచిత్యమును పోషించెనని చెప్పవచ్చును.

2. రతీవిలాపమును,

ఉ॥ "ఏవలరాజు భార్యను నుపేంద్రునికోడల శంభుచేత నా
దేవరగోలుపోయి కడుదీనత నొందుచునున్న దానఁజుం
డోవనవీథి నున్నఖచరోత్తములార దిగింద్రులార రం
డో వనవాసులార వినరోమునులార యనాథవాక్యముల్" (2-124) అను

ఉత్పలమాలా వృత్తమున సహజమైనరీతిలో, కరుణరసావిష్కరణ గావించునట్లు, హృదయద్రుతిని కలిగించునట్లు వర్ణించి పోతన వృత్తనిర్మాణౌచిత్యమును పోషించెనని చెప్పవచ్చును.

3. మధుర భావావేశమున హృదయగతిలో గలుగు మార్పును వ్యంజించుటకు పోతన మత్తకోకిల వృత్తమును ప్రయోగించెనని చెప్పవచ్చును. తపమాచరించుచున్న పార్వతికి శివుడు ప్రత్యక్షమైన సందర్భమున

మత్త॥ "దేవిదేవరఁజూచె దేవరదేవిఁజూచెను నంతలో
భావజన్ముఁడుదోచి యేసెను భావబంధము లొందగా
నేవమైఁదొలి ఫాలలోచన నేయఁజంకిన పుష్పబా
ణావళుల్ జతగూర్చి భర్గునినప్పుడేసెఁజెలంగుచున్" (2-293).

పోతన వీరభద్రవిజయమున ప్రయోగించిన, దండకము, జాతులు, ఉపజాతులు, వృత్తములను, వృత్తౌచిత్యమును పై విధముగ పరిశీలించుట మైనది. ప్రతి పద్యమున భాష, భావములు పోటీపడి కావ్యమునకు మరింత మనోహరత్వమును సంతరించి పెట్టినవని చెప్పుట సమంజసము.

## రసరామణీయకత :-

"నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తత ఇతి తత్ర
విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుని మాట. కావ్యమునకు రసము ప్రధానము. ప్రజ్ఞావంతుడైన కవి తనకున్న ప్రతిభా వ్యుత్పత్తుల నుపయోగించి రసపోషణలో జాగరూకత వహించి రసజ్ఞుల నల రించును

బమ్మెరపోతన వీరభద్ర విజయమున పోషించిన రసరామణీయకతను క్రింది విధముగ పరిశీలించ వచ్చును. వీరభద్రవిజయమున, వీరము, శృంగారము, కరుణము, శాంతము, రౌద్రము, బీభత్సము, భయానకము, అద్భుతము, హాస్యము అను నవరసములు పోషింపబడియున్నవి. ఒక్కొక్కదాని పరిశీలన క్రిందివిధముగనున్నది

## వీరము :-

వీరరసము ఉత్తమనాయకము. ప్రతినాయకుడు ఆలంబన విభావము చాతుర్యము, ఆమంత్రణము, స్థైర్యము, ప్రసాదము మొదలగునవి అనుభావములు. క్రోధాభిమాన హాసాదులు వ్యభిచారీభావములు ఇది దానవీరము, ధర్మవీరము, యుద్ధవీరము, దయావీరమని చతుర్విధములు.

వీరమునకు స్థాయిభావము ఉత్సాహము. "లోకోత్తరేషు కార్యేషు స్థేయాన్ప్రయత్న ఉత్సాహః" అని విద్యానాథుడు నిర్వచించెను.

వీరభద్రవిజయమున యుద్ధవీరము వర్ణింపబడినది. లోకోత్తరమౌ కార్యమును సాధించుటకై యత్నించు వీరభద్రుడు, అతని అనుచరగణమున ఉత్సాహము స్థాయియై స్పష్టపడుచున్నది. దక్షునిమీదకు యుద్ధమునకు వెడలు వీరభద్రుడు పల్కిన మాటలలోను, వీరభద్రుని మేని నుండి పుట్టిన వీరగణముల ఉత్సాహము లోను యుద్ధవీరము సువ్యక్తము.

"నడతున్ దక్షునిమీదఁ గయ్యమునకున్ నారాచఘోరాగ్నులన్
బుడమిందేవ గణంబులందు నిమి సంపూర్ణాహుతుల్ పోసెదన్
గడిమిం గెల్చెదఁ గూల్చెదం గలచెదం గాలించెదన్ జంపెదన్
గడి ఖండంబులు జేసెదన్ నుఱిమెదన్ ఖండించెదన్ మించెదన్'' (4-66)

''ఝుంకారభ్రుకుటాన నుండయి ధరాచక్రంబు ఘూర్ణిల్లఁగా
హుంకారించిన భద్రుమేన లయకాలోగ్రాగ్ని కీలావళిన్
సంకాశోద్ధత కోపచిత్తులు రణోత్సాహుల్ జగద్భీషణా
హుంకారుల్ ఘను లంతకాంతకులుదగ్రాగ్నుల్ మహావిక్రముల్" (4-74)

జన్మించిరి. ప్రమథగణము వీరభద్రుని వెంట దక్షుని మీదకు వెళ్లిరి.

వీరభద్రుడు ఇందు ఉత్తమనాయకుడు. దక్షుడు ఆలంబన విభావము. గర్వముతో నతడు చేయు యాగము, అతని చేష్టలు, మాటలు ఉద్దీపన విభావములు. చాతుర్యస్థైర్యౌదార్య పరాక్రమాదులు అనుభావములు. క్రోధాదులు వ్యభిచారీ భావములు. వీనితో వీర రసము యీ ఘట్టమున పరిపోషింపబడినది.

## శృంగారము :-

శృంగారమునకు "రతి" స్థాయి భావము. "తత్రసంభోగ విషయఇచ్ఛా విశేషోరతిః" అని విద్యానాథుని నిర్వచనము. శృంగారమున స్త్రీ, పురుషులు ఆలంబన విభావములు. ఉద్యానవనములు, వసంతఋతువు మొదలగునవి ఉద్దీపన విభావములు. ప్రియముఖావలోకనము, ప్రియగుణ శ్రవణము, కంపము

మొదలగునవి సాత్విక, అను భావములును అయి యున్నవి. స్మృతి, చింత - వ్యభిచారీ భావములు.

వీరభద్రవిజయమున, తపమాచరించు చున్న మహేశునకు శుశ్రూషకై హైమవతి తండ్రిచే నియమింపబడెను. సతిగమేను చాలించి, పార్వతిగ మరు జన్మధరించిన భవాని భవుని పొందవలసి యున్నది. అట్టియెడ,

"శివుఁజూచుం దమకించు సిగ్గు నగుడున్ జిక్కంగరంగున్మదిన్
భవుఁజేరం గమకించుఁ జంచలపడుం భావించు నెంచున్వడిం
గవయంగాఁ బడునాథుఁ గౌఁగిటను సింగారింతునోయంచునో
శివరమ్మాయని పిల్తునాయనుచు రాజీవాక్షి సంరబ్ధయై" (1-224)

అను పద్యమున, నాయికయైన భవాని సంభోగ విషయేచ్ఛా విశేషమగు రతిభావము "నాథుఁగౌగిటను సింగారింతునో" అను వాక్యమున స్పష్టము. ఉమామహేశులు ఆలంబన విభావములు. నాయకుని గాంచిన నాయికకు,

"కొలకులఁ దిరిగెడు హంసల
కలకల నాదముల కీరకల కలములు నుం
గల కంఠంబుల నాదము
లళి నాదములు'' (1-27) - ఉద్దీపన విభావ

ములు. ప్రియుని ముఖావలోకనము. కంపనము - అనుభావములు. స్మృతి వ్యభిచారీ భావము. వీని కలయికతో శృంగారము పరిపోషకము. తమకము' సిగ్గు, గమకము, చంచలము, కవయుట, సంరబ్ధము - అను పదముల (1-224 ప) కలయిక యిట మనోహరము,

ద్వితీయాశ్వాసమున, తపముచేయు చున్న పార్వతికి వటువు నిజరూము చూపినపుడు శృంగారరసము పోషింపబడి యున్నది. చూడుడు :-

"దేవిదేవరఁ జూచె దేవరదేవిఁ జూచెను నంతలో
భావజన్ముఁడు దోచి యేసెను భావబంధము లొందగా
నేవమైఁ దొలి ఫాల లోచను నేయఁజంకిన పుష్పబా
ణావళుల్ జతగూర్చి భర్గుని నప్పుడేసెఁ జెలంగుచున్" (2-293)

"క॥ తనువలచు శివుడు ముందట
దనకుం బ్రత్యక్షమైనఁ దద్దయు వేడ్కన్
దనుమధ్య చూచుచుండెను
తనువునఁ బులకాంకురములు దళుకొత్తగన్" (2–294).

"మత్త॥ చూచుఁ జింతనసేయు నేరగఁ జూచు వర్ణన సేయగా
జూచుచుం దమకించు సిగ్గునఁ జొక్కుఁ బ్రార్థనసేయగాఁ
జూచునంతనడయ్యుఁ దన్మఱచున్ ముదంబున వెండియున్
జూచుఁ జేష్టలు లేక యంబిక సోమశేఖరు నీశ్వరున్" (2–298)

అను పద్యములందు పార్వతీ పరమేశ్వరుల అన్యోన్యానురాగమును దెల్పి శృంగార రసమును పోషించియున్నాడు, పోతన.

**కరుణము :-**

''ఇష్టనాశాదనిష్టేః కరుణాఖ్యోరసోభవేత్" కరుణమునకు "శోకము" స్థాయి బంధునాశాదులు ఆలంబన విభావములు. నాశము పొందినవారి గృహ, తురగ, భూషణ వసనాది వస్తు ప్రదర్శనము, తద్వృత్తాంత శ్రవణము ఉద్దీపన విభావములు శరీపాతము, అశ్రుపాతము మొదలగునవి అనుభావములు. విషాదాదులు వ్యభిచారులు.

వీరభద్రవిజయమున, రతీదేవి విలాప ఘట్టమున కరుణరసము పోషింపబడినది. హరుని నేత్రాగ్నికి మారుడు బూడిదైనాడు. ఆ సంగతి నెరిగిన సుమసమ కోమలాంగి రతీదేవి తల్లడిల్లినది. అప్పటి పోతన రచన కరుణరస భరితము

రతీదేవి, ''చేతోజాతుండు వెసుటఁ గనుంగొని విస్మయాకుల చిత్తయై", మూర్ఛిల్లి యల్లన తెలివొంది'', "వదనంబును శిరంబును వదన గహ్వరంబు నందంద మోదు కొనుచు. . ...యిట్లని విలపింప దొడంగె"

"హా వలరాజ హా మదన హా మధురాయత చారులోచనా
హా విరహాళిధూనన నిరంతరచాపల సత్ప్రతాప
హా వనజాత నేత్ర తనయా యెటడాఁగితి నాకుఁ జెప్పుమా
సేవితమైన నీబలము చెల్వము మంటలలోన దాగెనో" (2–116)

"కట్టాదేవర కంటి మంటలు నినుం గారించుచో మన్మథా
చుట్టాలం దలిచంద్రులం దలచితో శోకంబునుం బొందితో
పట్టంజాలని శోవార్థిఁబడి నీ ప్రాణేశ్వరిం బిల్చితో
యెట్టుం బోవఁగ లేక మంటలకునై యేమంటివో మన్మథా!" (2-117)

సీ॥ "పురుషభిక్షము వెట్టి పుణ్యంబు సేయరే
తపము సేయుచునున్న తపసులార
ధర్మమెంతయు భర్తృదానంబు సేయరే
దివినున్న యింద్రాది దివిజులార
నావల్లభునినిచ్చి నన్ను రక్షింపరే
తలలెత్తిచూచి గంధర్వులార
దిక్కుమాలిన దాన దిక్కయి కావరే
ధర్మమానసులగు తంద్రులార

తే॥గీ అమర శరణంబు వేడెద నన్నలారా
అధిపుఁ గోల్పడి కడుదీననైనదాన
గరుణఁ గావంగ నింక నెవ్వరును లేరు
పుణ్యమౌను మొరాలించి ప్రోవరయ్య" (2-125)

సీ॥ మెఱుగు దీగయు బోలు మైఁదీగ సులియంగ
పదపడి వలికిలో బొదలు వెట్టు
కోకద్వయము బోని కుచకుంభములు గంద
నలినాక్షి కరతాడనంబు సేయు
నీలాలఁగతిబోలు నీలంపుటలకలు
ముడివడయూచి యమ్ముదిత యేడ్చు
కల్హారముల బోలు కన్నులు గతిచెడ
గమలాక్షి కడునశ్రుకణము లొలుక
ఇంతి విలపించు నత్యంత మేడ్పుఁ బొక్కు
నధిపచనుదెంచి కావవె యనుచుఁ జివుకు
స్రుక్కు మూర్ఛిల్లు దెలివొందు సురల దిట్టు
మగువ యెంతయు సంతాప మగ్నయగుచు' (2-134)

పై విధముగ పోతన ఈ ఘట్టమున కరుణ రసమును పోషించెను.

మూర్తీభవించిన శోకదేవత రతీదేవిని మన కనులయెదుట నిల్పి. కనులు చెమ్మగిలునట్లు గావించినాడు పోతన.

శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు, ''కోమలరసములైన నాల్గింటిలోను, శృంగార కరుణములలో హృదయ ద్రవీకరణము వేగిరము జరుగును.. ......... మఱియు నీ హృదయ ద్రవీకరణ శక్తి శృంగారమున కన్న కరుణమున నెక్కువ" సాహిత్యశిల్ప సమీక్ష – పుట-153) అని అనిరి. కావుననేమో దుఃఖాత్మకమైన రచనలు అత్యంత మధురములుగ పాశ్చాత్యులు భావింతురు.

ప్రస్తుత కరుణరసమున, మన్మథ మరణము ఆలంబన విభావము. మన్మథ సంబంధమైన ఆలోచన, అతని చరిత్ర స్మరణము మొదలగునవి ఉద్దీపన విభావములు, నేలపై పడుట, కన్నీరు మున్నీరుగ ఏడ్చుట మొదలగునవి అనుబావములు. విషాదము మొదలగువి వ్యభిచారులు వీనితో కరుణరసము నిష్పన్నమై ఆస్వాదయోగ్యమైనది.

**శాంతము :-**

శాంత శ్శమ స్థాయి బావఉత్తమ ప్రకృతిర్మ తః" శమము శాంతమునకు స్థాయిభావము. ఇదిఉత్తమ నాయకము. వైరాగ్యాదులచే మనసు విషయముల నుండి నివృత్తమగుటను శమము అని భావింపవచ్చును ఇందు అనిత్యముగ తెలియబడిన ఈ ప్రపంచము ఆలంబనము, వేదాంత శ్రవణము, తపోవన గమనము మొదలగునవి ఉద్దీపనములు నాసాగ్రదృష్టి, శత్రు మిత్రాదులందలి ఉదాసీనత ఇత్యాదులు అను భావములు హర్షోన్మాదులు వ్యభిచారులు.

వీరభద్రవిజయమున, ఉత్తమనాయకుడైన ఉమాధవుని ఉత్కృష్ట తపోవర్ణనమున శాంతము పరిపుష్టమై యున్నది.

"పరగ న్వెల్పలి చింతమాని యచల బ్రహ్మాసనాసీనుడై
తిరమై రాజితదేహము న్విమల భూతిన్ దీర్చిగూర్చుండెతా

గరుసుల్ నేరక తన్నుఁదాన తలపై గాఢాత్ముఁడై నిష్ఠతో
హరుఁడయ్యోగ సమాధిమై దవిలి నిత్యానందుఁడై యుండగన్" (1-29).

ప్రశాంత గంభీరము, ఉదాత్త సుందరమునగు భావములకు మత్తేభవృత్తము సముచితమైనదని ఆర్యులు తలంచిరి. అట్టి మత్తేభమున మహేశు తపోవర్ణనమును పోతన కావించినాడు. వెలుపలిచింతమాని, యోగసమాధిలో హరుడు నిత్యానందుడై యుండుటను మాధుర్యగుణ సమంచితము గావించి, శాంతమును ఆస్వాదనీయమొనర్చినాడు పోతన.

అనిత్యమైన విశ్వము ఇట ఆలంబన విభావము. ప్రశాంతసుందరమైన తపోవనము ఉద్దీపన విభావము. అచల బ్రహ్మాసనమున యోగ సమాధినొంది, వెలుపలిచింత లేకుండుట అను భావములు. నిత్యానందుడగుటయే హర్షము. ఆ హర్షమే వ్యభిచారీభావము. వీనితో శాంతము నిష్పన్నమై రసజ్ఞుల నలరించుచున్నది.

## రౌద్రము :-

"రౌద్రః క్రోధస్థాయిభావో రక్తోరక్తాధిదైవతః"

రౌద్రమునకు క్రోధము స్థాయి భావము. శత్రుకృతాపచారముచే మనసు ప్రజ్వలించుటయే క్రోధమని విద్యానాథుడు పేర్కొనెను,

అపరాధములు చేసిన పురుషాదులు ఉద్దీపనములు. ఉగ్రత్వము, ఆవేగము, రోమాంచము మొదలగునవి అనుభావములు, మోహము, అమర్షము మొదలగునవి వ్యభిచారులు, పిడికిటపొడుచుట, వికృతముగ చీల్చుట మొదలగువానిచే రౌద్రము ఉద్దీప్తమగును.

వీరభద్ర విజయమున, దక్షుడు శివ రహితయాగము నారంభించెను. అందులకాగ్రహించిన రుద్రుడు వీరభద్రోత్పత్తిని గావించి, దక్షాధ్వరధ్వంసమునకు పంపెను. వీరభద్రుడు ప్రమథగణములతో యాగశాలపై విజృంభించెను.

"జంకించి మైపెంచి శంఖంబు పూరించి
గగన భాగంబెల్ల గలయఁదిరిగి
అనికి సంరంభించి యార్పులఁజెలగించి
బ్రహ్మాండ భాండంబుఁబగులఁజేసి
భుజశాఖలడలించి భూస్థలి నంకించి
బలువిడి నాయుధంబులు ధరించి
అరుల గుండెలుచించి యడిదంబు ఝళిపించి
దర్పించి సింహనాదంబుఁజేసి
అతికరాళ భ్రుకుటితాస్యుడై కన్నుల
నిప్పులొలుక సురలు నెఱిదలంక
వీరగణ విభుండు విలయకాలానల
రౌద్రమూర్తి వీరభద్రమూర్తి" (4-104) వీరభద్రుడు,

సీ॥ పట్టిసంబులఁద్రుంచి పలుబాణముల నొంచి
ముసలాయుధంబుల మోది మోది
అలుగుల నాటించి యరచేతులను వ్రేసి
ముష్టిఘాతంబుల ముంచి ముంచి
కత్తుల నెఱయించి గదల గ్రుళ్లణగించి
భూరి శూలంబులఁ బొడిచి పొడిచి
శక్తుల దూలించి చక్రాలఁబరిమార్చి
పటునారసంబులఁ బఱపి పఱపి

పెనచి నరములు ప్రేగులు పెఱికిఁ బెఱికి
చెనకి మేనుల పట్టలు చీరి చీరి
డాసి చెక్కులు ముక్కులు గోసి కోసి
వీరభద్రుండు వేల్పులఁ దోలఁదొడగె'' (4-130)

ఈ పట్టమున, దక్షకృతాపరాధము కారణముగ ప్రజ్వరిల్లిన క్రోధము స్థాయిభావము. దక్షుడు ఆలంబనము. ఇంద్రాది అమర సంఘము దక్షయాగము నుచూడవచ్చుట, యాగము కొనసాగుట, దక్షకృత శివదూషణము మొదలగునవి ఉద్దీపనములు. ధైర్య శౌర్యములు అను భావములు. ఉగ్రత, ఆవేగాదులు వ్యభిచారులు వీనితో రౌద్రరసము పుష్టమై అలరారుచున్నది.

## బీభత్సము :-

"జుగుప్స" బీభత్సమునకు స్థాయి. దుర్గంధ మాంసాదులు ఆలంబన విభావములు. అచ్చటకృములు ఉద్దీపనములు ముఖసంకోచము, కనులు ముడుచుకొనుట మొదలగునవి అనుభావములు. అపస్మారకము, వ్యాధి, మరణము మొదలగునవి వ్యభిచారులు.

వీరభద్రుని విజృంభణమునకు గురియైన దక్షుని యాగశాలను వరించిన క్రిందిపద్యమున బీభత్సరసము పోషింపబడి యున్నది.

సీ॥ "సలలితంబుగ జన్నశాలలు భస్మమై
తోరణంబులు ద్రుస్సి ధూళిఁగలిసె
హోమగుండములెల్ల నొగి నెత్తురులఁదోగి
బ్రహ్మలు వేల్పులు పరగఁజచ్చె
బృందారకావలిఁ బొలియించెఁ గులవధూ
జనవిలాపంబులు సందడిల్లె
భాసురంబగు లక్ష్మీపతిఁ బట్టి కట్టిరి
తపసులు పెద్దలు ధరణిఁగూలె

బెరసి తలల గములు పీనుగుల పెంటలు
మదపు కుప్పలైన మాంసములును
రక్త నదులు మెదడు రాసులు నెముకలు
గుట్టలయ్యెఁ జెప్ప జెట్టలగుచు" (4-168)

దక్షుని యాగశాల, తెగిపడిన తలల సమూహములతో, నేలగూలిన పీనుగుల గుట్టలతో, మాంసపు కుప్పలతో, మెదడు రాసులతో, ఎముకల గుట్టలతో, రక్తపు నదులతో జుగుప్సను కల్గించుచున్నది,

పీనుగులు, ఎముకలు, మెదడు, మాంసాదులు ఆలంబన, ఉద్దీపన విభావములు. చూడలేక ముఖములు ముడుచుకొనుట, అసహ్యము అను భావములు. అపస్మారకము, ఆవేగము మొదలగునవి వ్యభిచారీభావములు. వీనితో బీభత్సరసము పోషింపబడినది.

## భయానకము :-

భయానకమునకు భయము స్థాయి. "క్రూరాకారాదుల చూచుట వలననే జనుని హృదయమందు పరణాదిరూప మహానర్థశంక గలుగునో యది భయము" దానియొక్క ఘోరతరమగు చేష్టలు ఉద్దీపనములు స్వేదము, వైవర్ణ్యము, అనుభావములు దీనత, గ్లాని, భ్రాంతి మొదలగునవి వ్యభిచారీభావములు.

వీరభద్రవిజయమున, వీరభద్రుడు ప్రమథ గణములతోడ దక్షునియజ్ఞవాటికను విపుల వీరావేశముతో చుట్టుముట్టి చెలంగి ఆర్చెను. అప్పుడచ్చటనున్నవారందరు దీతిల్లిరి. ఆ సందర్భమున భయానకరసము పోషింబడి యున్నది.

"కొందఱు మూర్ఛవోయిరటఁ గొందఱు పాఱిరిభీతచిత్తులై
కొందఱు చచ్చిరచ్చటను గొందఱు దూరిరిశాలక్రంతలన్
గొందఱు బుద్ధిభ్రమాస్పదిరి గుండెలు ఝల్లని తల్లడింపగాఁ
గొందఱు సృష్టి సంహరమొకోయని నివ్వెఱగందిరార్తులై" (4-91)

వీరభద్రుడు అతడార్చుట ఆలంబన విభావములు ప్రమథులతోడ వీరభద్రుడు యాగశాలలోని వారల భయపెట్టినతీరు ఉద్దీపనవిభావము. మూర్ఛ పోవుట, బుద్ధిభ్రమాస్పదుట అనుభావములు "సృష్టిసంహరమో" యని భ్రాంతి పొందుట, దీనతనొందుట మొదలగునవి వ్యభిచారీ భావములు. వినితో భయానకరసము పుష్టము.

## అద్భుతము :-

అద్భుతమునకు విస్మయము స్థాయి అపూర్వములగు వస్తు సందర్శనము వలన కలుగు చిత్తవిస్తారము విస్మయము.

అపూర్వము లేక విలక్షణమైన వస్తువు ఆలంబనము. దాని గుణములు ఉద్దీపనములు స్తంభము, రోమాంచము, త్వరపాటు, నేత్రవికాసము మొదలగునవి అనుభావములు ఉన్మాదము. హర్షము, ఉత్సుకత వ్యభిచారీభావములు.

సకల లోకంబులుం గొనియాడ వీరయాగంబు సేయవలయునని వీర భద్రుడు విచారించి భయంకరముగ హుంకరించును. అప్పుడతని మేనినుండి ఉగ్రరణవీరులైన వారు లెక్కకు మిక్కిలిగ ఉద్భవించిరి.

శా॥ "ఝుంకార భ్రుకుటాననుండయి ధరాచక్రంబు ఘూర్ణిల్లఁగా
హుంకారించిన భద్రుమేన లయకాలోగ్రాగ్ని కీలావళిన్
సంకాశోద్ధత కోపచిత్తులు రణోత్సాహుల్ జగద్భీషణా
హుంకారుల్ ఘనులంతకాంతకులుదగ్రాగ్నుల్ మహావిక్రముల్" (4-74)

ఉ॥ "సాహసధైర్యమానసులు చంద్రఫణీంద్ర విభూషణుల్ శివ
ద్రోహరగండ కీర్తుంతిదోర్బల గేయులు భూరితీవ్రహా
లాహల జృంభిత్వుల్ శిఖివిలంబిత నేత్రులు చారుగోపతీ
వాహులు వైరి వీరమదవారణ సింహులు ట్టిరుగ్రతన్" (4-75) అను పద్యములలో వర్ణింపబడిన విలక్షణోద్భవులైన వీరభద్రుగణము ఆలంబన విభావములు వారి ఉదగ్రాకృతి, గుణములు ఉద్దీపనములు వేగిరపాటు అనుభావము. హర్షాతిరేకము వ్యభిచారిభావము వీనితో అద్భుతరసము పోషింపబడినది,

## హాస్యము :-

హాస్యమునకు "హాసము" స్థాయిభావము. వికృతమైన ఆకారము, మాటలు, వేషము, చేష్టలు మొదలగునవిగల నర్తకునివలన హాసము స్థాయి భావముగ గలహాస్యరసము కలుగును.

వికృత వేషభాషలకు కారణమైన వ్యక్తి ఆలంబనవిభావము వాని చేష్టలు ఉద్దీపనములు సంకొచము, వదనస్మేరత మొదలగునవి అనుభావములు· హర్షచాపల్యాదులు వ్యభిచారీభావములు.

వీరభద్ర విజయమున, మహేశునిగూర్చి పార్వతీదేవి తపమాచరించు. చుండగ, ఆమె కడకు శంకరుడు మాయావటువుగ ఏతెంచెను. శంకరుని నిందించి, తనను పరిణయమాడుమని పల్కిన బ్రహ్మచారిపై పార్వతి కోపించి, ఆతనిని మెడ

బటి నెట్టుడని చెలులతో పల్కెను. అంత చెలికత్తెలు వటువుపై విజృంభించిరి అప్పటి శివుని వర్ణన హాస్యరసభరితము.

సీ॥ దండంబు విసరినఁ దప్పించుకొనిపోయి
పొలతులు కొందఱు పాదివిపట్టి
భాహుదండంబునఁ బట్టిన గొడుగును
బలిమిమై నల్లంతఁ బాఱవైచి
కరము బిగ్గనఁ బట్టి కట్టిన యొల్లియ
నొడిసి వ్రాలిన గోచి విడిపివ్చి
కూకటి బలుమాఱుఁ గుదియించి కుదియించి
చేడియల్ నవ్వుచు శిరము వంపఁ
బిన్నవాడుబోలె పెనుగులాడుచు నుండి
బాలుడైన కపట బ్రహ్మచారి
మాయమయ్యె నపుడు మగువకు ముందట
మహితమైన చిత్రమహిమ తోడ" (2-288)

కపట బ్రహ్మచారియైన శివుడు ఆలంబనము. గోచి విడిచిపుచ్చుట మొదలుగాగల అతని చేష్టలు ఉద్దీపనములు. చేడియల నవ్వులు అనుభావములు. సంతోషాదులు వ్యభిచారులు వీని కలయికతో హాస్యరసముప్పతిల్లు చున్నది.

పై విధముగ పోతన వీరభద్ర విజయమున నవరస పోషణ గావించి యున్నాడు ప్రథమాశ్వాసమున శాంతమును, ద్వితీయాశ్వాసమున, తృతీయాశ్వాసమున శృంగార, కరుణ, హాస్యములను, చతుర్థాశ్వాసమున వీరరౌద్రబీభత్స భయాన కాద్భుతములను పోతన పోషించి కావ్యశోభను ఇనుమడింపజేసెను.

## పాత్రపోషణము :-

పాత్రచిత్రణ యుక్తముగ నున్నపుడే కవి కావ్యానందమును సహృదయులకు సరియగురీతులలో అందించగలుగును. కావ్యమున పాత్రపోషణము ద్వివిధములుగ గోచరించు చున్నది. ఒక పాత్రశీలమును కవియే స్వయముగ చెప్పుట ప్రత్యక్షమార్గము. ఇతర పాత్రలచే చెప్పించుట పరోక్షమార్గము. మరి

యు, వాక్యరూపమునకొంత, కార్యరూపమున కొంత పాత్రపోషణము వ్యక్తమగు చుండును.

వీరభద్రవిజయమున, పోతన, పాత్రచిత్రణ కవసరమైన సన్నివేశకల్పనమును, సంభాషణా చాతుర్యమును నిర్వహించిన విధము ప్రశంసనీయము. ఔచిత్యమునకు భంగమేర్పడకుండ పాత్రలను తీర్చి దిద్దుట పోతన ప్రత్యేకత. వీరభద్రవిజయమున, ప్రతిపాత్రయు సహజస్వభావ నిర్భరమై పాఠకుల ఎదుట కదలుచుండుననుట అతిశయోక్తికాదు.

వీరభద్రవిజయమున, దక్షుడు, దాక్షాయణి, దధీచి, వీరభద్రుడు అను పాత్రలను పోషించిన విధమును పరిశీలించిన పోతన పాత్రచిత్రణా కౌశలము వ్యక్తమగును. ఆయా పాత్రలను క్రిందివిధముగ పరిశీలించుటమైనది.

**దక్షుడు :-**

వీరభద్రవిజయమున ప్రతినాయకునిగ దక్షుని వర్ణింపవచ్చును. ఇతడు ప్రజాపతులలో నొకడు. సతీదేవికి తండ్రి, పరమేశునికి మామ. కైలాసమున శివుడు కొలువైయున్నవేళ దక్షుడచటి కరిగినాడు. అల్లుడు సామాన్యముగ గౌరవించెనేగాని ప్రత్యేకముగ ఎదురేగి మన్నన సేయలేదు. అందువలన దక్షుడు ఈశ్వరునిపై వైరమునుబూనెను ఇట్టియెడ పోతన,

'అని తనపాలిటి కర్మము
పెనగొని తనుఁ జుట్టు ముట్టి ప్రేరేపంగాఁ
జెనటి యగు దక్షుడప్పుడు
మనమునఁ గోపంబు నొంది మలహరు నిడిచెన్" (1-85) అని నుడివెను.

దక్షుడు కర్మకొలది చెనటియై కోపించెనట. అది అతని దురదృష్టము. లేనియెడల నవబ్రహ్మలలో ఒకడైన దక్షప్రజాపతి మహేశతత్త్వము తెలియనివాడు కాడుగదా!

అటుల విరోధించిన దక్షుడు శివరహితమైన యాగము నారంభించెను. "తామసంబున పొంగి, ఖలుడై దక్షుడు అదక్షుడైనాడు". యాగమునకు దివిజ

గణమేతెంచెను. పిలువకున్నను దాక్షాయణి పుట్టినిల్లను చొరవతోడ వచ్చినది కాని దక్షుడామెను తిరస్కరించెను శివుని నిందించెను. కాని దక్షుడొనరించిన శివనింద నిరదగాదు. నిందాస్తుతిగ పోతన వర్ణించెను జాతిలేదు పుట్టుజాడ లేదు, పరముడొంటిగాడు బ్రహ్మాదులెరుగరు" అని దక్షుడు పల్కుటలో సృష్టి కర్తకుగూడ అంతుబట్టని మహేశుని మాహాత్మ్యము నూహింపవలయును. అట్టి యెడ సతీదేవి, దక్షుల వాదనలు, సతీదేవి దేహత్యాగము, దక్షునకు శివుడు శాప మునిచ్చుట జరిగినది

దక్షుని పునర్జన్మ వైవస్వత మన్వంతరమున జరిగినది.

'మఱి వైవస్వతమన్వం
తరమున నొక కాలమందు దక్షుడ దక్షుం
డురుతర పాప విచక్షుడు
పరగిన్ జన్మించె ఘోరపాపాత్మకుడై" (4-3) అనుటను బట్టి దక్షుడు ఘోరపాపాత్ముడుగనే జన్మించినాడు తెలివికోల్పడి అజ్ఞానముతోడ శివరహిత యాగమారంభించినట్లు తెలియుచున్నది దదీచి హితోక్తులు, మందలింపులు దక్షునకు నచ్చలేదు ఫలితముగ వీరభద్రునిచే చంపబడెను. బ్రహ్మాదుల ప్రార్థ నతో శంకరుడు దక్షుని మేషశిరముతో పునర్జీతుని గావించెను. పిదప దక్షుడు మన్నింపుమని మహేశుని ప్రస్తుతించెను

పోతన వీరభద్రవిజయమున, దక్షపాత్ర స్వభావప్రవృత్తిని వివరించుచు ప్రత్యక్షమార్గమున పాత్రచిత్రణ గావించినాడు దక్షుని పాత్రను పోతన కడు దక్షతతో తీర్చిదిద్దినాడని చెప్పవచ్చును.

**దాక్షాయణి:-**

ప్రకృతిశక్తుల సంపూర్ణ స్వరూపిణియగు సతీదేవి దక్షప్రజాపతికి దుహిత పుత్రి పేరుమీదుగా ఆమెకు దాక్షాయణి అనిపేరు కల్గెను.

దక్షుడు మహేశునకు సతీదేవినిచ్చి పరిణయమొనర్చెను. భువనభర్తకు

మామయయ్యెను. ఒకసారి శివుడు తనను గౌరవించలేదని కినుక వహించి దక్షుడు తన అవమానమునకు ప్రతీకారముగ సతీశ్వరుల మాత్రము పిలువక యాగమాచరించెను. కాని నారదుని వలన తండ్రియాగము నెరింగిన దాక్షాయణి; "మదనారికి నెల్లప్పుడు మది దప్పని భార్యకాన మనమున కలగెన్". సతీశ్వరుల అన్యోన్యత ఇందు వర్ణితము.

మొదట, సతి తనకు తెలిసిన విషయమును శివున కెరింగించుటకు వెనుకాడెను. కాని చివరకు, "ఎల్లజన్నువ్వారలు దురితాత్ముని యాగమునకు దురితారాతీ" అని యాగమునకు పోయిన వారలగూర్చి చెప్పినది. తండ్రిని దురితాత్ముడని నిందించినది. అదురితమును హరించువాడవు నీవేననియు ఈశ్వరునకు గురుతు చేసినట్లయినది.. సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు దక్షయాగనిమిత్తము నెరింగించి "కన్యలకుఁబుట్టిన యిండ్లకుఁబోవలోకముల్మెచ్చును బొమ్మ" అని పల్కెను. తనను శివుడు వేరుచేసెనని ఆమె అప్పుడే ఖేదమొందెను. తుదకు శివుని ఊరడింపుతో కుదుటపడినది.

సతీదేవి ప్రమథగణములు కొలుచుచుండ తండ్రి యాగశాల కరిగినది. దక్షుడామెను ఆదరించలేదు.

"అట్టివిధముచూచి యాత్మలోఁ గోపంబు
పుట్టుటయును ధీరబుద్ధినద్రి
కన్యయైన మేటి గావున సైరించి
సామవృత్తి నాదిభామ పలికె" (1-131) అని పోతన సతీదేవిని వర్ణించెను.

దక్షుని నిరాదరణము సతీదేవికి కోపమును కల్గించెను: కాని ఆమె ధీరబుద్ధి. అద్రికన్యయైన మేటి కనుక సహనము ఆయమ్మ సహజస్వభావము. అందువలననే ఆమె సౌమ్యముగ దక్షునితో మాటలాడునపుడు ముమ్మూర్తులలో అధికుడు, యజ్ఞనాథుడు అయిన పరమేశుని దివ్య ప్రభావమును వివరించుచు ఆతురత ఆమెలో చూడవచ్చును. మృదువుగ మందలించి ఆమె శివతత్త్వమును చాటినది. ఇదియే పోతన ఆశయము. కాని దక్షుడామె పలుకులను తిరస్కరించెను. శివనింద గావించెను. అపుడు దాక్షాయణికి కోపము కట్టలుత్రెంచుకొనినది. అప్పటి పోతన గారి దాక్షాయణి,

శా॥ "ఏరా దక్షయదక్షమానస వృథా యీ దూషణంబేలరా
యోరీ పాపములెల్లఁబో విడువరా యుగ్రాకుఁజేపట్టరా
వైరంబొప్పదురా శివుందలపరా వర్ణింపరా రాజితో
త్కారాత్ముండగు నీలకంఠుందెగడంగా రాదురా దుర్మతీ" (1-146) అని తండ్రియనికూడ ఆలోచించకుండ, క్రుద్ధురాలై, కరకుగ దక్షుని తెగడినది. అందరు వినుచుండ శివుని మహిమను,

"కలయనీరేడు లోకముల దొంతులతోడ
బాగొప్ప మూడురూపములతోడ
మూడు మంత్రములతో మూడు కాలములతో
క్రమియించు పుణ్యపాపములతోడ
సలలిత ఖేచరాచర జంతు కోటితో
భూరితేజములతో భూతితోడఁ
జంద్రానలావనీ జలవాయు గగనాత్మ
తరణుల తోడఁజిత్రములతోడఁ

ఆ॥ భర్గదివ్యమహిమ బ్రహ్మాండములు సేయుఁ
గాచుచడచుఁగాని కానరాదు
నిఖిలమెల్లఁ దాన నీవును నేనును
దానకాననింద దగదు సేయ" (1-148) అని చాటినది

చివరకు దాక్షాయణి, దక్షునితో, " ... నీపుట్టిన దేహముతోడను పట్టున శివుజేరరాదు", "ఈయొడలుపోతగాదె" అని పలికి, శంకరు శ్రీపాదయుగళమును తన మనస్సరసిలో నిలిపి తనువును యోగాగ్నిలో భస్మమొందించినది.

పోతన దాక్షాయణి పాత్రపోషణమున చూపిన తీరున మూడు ముఖ్యమైన విషయములు గోచరించుచున్నవి 1. భవునియందు ఆమెకు గల అనూనము, అనూహ్యము, అనల్పమునైన భక్త్యనురాగములు. 2. మహేశుని దివ్యమహిమను మహేశ్వరి స్పష్టీకరించుటలో ఔచిత్యముండునను విషయము, 3. మాలిన్యము శరీరమునకేగాని ఆత్మకుకాదు. ఆత్మనిత్యము, నిర్మలము. దక్షు

నికి పుట్టిన శరీరము గావున, దక్షుడు శివనిందచేసినందున, ఆ శరీరముతో శివుని చేరరాదని ఆమె తలచి, దేహత్యాగ మొనరించి, బాలయై హిమవన్నగమునుచేరి మేనా హిమవంతులకు ముద్దుల పట్టియైనది.

హైమవతిగ నున్న జగజ్జనని నిజనాథు వియోగమును హిమవంతునింట అనుభవించినది. తపమాచరించి, పరమేశుని మెప్పించి, ఆతనిని పతిగపొందినది. ఆమె తపోనిష్ఠకు, "లంఘించెంగమలోద్భవుం డు మదిఁదాలక్షించి తద్దేవతా సంఘంబెల్లఁగలంగె మేలుకొనియెం జక్రాయుధుండంత వేగం ఘీంకారములిచ్చె దిగ్గజములుం గైలాసశైలంబు దుర్లంఘ్యంబైన గణాలితోఁ గదలి దోర్లంబాజెనల్లాడుచున్" (2-249) అని పోతన వర్ణించినవిధము, ఆమె ఈశ్వరుని కొరకు పడు ఆరాటమును వ్యక్తము చేయుచున్నది.

తపము చేయుచున్న పార్వతివద్దకు కపట బ్రహ్మచారి వచ్చి, ఈశ్వరుని నపహసించి, తనను పరిణయమాడుమని పల్కినపుడు, పార్వతి కోపముతో ఇట్లనియెను.

ఉ "వీడట బ్రహ్మచారియట వీనుల బెట్టగరాని మాటలే
యాడుచునున్నవాడు మదనాంధుడు వీడు నమశ్శివాయయెం
డాడగవద్దు వీనిఁగపటాత్ముని నిచ్చటనుండనీయక పం
డ్లూడగ వేసిద్రొబ్బుడని యుగ్రతఁ బల్కినఁ గాంతలందఱున్" (2-257)

ఇందు, ఈశ్వరుని తప్ప అన్యులను తన మనమున తలవని పార్వతీ మనస్తత్వమును పోతన వివరించెను.

పై విధముగ ఉదాత్తమైన కావ్యనాయికను పోతన వీరభద్రవిజయమున చిత్రించెను.

**దధీచి :—**

శంభుదేవుని శాపాక్షరములకు ఫలితముగ దక్షుడు వైవస్వతమన్వంతరమున మరల యాగమునారంభించెను. బ్రహ్మాది దేవతలు, మహర్షి సంఘము,

సిద్ధసాధ్యాదులెల్లరును యాగమునకు విచ్చేసిరి. దధీచి అందరిని పరికించినాడు మలహరుడు రాకుండుటను గమనించినాడు.

పోతన అపుడు దధీచిని, "నిశ్చలతరవాక్యదోషతమ చండమరీచి దధీచి అని వర్ణించినాడు. కనుకనే బ్రహ్మాది దేవసంఘమున్న సభలో నిర్భయముగ నిస్సందేహముగ, నిర్దుష్టముగ మాటలాడినాడు దధీచి

పాపచక్షుడైన దక్షుని పుణ్యచక్షుడైన దధీచి మందలించెను. "జీవచ్ఛవముల పూజించు వెట్టి భూమింగలడే" అని దధీచి పలికెను. శివరహితయాగము నిష్ఫలమని దధీచి దక్షునకు హితవుగరపెను. రుద్రమహిమ దెలియ, "ధాత్రకైన అతని తాతకైన" శక్యము కాదని బోధించెను. మీరు చచ్చుట తెల్లమని అమరులకు హెచ్చరికచేసెను. మరియు, "పంచవదనుని మోము జేగురించెనేని తత్క్షణము తమ యాళ్లత్రాళ్లు" తెగునని కఠినముగ పల్కినాడు,

దధీచి "నిర్మలాత్మకుడు", "అనుపమగుణుడు". కనుకనే రాబోవు అపదను గుర్తించినాడు. దక్షుని మందలించుటకును, పుణ్యశాలియు, ధీశాలియునైన దధీచి తగినవాడని పోతన భావించెను. అందువలననే మూలమున ఒకటి, రెండు శ్లోకములలో గల భావమును దాదాపు నలుబది పద్యములలో చక్కని ఉపన్యాసరీతిలో పోతన వర్ణించెను దధీచి హితోక్తులు దక్షుని చెవికెక్క లేదు. అంత దధీచి అచటనుండి నిర్గమించి ఉమామహేశుని కడకేగి, ఈశ్వరునితో, మీరు వేగఁజనియచ్చటశూరుల వాని తోడుతన్నలవడఁజేయవే" (4-49) అని పలికెను. అంత పరమేశ్వరుడు కోపించి, తనహుంకారమున వీరభద్రుని పుట్టించెను. దక్షయాగమును నాశము గావించి, దధీచిని సంతృప్తిపరచెను.

పోతన వీరభద్ర విజయమున, పై విధముగ దధీచిని ఉత్తమమైన పాత్రగ తీర్చిదిద్దెను.

## వీరభద్రుడు :-

"వీరభద్ర విజయము" నందు ప్రముఖమైన పాత్ర వీరభద్రుడు రుద్రాంశ సంభూతుడు "సృష్టిలో పూర్ణుడగు మానవుని పొందుటకు కలిగిన ప్రాప్తి

నరూపమే వీరభద్రుడనవచ్చును. ప్రకృతి సంబంధములేక పుట్టిన యీ రుద్ర మహాశక్తియే ప్రాకృత వ్యక్తియై విశ్వకల్యాణమునకు తోడ్పడెను." (లేపాక్షి - పుట 43) అని ఆచార్య బాడాల రామయ్యగారు పల్కిరి.

వీరభద్ర విజయము నందలి నాల్గవ ఆశ్వాసమున గల కథాభాగమంతయు వీరభద్రుని ఆధారముగ నడచినదేననవచ్చును. దక్షయాగ వినాశార్థము రుద్రుడు తన హుంకారమునుండి వీరభద్రుని సృజించెను. పుట్టుకలోనే గాక, ఆకారములో గూడ పోతన వీరభద్రుని పాత్రయందు వైలక్షణ్యమును చూపెను. వీరభద్రుడు పద్మనాభదేవేంద్రాది దివిజ సంఘమును యుద్ధమున నోడించి బంధించగల దిట్ట. కనుకనే పోతన, "అఖండతరప్రళయాగ్ని సన్నిభాకారుడు వీరభద్రుడతిగర్వసముద్రుడు పుట్టెరౌద్రతన్" (4-52) అని వీరభద్రుని వర్ణించెను.

వీరభద్రుడు పార్వతీశ్వరులతో, "నన్నునుపుట్టింపగనేల వలసె బొలుపుగ నాకున్ నెట్టన యానతి యీవే" (4-64) అని వేడుకొనగ, శివుడు, "మమున్ వెల్వెట్టి దక్షుండు" యాగము చేయుచున్నాడు. నీవువేగచని, "దక్షుఁజంపి యాగమ్ము హరించి రమ్మనుచు నానతి యి"చ్చెను. అపుడు వీరభద్రుడు,

ఉ॥ "కుంభినిద్రెంతునో జముని గుండెలు చెండుదునో సురాచల
స్తంభముద్రెంతునో సురల చట్టలు చీరుదునో కడంగిది
క్కుంభులద్రుంతునో యజునిక్రొవ్వణగింతునొ సూర్యచంద్రులన్
జృంభణమెల్ల మాన్పుదునొ చుక్కలడుల్తునొ పార్వతీశ్వరా" (4-64) అని

అడిగెను ఇట్లు పోతన పాత్రబల సామర్ధ్యములను పాత్రచేతనే చెప్పించెను.

ఒకపాత్రను సృష్టించు నపుడు అపాత్రగుణములను క్రమవృద్ధినొందించవలయును అప్పుడే పాత్ర కృత్రిమముగాక స్వాభావికముగ ప్రకాశించుటకు వీలుండును. కనుకనే పోతన వీరభద్రుని గూర్చి ముందుగ తాను చెప్పెను. పిదప పార్వతీశ్వరులతోడ చెప్పించెను. అనంతరము పాత్రతోడనే అపాత్ర స్వభావము నెరింగించెను. ఇట్లు పోతన పాత్రపోషణమున అనుసరింప వలసిన మార్గముల ననుసరించి తన కావ్యమున పాత్రచిత్రణము గావించియున్నాడు.

వీరభద్రుడు మహేశునానతితో దక్షుని యగశాలకరిగి సమస్తదేవనికర మును బంధించి, దక్షుని శిరమును ఖండించెను. విజయముతోడ వచ్చిన వీర భద్రునకు మహేశుడు పట్టముగట్టినాడు. శివుడు, "ఈబలియుండాఢ్యుడు వీర భద్రుడఖిల బ్రహ్మాండ భేద్యుండు సల్లలితానందుడు ముజ్జగంబులకు నెల్లన్ దానకర్తారుడై వెలుగందైవము" (4-222) అని, దేవతలతో పలికి వీరభద్రునకు పట్టము గట్టెను. ఈశ్వరు నానతి పరగగజేపట్టి భువనభరదక్షుడై కరుణన్ జగంబులన్నియు" వీరభద్రుడు పరిపాలనసేసెను.

వీరభద్రుని పాత్రను పోతన కడు సమర్థవంతముగ పోషించెననవ చ్చును. ఆకృతిదాల్చిన వీరరసావతారమా అనునట్లు పోతన వీరభద్రుని పాత్ర ను తీర్చిదిద్దినాడు.

పై విధముగ పోతన వీరభద్రవిజయమున, ఆయా పాత్రల స్వరూప స్వభావములను వ్యక్తీకరించుచు పాత్రచిత్రణ గావించి యున్నాడు. పాత్రల ప్రతి కదలికను క్రమపరిణామ పూర్వకముగ స్పష్టపరచుచు, అందుల కనువగు భాషను ప్రయోగించి రచనగావించి యున్నాడు పోతన. హిమవంతుడు, సప్త ర్షులు, రతీమన్మథులు మొదలగు పాత్రల సృష్టిలోను పోతన అనుసరించిన మార్గము ప్రశంసనీయము అని చెప్పవచ్చును.

## వర్ణనలు :-

"వర్ణన అనగా వర్ణించుట 'వర్ణస్తుతౌ' కొనియాడబడునది, కొనియాడు నది అని గురుబాల ప్రబోధిక, ఏవస్తువునైనను, దాని బాహ్యాకారమును, దానిని పురస్కరించుకొని ఉత్పన్నములగు భావములను వర్ణించుట వర్ణన యగుచున్నది అంతర్వర్ణనమును, బాహ్యవర్ణనములును వర్ణన క్రిందికేవచ్చును. వర్ణనతో కూడు కొనినదే కవిత్వము" (ప్రబంధాలలో ప్రకృతివర్ణనలు - పుట 10) అని శ్రీ అంతటి నరసింహముగారు పేర్కొనిరి. "కవయతీతికవిః" అను వ్యుత్పత్తిననుసరించి, వర్ణించువాడుకవి కవి కవనము లేదా కవిత్వము చేయును, వీనికి పర్యాయ

ముగ "వర్ణన"ను కూడ చేర్చుకొనవచ్చును. అపుడు వర్ణన, కవిత్వము ఏకార్థ బోధకములగును.

ఒక వస్తువుయొక్క సమగ్రమైన స్వరూపమును, దాని బాహ్యాంతర తత్త్వములను వివరించుటకు వర్ణన ఉపయోగపడును. అటులే పాత్రల భౌతిక మానసిక ప్రవృత్తులను తెలుపుటకును, వాతావరణ పరికల్పనమునకును, మనోజ్ఞమైన తీరులో కావ్యమును సంతరించి పాఠకునికి సంపూర్ణ రసానుభూతి నొందించుటకును కవులు వర్ణనలను కల్పింతురు.

నన్నెచోడకవిరాజు, తన "కుమారసంభవము"న,

"వనజలకేళీరవి శశి
తనయోదయ మంత్రగతి రతిక్షితిపరణాం
బునిధి మధు ఋతుపురోద్వా
హతగ విరహ దూత్యవర్ణనాష్టాదశముల్" (1-44) అని అష్టాదశ వర్ణనలను పేర్కొనియున్నాడు. పాల్కురికి సోమనాథుడు తన "పండితారాధ్యచరిత్రము"న తొమ్మిదిరసములను, పద్దెనిమిది వర్ణనలను, ముప్పదిరెండు అలంకారములను డెబ్బదిరెండు అర్థభావములను పేర్కొనెను. భోజుడు 'సరస్వతీ కంఠాభరణము"న వర్ణనలను ఇరువదియారుగ చెప్పియునాడు. కేశవమిత్రుడు "అలంకారశేఖరము"న ముప్పదినాలుగు వర్ణనలను వివరించియున్నాడు. శ్రీ అంతటి నరసింహముగారు "ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు" అను పరిశోధనావ్యాసమునందు "పురగిరిఋతుసాగరాది. .. " అష్టాదశవర్ణనలను నిర్ధారించి వివరించిరి.

వీరభద్రవిజయమున పోతన గావించిన వర్ణనలు స్వాభావికములు, సందర్భానుసారములునయి కావ్యరసోత్కర్షకు నిమిత్తములై అలరారుచున్నవి. పోతన వీరభద్ర విజయమున గావించిన వర్ణనలను క్రిందివిధముగ పరిశీలించుటమైనది.

## వనవర్ణన :-

వనమనగ ఉద్యానవనమని కొందరు, అడవి యని మరికొందరు భావించిరి. "వర్ణనా వైవిధ్యమును వర్ణనా నైపుణ్యమును ప్రదర్శించుట కనువైన స్థానము ఉద్యాన వన వర్ణన. ఇది యొకమనోహరప్రక్రియ" (ప్రబంధములలో ప్రకృతివర్ణనలు - పుట 185). అని శ్రీ ఆంతటి వారనిరి. శ్రీ నిడదవోలు వేంకట రావుగారు "వన"మనగ "అడవి" అని భావించిరని శ్రీవేదము వేంకటరామశాస్త్రి గారు తెల్పుచు "అది యుక్తము గాదు, వనకేళినే వనవర్ణనగ గ్రహించుట యుక్తము (నన్నిచోడకవిత్వము – పుటలు 138-139)" అని నిర్ధారించిరి. వన వర్ణనల వలన రసవత్కావ్యములు మరింత రసవత్తరములై సరసుల నలరించును ఫలపుష్పభరితములై యొప్పు మహీరుహములు, లతామండపములు, మంజుల నాదంబుల నలరించు పక్షినికరంబులు యిందు ముఖ్యముగ వర్ణనీయములు.

వీరభద్ర విజయము నందలి వనవర్ణనమును క్రింది విధముగ వివరించుట గలదు.

వీరభద్రవిజయ కావ్యకథారంభమున నైమిశారణ్యవర్ణన గావింపబడినది. ఈ అరణ్యవర్ణన ఉద్యాన వనవర్ణనమునకు భిన్నముగనున్నది.

"మహిత మాతులుంగ మందార చందనసాల భల్లాతకీ ప్రముఖ రాజిత కుంభినీ విరాజితంబును, కురువింద కుందము హిమ్లూత మధూక శతపత్ర కమల కల్హారకర వీరమల్లికాదివల్లీ సంపుల్ల పుష్పవల్లీ లలిత పరిమళ సుగంధబంధురది గంతరాళంబును... ., చంచరీకశారికాకరనాటల చక్రవాక నీలకంఠ [illegible] కంకనాళలింగ క్రౌంచకారంభ కారండకానకపోత పారావత శకుని భరద్వాజ చకోరలావు కజీవంజీవవాయ సారాతి కోయష్టిక డిండిభ సారసశాతఖండనారంగ ప్రదాగంగ గణనాద ప్రమోదితంబును, మండిత గండభేరుండ వేదండ కంఠీరవ శరభ శార్దూల శంబర జంబూకగవయవరా రోహ ప్లవంగ శల్యసారంగ చమరీ మృగ గోకర్ణ వృకాది మహామృగ మందిరంబును, దందశూకగాథేయ మార్జాల మూషక నివాసంబును, సకల పుణ్య తరంగిణీ మంగళ సంగమంబును, వినిర్మల సరోవర

విలసితంబును, అనుపమ మునినాద నిరంతర బహుళ పాఠనిఖిల నిగమ కలలారావ ఘటిత గగన తలంబును ధర్మ తపోధనధాన్యదాన తాపసోత్తమ సంతత సంతుష్ట హోమధూమ సమ్మిళిత బృందారకాలోకనంబును, సర్వభువన మహారణ్యరత్నంబును సకల మునిజన స్తోత్ర పాత్రంబుననగు నైమిశారణ్య పుణ్యక్షేత్రంబు" (పుట 11,12) అని వీరభద్రవిజయమునందు నైమిశారణ్యవర్ణన గావింపబడియున్నది.

పోతన వీరభద్రవిజయమున, మహేశుని తపోవన వర్ణనము క్రింది విధముగ నున్నది.

"ఘనతర మాతులుంగ వటఖర్జుర రంభ కదంబ నింబ చం
దననవచంపకక్రముకతాలతమాల విశాల సాలరో
చన వరగంధ సారఘన సారయుదుంబరచూతకేతకీ
పనసలవంగలుంగ తరుపంక్తులనొప్పినదాని వెండియున్" (1-206)

కం॥ "కొలకుల దిరిగెడు హంసల
కలకల నాదముల కీర కలకలములు నుం
గల కంఠంబుల నాదము
లళి నాదములమరు సుందరారామంబున్" (1-207).

పార్వతీదేవి తపోవనమును పోతన వర్ణించిన తీరు ప్రశంసనీయము. ఆవర్ణనమిట్లు గలదు

"అకాల పల్లవ ఫలభరిత శాఖాలోక విరాజిత మందార మాతులుంగ చందన పున్నాగ తిలక కేసర కదళీ జంబీర కదంబ నింబ తమాల రసాల హింతాళ ప్రముఖ నానాభూజాత సంఘాత విలసితంబును, నిర్మల సరోవర జనిత ఫుల్లసల్లలితకమల ప్రసూనబంధుర గంధవాహధూత బలపరాగధూళీ పటల దశదిశాలంకృతంబును, ననంత లతాసిత సంఫుల్ల పరిమళ మోదమారుత సమ్మిళిత దూరదేశంబును, మరాళ శారికాకీర మధుర కోకిలాది నానావిహంగ మృదు మధు

రవచన ప్రమోదితంబునునై, సకలతపోవనరాజ్య లక్ష్మీశోభితవైభవంబనంబొల్చు" వనంబు (2-238) అనియు,

ఆ॥ ఈవనంబులోని యేపారు పుష్పంబు
లేయ మఱచెగాక యేసెనేని
కాముచేతనాడు కామారిచిక్కడే
సకల మైన వారు సంతసిల్ల" (2-241) అనియు పోతన పార్వతీ తపోవనశోభను వర్ణించెను. ఇంద్రుని ఉద్యానవనమైన నందనవనమునకు గూడ పార్వతీతపోవనమునకుగల శోభ లేదని పోతన వివరించినాడు. ఈ ఉద్యానవనమునందలి పుష్పబాణములను మన్మధుడు నాడు పరమేశ్వరునిపై ప్రయోగించియుండిన యెడల, తప్పక ఈశుడు కామునిచేత చిక్కియుండెడి వాడని పోతన చెప్పుట ఈవనశోభకు వన్నెచేకూర్చుచున్నదని చెప్పవచ్చును.

## 2. సూర్యోదయ వర్ణన :-

నన్నెచోడమహాకవి మొదలగువారు చంద్రాస్తమయ, సూర్యోదయములను ఒక్క పద్యములోనే వర్ణించిరి. ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యములో సూర్యాస్తమయ చంద్రోదయమ్ములను ఒకే పద్యములో (4-91) వర్ణించెను. వీరందరు సూర్యభగవానుని ప్రభావమహిమలను సువ్యక్త మొనరించుటకు యత్నముగావించిరి.

వీరభద్ర విజయమున పోతన సూర్యోదయ వర్ణనమును కావించియున్నాడు. చంద్రాస్తమయ ప్రసక్తియిందు కానరాదు. పోతన క్రింది పద్యమున సూర్యోదయ వర్ణనగావించెను.

"నలిన దళంబుల కలకొని వెలయించి
కువలయ దళముల క్రొవ్వణంచి
కుసుమ బాణునిపెంపు కొంత నివారించి

విరహులఁబట్టిన వెఱ్ఱి దెలిపి
యంధకారము నెల్ల హతమునుగావించి
చుక్కల తేజంబు జక్కఁబెట్టి
మదచకోరంబుల మదములు విడిపించి
నిఖిల జగంబుల నిద్రమాన్పి

ఆ॥ వేడి దీప్తి దిశల వెద చల్లిమునులును
నమర సంఘములును నర్ఘ్యజలము
లొసగఁ బూర్వశైలదెస నభి రమ్యమై
తామ్ర కిరణుడైన తరణి వొడిచె" (3-124)

పై పద్యమున, "నిఖిల జగంబుల నిద్రమాన్పి" అని అనుటచే సూర్యుడు చైతన్య ప్రదాతయని, "అంధకారమునెల్ల హతము గావించి చుక్కల తేజంబు చక్కబెట్టి" అని అనుటచే సూర్యుడు అజ్ఞానమును నంత మొందించి జ్ఞాన జ్యోతులను వెల్గించు జ్ఞాన ప్రదాతయని పోతన సూర్యుని స్వభావమును, ప్రభావమును వివరించెనని చెప్పవచ్చును.

యోగి వియోగియైన శివుని పరిణయముకున ముందు సూర్యోదయ వర్ణన ఔచితీ సమంచితమై యున్నది. జగత్పితరులైన పార్వతీశ్వరుల పరిణయమునకు జగముతెల్ల మేల్కొనినవని ధ్వని

## సూర్యాస్తమయ వర్ణన :-

సూర్యాస్తమయ వర్ణనలో, "సూర్యాస్తమయ, సంధ్యావర్ణన, అంధకార వర్ణన, నక్షత్రవర్ణన మాత్రము వచ్చు"నని (ప్రబంధములలో ప్రకృతివర్ణనలు - పుట 319) శ్రీ అంతటి నరసింహము గారనిరి.

వీరభద్రవిజయమున తృతీయాశ్వాసమున, పార్వతీదేవి కల్యాణమునకు ముందు సూర్యాస్తమయ వర్ణన గలదు.

సీ॥ తారకా సురుచేత దారుణకృత్యముల్
మానుగ నిటమీద మాననియుఁ
దారల వీధిని తలకొని మాయించు
టెంత యింతటఁ గరుణింతు ననియు
హరుపెండ్లిచూడ రండని మేరుగిరిచాటు
వారికిఁజెప్పఁ బోవలయు ననియు
గౌరీవివాహలగ్నం బెల్లి ప్రొద్దునఁ
దిరిగి తూర్పునఁ బొడతెంతు ననియు

ఆ॥ సంభ్రమించి పెండ్లిసాటించి యవ్వలి
దిక్కు మొగముచేసి తీవ్రగతుల
సకల జారిణీ వ్రజంబులు హర్షాబ్ధిఁ
గ్రుంకె నపరవార్ధిఁ గ్రుంకె నినుడు" (3-117) అను పద్యము నందలి సూర్యాస్తమయ వర్ణన కథాగమనమునకు ఉపయోగపడినది.

## అంధకారవర్ణన :-

వీరభద్రవిజయమున పోతన గావించిన నిబిడాంధకార వర్ణనము క్రింది విధముగ నున్నది

ఉ॥ "చీకటిగప్పె నాంతసము జీకటిగప్పెది గిభకుంభముల్
చీకటి గప్పె భూతలముఁ జీకటిగప్పెఁజరాచరాదులన్
జీకటి గప్పె దంపతులచిత్తపయోజవనాంతరంబులన్
జీకటి గప్పె లోకములు చికులుసేయుచు నంతకున్" (3-119).

## నక్షత్రోదయ వర్ణనము :-

పోతనగావించిన నక్షత్రోదయ వర్ణన, అతని కవితాచాతుర్యమునకు నిదర్శనమనవచ్చును.

సీ॥ "రత్నాకరముద్రచ్చు రాజు పుట్టెడు వేళఁ
దొడగిన యమృత బిందువుల నంగ
కమలవైరిని రాహుగిబళింప నంతంతఁ

దొరగు వెన్నెలరేని తునగలనగ
నాకాశలక్ష్మి దాహరుని పెండ్లికి నిరు
కేలఁబట్టిన సేసబ్రాలనంగ
నిఖిలేశునకు బ్రహ్మనీలాంబరమున మే
ల్పట్టు కట్టిన మౌక్తికంబు లనగ

ఆ॥ వీధులేర్పడంగ వెలుగు మెఱుంగుల
చిదుపలమరు భంగిఁ జెలుపు మిగిలి
గగన వీథినుండి ఘనతర నిబిడాంధ
కారమవియఁ దారకంబు లొప్పె" (3-121)

పై పద్యమున, నక్షత్రములను, విశిష్టములును, వినిర్మలశోభావిలసిత
ములును, విశేషశుభావహములును అయిన అమృతబిందువులు, వెన్నెలరేని
తునకలు, సేసబ్రాలు, మౌక్తికములు అను వానిగ భావించుట జరిగినది. ఈ
భావన భావికదను ధ్వనింప జేయుచు మనోజ్ఞముగ సాగినదనవచ్చును.

పోతనసూర్యాస్తమయ వర్ణనలో సంధ్యావర్ణన తక్క, తక్కిన సూ
ర్యాస్తమయ, అంధకార, నక్షత్రోదయాది వర్ణనలను కథతో సమ్మేళనము నొం
దునట్లు వర్ణించి తన కవితాచాతురిని ప్రదర్శించెనని చెప్పవచ్చును.

## చంద్రోదయ వర్ణన :-

ఆంధ్ర కావ్యములందు చంద్రోదయ వర్ణనకు మిక్కలి ప్రాధాన్యత
గలదు. చంద్రోదయము, చంద్రికావిలాసము మొదలగువానికి తెలుగు కవులు
అధిక ప్రాదాన్యమునిచ్చి యున్నారు. ఇట్టియెడ కవిభావుకత, విషయ పరిజ్ఞాన
ము, లోకానుభవము వెల్లడియగుచుండును.

పోతన వీరభద్రవిజయమున తారకోదయమయిన వెంటనే చంద్రోదయ
వర్ణన గావించియున్నాడు.

సీ॥ మఱిగిన విరహుల మానంబు లెడలించి
యిరవైన చీకటి యిండ్ల కనిపి
మఱి గోకముల నెల్ల మఱువులుగాఁదోలి
నీలోత్పలంబుల మేలు కొలిపి
వెలయఁ జకోరకావలికి విందులు వెట్టి
నీర జాతంబుల నిద్రపుచ్చి
వనధుల నుబ్బించి వలరాజు నెగయించి
మంద మారుతము కానంద మొసగి

ఆ॥ తనదు తెలుపుచేతఁ దలకొని నిఖిలంబు
తెలుపుఁగాగఁ దూర్పు దిక్కునందుఁ
జల్లదనము చూపి జగము లన్నింటికి
మామ యనగఁ జందమామ వొడిచె" (3-122) నని పోతన లలిత శృంగారప్రసక్తులతో చంద్రోదయవర్ణన గావించెను. ప్రేమకు, అనురాగమునకు ప్రతీక చంద్రుడు గదా!

## 4. యుద్ధవర్ణన :-

అష్టాదశవర్ణనలలో యుద్ధ వర్ణనమునకు కూడ తెలుగుకవులు సముచిత స్థానమును కల్పించిరి. సైన్యధూళి, శరమండపము, రక్తనదులు, రథ, చామర, కేతు, యోధులు యిప్పట్టున వర్ణ్యములగు చున్నవి. వీరభయానక బీభత్సరస సమంచితముగ యుద్ధవర్ణన సంతరింపబడుట పరిపాటియై యున్నది. వర్ణన కొరకుగాక కథాపటుత్వమునకీ వర్ణన ఉపయోగపడు చుండును.

వీరభద్ర విజయమున, పోతన, చతుర్థాశ్వాసమున దాదాపు 65 గద్య పద్యములలో యుద్ధవర్ణన గావించి యున్నాడు. వీరభద్రుడు దక్షుని యాగశాల కరిగి అచటనున్న దేవగణముపై విజృంభించి, వారల శిక్షించి, ఇంద్రాదులతోను విష్ణువుతోడను యుద్ధమొనరించెను. పోతన కడు మెలకువతోడ, రసపుష్టిని, కూర్చుచు ఉదాత్తముగ ఈ యుద్ధవర్ణన కావించెను.

వీరభద్రుడు, "గిరిగహ్వర గహన గుహాంతర్గతశయన సుప్తంబులైన మదగంధగజ యూథంబుల ఘీంకారంబు చేత ప్రబోధితంబై వాని వెనుదవిలి కుంభస్థల మాంసంబు నఖదంష్ట్రంబులం జించిచెండాడు సింగంబు పగిది దేవ గణంబులపై విజృంభించెను. దేవతలనుపిడుగులంబోలిన బాణజాలంబుల పఱపుచు, శూలంబుల బొడుచుచునేల పాలుచేయుచు, ఁగఠారంబుల బొడుచుచు గుఠారంబుల ఖండించుచుఁ బరశువుల నరకుచు, నత్తళంబుల నొత్తుచుఁజక్రంబుల ద్రెంచుచు. భిండివాలంబుల ఖండించుచుఁ జంచువుల విజృంభించుచు, నఖంబుల జీరుచు పాదంబులఁ జవురుచు పిడికిళ్లరువ్వుచు నరచేతులంబాదుచుఁ దూపుల బఱపుచు "అందరకు నన్నిరూపులైతోచి, గొడుగులు విరుచుచుఁ, జామరంబులఁబొడి సేయుచు. శిరంబుల గూల్చుచుశిఖలు పెఱుకుచు వదనంబులు ద్రుంచుచు నూరువులుఁబదంబులు వ్రచ్చుచు గళంబులు గోయుచు ముక్కులు జిదుముచు ప్రేగులు గొంచుచు కన్నులు బెఱుకుచు చెవులు ద్రెంచుచుఁ గిరీటంబులు పతతాడనంబున రాల్చుచు కండలు చెండుచు, రక్తంబులుగ్రోలుచు నెముకలు రాల్చుచుఁబడద్రోచి పండ్లు పీకుచుఁ గొందఱహోమగుండంబుల నిండను ద్రెల్చుచు మకరంబులు ఖండించుచు" (4-108) వీరభద్రుడు హింసించెను

అయినను వీరభద్రునకు కసిదీరలేదు పుడమి మన్నుగఱువగ దేవేంద్రుని, రక్తముగ్రక్కగ సూర్యునితన్నినాడు. అగ్ని జిహ్వలను దెగఁగోసినాడు. యముని నేలగూల్చిబొమ్మద్రొక్కి నిలిచినాడు. నైరృతి వరుణులను గదాఘాతములచే నేల గూల్చినాడు. సరస్వతి వాణిముక్కుదుదిగోరున జిదిమినాడు. అగ్నిదేవుని ఇల్లాలి ముకుచను, వృత్తస్తన శిఖరముల, దుదిగోర ద్రుంచినాడు. సూర్యుని పండ్లూడగొట్టి తగుబుద్ధి చెప్పినాడు. చంద్రుని భూగతునిగజేసి పాదముల ద్రొక్కినాడు. ఇంకను తృప్తిపడక,

"పట్టిసంబుల ద్రుంచి పలుబాణములనొంచి
ముసలాయుధంబుల మోది మోది
అలుగుల నాటించి యరచేతులను వ్రేసి
ముష్టి ఘాతంబుల ముంచి ముంచి
కత్తుల నెఱయించి గదల క్రుళ్లణగించి

భూరి శూలంబుల బొడిచి బొడిచి
శక్తుల దూలించి చక్రాల బరిమార్చి
పటునారసంబుల బఱపి పఱపి

తే॥ పెనచి నరములు ప్రేగులు పెఱికి బెఱికి
చెనకి మేనుల పట్టలు చిరి చీరి
డాసి చెక్కులు ముక్కులు గోసి కోసి
వీరభద్రుండు వేల్పుల దోలవొడగె"ను (4-130). మరియు,

సీ॥ "ఒకమాటు కత్తుల నొరలంగగుత్తుకల్
విడిపించి తనతోటి వెలదికిచ్చు
నొకమాటు హూతల కుఱికి మర్త్యంబులు
ఖండించి భూత సంఘములకిచ్చు
నొకమాటు నఖముల నూరుస్థలంబులు
వ్రచ్చి బేతాళసవ్రజము కిచ్చు
నొకమాటు గదలచే నూరుతలంబులు
మురియించి మృగ సంఘములకు నిచ్చు

ఆ॥ ఒక్కమాటు గముల నొక్కటుపెండాడు
నొక్కమాటు సురల నొల్లబుచ్చు
వీరభద్రురణము వేఱెవ్వరిని బోల్ప
వచ్చు నతనిబోల్ప వచ్చుగాక" (4-133) అని పోతన వీరభద్రుని, రణమున సాటిలేని వీరునిగ చిత్రించెను. ఇంతియేగాక వీరభద్రుడు, అచటివారందరు చూచుచుండ, అలుగులు నాటించి, శూలములగ్రుమ్మి దక్షుని శిరము ఖండించెను.

వీరభద్రుడు విష్ణువుతో గావించిన యుద్ధము క్రిందివిధముగ వర్ణింపబడియున్నది వీరభద్రుడు దక్షుని శిరంబు ఖండించిన పిదప దేవజనంబు భీతిల్లి పరుగెత్తుచుండ విష్ణువు వీరభద్రునితోతలపడెను.

వీరభేరీ మృదంగశంఖ కాహళ నిస్సాణాది వాద్యములు చెలంగుచుండ వీరభద్ర విష్ణువులు సమరమునకు తలపడిరి. గుణఘోషంబులు దిగంతరాళంబుల దిగులు గొలుపుచుండ, "మహార్ణవము మహార్ణవమును, గిరీంద్రంబు

గిరీంద్రంబును ....తాకి పోరాడు చందమున సముల్లై అసమాన రణవిహారం బులు సలుపుచు ......కంఠీరవంబులుంబోలె గర్జించుచు....... " అతిభయంకర ముగ సంగరము చేయుచుండిరి (4-152). చివరకు విష్ణువు నారాయణాస్త్ర ప్రయోగంబుచేయగ వీరభద్రాస్త్రమును వెడలించి తద్బాణమును భద్రుడు త్రుం చివైచెను. వీరభద్రుడు తీవ్రబాణ తతుల హరి కోదండమును విఱిచెను. గరు త్మంతుని రెక్కలు తునిమెను. అందులకు మాధవుడు కోపించి శంఖ చక్రధ రుల కొందర పుట్టించెను భద్రుడు వారల శిఖనేత్రజ్వాలల దహించినాడు. పిమ్మట,

"ఏపున సేయగా వెఱచి యెత్తిన చక్రముతోడ బీతిలి
క్ష్మాపతి సింహము న్గదిసి చిక్కినయేనుగు బోలె నేలపైఁ
జూపులు చేర్చి చేడ్పడినఁజూచి దిగీంద్రులు డాయకుండఁగాఁ
గోపమునొంది భద్రుడును క్రూరశరంబులనేసెనుగ్రుడై" (4-159)

చివరకు విరథుండైన, నిర్వికార నిశ్చేతనుండైయున్న మాధవుంజూచి యవ్వీరుండు తన బాణజాలంబుల నతని ప్రాణంబులుగొన సమకట్టి యీశ్వర ప్రియుండని మనంబునందలంచి" (4-170) వదలి నట్లు గలదు.

పై పటమున పోతన శైవపక్షపాతమును ప్రదర్శించినను, విష్ణుదేవుని ఓటమిని మాత్రమేచెప్పి, శిక్షనుచెప్పక ఉదాత్తతను ప్రకటించియున్నాడు. ఇవీ పోతన సంస్కారము

ఇంద్రుడు వీరభద్రునిపై తన వజ్రాయుధమును ప్రయోగింపగ, దానిని వీరభద్రుడు చేజిక్కించుకొని, దేవగణమును బంధీకృతులను గావించెను.

పై విధముగ పోతన వీరభద్రవిజయమున యుద్ధవర్ణన గావించి తన కవన చాతురిని ప్రదర్శించి యున్నాడు భావములకు తగిన భాషనుపయోగించి చిత్తదీప్తిని కల్గించి, పోతన వీరరౌద్రాది రసములను పోషించెను.

## 5. సముద్ర వర్ణన :-

కావ్యములందు సముద్రవర్ణన సామాన్యముగ అలంకార సమన్వితమై

అలచుచుండును, అలలు, జలచరములు, నదీప్రవేశము, బడబాగ్ని, మేఘ ములు ప్రాలుట మొదలగు అంశములకు ఇందు చోటు కల్పింపబడును.

వీరభద్రవిజయమున తృతీయాశ్వాసమున క్షీరసాగర వర్ణన గలదు.

"అల్లకల్లోల మాలికారావ నిరంతర బధిరీ భూత దిగంతరాళంబును, మకర కమఠ కర్కాటక మండూక తిమి తిమింగలాది జలచరావాసంబును, క్రౌంచకాదంబ కారండవ కర్కశ సారస చక్రవాకాది విహంగమ నివాసంబును, అకాల కుసుమ ఫల భరిత నానా తరులతా విరాజిత వేలాయుతంబును, సనక సనందనాది మునీంద్ర సంచారణంబును ననంత గంభీరంబును నఖిల రత్న సముదయ జనదేశంబును జలజనయన శయన స్థానంబును నమృతజలమయం బునునై వైకుంఠపురసమీపంబున నొప్పుచున్న క్షీరార్ణవంబు" (3-218) అని ప్రకృతసిద్ధమగు సాగరసహజవిధానము చక్కగ వివరింపబడియున్నది. అలలు జలచరములు, లతాంతములుగల లతలు, రత్నములు, మునిగణము, అమృ తజలము మొదలగు సమస్త విషయప్రస్తావన యందు గలదు అనంతమైన సాగరమును సాకారముగ పోతన సాక్షాత్కరింప జేసినాడు.

## 6. పురవర్ణన :

సామాన్యముగ పురవర్ణనమున కవులు, దుర్గము, పరిఖ, తోరణములు, ధ్వజములు, ప్రాకారములు, ఆరామములు, మార్గములు, వేశ్యావాటికలు, మొదలగు అంశములను వర్ణనీయములుగ చూపిరి

వీరభద్రవిజయమున పోతన అమరావతీపుర వర్ణనమును అతి సుందర ముగ కావించియున్నాడు

సీ॥ "కొమరొంది పొడవైన గోపురంబులచేతఁ
దనరారు దివ్యసౌధములచేత
బహురత్న కాంచన ప్రాసాదములచేతఁ
గమనీయ విపణి మార్గములచేత
పుణ్యజనాళిచే బృందారకాప్సరో

గంధర్వ కిన్నర గణముచేత
బహు విమానములచే బహువాద్యములచేత
బహు వనాంతర సరః ప్రతతిచేత

ఆ॥ పసిడి కొండమీద బహువైభవమ్ముల
లలితదేవరాజ్యలక్ష్మి మెఱసి
సకల భువన భవన చారుదీపంబైన
పట్టణంబు వజ్రి పట్టణంబు" (2-31) అను పద్యమున ఎత్తయిన గోపురములు, దివ్యసౌధములు, విపణి మార్గములు, విమానములు, బృందారకాప్సరోగణములు, వనములు, సరసులు మొదలగు వాని ప్రస్తావనగలదు. సకల లోక భవనచారు దీపము అమరావతీ పట్టణము అని పోతన గావించిన కల్పన మనోహరము. దేవరాజ్యలక్ష్మి పసిడి కొండమీద బహువైభవమ్ముల మెరయుట ఔచితీ శోభితము. అమరావతి వజ్రి పట్టణము. అనగా వజ్రాయుధుడైన దేవేంద్రునిచే సదారక్షింపబడునది. కనుకనే సకల భువన భవనములకు మనోజ్ఞమైన దీపమైనది. భావనలో మాధుర్యమును, శైలిలో సరళతను సంతరించుకొని ఈ పురవర్ణన మనోజ్ఞముగ నున్నదన వచ్చును.

మూడవ ఆశ్వాసమున, పోతన, పార్వతీకల్యాణమును పురస్కరించుకొని మనోజ్ఞముగ అలంకరింపబడిన ఓషధిప్రస్థమును వర్ణించిన విధము క్రింది విధముగ నున్నది.

కం॥ మణులను గనకంబుల ద
ర్పణముల నవపల్లవముల బహువస్త్రములన్
ప్రణుతగతిని నెత్తిరి తో
రణములు పురవీథులందు రచ్చలయందున్" (3-114)

సీ॥ మృగనాభిజలములు ముంగిళ్ల జల్లిరి
ముగ్గులు దీర్చిరి ముత్తియములఁ
దనర నంగళ్లఁ జిత్తరువులు వ్రాసిరి
హేమకుంభము లెత్తిరిండ్లనెల్లఁ
బహుమార్గముల నంది పడగలు గట్టిరి
కీలించి కట్టిరి మేలుకట్లు
కమనీయ గతుల వాద్యములు మ్రోయించిరి
యెలమి శృంగారించి రెల్లచోట్ల

ఆ॥ బరఁగ సకలలోకపతికి సమర్పింప
నాయితములుచేసి రఖిల మణులు
సర్వజనులు మిగులు సంపద నొందిరి
భూధరేంద్రుఁడేలు పురము నందు" (3-115) అను పైరెండు పద్యము

అందు తోరణములతో, మృగనాభిజలములతో, ముత్యాల ముగ్గులతో, చిత్తరువులతో అలంకరింపబడిన ఓషధి పురమును పోతన మనోజ్ఞముగ వర్ణించెను.

## 7. వివాహవర్ణన :-

"స్నానము, అంగభూషణములు, తూర్యవేదఘోషములు, సంగీతహెూమలాజలాదులును వర్ణ్యములు" అని శ్రీ సన్నిధానమువారు వివాహ వర్ణనమున వర్ణింపబడు వానిని గూర్చి చెప్పెను. వివాహ సంబంధమైన ఆచారములు ఈవర్ణనమున వివరింపబడును.

వీరభద్ర విజయమున పోతన తృతీయాశ్వాసమున పార్వతీపరమేశ్వరుల వివాహము వర్ణింపబడి యున్నది. అందు పోతన తెలుగువారి వివాహమునకు సంబంధించిన ఆచారవ్యవహారములను వివరించియున్నాడు.

మహేశ్వరుడు విడిదికి వచ్చుట, వధూవరులకు మంగళ స్నానములు చేయించుట, క్రంతలు నడచుట, వరునకు కాళ్లుకడిగి మధుపర్కమిచ్చుట, తెరవారబంచుట, కన్యాదానముచేయుట, తలంబ్రాలుపోసికొనుట అను మొదలగు అంశములు వర్ణింపబడియున్నవి.

పార్వతీ పరమేశ్వరు తలంబ్రాలుపోసికొనిన విధమును,

"లీలన్ బార్వతి సేసలన్ శివునిమౌళిన్ బోసెదాఁగోరికల్
కేలం దోయిటఁబట్టి శంకరునిపైఁగీలించెనో నాగ న
వ్వేళన్ సత్కృపదోయిలించి సతిపై విశ్వేశ్వరుండిచ్చెనాఁ
బోలన్శంభుడు ప్రాలుపోసెఁ దలపైఁబూర్ణేందు బింబాస్యకున్(3-183)అను

పద్యమును పోతన రమ్యముగ ఉత్ప్రేక్షాలంకార సహితముగ వర్ణించియున్నాడు.

ఇంకను పోతన, లాజహోమము చేయించుట, అరణమిచ్చుట, అప్పగింతలు అను అంశములను గూడ వీరభద్రవిజయమున వర్ణించియున్నాడు.

## 8. గిరివర్ణన :-

ప్రకృతివర్ణనలలో పర్వతవర్ణనకు ప్రముఖస్థానమున్నది. వేదవాఙ్మయమునుండియు పర్వత వర్ణన కన్పట్టుచున్నది. సామాన్యముగ గిరివర్ణనమున, ఓషధులు, ధాతువులు, వెదుళ్లు, నిర్ఝరులు, కిన్నరులు, శృంగములు, తటములు, వనజంతువులు మొదలగునవి వర్ణ్యములై కన్పట్టుచుండును.

వీరభద్రవిజయమున తృతీయాశ్వాసమున హిమవద్గిరి వర్ణన గలదు.

సీ॥ మింటి చుక్కలతోడ మేలమాడుచునున్న
ఘనమేఘ సంఘంబు గలుగుదాని
హరితపాపన హామిరుహంబులు
కమలాకరంబులు గలుగుదాని
గంధర్వఖేచరగణ విమానంబులు
గప్పిన రత్న శృంగముల దాని
శుకపికశారికా నికర ధ్వనులచేత
నతిరమణీయమై యలరుదాని

ఆ॥ సిద్ధ దంపతులు వశీకృతకాములై
సాను తలములందు సరసమాడ
జెలువు మిగులు దాని శీతాచలేంద్రంబు
గరము వేడ్కతోడఁగనిరి మునులు" (3-31) మరియు,

చ॥ సలలిత కామధేనువులఁ జందనకల్ప మహీరుహంబులన్
లలిత తరంగిణీ తటములంగరుడామర సిద్ధ కన్యలన్
విలసిత సూర్యకాంతముల విస్ఫురితేందుశిలాతలంబులన్
చెలువగు భూధరేంద్రమును శీతనగేంద్రముఁగాంచె సంయములే" (3-33)

అను రెండు పద్యములలో, మొదటి పద్యమున, వృక్షతతి, కమలాకరములు శుకపికశారికానికరధ్వనులను, వశీకృతకాములై సరసమాడుచున్న సిద్ధ దంపతులను పోతన వర్ణించి యున్నాడు. పెండ్లి పెద్దలగు మహర్షి సంఘమ్మునకు సిద్ధ దంపతుల దర్శనము శుభసూచకము కావచ్చును

రెండవ పద్యమున కామదేనువుల యొక్క, చందన మహీరుహముల యొక్క, తరంగిణీ తటముల విహరించు గిరుడామరసిద్ధకన్యల యొక్క వర్ణన గలదు. పోతన హిమగిరివర్ణన రామాయణములోని అయోధ్యకాండలోని వాల్మీకి చిత్రకూట వర్ణనమును తలపించు చున్నదనవచ్చును.

## 9. విరహవర్ణన :-

విరహమున తాపము, నిశ్వాసము, చింత, మౌనము, జాగరణము, కృశాంగత్వము, క్షణములు సంవత్సరములుగ, రాత్రులు దీర్ఘములుగ, శిశిరము ఉష్ణముగ వర్ణింపబడు చుండును. ఇంకను యిందు శిశిరోపచారములు వర్ణింప బడును, చంద్రోపలంబనాది వర్ణనము దీనికి అనుసంధింపబడును.

పోతన, వీరభద్ర విజయమున గావించిన పార్వతీ విరహవర్ణన క్రింది విధముగ నున్నది.

యౌవనమునందడుగిడిన పార్వతి ఈశుని పొందికనాశించినది. అందు లకై ఎదురుతెన్నులజూడ సాగినది

సీ॥ శృంగారములుసేయ శృంగారి యొల్లదు
 పువ్వులు దురుమదు పువ్వుబోడి
పలుకంగనేరదు పలుకనేరనిభాతిఁ
 జంచలత్వమునొందుఁ జంచలాక్షి
సరసులఁ గ్రీడింప సరసి జానన వోదు
 మౌనంబుతోఁగుందు మానవిభవ
గంధంబు పూయదు గంధవారణయాన
 చెలువలఁ బిలివదు చెలుల చెలియ

తే॥ ముకురమే ప్రొద్దుఁజూడదు ముకురవదన
తరుణి మఱియును సర్వకృత్యములు మఱచి
హరునితోడిదె గొండాటయై లతాంగి
యుగ్ర తాపంబు సైరింపకున్నఁజూచి" (1-202)

ఆ॥ "కూడియాడుచున్న కోమలి జనములు
శిశిరవిధులఁగొంత సేదదీర్చి"రి (1-203) అను పద్యములందు ఉమాదేవి

అలంకరణమానుకొని, మౌనమువహించి, సమస్త కార్యములు మరచి, హరుని తోడిదేలోకమై మిక్కలి తాపముననుభవించు చుండగ, ఆమెతో కూడియాడుచున్న చెలులు శిశిరవిధుల ఆమెకు సేదదీర్చినట్లు పోతన వర్ణించియున్నాడు. "హరుని తోడిదెగొండాటయై" యుండెననుట మనోజ్ఞమైన ప్రయోగము.

ద్వితీయాశ్వాసమున, శంకరుడు ఎఱుకతగవచ్చి పార్వతికి ఎఱుకజెప్పి నిజరూపమును చూపి అదృశ్యుడగును. అపుడు పార్వతి అనుభవించిన విరహమును పోతన క్రింరివిధముగ వర్ణించియున్నాడు.

సీ॥ వినరమ్మనామాట విశ్వేశ్వరునిఁ బాసి
నిలువంగ నేరనో నెలఁతలార
నాగేంద్రుధరుమీద నాకోరికలు పర్వి
పాయంగ నేరవో భామలార
వలరాజు వెసఁదోచి యలరుల బాణంబు
లేసి నొప్పించెనో యింతులార
నగములరాజుతో నాప్రకారంబెల్లఁ
దెలియంగ జెప్పరే తెరవలార

ఆ॥ రమణులార నిలువరాదింకఁ దాపంబు
సరసి జాక్షులార సైపరాదు
ఒక్క దినము గడుచు టొక్కవత్సరముదా
గడచుటయ్యెనాకుఁ గాంతలార" (2 - 212) ఒక్కదినము పార్వతికి ఒక వత్సరముగనున్నదట.

## 10. స్త్రీవర్ణన :

వీరభద్ర విజయమున, పోతన, పార్వతీదేవివర్ణన తృతీయాశ్వాసమున కావించియున్నాడు. పార్వతియొక్క అవయవ సౌందర్యమును సప్తర్షులచేత క్రింది విధముగ చెప్పించెను.

కం॥ "ఆ కన్నులు నాచన్నులు
నాకురులాముద్దుమోము నానెనరులార

మ్యాకారము నామర్థ్యము
నే కాంతలయందు నెఱుగమిభచర్మధరా" (3-62)

సీ॥ "జలజాక్షినెమ్మోముఁ జందురుబోల్తమా
చందురు నందునఁగందు గలదు
కన్నియ వదనంబుఁ గమలంబు బోల్తమా
కమలంబు పుట్టుచోఁగసటు గలదు
మోహనాంగి ముఖంబు ముకురంబుఁబోల్తమా
ముకురంబు నందున మృదువులేవు
మానిని వచనంబు మణిపంక్తిఁ బోల్తమా
మణులెల్ల రాలనుమాట గలదు

ఆ॥ ఇంకనేమిబోల్త మింతి యాననముతో
సృష్టినేమి సాటి సేయ వచ్చు
మగువ మొగము కాంతి మలహరనీయాన
త్రిభువనంబులందు నభినవంబు" (3-68)

ఉ॥ 'సోమునిఁదోడు తెచ్చుకొని స్రుక్కక చిల్కలుఁదేంట్లు గొల్వగా
గాముడు విల్లునమ్ములు నఖండతబట్టినయట్లు దోచునా
బామముఖాబ్జరేఖయును బల్కును గొప్పునుభ్రూలతాంగమున్
గాముడు నీవు చంపుటయుగల్లనిపించె శశాంకశేఖరా" (3-66)

ఇంకను, పార్వతి కురులు ఇంద్రనీలములకంటె, నీలాళులకంటె మిన్నగనున్నవని, పార్వతి ఫాలభాగము బాలేందునికంటె మిన్నయైనదని, పార్వతి కనుబొమలు మదనుని విల్లువలెనున్నదని, పార్వతి మృగలోచనములు ఇందీవరములకంటె మిన్నగనున్నవని, పార్వతీ కరములు కోమలత్వమున పల్లవములను మించియున్నవని వీరభద్రవిజయమున పోతన వర్ణించియున్నాడు.

పై విధముగ పోతన, వీరభద్రవిజయమునందు, అష్టాదశ వర్ణనలలోని వనవర్ణన, సూర్యోదయ, సూర్యాస్తమయవర్ణన, చంద్రోదయవర్ణన, యుద్ధవర్ణన, సముద్రవర్ణన, పురవర్ణన, వివాహవర్ణన, గిరివర్ణన, విరహవర్ణన, స్త్రీవర్ణనలను వర్ణించిన విధమును సహేతుకముగ పరిశీలించుటమైనది.

## అలంకారములు :-

"నకాంతమపి నిర్భూషం వనితాముఖమ్' అని అలంకారికుల అభిప్రాయము. ఆభరణ రహితమైయుండు కాంత ఏవిధముగ శోభించదో, అలంకార లేమితో కావ్యమును ప్రకాశింపజాలదని వారి ఆలోచన. నన్నెచోడమహాకవి, కావ్యము "షట్త్రింశదలంకారాలంకృతంబై" (1-45) ఉండవలయునని, అలంకారములు గూడ కావ్యశోభకు మూలాధారములని వక్కాణించెను. అలంకారములు కవి కల్పనా నైపుణ్యమును వ్యక్తీకరించును. కావున కవులు అలంకారములతో కావ్యముల నలంకరించి తత్సౌందర్యమును ఇనుమడింప జేయుచుందురు. అలంకారములు శబ్దార్థభేదములతో రెండు విధములుగ కన్పించుచున్నవి. 1. శబ్దాలంకారములు, 2. అర్థాలంకారములు.

## 1. శాబ్దాలంకారములు :-

అర్థమునపేక్షింపక శబ్దముల నాశ్రయించునవి శబ్దాలంకారము లనబడును. శ్రవణ సుఖమును కలిగించు శబ్దముల పొందికకూడ కావ్యశోభకు మూలములే యగుచుండును. రసప్రసంగము పట్లను, రసప్రసంగములేని పట్లను గూడ శబ్దాలంకారములు ఛందమును శ్రుతిరంజకము గావించి చరితార్థములగుచుండును

## అనుప్రాసము :-

రసానుగతమగు ప్రకృష్టమగు వర్ణవిన్యాసము అనుప్రాసము రసము విభావాదులచే పుష్టమగుచున్నను, కొన్ని వర్ణనలు కొన్నిరసములను వ్యక్తము చేయునని అలంకారికుల విశ్వాసము. రసస్ఫోరకమైన అట్టి వర్ణవిన్యాసమే అనుప్రాసము "ప్రకృష్టో వర్ణ విన్యాసోరసాద్యనుగతో హియః, సోఽను ప్రాసస్స చచ్ఛేకవృత్త్యాదిగతో ద్వివిధా" (ప్రతాపరుద్రీయమ్ - పుట 291) అని గలదు

వీరభద్రవిజయము నందలి శబ్దాలంకార విన్యాసములను క్రింది విధముగ పరిశీలించుట గలదు

## వృత్త్యనుప్రాసము :-

ఒకటిగాని, రెండుగాని, అంతకన్న నెక్కువ హల్లులు పలుమార్లు ఆవృత్తి యగుట వృత్త్యను ప్రాసము.

ఉదా :- కం॥ "వడవడ వడకుచు నుడుగుచుఁ
జడిముడి మయినొంది కలగి చింతాకులయై
వెడఁగు దనంబున నిలుచునుఁ
గడువాడిన పువ్వుభంగిఁ గాంతిదొఱంగన్" (1-107).

వీరభద్ర విజయమున గల పై పద్యమున "వ", 'డ" అను హల్లులు పలుమార్లు అవృత్తియగుచున్నవి. కనుక ఇది వృత్త్యానుప్రాసము.

ఉదా॥ "పెదవులు దడపుచు గొంకుచు
నదరుచు బెగడుచును నడుగులల్లన నిడుచున్
వదనము వంచుచు నడగుచుఁ
దుదినాలుక తొట్రు పడగఁదొయ్యలి వగతోన్" (1-108) అను పై పద్యమున, ద,డ,చు,న అనునవి ఆవృత్తియగుచున్నవి. ఇంకను,

"ఉడురాజ ధరున కెల్లను
దొడవయ్యెడు నాకుఁదొడవుఁదొడుగగ నేలా
తొడవులు దొడిగినఁ గొఱతని
యుడురాజోత్తమునిఁజూడ నొక్కతెవచ్చెన్" (3-152) అను పద్యమున డ, ద, కారములు అవృత్తియగుచున్నవి. వృత్త్యనుప్రాసమునకు ఎన్నియో ఉదాహరణములను పోతన వీరభద్రవిజయమున చూపించవచ్చును.

## లాటానుప్రాసము :-

వచ్చినపదమే మరలవచ్చి అర్థభేదము లేకున్నను తాత్పర్య భేదమున్న యెడల లాటాను ప్రాసమగును. పోతనకు లాటాను ప్రాసము ప్రీతి పాత్రమైన అలంకారమని చెప్పవచ్చును.

వీరభద్రవిజయమున లాటానుప్రాసములకు కొదువలేదు.

ఉదా :- "జగములోపల గల జంతురాసులబట్టి
మనసులఁగలచు నీమహిమ మహిమ
నాటుచోగంటు గానగరాక వాడియై
సరిలేక నాటు నీ శరము శరము
పరమేష్టి సృష్టిలోపలి పురుషుల కెల్ల
దీపమై వెలుగు నీ రూపు రూపు
అఖిలంబు నెందాక నందాక నందమై
పృథుతరంబైన నీ బిరుదు బిరుదు
ఆ॥ శూలినైనఁదాపసులనైనబాధింతు........నిరుపమాంగ" (2-58)

పైపద్యమందు, మన్మథునియొక్క మహిమయే మహిమయని, ఆతని వాడియైన శరమే శరమని, ఆతని రూపమే రూపమని, ఆతని బిరుదమే గొప్ప బిరుదమని తాత్పర్యభేదమున మహిమ, శరము, రూపు, బిరుదు అను పదములు రెండవమారు ప్రయోగింప బడియున్నవి. ఇంకను కొన్ని పద్యములను చూడవచ్చును,

ఉదా:- సీ॥ "పట్టిసంబులఁద్రుంచి పలుబాణముల నొంచి
ముసలాయుధంబుల మోది మోది
అలుగులునాటించి యరచేతులనువ్రేసి
ముష్టిఘాతంబుల ముంచి ముంచి........"(4-130)

ఉదా॥ సీ॥ బహుతంత్రములచేత భాసిల్లియందంద
వేదనాదములచే వెలపి వెలసి
విదిత వైభవముల విలసిల్లి విలసిల్లి
కలకలరవములఁ జెలగి చెలగి........" (4-87)

ఇట్లు అనేకములను వీరభద్రవిజయమున చూడవచ్చును.

## అంత్యానుప్రాసము

పదాంతమునగాని, వాక్యాంతమునగాని వర్ణములు పునరుక్తములగుట అంత్యానుప్రాసము, ఇందులకు వీరభద్రవిజయమున కొన్నిపద్యములను చూడవచ్చును.

ఉదా .- కుంభిని ద్రెంతునో జమునిని గుండెలు చెండుదునో సురాచల
స్తంభము ద్రెంతునో సురలచట్టలు చీరుదునో కడంగి ది
క్కుంభుల ద్రుంతునో యజుని క్రొవ్వణగింతునొ సూర్యచంద్రులన్
జృంభణమెల్ల మాన్పుదునొ చుక్కలడుల్తునొ పార్వతీశ్వరా" (4-64)

పై పద్యమున వాక్యాంతమున "నొ" అను వర్ణము పునరుక్తమై శ్రుతి రంజకముగ, అర్థవంతముగనున్నది. మరియు,

"కాయజసంహరాయ శశిఖండధరాయ నమశ్శివాయ కా
లాయ హరాయ భీషణబలాయ కపాలధరాయ దేవదే
వాయ యమాంతకాయ దృఢ వజ్రపినాక త్రిశూలదండహ
స్తాయ మునీంద్రయోగి వరదాయ సురాధిపతే! నమోస్తుతే" (3-236) అను పద్యమున శివనామముల చివర "య" కారము పునరుక్తమగుచున్నది. ఇట్టివి వీరభద్రవిజయమున కోకొల్లలు

## ఛందోஉలంకారములు :-

ఛందశ్శాస్త్ర సంబంధమైన శబ్దాలంకారములు ఛందోஉలంకారములన బడును. సాధారణముగ కానవచ్చు శబ్దాలంకారములు పద్యమునను, గద్యమునను ఉండవచ్చును. ద్విప్రాస, త్రిప్రాసాది షడ్విధ ప్రాసలు, మొదలగునవి ఛందశ్శాస్త్రబద్ధములైన పద్యములందే కాననగును. కనుక వీనిని "శబ్దాలంకారములనుట యందు సామంజస్యములేదు. ఛందమునందే యుండదగినవి కావున వీనికి ఛందోஉలంకారములని వ్యపదేశము చేయబడుచున్నది" (ఆంధ్రమహాభారతము ఛందఃశిల్పము - పుట 150) అని శ్రీపాటిబండ మాధవశర్మగారనిరి.

పద్యము నందలి ప్రాసాక్షరము పలుమార్లు అవృత్తియైన అది ఛందోలంకార సంబంధమైన అను ప్రాసము. వీరభద్ర విజయమున ఛందోలంకారములు దర్శనమిచ్చుచున్నవి.

ఉదా :- 'ఏరాదక్షయదక్ష మానసవృథా యీ దూషణంబేలరా
యోరీ పాపములెల్లఁబో విడువరా యుగ్రాక్షుఁజేపట్టరా

వైరం బొప్పదురా శివుందలపరా వర్ణింపరా రాజితో
త్కారాత్మ్మండగు నీలకంఠుఁడెగడంగా రాదురాదుర్మతీ" (1-146)

అను ఈ పద్యమున "ర" కారము ప్రాసాక్షరము. ఇది ప్రతివాక్యము చివరను ప్రయోగింపబడినది. ప్రాసాక్షరమే పలుమార్లు ఆవృత్తిఅయినందున,దీనిని ఛందోఽలంకారముగ చెప్పవచ్చును.

## ద్విప్రాసము :-

రెండక్షరములు ప్రాసంబుననిడి చెప్పునది ద్విప్రాసము. ఇందు వ్యంజనమునకే ప్రాధాన్యము. స్వరము భేదిల్లినను దోసముండదు. ఉదా :-

కం॥ "నిత్యము నీగంభీరత
నిత్యము కరుణాబ్ధియైన నీచిత్తంబున్
నిత్యము నీ కృత్యంబులు
నిత్యము నినుగొలువనిమ్ము నిర్మలమూర్తీ" (3-243) అను పద్యమున "త్య", "ము" అను రెండు వర్ణములు ప్రాసమున కూర్పబడి నాలుగు పాదములందు భాసిల్లుచున్నవి. ద్విప్రాసమునకు ఇంకను కొన్నిపద్యములు గలవు.

ఉదా.- "యాగము లోపల శివునకు
భాగము గలదనుచు శ్రుతులు పల్కినచో నీ
భాగము నీకిచ్చెద నీ
యాగములఁదెలుపుమనిన నతివేగమునన్" (4-98)

పై పద్యమున, "గ", "ము" అను రెండువర్ణములు నాలుగు పాదములందు ప్రాసమున కూర్పబడియున్నవి,

## త్రిప్రాసము :-

అక్షరత్రయమును ప్రాసమున నిడిన త్రిప్రాసము.

ఉదా .- "శరణార్థి భక్తవత్సల
శరణార్థి పురాణయోగి జనమందారా
శరణార్థి దురితసంహర
శరణార్థి మహేశ రుద్రజలజాక్షనుతా" (3-94) అను పద్యమున "ర", 'ణా", "ర్థి" అను మూడక్షరములు నాలుగు పాదములందు ప్రాసముగ కూర్పబడియున్నవి.

## చతుః ప్రాసము :-

నాలుగు అక్షరములను ప్రాసస్థానమున సంతరించిన చతుఃప్రాసము.

ఉదా :- "చనుదెంచితె కుసుమాయుధ
చనుదెంచితె పంచబాణ శంబరవైరీ
చనుదెంచితె కందర్పక
చనుదెంచితె యెల్లపనులు సమ్మోదములే" (2-40) అను ఈపద్యమున, ను, దెం, చి, తె అను నాలుగు వర్ణములను నాలుగు పాదములందు ప్రాసమున కూర్చి పోతన చతుఃప్రాసమును పాటించెను.

## పంచప్రాసలు :-

అక్షరపంచకమును ప్రాసముననిడి చెప్పుట పంచప్రాసలు. ఉదా :-

"నినుదెలిమక మతిమాలితి
నినుదెలియక ఖలుడనైతి నీలగ్రీవా
నినుదెలియక గతిఁ దప్పితి
నినుదెలియక మరులుకొంటి నిరుపమమూర్తీ" (4-207) అను పద్యమున "ను,దె,లి,య, క" అను ఐదువర్ణములు నాల్గుపాదములందు ప్రాసముగ కూర్పబడియున్నవి.

పైవిధముగ కూర్పబడిన అలంకారములన్నియు అప్రయత్న సిద్ధములు కావున ఈవిధముగ పోతన వీరభద్రవిజయమున శాబ్దాలంకారములను, ఛందోఽలంకార విశేషములను కూర్చి కావ్యమునకు శోభను కూర్చెననిచెప్పవచ్చును.

## అర్థాలంకారములు :

అర్థసంబంధమైనవి అర్థాలంకారములు. వీరభద్రవిజయము నందలి అర్థాలంకారములను క్రిందివిధముగ పరిశీలింపవచ్చును.

## 1. ఉపమ :-

"బ్రహ్మజ్ఞానమువలన సమస్తవిశ్వము దెలియబడిన విధమ్మున నుపమా జ్ఞానము వలన సమస్తాలంకారజ్ఞానము లభించును" (కావ్యాలంకార సంగ్రహము పుట - 563) అని శ్రీ సన్నిధానము వారు తెల్పిరి.

ఉపమానమునకు ఉపమేయమునకు సామ్యమును చక్కగ వర్ణించిన యెడల అది ఉపమాలంకార మనబడును. వీరభద్ర విజయమున ఉపమాలంకారములు కొల్లలు. మచ్చునకు,

"నిదురబోయిన పంచాననంబు నందంద మేలుకొలుపు మదగజంబు చందంబున నిందిరానందనుండు........సచ్చిదానంద హృదయుండగు నమ్మహేశ్వరుంగాంచి యల్లనల్లనడాయంబోయి తదీయాభిముఖుండై" (2-99) అను వచనమున, నిర్గుణుండును, నిర్వికారుండును, యోగధ్యానసంతత భరితాంతరంగుండునునై, తన్మందాన తలపోయుచునశ్రాంతసచ్చిదానంద హృదయుండై యున్న ఈశ్వరునకు "నిదురబోయిన పంచాననము"తో పోలిక చెప్పబడినది. పంచానన మనగ సింహము అని అర్థము. కాగా, ఈశానము, తత్పురుషము, వామదేవము, సద్యోజాతము అఘోరము అను ఐదుముఖములుగల మహేశునకు "పంచాననుడు" అని ప్రసిద్ధము. కనుక ఈశ్వరునకు పంచాననముతోడ పోలిక అర్థవంతము, ఔచిత్యశోభితము. మన్మథుని మదగజముతోడ పోల్చినాడు. సర్వేశ్వరునిపైకి వచ్చిన మన్మథుని మదగజముతో పోల్చుటగూడ ఔచిత్యమే. కనుక ఈవచనము ఉపమాలంకారసహితము. ఇంకను,

1. "వడవడవడకుచు నుడుగుచు.... ...
గడువాడినపువ్వుభంగిఁగాంతి దొఱంగున్" (1-107) అను పద్యము,

2. "శ్రీలలాటము సంపుటించిన చేతులా........ఁగలకంఠి నిల్చెఁ
గొలంకు భంగి దలంకుచున్" (1-120) అను పద్యము,

3. "కడునెండిపోయిన ఘనతటాకమునకు వారిపూరము నిండవచ్చినట్లు
తనరాకతఱిజూచి వనజంబులుపొందు నర్కుండు వొడిచనట్లు"(1-186) అను పద్యము,

4. "మదాంధసింధురంబునుంబోలె నతులితమదోద్రేకమాననుండై"(0-86

5. "ఏపుసేయగావెఱచి .......సింహమున్గదిసి చిక్కనయేనుగుబోలె"(4 159
అనునవి ఉపమాలంకారమునకు ఉదాహరణములుగ చెప్పవచ్చును.

## రూపకము :-

విషయమునకు విషయి యొక్క అభేదముచేతను, తాద్రూప్యముచేతను రంజనము రూపకాలంకారము. వీరభద్రవిజయము నందలి,

"పరమేశుడనియెడి పడమటికొండపైఁ
కుసుమ బాణార్కుఁడు గ్రుంకె నేడు
గౌరీశుడనియెడు గంభీరవార్ధిలో
నరిగి మన్మథ కలంబవిసెనేడు
ఫాలాక్షుడనియెడి బడబానలములోనఁ
గందర్ప కాంభోధి గ్రాఁగెనేడు
మలహరుడనియెడి మహిత మార్తాండుచే
మదనాంధ కారము మ్రగ్గెనేడు

ఆ॥ నేడు మునులతపము నిష్కళంకతనొందె . . నెందుజొత్తు" (2-127) అనుపద్యమును రూపకాలంకారమునకు ఉదాహరణ గ చూడవచ్చును. ఇందు ఉపమేయమునకు ఉపమానమునకు అభేదము చెప్పబడియున్నది. ఇందు గ్రహించిన ఉపమానము లన్నియు అర్ధవంతములు, అర్థాంతరములునై యున్నవి.

పరమేశుడనియెడు పశ్చిమాద్రిపై మదనుడను సూర్యుడస్తమించె నని చెప్పబడెను ఉపమేయ ఉపమానసులకు అభేదము చెప్పబడినది అస్తాద్రిని అస్తమించిన సూర్యుడు ఉదయాద్రిని ఉదయించకమానడు. కాని కొంత కాలవ్యవధి మాత్రముండును. పార్వతీ పరమేశ్వరుల వివాహానంతరము మన్మథుని పునర్జీవనమును పోతన యిట గుప్తముగ తెల్పియున్నాడు రూపకాలంకార పరిపోషణమున పోతన చక్కని కవనచాతుర్యమును ప్రదర్శించెనన వచ్చును పై పద్యము రతీవిలాప సందర్భమున వర్ణింపబడి యున్నది.

## ఉత్ప్రేక్ష :-

ఉత్ప్రేక్ష యనగ ఊహ అన్యధర్మసంబంధ నిమిత్తముచేత నన్యవస్తువున కన్యతాదాత్మ్య సంభావనముత్ప్రేక్ష.

వీరభద్రవిజయమున, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఘట్టమున గల క్రిందిపద్యము ఉత్ప్రేక్షకు ఉదాహరణముగ గ్రహింపవచ్చును.

"తలన్ బార్వతిసేసలన్ శివునిమౌళిన్ బోసెదాఁగోరికల్
కేలిం దోయిటఁబట్టి శంకరునిపై గీలించెనో నాగ న

వ్వేళన్ సత్కృపదోయిలించి సతిపై విశ్వేశ్వరుండిచ్చెనాఁ
బోలన్‌శంభుడు ప్రాలుపోసెఁదలపైఁ బూర్ణేందు బింబాస్యకున్" (3-184)
అను పద్యమున జగత్పితరులు తలంబ్రాలు పోసికొనుట వర్ణితము.

పార్వతి కోరికల దోయిలియా యనునటుల శివుని మౌళిపై సేసలు పోయగ, శివుడు సత్కృ దోయిలించి యిచ్చినటుల పార్వతిపై తలంబ్రాలుపోసె నని, పోతన ఉత్ప్రేక్షను మనోహరముగ చెప్పెను

సీ॥ "రత్నాకరముద్రచ్చరాజుపుట్టెడువేళ దొడగిని యమృత బిందువులనంగ
కమలవైరిని రాహుకబళింప-నంతంతఁదొరగువెన్నెరరేని తునక లనగ
నాకాశలక్ష్మిదాహరునిపెండ్లికి నిరుకేలబట్టిన సేస బ్రాలనంగ
నిఖిలేశునకు బ్రహ్మనీలాంబరమునమేల్పట్టు కట్టిన మౌక్తికంబులనగ

ఆ॥ "విధులేర్పడంగ . దారకంబులొప్పె"(3-121) అను పద్యమున తార కములను, అమృత బిందువులుగ, వెన్నెలరేని తునకలుగ, సేసబ్రాలుగ, మౌక్తి కములుగ ఊహించుట గలదు. కనుక ఇది ఉత్ప్రేక్ష.

## అనన్వయము :-

ఒకే వస్తువు ఉపమానమును, ఉపమేయమును నయిన యెడల ననన్వ యాలంకారమన నొప్పును

ఆ॥ ఒక్కమాటు గిముల నొక్కటఁ జెండాడు
నొక్కమాటు సురల నొల్లఁబుచ్చు
వీరభద్రురణము వేరెవ్వరిని బోల్ప
వచ్చునతనిఁ బోల్పవచ్చుఁ గాక" (4-133) అను పద్యమున రణమున వీరభద్రునకు వీరభద్రుడే సాటికాని వేరెవ్వరును సములుకారని ఉపమానోపమేయ ములు రెండును వీరభద్రునకే చెప్పబడినవి కనుక ఇది అనన్వయము

## వ్యాజస్తుతి :-

నిందావ్యాజముచే స్తుతియు, స్తోత్రవ్యాజముచే నిందయును చేయుట వ్యాజస్తుతి

దక్షుడు సతీదేవి యెదుట,

ఆ॥ "మూడు మూర్తులందు మొగి నెవ్వఁడును గాడు
జాతిలేదు పుట్టు జాడలేదు
పరముడొంటిగాడు బ్రహ్మాదులెఱుగరు
తిరుగుజోగిఁదగునె దేవుడనగ" (1-137) అని గావించిన నిందలో స్తుతి గలదు. బ్రహ్మాదులకు అంతుపట్టని దివ్యశక్తి శివశక్తియని ఇందలి స్తుతి. మరియు,

సీ॥ "చీనాంబరంబులు చెలువొప్పగట్టడు మదసింధురేంద్రచర్మంబుగాని
రత్నకంకణములు రమణమైఁదొడగడు ఫణిలోకరాజుకంకణముగాని
చందన గంధంబు జాణడై పూయడు మదపంచబాణ భస్మంబుగాని
పువ్వులు దండలు బోగియైతురుమడు వెలయింతలేనిరేవెలుగుగాని

ఆ॥ యూరనుండనొల్లఁ డొలుకులలోగాని
యెనసి హయమునెక్కఁడెద్దుగాని
చెలువ యేమిచెప్ప సిగ్గయ్యెడిని వెఱ్ఱి
యనగ నెపుడు శివుని వినవె చెపుమ" (2-277) అను పద్యమున నిందలో స్తుతి గలదు. కనుక ఇది వ్యాజస్తుతి.

## అర్థాంతరన్యాసము :-

సామాన్యము చేత విశేషమునుగాని, విశేషముచేత సామాన్యమునుగాని సమర్థించిన యెడల అర్థాంతరన్యాస మగును.

వీరభద్రవిజయమున రతీదేవి విలాపమునగల క్రిందిపద్యమును అర్థాంతరన్యాసమునకు ఉదాహరణముగ గ్రహింపవచ్చును.

"నినువేభంగులఁబాయఁజాల వనితా నిర్భేదమందేమియు
న్మనప్రాణంబులు రెండు నొక్కటిసుమీ నారీమణీ నమ్ముమీ
యని కావించిన బాసలన్నియును గల్లయ్యెంగదా లక్ష్మనం
దన యెవ్వారికినైన దైవఘటనల్ తప్పింపగావచ్చునే" (2-136). ఇందును,

"వనితాకూతులఁ బెండ్లిసేయునెడలన్ వాచాలకుల్ తల్లులే
యని లోకంబులు పల్కఁగాన సతి నీవద్రీశు నిల్లాలితో
నొనరం గన్నియకున్ వరుండుడగు మీరూహింపగానేలయి
మ్మని కార్యంబు ఘటింపగాఁబలుకుమీ యంభోజపత్రేక్షణా" (3-29)

అను పద్యమును గూడ అర్థాంతరన్యాసాలంకారమునకు ఉదాహరణముగ స్వీక రింపవచ్చును.

## వ్యతిరేకాలంకారము :-

"ఉపమానముకన్న ఉపమేయమునధికముగ చెప్పిన వ్యతిరేకాలంకార మగును" అని కావ్యాలంకార సంగ్రహమునగలదు. "ఉపమానోపమేయములలో దేనికేని యొక్క దానికి ఆధిక్యము చెప్పిన వ్యతిరేకాలంకారమని" చంద్రాలోక మునచెప్పబడియున్నది.

వీరభద్రవిజయమున పార్వతీదేవి వర్ణనమున వ్యతిరేకాలంకారము పలు మార్లు ప్రయుక్తమైయున్నది.

సీ॥ "జలజాక్షినెమ్మోముఁజందురుఁబోల్తమా చందురునందునఁగందు గలదు
కన్నియవదనంబుఁగమలంబుఁబోల్తమా ముకురంబుపుట్టుచోఁగసటుగలదు
మోహనాంగిముఖంబుముకురంబుబోల్తమా ముకురంబునందునమృదుపులేదు
మానినివదనంబు మణిపంక్తిబోల్తమా మణులెల్లరాలనుమాటగలదు

ఆ॥ ఇంకనేమిబోల్తమింతి యాననముతో
సృష్టినేమి సాటి సేయవచ్చు
మగువమొగము కాంతి మలహరనీయాన
త్రిభువనంబులందు నభినవంబు" (3-68) అను పద్యమున ఉపమేయ మును అధికముగ వర్ణించెను. చంద్రుడు, కమలము, ముకురము, మణిపంక్తుల కన్న పార్వతీదేవి వదనము మిన్నయని పై పద్యమున వర్ణింపబడినందున యిది వ్యతిరేకాలంకారమని చెప్పవచ్చును.

పై విధముగ పోతన వీరభద్రవిజయము నందుగల ఉపమ, ఉత్ప్రేక్ష, అనన్వయ, వ్యాజస్తుతి, అర్థాంతరన్యాస, వ్యతిరేకాలంకారములను పరిశీలించుట జరిగినది. పోతన అలంకారచాతుర్యము ప్రశంసనీయము.

## అనుకరణములు :-

పోతన తన వీరభద్ర విజయమున పలువురు పూర్వకవుల రచనావిధాన మును పుణికిపుచ్చుకున్నాడని చెప్పవచ్చును. పూర్వకవులను అనుసరించినను తన రచనలో స్వాతంత్ర్యమును, వాక్చమత్కారమును వర్ణనావైవిధ్యమును పోషిం చుకొనెను. పోతన నన్నయ, నన్నెచోడ, శ్రీనాథమహాకవులను అనుకరించెనని క్రిందివిధముగ చెప్పవచ్చును

పోతన వీరభద్రవిజయమున, "ఉన్నతగుణధుర్యునన్నపార్యు" (9ప) అని పేర్కొని యున్నాడు. ఆగ్రంథప్రారంభమే అనగ తనకవితా ప్రారంభమే నన్నయ కవితానుకరణముతో మొదలుపెట్టినాడు.

"శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితిమావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకన్ధరా శ్రేయ సే" (ఆదిపర్వము - ప్రారంభము)

పై శ్లోకమును వీరభద్రవిజయమున క్రిందివిధముగ అనువదించి యున్నాడు.

"చ॥ సిరియును వాణిగౌరియనుజెన్నగు కన్యకుమేనువాక్కు(బె
న్నురమును నుంకువిచ్చిముదమొప్ప వరించి జగంబులన్నియున్
దిరముగఁ జేయఁ బ్రోవఁ దుది( దీర్పగ(ద్ర్యష్ట యుగేక్షణుండునై
హరి విధిశంభుమూర్తియగునాద్యుడు మాకు బ్రసన్నుడయ్యెడున్" (2ప)

ఉ॥ "శ్రీలలితాంపుభూతియును శేషవిభూషణమున్ శిరంబుపై
వేలుపుటేరు పాపటను వెన్నెలపాపడు మేనగొండరా

చూలియుఁగేల ముమ్మొనలశూలము నీలగళంబు గల్గునా
వేలుపు శ్రీమహానగము వేలుపుమాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్" (1ప).

పై పద్యములందలి, "మాకుప్రసన్నుఁడయ్యెడున్" అను దానిని చూడ గనే నన్నయ్య ఉదంకస్తుతి జ్ఞప్తికి వచ్చుచున్నది.

నన్నెచోడుడు, కుమారసంభవమున, మన్మథుడు ఈశ్వరుని తపోభగము గావించుటకు బయలుదేరు నపుడు రతీ మన్మథుల సంభాషణమును వర్ణించెను. ఆభావమును పోతన తన వీరభద్రవిజయమున అనుకరించెను.

కుమారసంభవము (4-72)

చ॥ "అతనిశరాసనంబు గనకాచలమిక్షుశరాసనంబు నీ
కతనికి నమ్ముపాశుపత మంటిన గందెడుపూవుటమ్ము నీ
కతడు పురాపహారి విరహాతుర పాంథజనాపహారి వీ
వతనికి నీకు హస్తిమశకాంతరమెమ్మెయి నెన్నిచూచినన్"

వీరభద్రవిజయము (2-81)

సీ॥ భూకాంత తేరును పూవుల తేరును
నిర్జరసుభటులు స్త్రీరభటులు
కనకాచలము విల్లు కడుతియ్యనగు విల్లు
మేటి నంది పడగ మీను పడగ
బహుమంత్రవాజులు పచ్చని వాజులు
పెక్కుదలలనారి భృంగనారి
నలుమొగంబుల యంత నవవసంతుడు యంత
పురుషోత్తముండమ్ము పూవుటమ్ము

ఆ॥ వెలయు రేలుఁబగలు వెలిగించు కన్నులు
తమ్మికండ్లు త్రిపుర దైత్యకోటి
గురి విటవ్రజంబు గురి యతనికి నీకు
నేమి సెప్పవచ్చునెంత కెంత" సీసమున భావము విస్తృతమైనది.

కుమారసంభవము - మన్మథరథవర్ణన (4-83)

సీ॥ "పంకరుహంబులు బండికండులు చంప
కంబులు మెగలుత్పలంబులిరుసు
కరవీరములు పలుగాడి జాదులు సనుఁ
గొమ్మలశోకముల్ గోడుపీట
సిందు వారంబులు సీలలు గేదగుల్
మెట్టులు మొల్లలు మెట్టుగుదెలు
పొగడలు పలుపులు పున్నాగములు పగ్గ
ములుసహకారముల్ పూనుగాడి

తే॥ కురవకానీక మూలంపుఁ గోలకైర
వములు మునుకోల కోకముల్ వాహనములు
గా వసంతుడు స్తూతుడై పూవుదేర
నెరయఁగుసుమాయుధంబులు నినిపిదెచ్చి"

వీరభద్రవిజయము (2-94)

సీ॥ "కమల షండము నున్నగాజేసి యిరుసుగాఁ
గావించి కెందమ్మికండ్లఁగూర్చి
తగనించుమోసుల నొగలుగాఁ గావించి
కరమొప్పగేదగి కాడివెట్టి
సంపెంగ మొగ్గల చనుగొయ్యలొనరించి
పల్లవంబులు మీదు పరపుఁజేసి
చెలువైన పొగడ దండలచేత బిగియించి
లేదీగ పలుపులు లీలజొనిపి

ఆ॥ వె॥ తెఱగ లరసి పువ్వుతేనెఁగందెనవెట్టి
గండురాజకీర గములుగట్టి
మెఱయ చిగురు గొడుగు మీను టెక్కముగ్రాల
దేరుఁబన్ని సురభి తెచ్చెనపుడు"

కుమారసంభవమున గల మునివరులు పార్వతిని పరమేశ్వరునకు అడగుటకు వెళ్లిన సందర్భమును, పోతన క్రిందివిధముగ అనుకరించి యున్నాడు.

కుమారసంభవము (7-136)

"మునివరులు....... ప్రముదిత హృదయులగుచు నిప్పరమేశ్వరి పరమే శ్వరు నగ్రమహిషియగు టేమి యపూర్వంబని నిశ్చయించి పార్వతి ముద్రారోహ ణంబు సేసి నగపతిచే నమస్కృతులై వీడ్కొని చనుదెంచిరి".

పై భావమును పోతన వీరభద్రవిజయమున. (3-56) "మునీంద్రులు .... ...ముదితకుముద్రారోహణంబుచేసి" అని వ్రాసెను.

శ్రీనాథుడు హరవిలాసమున పార్వతి తపోవర్ణన సందర్భమున, "నీల కంఠస్తోత్రనియతి గూర్చు" అని స్తవప్రశంస, సంస్కృత కుమారసంభవమున లేకున్నను వ్రాసియున్నాడు.

పోతన వీరభద్రవిజయమున శివపంచస్తవములలో ప్రసిద్ధమగు నీలకంఠ స్తవమును గూర్చి ప్రత్యేకముగ ఒక సీసపద్యమును వ్రాసియున్నాడు.

సీ॥ గరమొప్పనీ నీలకంఠస్తవంబులో
నబల! యేకశ్లోకమైనఁజాలుఁ
గరమొప్పనీ నీలకంఠస్తవంబులో
నబల! యర్థశ్లోకమైనఁజాలు
గరమొప్పనీ నీలకంఠస్తవంబులో
నబల! పాదశ్లోకమైనఁజాలుఁ
గరమొప్పనీ నీలకంఠస్తవంబులో
నబల! కించిన్మాత్రమైనజాలు

ఆ॥ వె॥ విమల భక్తితోడ వినినఁబఠించిన
సజ్జనుండు సకల సంపదలను
గలిగి భవము లేక కైలాసవాసుడై
నన్ను జేరియుండు నలిన నేత్ర" (3-263).

పోతన సమకాలికుడైన శ్రీనాథుని కృతులలోను, వీరభద్రవిజయములో నుగల సమాన భాగములకు గాను క్రింది ఉదాహరణమును చూపవచ్చును.

శ్రీనాథుని కాశీఖండము (7-60 పద్యము)

సీ॥ శితికంధరునకు నెచ్చెలిగాడు కాడొకో
యటమటీఁడైన నీ యక్ష భర్త?
యహి కంకణునకు మూడవ కన్నుగాడొకో
ప్రాల్మాలినట్టి యీపావకుండు?
పురవైరికవతంస పుష్పంబు గాడొకో
నిర్భాగ్యుఁడైన యీనీరజారి?
గంగాధరునకు లెంకల లెంగ గాడొకో
పెనుగూళయైన యీ యనిమిషేంద్రుఁ?

గీ॥ డేమిగుడువంగ వచ్చినారిండ్లు విడిచి
హరుని వెలిపెట్టినట్టి యీ యాగమునకు
బంచవదనుని కను జేవురించెనేని
తత్క్షణంబున తమ యాండ్ర త్రాళ్లు తెగవె"

పోతన వీరభద్రవిజయమున గల క్రిందిపద్యమును చూడుడు.

"నీలకంఠునకు నెచ్చెలి గాడొకో
యటమటీఁడైన నీయంబుజాక్షు
డహికంకణునకు మూడవ కన్నుగాడొకో
ప్రాలుమాలినయిట్టి పావకుండు
గంగాధరునకు సంగడికాడు కాడొకో
పెనుకూళ్ల మారైన యనిమిషపతి
పురవైరికిని తలపుష్పంబు గాడొకో
నిర్భాగ్యుఁడైన యీనీరజారి

గీ॥ యేమికుడువంగ వచ్చితి రిందు మీరు
తాము పాలించినట్టి లోకములు విడిచి
పంచ వదనుని కను జేవురించెనేని
తత్క్షణంబున తమయాళ్ల త్రాళ్లు దెగవె" (4-47).

పై విధముగ పోతన తన పూర్వకవులను అనుకరించిన విధానమును పరిశీలింపుటమైనది.

## 8. ధ్వన్యనుకరణ పద ప్రయోగము :-

ధ్వనిని అనుకరించుచు చెప్పుపదములే ధ్వన్యనుకరణ పదములు. పోతన వీరభద్ర విజయమున గావించిన ధ్వన్యనుకరణపద ప్రయోగమును క్రింది విధముగ పరిశీలించుటమైనది.

ముక్కంటి కంటిమంటి మన్మథుని భస్మమొందించుటకు వెడలునపుడు పోతన ధ్వన్యనుకరణ పదప్రయోగమును గావించియున్నాడు. ఉదా :-

కం॥ భుగభుగయను పెనుమంటలు
భగబగమని మండునంత బ్రహ్మాండంబున్
దిగుదిగులు దిగులుదిగులనఁ
డెగి మరుపైఁజిచ్చుకన్ను దేవుడు విచ్చెన్" (2-110).

"క్షీరసాగరమథనము"ను వర్ణించు పట్లగూడ పోతన ధ్వన్యనుకరణపద ప్రయోగము కావించియున్నాడు.

" అంబోసిది గుబ్బుగుబ్బుననుచున్ ..." (3-223)
"భూతలంబులం బగుల జేయంజాలిన ఘుమ ఘుమారావంబులతో వెలిను రుగులెగయు" (3-224).
'గుభులుగుభుల్లను నాదంబుల బ్రహ్మాండ"బులన్నియునదిరి" (3-226).

పై విధముగ పోతన వీరభద్ర విజయమున సార్థకమైన ధ్వన్యనుకరణ పదప్రయోగమును కావించెనని చెప్పవచ్చును

## 9. ఆత్మీయత :-

కావ్యమున కవియొక్క ఆత్మీయత, ఒకటి పాత్రనను అడ్డుపెట్టుకొని చేసెడి స్వానుభవవర్ణనలలోను, రెండు అనుభవము లేకపోయినను అతనికి భావనామాత్రతృప్తినిచ్చున వాంఛాపరంపర వర్ణనలలోను ప్రతి ఫలించునని ఆచార్య పింగళివారనిరి. (సాహిత్యశిల్పసమీక్ష - పుట 357) భావజగత్తులో సంచరించెడి కవి ఆత్మను పరిశీలించినచో గోచరించెడి మూర్తినే "ఆత్మీయత" అని చెప్పవచ్చును, వీరభద్రవిజయమున కనిపించు పోతన ఆత్మీయతను క్రిందివిధముగ పరిశీలించవచ్చును.

పోతనయందుగల వీరశైవతత్త్వము వీరభద్రవిజయమున పెక్కుచోట్ల కన్పించుచున్నది. పోతన యందుగల శివభక్తిభావము, క్రింది విధముగనున్న భగవన్నామ సంస్తుతినిబట్టి తెలియనగును.

సీ॥ భుజగేంద్ర భూషాయ భూతాధి నాథాయ
నిత్యానురాగాయ నిర్మలాయ
గంగావతంసాయ ఖండేందు జూటాయ
దేవాధిదేవాయ దివ్యటాయ
వేదాంత వేద్యాయ వీర ప్రతాపాయ
కైవల్యనాథాయ ఘన ఘనాయ
రణరంగ వీరాయ రమణీయరూపాయ
భువనాభిరామాయ పురహరాయ

ఆ॥ ఓంనమశ్శివాయ ఓంకారరూపాయ
శంకరాయ రిపు భయంకరాయ
మదన సంహరాయ మానితకైలాస
మందిరాయ నీలకంఠరాయ" (4-217).

"పుట్టింప నీవెనేర్తువు, నెట్టన రక్షింపనీవనేర్తువు గడిమిం, గిట్టింప నీవెనేర్తువు, యిట్టిదయారసమె చెల్లునీకు మహేశా" (4-194) అని ఈశ్వరు మాహాత్మ్యమును పోతన విశదీకరించెను. "ఏరాదక్ష యదక్షమానస . నీలకంఠుఁదెగడం గారాదురా దుర్మతీ" (1-146)అని దక్షుని నిందించిన సతీదేవి పలుకులను పోతన పలుకులుగనే భావింపవచ్చును.

"శివుడెచ్చట వేంచేయును, శివతరమచ్చోటువినుతిసేయగ వశమే, శివుడెచ్చట వేంచేడు, శివుడెచ్చోనిండిలేడు సిద్ధము దక్షా" (1-155) అను సతీదేవి పలుకులనుబట్టి,

"ఎనయఁజదువులెల్ల యెఱుగును జెప్పుమా, యిట్టిరుద్ర మహిమ యిజ్ఞగంబు, నట్టిరుద్రమహిమ యెఱుగంగనలవియె ధాతకైన నతని తాతకైన" అనియు, "దేవుడు నాకంబునకును, దేవుడు త్రింశకోటి దేవావలికిన్, దేవుడులోకం

బులకును, దేవుండీశ్వరుడె కాకదేవుడు గలడే" (4-33) అనియు పలుకు దధీచి మాటలనుబట్టి,

"శివనిందయు స్మృతినిందయు, శివభక్తులుగానివారి సేవించుటయున్, భువనమునగాదు దక్షుడు, శివనిందనువలచి యిట్లుచెడియెన్" (4-167) అని మునులతో తీర్పు చెప్పించుటను బట్టి, పోతన వీరశైవతత్త్వము (ఆత్మీయత) వ్యక్తము.

పైవిధముగ పోతన పాత్రలనడ్డుపెట్టుకొని తృప్తిదీర పరమేశ్వరధ్యాన మొనరించి సంతుష్టుడైనాడని, వీరశైవ హృదయమును ప్రకటించినాడని చెప్ప వచ్చును.

## 10. వ్యంగ్యరచన :-

"కావ్యస్యాత్మాధ్వనిరితిబుధైః" అని ఆనందవర్ధనుని సిద్ధాంతము. ధ్వ న్యర్థమే వ్యంగ్యార్థము. ఆడువారికి అవయవముల కన్న భిన్నమగు అందము ఏరీతిన ప్రకాశించునో యటులే మహాకవుల కావ్యములందు వాచ్యార్థముల కన్న భిన్నముగ వ్యంగ్యార్థము భాసిల్లుచుండును వాచ్యార్థ సామర్థ్యము చేతనే వ్యంగ్యార్థము ఆక్షిప్తమగు చుండును. వ్యంగ్యార్థము సహృదయ హృదయైక వేద్యము కవనశిల్పముగల కవి వ్యంగ్యధోరణినవలంభించి కావ్యమునకు శోభ ను చేకూర్చును. పోతన ఈ విషయమున కూడ సిద్ధహస్తుడని క్రిందివిధముగ చెప్పవచ్చును

శంకరుడు బ్రహ్మచారి వేషమున, తపమాచరించుచున్న పార్వతికడకేగి శివదూషణ గావించి, తనను పరిణయమాడుమని పలుకగ, కోపించిన పార్వతి తన చెలులతో వటువును వనము వెడలగనంపుమని చెప్పెను. చెలులు బ్రహ్మ చారిని పట్టయుద్యుక్తులైరి. అపుడు వటువు,

"నన్నున్ బట్టెడువారెమీవశమె యన్యాయంబుగా నిప్పుడున్
నన్నున్ జిన్నగఁజూడవద్దు వినుడా నారాయణ బ్రహ్మలున్
నన్నున్ బట్టగలేరు చిక్క బడునే నాబోటి మీచేతమీ
నన్నుఁబైన దలంపఁబో విడువుడో చంద్రాస్యలింకెయ్యెడన్" (2-283) అని

పల్కును. ఇందు శివపురాణ ప్రసిద్ధమైనకథ వ్యంగ్యముగ గుర్తుచేయబడినది. **అది :-** బ్రహ్మవిష్ణువులిరువురు శైవజ్యోతియైన అనలస్తంభము నాద్యంతములను గనవలెనని పోటీపడి ఓటమినిపొందిరి. అసత్యమాడి బ్రహ్మశిరమును కోల్పోయెను విష్ణువు తన అశక్తతను విన్నవించుకొనెను. ఈవిధముగ బ్రహ్మవిష్ణువులకు పట్టుబడని తాను ఈ చంద్రాస్యలకెట్లు పట్టుబడునని భావము

ఎఱుకత వేషధారియైన శివుడు పార్వతికి ఎఱుక చెప్పినపుడు పోతన వ్యంగ్యరచన గావించినాడని చెప్పవచ్చును.

సీ॥ చింతించి యాబ్రహ్మసృష్టి బుట్టించుచో నెలనాగననుగాంచి యెఱుకలడిగె
నగములు సాధింప నగభేదిరావించి, యెలనాగననుగాంచి యెఱుకలడిగె
దనుజుల నిర్జింప దనుజారిపోవుచో నెలనాగననుగాంచి యెఱుకలడిగె
మఱి హలాహలవహ్నివెలివెల్వులమూకయెలనాగనను గూర్చియెఱుకలడిగె

ఆ॥ పరమమునులు యతులు పరమయోగీంద్రులు
సజలమున్న నన్ను సంతసమున
నెఱుకలడిగి కాదె యెల్లశుభంబులు
గలిగియుండుపెల్ల కమలనేత్ర" (2-192)

ఇందు సమస్తసృష్టి, స్థితి, లయములకు కారణుడగు పరమేశుని తత్త్వము వ్యంగ్యముగ వర్ణింపబడియున్నది. సమస్తశుభములకు శంకరుడేమూలమని ధ్వని. ఇంకను దక్షుడు గావించిన శివనింద వ్యంగ్యరచనా పూర్వకమైనదనియే చెప్పవచ్చును ఉదా -

సీ॥ కట్టంగదిక్కులేకాని కోకలులేవు పూయగంధములేదు భూతిగాని
కాలకూటమెకాని కంఠమాలికలేదు ఫణిగాని తొడుగంగమణులులేవు
సలినాసమెకాని తలపెండ్రుకలులేవు తలకుంబువ్వులులేవు నెలయకాని
నడుపగంచములేదు వెడదపున్కయగాని యెక్కగుఱ్ఱములేదు యెద్దుగాని

ఆ॥ మూడు మూర్తులందు మొగినెవ్వడును గాడు
జాతిలేదు పుట్టుజాడలేదు

పరముఁడొంటిగాఁడు బ్రహ్మదు లెఱుఁగరు
తిరుగుజోగిఁదగు నెదేవుఁడనగ" (2-137).

ఇందు శివునిమహిమ వ్యంగ్యముగ వర్ణింపబడియున్నది. శివుడు, ముగ్గురుమూర్తులకు మూలపురుషుడని, పుట్టుక, జాతిలేని భగవంతుడని పైపద్యమున వ్యంగ్యరచనా వైభవమును వివరించ వచ్చును

## 11. ఔచిత్యానౌచిత్యములు :-

ఏకావ్యమున ఔచిత్యము ఉత్కృష్టమై అగుపించునో ఆకావ్యము రసజ్ఞులైన పాఠకుల మన్ననలకు పాత్రమగుచు లేనిచో అపాత్రమగును. కాని ప్రతి కావ్యము నందును ఔచిత్యానౌచిత్యములు సర్వసాధారణము. ఔచితీ సంపన్నమైన కావ్యములకు సాహిత్యమున శాశ్వతస్థానము లభించును.

పోతన వీరభద్రవిజయము ఔచితీ పరిపోషితము. అయినను, చంద్రుని యందు మచ్చవలెయిందును అల్పముగ ఔచిత్యభంగకరములగు ఒకటి, రెండు దోషములు గలవు. ఇట్టివి సహజమనవచ్చును.

### ఔచిత్యము :-

వీరభద్రవిజయము చతుర్థాశ్వాసమున, శివరహితమైన యాగముచేయుచున్న దక్షునితో పుణ్యచక్షువైన దధీచి పలికిన పలుకులు పోతన ఔచితీ పరిపోషణకు చక్కని ఉదాహరణములనవచ్చును. "జీవచ్ఛవముల పూజించు వెఱ్ఱిభూమింగలడె" అనియు, 'శిరములేని తనువు చెలరేగి యాడునే" అనియు(4,12,13 చెప్పిన పోతన మాటలలో సరళత, స్పష్టత గలదు. "శివరహితమైన యాగము శిరములేని తనువని" పోతన చెప్పుటలో ఔచిత్యమెంతేని గలదు. ఈ మట్టము వ్యాసుని మూలమునకు మెరుగులు పెట్టుచున్నదన వచ్చును.

ఇక రెండవపట్టమైన మన్మథదహనమునందును పోతన ఔచిత్యమును పోషించియున్నాడు ద్వితీయాశ్వాసమున, ఇంద్రుడు పురహరునికి అప్రజను

గూర్చుమని పలికినపుడు, మన్మథుడులికిపడి, "మోహాతీతుడైన శంభుని మీదికి తననుపంపుట తగవుకాదని", "ఓహో యీపనినన్నుబంప దగవాయూహింప నాకున్ శివద్రోహంబిమ్మెయి జేయగాదగునె" (2-50) అని పలికెను" వెఱతునయ్యయెన్ని విధములఁజెప్పిన ......మృగకులేంద్రునోర్వమృగము వశమె"(2-55) అని మన్మథుడు పలుకుట ఎంతేని సమంజసమనవచ్చును.

శివునిపై విక్రమింపబోవు మన్మథుని, వలదని వారించిన రతీదేవి పలుకులు ఔచితీ విలసితము లనవచ్చును. రతీదేవి మన్మథునితో, "నీవేలా మూఢుడవైతివి నీదుమది దానెచ్చటికింబోయె, మిథ్యాలాపంబులఁ బల్కనీకుఁ దగ" (2-73) దనియు, "ప్రళయకాలాగ్నికోటిచే బ్రజ్వరిల్లుమంటఁగల కంటఁబరగు ముక్కంటి మీద, వ్రాలనేరదు నీపెంపుదూలుగాని" (2-83) అనియు, "వలదు శంభుతోడ వైరంబు మన్మథ" (2-74) అనియు పలికిని పలుకులన్నియు ఔచితీ శోభితములనియే చెప్పవచ్చును. ఇంకను తదితర పట్టములందు పోతన ఔచిత్యమును పోషించి వీరభద్రవిజయమును రచించెను, ప్రతిపదము, ప్రతిపద్యమును ఉచితమగురీతిలో ప్రయోగించి, కావ్యసౌందర్యోత్కర్షకు నిధానముగావించి, రస పరిపోషణకు ఔచిత్యము మూలమను ఆర్యోక్తికి పోతన నిబద్ధుడైనాడని చెప్పవచ్చును.

## అనౌచిత్యము :-

రసభంగమునకు అనౌచిత్యమును మించిన కారణము మరియొకటిలేదని విజ్ఞుల అభిప్రాయము. సామాజిక ధర్మమునుబట్టి ఔచిత్యానౌచిత్యములు దర్శనమిచ్చుచుండును.

వీరభద్రవిజయమున అనౌచిత్యముగ కనిపించు ఒకటి రెండు సంఘటనలు కలవు. పోతనకు ముందున్న కవులరచనలలో గూడ యిట్టివి కానవచ్చుచున్నవి

వీరభద్రవిజయమున, మహర్షులు గౌరీదేవి సౌందర్యమును మహేశునకు వర్ణించిచెప్పువిధము తృతీయాశ్వాసమున గలదు. జగన్మాతను గూర్చి భువనకర్త

యైన ఈశ్వరునకు సర్వజ్ఞులైన ఋషులు క్రిందివిధముగ చెప్పుట అనౌచిత్యమన వచ్చును.

సీ॥ తరుణిచన్నులు భద్రదంతి కుంభములన్న
దంతి కుంభములకుఁ గాంతి లేదు
కొమరాలి కుచములు కోకద్వయములన్నఁ
గోకంబులొకచోటఁగూడ కుండు
కన్నియచనుదోయి కనక కుంభములన్న
గనక కుంభములవి గరగబడును
పొలతుక పాలిండ్లు పూబంతు లందమా
పూలబంతులంటినఁ బ్రోదిమఱగు

ఆ॥ గాన బోల్పగదగదు కాంత పయోధర
యుగళమునకు నింక జగములోన
నేమిపోల్పవచ్చు నీశాన చెప్పవే
పణతిఁ బొగడ వశమె బ్రహ్మకైన" (3–71) మరియు "తెఱవకుఁజన్నుల బ్రేగున, మఱి అల్లలనాడుచున్న మధ్యయుబ్రేగై, విఱుగునది విఱుగ కుండుట వెఱగయ్యెనుమాకు" (3–72) అనియు, "చెలువకుఁగేకిసములకును, కలహంసాధీశునకును గజరాజునకున్, వెలదినడుచుక్రియలట్లను, నలినదవందరముగాదు" (3–73) అనియు 'మునులు పల్కుట అనౌచిత్యముగ నున్నదనవచ్చును.

ఇంకను చతుర్థాశ్వాసమున, వీరభద్రుడు సురసంఘమును శిక్షించునపుడు, "నెత్తురు ధారలు మొగమునఁ, జొత్తిల్లగ నగ్నిదేవు సుందరి ముక్కున్ వృత్తస్తనశిఖరంబులు, నత్తరితుదిగోరఁద్రుంచి యవ్వలవైచెన్" (4–120) అనియు "వనితలచనులకు నీడైఁ, జనియెడునని పంచశరుడు జక్కవదోయిం, గొనముక్కులుకోసినక్రియఁ, జనుముక్కులు దనరెవహ్నిసతికి రణోర్విన్" (4–121) అనియు మఱిరాహుచేత మధ్యము, గరువంబడియున్న పూర్ణకమలారిగతిన్, 'గఱగళుడు ముక్కుఁజిదిమినఁ, దెఱవకు భారతికి మోముధృతినొప్పారెన్' (4–119) అనియు వర్ణించుట అనౌచిత్యముగనున్నదని చెప్పవచ్చును. ఈవర్ణనలు కావ్యశోభకు భంగకరములుకావని చెప్పవచ్చును.

## 12. సామెతలు :-

"కందవ మాటల సామెత
లందముగాజేర్చి చెప్పనది తెనుగునకున్
విందై రుచియై వీనుల
విందైమతికానిపించు విబుధులకెల్లన్" (1-18ప) అని మొల్ల. సామెత యొక్క ప్రాముఖ్యమును వివరించెను "ఒక పిండితార్థా కొద్దిమాటలలో చెబుతుంది సామెత. దాని వెనుక ఎంతోఅనుభవం ఉంటుంది అని శ్రీవిశ్వనాథవారు చెప్పిరి.(తెలుగుసామెతలు - పీఠికలు)

సామెతలు సామాన్యముగ జనసామాన్యమునుండి పుట్టుకొని వచ్చును. ప్రజల అనుభవములు, అభిరుచులు సామెతలలో ప్రతిబింబించును. అన్నమునకు వ్యంజనమువలె సామెతలను జనులు తమ నిత్య వ్యవహారమునందు ప్రసక్తానుప్రసక్తముగ వాడుచుందురు. సామెతలందు ప్రజల ఆచారములు, సాంప్రదాయములు, విశ్వాసములు, వారి జీవితవిధానము వెల్లడియగును.

పోతన వీరభద్రవిజయమున సామెతలను వాడియుండుటను గమనించవచ్చును.

1. "మెచ్చని మామలిండ్లకును మేకొని శోభనవేళc బిల్వమిన్ . పోcదగుట పోలదు నల్లురకు" (1-116ప).
2. "పిలువని పేరటముపనిగలవారునుబోలె సిగ్గుగాదేరాగన్" (1-141)
3. "ఎవ్వారికైనదైవఘటనల్ తప్పింగగావచ్చునే" (2-137)
4. "మేదిని చచ్చిన వారు వత్తురే (2-155)
5. "జీవచ్ఛవములం బూజించు వెట్టిభూమింగలడే" (4-12)
6. "శిరములేని తనువు చెలరేగి యాడునే" (4-13)
7. "తారేపెట్టిన తరువుల తారే పెఱుకుదురే" (4-176) అనునవి వీరభద్ర విజయమునందుగల సామెతలు.

## 13. జాతీయములు :-

జాతియందు పుట్టినది జాతీయము. జాతీయమునకుగల ధర్మములన్ని యు సామెతయందుండును. అట్లుండియు జాతీయము ప్రత్యేక లక్షణములను కొన్నింటిని కలిగియుండి సామెతనుండి వేరగుచున్నది. ఇవి ప్రయోగరూఢిచేత శబ్దగతార్థమునకు భిన్నమైన అర్థమును స్ఫురింప జేయును ఆంగ్లభాషలో వీనిని "Idioms" అందురు. గ్రీకుభాషలో 'Idiom' అనగ Peculiar Phraseolcgy (విలక్షణ పదసంబంధము) అని అర్థము. ఏ జాతీయమును గాని, అందలి పదములకున్న అర్థము, కారకము మొదలగువానిని జూచి అట్లే మరొక భాషలోని కనువదించినచో ఆ అరము ఎంతగింజుకున్ననురాదు. అదియే జాతీయముల కుండు విశిష్టత.

వీరభద్రవిజయమునపోతన క్రిందిజాతీయములను ప్రయోగించియున్నాడు అవి "పిలువని పేరంటము", "కన్నుల పండువు", "పుంఖాను పుంఖము", "చిలుకసలుకులు", "పీనుగు పెంటలు", మొదలగునవి.

పైవిధముగ పోతన వీరభద్రవిజయము నందలి, అవతారిక, ఛందస్సు, రసరమణీయకత, పాత్రపోషణ, వర్ణనలు, అలంకారములు, అనుకరణములు, ధ్వన్యనుకరణ పదప్రయోగము, ఆత్మీయత, వ్యంగ్యరచన, ఔచిత్యానౌచిత్యములు సామెతలు, జాతీయములు అను అంశములను సోదాహరణముగ పరిశీలించుట మైనది.

పోతన, వీరభద్ర విజయమును కావ్యలక్షణ సమన్వితముగ రచించి తెలుగుసాహితీలోకమున సముచితస్థానము నలంకరించెనని చెప్పవచ్చును,

# ప్రకరణము - 5

## పోతనకృతులు - తులనాత్మకపరిశీలనము

1. అవతారికలు
2. ఇతివృత్తములు
3. ఛందస్సు
4. వర్ణనలు
5. ఆత్మాశ్రయకవితారీతి
6. శబ్దాలంకారములు

తొలిరచనయైన వీరభద్రవిజయము వీరశైవమును ప్రతిపాదించుచుండ, తుదిరచనయైన భాగవతము అద్వైతధర్మమును బోధించుచునే శ్రీవైష్ణవమును ప్రతిష్ఠించుచున్నది. మధ్యకాలములోని భోగినీదండకము రాచరికపువ్యవస్థలో అందులకనువగు విరాసస్వభావమున, శృంగారరసస్ఫోరకముగ అల్లిన లఘుకృతి· దండకకావ్యము, నారాయణశతకము పరమాత్ముని చేరుటకై ఆత్మపొందుఆర్తిని నివేదించుకొనుశతకము.

వస్తుప్రక్రియా వైవిధ్యముగల పోతన కృతులను,

1. అవతారికాలక్షణములు - తులనాత్మకపరిశీలనము
2. ఇతివృత్తము - తులనాత్మకపరిశీలనము
3. ఛందస్సు - తులనాత్మకపరిశీలనము
4 వర్ణన - తులనాత్మకపరిశీలనము
5. ఆత్మాశ్రయకవితారీతి - తులనాత్మకపరిశీలనము
6. శబ్దాలంకారములు - తులనాత్మకపరిశీలనము అను అంశముల క్రింది పరిశీలించి, అందలి భేద సాదృశ్యములను వివరించుటయే ఈ ప్రకరణము యొక్క ముఖ్యోద్దేశము.

## 1. అవతారికాలక్షణములు - తులనాత్మకపరిశీలనము

పోతనకృతులలోని వీరభద్రవిజయము, మహాభాగవతములందు మాత్రము అవతారిక కూర్పబడియున్నది. భోగినీదండకము, నారాయణశతకములందు అవతారికలేదు.

### శ్రీకారము :-

వీరభద్ర విజయము శ్రీకారముతో ప్రారంభింపబడినది. ఆదిగణము, "భగణము" "శ్రీకైవల్యపదంబు ......."

భోగినీదండకము, నారాయణ శతకములుగూడ శ్రీకారముతోడనే ప్రారంభింపబడియున్నవి. భోగినీదండకమున "తగణము", నారాయణ శతకమున "మగణము" ఆదిగణములు.

## దేవతాస్తుతి :-

పోతన, వీరభద్ర విజయమున, "హరివిధిశంభుమూర్తియగు నాథ్యుని" స్తుతించెను. ఇష్టదేవతలగు వీరభద్రుని, విఘ్నేశ్వరుని,. భారతీదేవిని కీర్తించెను.

పోతన, భాగవతమున కృష్ణుని, శివుని, బ్రహ్మను, గణపతిని. సరస్వతిని, దుర్గను, లక్ష్మిదేవిని స్తుతించెను. వీరభద్రవిజయమున లక్ష్మిదేవిస్తుతిలేదు. భాగవతమున దినకర, కుమారప్రముఖులను తలచియున్నాడు పోతన.

## సుకవిస్తుతి :-

పోతన వీరభద్రవిజయమున, వాల్మీకి, వ్యాసుడు, బాణుడు, కాళిదాసు మాఘుడు, మణిభద్రుడు, భోజుడు, భారవి మొదలగు సంస్కృత కవులను, నన్నయ్య, తిక్కన, రంగనాధుడు, వేములవాడ భీముడు మొదలగు తెలుగు కవులను భక్తితోదలచెను.

భాగవతమునందు, వాల్మీకి. వ్యాసుడు, బాణుడు, మయూరుడు, కాళిదాసు, భారవి, మాఘుడు మొదలగు సంస్కృతకవులను, నన్నయ్య, తిక్కనలను మఱియు ఇతరపూర్వకవులను స్తుతించెను.

వీరభద్రవిజయమున మయూరుని స్తుతిలేదు.

## గురుస్తుతి :-

పోతన వీరభద్ర విజయమున వెన్నుతట్టి తనను ప్రోత్సహించిన సోమనాథసముడగు ఇవటూరి సోమనాథగురుని ఘనముగ స్తుతించెను. భాగవతమునందు గురుప్రసక్తిలేదు కావున సోమగురుడు పోతనకు మతగురువైయుండునని చెప్పవచ్చును.

## కృతికర్తృవంశవర్ణన :-

పోతన వీరభద్రవిజయమున, తన వంశమును 17 గద్యపద్యములలో వివరించియున్నాడు. భాగవతమున మాత్రము నాలుగు పద్యములలో వంశవర

నమును సంక్షిప్తముగ వివరించెను. వీరభద్రవిజయము నందలి వ్యక్తులకు, భాగవతమునందలి వ్యక్తులకు భేదములేదు. వీరభద్రవిజయము తల్లికి "లక్ష్మి" యని, భాగవతమున "లక్కసాని", "లక్కమాంబ" అని చెప్పియున్నాడు. తన తల్లిదండ్రులు, సోదరుడు శైవాచార సంపన్నులని పోతన తన రెండుకావ్యములందు తెలిపియున్నాడు.

భోగినీదండకము, నారాయణశతకములందు కృతికర్తృవంశవర్ణనలేదు.

## కావ్యోత్పత్తిప్రశంస:-

పోతన తన మతగురువైన సోమనాథుని ఆదేశానుసారము వీరభద్ర విజయమును రచించినట్లు, శ్రీరామభద్రుని ఆదేశాను సారము భాగవతమును రచించినట్లు, సర్వజ్ఞ సింగభూపాలుని కోరికపై భోగినీదండకమును చెప్పినట్లు, ఆత్మప్రబోధముతో భవబంధవిముక్తికై నారాయణశతకమును రచించినట్లు తెలిపియున్నాడు.

## గ్రంథాంకితము :-

పోతన వీరభద్రవిజయమును పరమేశ్వరాంకితముగ రచించెను. భాగవతమును శ్రీరామచంద్రునికంకితముగ వెలయించెను. భోగినీదండకమును సర్వజ్ఞసింగభూపాలునకంకితముగను, నారాయణశతకమును వైకుంఠనారాయణునకు అంకితముగను పోతన రచించెను.

## ఫలశ్రుతి :-

వీరభద్రవిజయమున పోతన, వీరభద్రవిజయ కథను చదివినను వినినను, వ్రాసినను మహేశుకొల్వు లభించునని, పంచమహాపాతకములు తొలగునని, ఫలశ్రుతిని చెప్పియున్నాడు.

## షష్ఠ్యంతములు :-

వీరభద్రవిజయమున శివునిపేర,

1. "కరుణాంచిత గుణమణికిని.... ...భక్తచిన్తామణికిన్" (పీఠిక - 42)
2. "హాలాహలభక్షునకును........జితదక్షునకున్" (పీఠిక - 43)
3. "ముకుళిత కరసురపతికిని .......పార్వతి పతికిన్" (పీఠిక - 44)
అని షష్ఠ్యంతరచన గావింపబడియున్నది.

భాగవతమున కృష్ణునిపేర,

1. "హరికినందగోకులవిహారికి........దుర్వినితాప్రహారికిన్" (పీఠిక - 29)
2. "శీలికి నీతిశాలికి.... ...చక్రనిరుద్ధమరీచిమాలికిన్" (పీఠిక - 30)
3. "క్షంతకు........భక్తజనానుగంతకున్" (పీఠిక - 31ప)
4. "న్యాయికి . . . .శేషశాయికిన్" (పీఠిక - 32ప) అని షష్ఠ్యంతరచన గావింప బడియున్నది.

అవతారికాలక్షణములలో, వీరభద్రవిజయము, భాగవతములలో ఒకటి రెండు విషయములందు తప్ప, తక్కినవానిలో ఒకే ఆత్మ సంచరించు చున్నదన వచ్చును.

## ఆశ్వాసాంత గద్యలు :-

పోతన కృతములైన వీరభద్రవిజయము, నారాయణశతకము, ఆంధ్ర మహాభాగవతములలో ఆశ్వాసాంతగద్యలు కలవు భోగినీదండకమున మాత్రము దండకాంతమున గద్యకు బదులు గ్రంథాంకిత పద్యమొకటి గలదు.

వీరభద్రవిజయమున, నాల్గాశ్వాసాంతములందు, "ఇదిశ్రీమన్మహామహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్యశ్రీపాదపద్మారాధక కేసనామాత్యపుత్త్ర పోతయనామధేయ ప్రణీతంబైన వీరభద్రవిజయంబను మహాపురాణ కథయందు ..." అను పద్యము గలదు.

భాగవతమునందు, "ఇది శ్రీపరమేశ్వరకరుణా కలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్త్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీమహాభాగవతంబను మహాపురాణంబునందు........" అని గలదు. నారాయణశతకమున, "ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన నారాయణ శతకంబున సర్వంబును సంపూర్ణము" అని గలదు.

పై ఆశ్వాసాంత గద్యలను పరిశీలించగ, వీరభద్రవిజయమున పోతన గురువగు ఇవటూరి సోమనాథుని ప్రసక్తిగలదు. మరి భాగవతమున గురువుప్రసక్తి లేదు. సహజపాండిత్యుడని బిరుదమును చెప్పియున్నాడు.

భోగినీదండకము అంతమందున్న,

"పండిత-రత్నీయుడగు బమ్మెరపోతన ....భోగినీదండకమున్ రచించె ..." నని పద్యమున చెప్పబడియున్నది. దీనినిబట్టి భోగినీదండకము రావుసింగభూపాలు నకంకితమిచ్చినట్లు తెలియుచున్నది

## ఇతివృత్తము - తులనాత్మకపరిశీలనము

పోతన కృతులలోని ఇతివృత్తములను క్రింది విధముగ పరిశీలించుట గాలదు.

## వీరభద్రవిజయము :-

వాయుపురాణము నందలి పూర్వభాగమున, 30వ అధ్యాయమునగల దక్షాధ్వరధ్వంస కథనాధారముగ పోతన వీరభద్రవిజయమును రచించెను వీర శైవతత్త్వమును సమగ్రముగ ప్రతిపాదించిన కావ్యమిది సృష్టి, స్థితి, లయలకు ఈశ్వరుడే మూలమని, నిఖిల తంత్రములకు నీలకంఠుడు దైవమని, సర్వము ఈశ్వరుని మాయావిలసితమని, ఇందు వివరింపబడియున్నది

శివుని ధిక్కరించి, శివరహితయాగము చేయు దక్షుని, శివుని హుంకార మునుండి పుట్టిన వీరభద్రుడు సంహరించి, శైవమును ప్రతిష్ఠాపించుట వీరభద్ర విజయమునందలి ప్రధానేతివృత్తము శంభుకొల్వుచేరుటకు, పంచమహాపాతక ములు బాపుకొనుటకు వీరభద్రరచన కావింపబడెను. చతుర్వేదములు, బ్రహ్మాది దేవగణము మహేశుని శరణువేడి ఆతని మహిమను వేనోళ్ల కీర్తించుట ఇందు వర్ణింపబడెను.

## భాగవతము :-

ఇందు విష్ణుదేవుని పరబ్రహ్మ స్వరూపముగ భావించి, ఆదేవుని లీలా విలాసములను, మహిమోన్నతిని పోతన వర్ణించెను భాగవతుల చరితములు ఇందు వర్ణింపబడినవి. ప్రతి పాత్రయందు "సర్వంవిష్ణుమయం జగత్" అను తత్త్వమునే పోతన ప్రతిపాదించెను. ఆత్మనివేదనముతో శ్రీకైవల్యమును పొందు మార్గమిందు చెప్పబడియున్నది.

## నారాయణశతకము :-

ఇందు "నారాయణా" అనునది మకుటము. విష్ణుసంకీర్తనము, విష్ణుమూర్తి దశావతారములు, విష్ణుదివ్యరూపవర్ణన, కృష్ణావతార ప్రశంస, జ్ఞానమోక్షమార్గములు నారాయణ శతకమున వర్ణింపబడి యున్నవి....... సుజ్ఞానము మోక్షము ద్వాదశసంప్రాప్తి న్నతాంధ్రాఖ్యకావ్యము నర్పించితి మీపదాబ్జములకున్ వైకుంఠ నారాయణా" (103ప) అనుటనుబట్టి పోతనకు మోక్షేచ్ఛయే ప్రధానమని విదితమగుచున్నది. మోక్షమునకై నారాయణ ధ్యానమొనరించినటుల అవగతమగుచున్నది ఇది భక్తిప్రధానమైన శతకము.

## భోగినీదండకము :-

వేశ్యమాత పుత్రిక యొకతె సర్వజ్ఞసింగ భూపాలుని వలచుట, తల్లిని బ్రతిమాలి, తనప్రేమను సఫలముగావించుకొనుట ఇందలి ఇతివృత్తము. దండకరూపమున సాగినశృంగార రస ప్రధానమైనదీ రచన.

పోతన కృతుల ఇతివృత్తములను పరిశీలింపగ, భోగినీదండకము మాత్రము విభిన్నముగను, విశిష్టముగను నున్నది. ఒక నరేంద్రుని జీవితములో జరిగిన విలాస ఘట్టమునకు సంబంధించిన కథయిది. రాజసేవావిముక్తుడుగ కీర్తింపబడిన పోతన ప్రకృతికి ఈరచనభిన్నముగ కానవచ్చుచున్నది. కాని, వేశ్యమాత తనకుమార్తెకు బుద్ధులుచెప్పునప్పటి, "రాజుల్ బహువ్యాజులే? భోజులే? చంచలచ్చిత్తులే? మత్తులే? వ్రేతకాయత్తులే? నూతనాసక్తులే? లోభసంయుక్తులే? దోషసంసిక్తులే?" (పుట 20) అను వాక్యములు రాజులయెడ పోతనకుగల భావమునకు అద్దము పట్టుచున్నవి.

వీరభద్రవిజయము, నారాయణశతకము, భాగవతము అను ఈమూడు గ్రంథము లందలి ఇతివృత్తములు పరమాత్మతత్త్వమును విభిన్నరీతులలో వివరించు చున్నవి. శివుడేయైనను, నారాయణుడేయైనను, విష్ణువేయైనను, ఆ పరబ్రహ్మదివ్యస్వరూపమును, దివ్యమహిమను వర్ణించుటయే పోతన ముఖ్యోద్దేశమని తెలియుచున్నది. పరమాత్ముని చేరవలెననెడు జీవుని వేదన ఈ మూడు రచనలందు సాక్షాత్కరించుచున్నది. భోగినీదండకము మాత్రము ఇందులకు భిన్నముగ సామాజిక ఇతివృత్తముతో నున్నది.

## ఛందస్సు - తులనాత్మక పరిశీలనము

పోతన కృతులలో ప్రయుక్తమైన ఛందస్సును గూర్చి క్రింది విధముగ తులనాత్మకముగ పరిశీలించుటమైనది

వీరభద్రవిజయమున, మొత్తము 1046 గద్య పద్యములున్నవి. ఇందు వచనములు 274, ఒకదండకము. 299 వృత్తములు, 314 జాతులు, 158 ఉప జాతులు గలవు. సాంస్కృతిక ఛంచమునాశ్రయించి వ్రాసిన పద్యములు 613 కాగ, దేశి ఛందమునాశ్రయించి వ్రాసిన పద్యములు 158 మాత్రమే. కావున, పోతన వీరభద్రవిజయమున సంస్కృత ఛందమునకు ప్రాధాన్యమిచ్చెనని చెప్ప వచ్చును పద్యములన్నింటిలో కందములు 313 కలిగి అగ్రస్థానమున నుండగ, సీసములు 119 కలిగి ద్వితీయస్థానమున నున్నవి. విశేషవృత్తములలో మత్తకోకిలలు 19 గలవు. మత్తకొకిలవంటి నడకగల తరలము 5 గలవు. లయగ్రాహి 6, మాలిని 4, చంపకమాలలు 43, ఉత్పలమాలలు 118, మత్తేభ 49, శార్దూలము లు 55, గలవు.

భాగవతము నందు 1773 వృత్తములు, 2290 జాతులు, 1475 ఉప జాతులు, రెండు దండకములు గలవు వచనములు 2393 గలవు. సాంస్కృతిక ఛందముననుసరించి వ్రాసిన పద్యములు 4063 కాగ, దేశి ఛ్ఛందమున వ్రాసిన పద్యములు 1475 మాత్రమే గలవు. కనుక వీరభద్రవిజయము సందువలెనె భార తమునందును పోతన సాంస్కృతిక ఛందమునకే ప్రాముఖ్యమునిచ్చిరి. పద్య ములన్నింటిలో కందములు 2288 కలిగి అగ్రస్థానమున నుండగ, సీసములు 911 గల్గి ద్వితీయస్థానమున నున్నవి. విశేషవృత్తములలో మత్తకోకిలలు 34, తరల ములు 15 గలవు.

నారాయణశతకమున, శార్దూలవృత్తములు 30, మత్తేభములు 75 గలవు.

భోగినీదండకము, దండకకావ్యము దండకాంతమున గ్రంథాంకితపద్య ము ఉత్పలమాలలొగలదు. భోగినీదండకము తగణముతో నిర్మింపబడియున్నది. దండకాంతమున రెండు గురువులు అదనముగ గలవు.

వీరభద్ర విజయమునగల, "శ్రీనీరరూపాశివద్రోహగండాప్రచండ ....... రుద్రానమస్తే నమస్తే నమస్తే నమః" (4-180) అను తగణరూప దండకమున, అంతమున అదనముగ ఒక గురువు మాత్రమే గలదు.

భాగవతమున, తృతీయ, దశమస్కంధము లందు గల రెండు దండకములను వీరభద్రవిజయము నందలి దండకము వలె తగణముతోసాగి, అంతమున ఒక గురువును మాత్రమే అదనముగ గలిగి యున్నవి.

పోతన కృతులందలి ఛందమును పరిశీలించగ, పోతనకు సాంస్కృతిక ఛందమనిన మక్కువ ఎక్కువని తెలియుచున్నది. విశేషవృత్తములలో పోతనకు మత్తకోకిలపై ప్రీతి మెండని తెలియుచున్నది. నారాయణ శతకమునందు, భాగవతమునందు **మత్తేభములు అధికముగ** ప్రయోగింపబడినవి. వీరభద్రవిజయము, **భాగవతములందు** కందములు ప్రథమస్థానమునను, సీసములు ద్వితీయస్థానమున గలవు.

## వర్ణనలు - తులనాత్మక పరిశీలనము

వీరభద్రవిజయము నందు భాగవతమునందు పోతన నిర్వహించిన వర్ణనలను క్రిందివిధముగ తులనాత్మక పరిశీలన గావించుటమైనది. నారాయణశతకమునందు, భోగినీదండకమునందు వర్ణనలు లేవని చెప్పవచ్చును.
వీరభద్రవిజయము నందలి హిమవద్గిరి వర్ణనను, భాగవతము నందలి త్రికూట పర్వత వర్ణనను పరిశీలింపవచ్చును.

## వీరభద్రవిజయమునందలి హిమవద్గిరి వర్ణన :-

సీ॥ మింటి చుక్కలతోడ మేలమాడుచునున్నఘనమేఘ సంఘంబుగలుగుదాని
భూరితపోవన భూమీరుహంబులు కమలాకరంబులు గలుగుదాని
గంధర్వఖేచరగణ విమానంబులు గప్పిన రత్నశృంగముల దాని
శుకపికశారికానికరధ్వనులచేత నతిరమణీయమైయలరుదాని

ఆ॥ సిద్ధదంపతులు వశీకృతకాములై
సానుతలములందు సరసమాడఁ

జెలువుమిగులుదాని శీతాచలేంద్రంబుఁ
గరముపేడ్కతోడఁ గనిరిమునులు" (3-31) మరియు,

"సలలితకామధేనువులఁ జందనకల్ప మహీరుహంబులన్.... ...
చెలువగు భూధరేంద్రమును శీతనగేంద్రముఁ గాంచిసంయముల్" (3-33)
అను పద్యములందు మేషపంక్తులు, తపోవనవృక్షవాటికలు, కమలాకరములు, రత్నశృంగములు, శుకపికముల కిలకిలారావములు, సిద్ధదంపతుల శృంగారకేళి, చంగనకల్ప మహీరుహములు మొదలగు వానితో హిమగిరి అలరారుచున్నట్లు మాధుర్య గుణవ్యంజకముగ వర్ణింపఁబడినది. ఈ హిమవదిరి భోగులకును సం భోగులకు, యోగులకు విహారస్థలముగ చెప్పబడినది.

భాగవతము నందలి అష్టమస్కంధము నందలి త్రికూటపర్వత వర్ణన :-

సీ॥ రాజేంద్రవినుసుధారాశిలో నొకపర్వతము త్రికూటంబనఁదనరుచుండు
యోజనాయుతమగు నున్నతత్వంబును నంతివెడలుపు నతిశయిల్లుఁ
గాంచనాయస్సార కలధౌతమములై మూడుశృంగంబులు మొనసియుండుఁ
దటశృంగ బహురత్నధాతుచిత్రితములై దిశలుమానభములుఁ దేజరిల్లు

తే॥ భూరిభూజలతాకుంజ పుంజములును
మ్రోసి పలుతెంచు సెలయేటిమొత్తములును
మరగి తిరిగెడు దివ్యవిమానములును
జఱులఁగ్రీడించు కిన్నరచయముఁగలిగి" (8-23) అనియు,

వ॥ "అది మఱియును మాతులుంగ లవంగలుంగచూతకేతకీ భల్లాత
కామ్రాతక సరళపనసబదరీవకుళ ..." (8-24) అనియు పర్వతవర్ణన గలదు.

"రాజేంద్రవిను . "అను సీసపద్యమున భూధరముయొక్క ఉన్నతి విశాలత, అందలి రత్నమయశృంగములు, వృక్షసముదాయములు, సెలయేళ్లు, విమానముల సంచారము, కిన్నరదంపతుల శృంగారకేళి వర్ణింపబడి యున్నది. వచనమున వివిన్న వృక్షజాలము. పుష్పలతలు శుకపికాది పక్షిసంతానములు, పక్షి

సముదయము, నవరత్నములు, సిద్ధసాధ్యులు, సింహశరభశార్దూలాది మృగ గణ ముల వర్ణనగలదు. వీటన్నిటితో త్రికూటపర్వతము ప్రఖ్యాతమై యున్నదని చెప్ప బడియున్నది

వీరభద్ర విజయము నందలి, "మహితమాతులుంగ మందార చందన సాల భల్లాతకీ ......నైమిశారణ్యపుణ్యక్షేత్రంబు నందు" (1-45) అను వచనము భాగవతము నందలి త్రికూట పర్వతము వర్ణింపబడిన వచనములకు ఆధారమని నుడవవచ్చును.

పై తెల్పిన రెండు పర్వత వర్ణనలలో సరళత, స్పష్టత, ఔచిత్యము పోషింపబడియున్నది. పర్వతవర్ణనకు రెండు కృతులలో సీసపద్యములే సమాదరింప బడియున్నవి. వీరభద్రవిజయమునందలి హిమగిరివర్ణనలో, గిరిసానుదేశములందు సిద్ధ దంపతులు వశీకృతకాములై సరసమాడు కొనుచున్నట్లు, భాగవతమున పర్వతచఱియలందు కిన్నరచయము క్రీడించుచున్నట్లు వర్ణింపబడి యున్నది.

## యుద్ధవర్ణన :-

వీరభద్రవిజయమున, వీరభద్రుడు విష్ణువు. దేవేంద్రాదులతో గావించిన యుద్ధము వర్ణింపబడి యున్నది. భాగవతమున దేవాసుర సంగ్రామము వర్ణింప బడియున్నది. ఈ రెండు యుద్ధవర్ణనలను పరిశీలించుట క్రింది విధముగనున్నది

వీరభద్రవిజయమున, వీరభద్రుడు, వేల్పుల మూకలను, "బాణజాలంబుల పఱపుచు, శూలంబుల బొడుచుచు, .. ..కుఠారంబుల ఖండించుచు, పఱశువుల నఱకుచు ... భిండివాలంబుల ఖండించుచు" (4-108) చెండాడి నట్లు వర్ణింపబడి యున్నది.

భాగవతమున దేవతలు దానవులను, "శరంబుల నాటింపుచుఁ బఱశువుల నఱకుచుఁ జక్రంబులం జెక్కుచు, శక్తులందునుముచుఁ, గుఠారంబులం బొడుచుచు ......"(8-334) హింసించినట్లు వర్ణింపబడియున్నది.

వీరభద్ర విజయము నందలి వీరభద్రుని సమరోత్సాహమును",....కంఠీ రవంబునుంబోలె గర్జించుచు, మదాంధ సింధురంబును బోలెమ్రోయుచు, మేఘం బునుంబోలె శరవృష్టి గురియుచు...."(4-127) న్నట్లు,

భాగవతమున దేవతల సమరోత్సాహమును, "........సింహనాదంబులు సేయుచు, నట్టహాసంబులిచ్చుచు, బహునాదంబుల విజృంభించు...." (8-334) చున్నట్లు పోతన వర్ణించెను.

పై వర్ణనలలో క్రియాపదముల నంతముగ ప్రయోగించి పోతన యుద్ధ వాతావరణమును సమగ్రముగ ప్రతిష్ఠించెను. సమరోత్సాహమును వర్ణించునెడ భాగవతముకన్నను. వీరభద్రవిజయమునందు చక్కని పూర్ణోపమలు ప్రయోగింప బడియున్నవి. రెండు కావ్యములందు యుద్ధవర్ణన అధికభాగము వచనమున చెప్పబడి యున్నది ఏకకవికృతములైన ఈ వర్ణనలు ఒకదానికొకటి పోలికలు గలిగి పోతనగారి వర్ణనావైభవమును చాటుచున్నవని నుడువవచ్చును

## ఆత్మాశ్రయకవితారీతి - తులనాత్మకపరిశీలనము

సృష్టిచక్రమునకు ఆధారమైన పరమేశ్వరుని మహిమను, చరితమును వర్ణించునెడ పోతన ఆత్మీయత పాఠకులకు విదితమగుచుండును. భక్తుల చరిత ములను వివరించునపుడు, ఆయాభక్తుల పాత్రలలో లీనమై భగవంతుని తనివి తీర ధ్యానించుకొని పోతన తృప్తి పడుచుండును. పోతన ఆత్మీయతను క్రింది విధముగ చూడవచ్చును.

వీరభద్ర విజయమున బ్రహ్మాదిదేవతలు మహేశుని ప్రార్థించునెడ, పుట్టింపనీవెనేర్తువు, నెట్టరక్షింపనీవెనేర్తువు గడిమిం, గిట్టింపనీవెనేర్తువు, యిట్టిద యారసమెచెల్లునీకు మహేశా" (4-154) అనియు, మరియొకచోట," భావింప జగములన్నియుఁ, గావింపగవానినన్ని ఖండింపగ బ్రహ్మవిష్ణు మహేశ్వరులన, నీ వైతివికాదె దేవనిఖిలాదిపతీ" (3-241) అనియు పోతన పేర్కొనెను.

భాగవతమునందు

"సకలసృష్టి స్థితి సంహారక ర్తవై బ్రహ్మవిష్ణుశివాఖ్యబరగుతీవు" (8-222) అనియు, "నీయందసంభవించును, నీయందవసించియుండు నిఖిలజగములున్, నీయంద లయముఁబొందును, నీయుదరము సర్వభూతనిలయమురుద్రా" (8-223 అనియు పేర్కొనెను.

నారాయణశతకమున,

"భూతవ్రాతమునంబు జాసనుడవై పుట్టింతు విష్ణుండవై
ప్రీతింబ్రోతు హరుండవైచెఱుతు నిర్భేద్యుండవైత్రైగుణో
పేతంబై పరమాత్మవై నిలుతునీ పెంపెవ్వరుగానర
జ్ఞాతోద్యాతసుజాత పూజిత పదాబ్జశ్రేష్ఠనారాయణా" (24ప) అనియు పే
ర్కొనెను.

శివుడైనను, విష్ణువైనను పరమాత్మ ఒక్కడే ఆ పరమాత్మయే సమస్త సృష్టిస్థిలయ కారణభూతుడని పోతన పై మూడు కృతులందు చాటియున్నాడు. చెప్పినపద్ధతిలో ఏకత్వము కొట్టవచ్చినట్లు కన్పించుచున్నది.

పరమాత్మను కీర్తించునెడ సహస్రనామావళితో ధ్యానించుట పోతన సహజస్వభావము. త్రివర్గయుతకైవల్య సాధనకు (భాగవతమునందు), శంభుకొల్వుచేరుటకు (వీరభద్రవిజయమునందు), సుజ్ఞానమోక్షములకు (నారాయణశతకమునందు) పరతత్త్వరూపమును భావించుకొని ధ్యానమననములు గావించుట ఒక్కటియే ఉత్తమమార్గమని పోతన విశ్వాసమనవచ్చును.

వీరభద్ర విజయమున, క్షీరసాగమథన ఘట్టమున బ్రహ్మాదిదేవతలు ఈశ్వరుని స్తుతించిరి. ఈస్తుతి పోతన భక్త్యార్ద్రతకు నిదర్శనముగ వెలువడిన భగవన్నామావళి యనవచ్చును.

"కాయజసంహరాయ శశిఖండధరాయ నమశ్శివాయ కా
లాయహరాయ భీషణ బలాయ తపాలధరాయ దేవదే
వాయ యమాంతకాయ దృఢవజ్రపినాక త్రిశూలదండ హ

స్తాయమునీంద్ర యోగివరదాయ సురాధిపతే! నమేస్తుతే" (3-236) అనియు, 'ఆయతమంగళాయ భుజగాదిపరమ్యకరాయ... . శివాయ నమో నమో స్తుతే" (3-237) అనియు, "కారణకారణాయ భుజగర్వమదాంధకసంహరాయ .... నమోనమోస్తుతే" (3-238) అనియు, "ఋతుసంవత్సరమాస పక్షజనితా రూఢాయ . నమో సోమార్ధచూడామణే" (3-239) అనియు సంస్కృతశ్లోక ములవలె పోతన రచించెను.

భాగవతమున, బ్రహ్మ శ్రీహరిస్తోత్రమునుగుఱించి నిజనందనుల కెరిగించి నటుల వివరించుచు పోతన,

సీ॥ "పంకజనాభాయ సంరక్షణాయ శాంతాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేంద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదేవాయ పూర్ణాయ పుణ్యాయనిర్వి
కారాయ కర్మనిస్తారకాయ త్రయీపాలాయ త్రైలోక్యపాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వయంజ్యోతిషే దురంతాయ కర్మ

తే॥ సాధనాయ పురాపురుషాయ యజ్ఞ
రేతసే జీవతృప్తాయ పృథ్వీరూప
కాయ లోకాయ నబిసేఽంతకాయ విశ్వ
యోనయే విష్ణవే జిష్ణవే నమోఽస్తు" (4-702) అనియు,

సీ॥ "స్వర్గాపవర్గా సుద్వారాయ.... ..నమోస్తు" (4-703) అనియు,
"సర్వసత్త్వాయ . . నమోస్తు" (4-704) అనియు శ్రీమన్నారాయణ స్తవమును గావించి తనివినొందెను

నారాయణశతకమున,

"నరసింహాచ్యుత వాసుదేవ వికసన్నాళీక పత్రాక్షభూ
ధరగోవింద ముకుంద కేశవ జగత్త్రాతాఽహితల్పాంబుజో
దర దామోదర తార్క్ష్యవాహన మహాదైత్యారి వైకుంఠ మం
దిరపీతాంబర భక్తవత్సలకృపందీపింపు నారాయణా" (99ప) అని శ్రీహరి

అవతారమూర్తులను పోతన కీర్తించెను సర్వేశ్వరుని వివిధనామములను ధ్యానించి పోతన తరించెను,

కావ్యములందలి పాత్రలముఖముగ జరిగిన ఈ స్తోత్రములన్నియు పోతన భక్తితత్త్వమును చాటు చున్నవనవచ్చును.

పై పరిశీలనమువలన, పోతన కృతులలో, భక్తితోనిండిన ఆయన హృదయము ఒకేవిధముగ కన్పించుచున్నది. వీరభద్రవిజయమున పరమేశ్వరునిస్తుతి' భాగవతము, నారాయణశతకములందు నారాయణస్తవము జరిగినది. భగవంతునిచేరుటకు భక్తితో ధ్యానించుటయే ఉత్తమమార్గమ మని విశ్వసించిన పోతన ఆత్మమనకు ఆతనికృతులందు వ్యక్తమగుచున్నది.

## శబ్దాలంకారములు - తులనాత్మక పరిశీలనము :-

ఆంధ్రసాహిత్య చరిత్రలో పోతనకు ఒక విశిష్టస్థానము కలదు. అట్టి స్థానము నందుటకు ఒకటి వారి భక్తిరస ప్రతిష్ఠాపనముకాగ, రెండవది నన్నయ్యా అక్షరరమ్యతగ పేర్కొనిన శబ్దాలంకారవిన్యాసము. శబ్దముల పొందికపై భక్తకవి పోతనకు ఎక్కువ మక్కువ. అటులని అర్థాలంకారములందు అనాదరమేమియులేదు. పూర్ణోపమల నందించుటలో కాళిదాసమహాకవికి పోతన దగ్గరవాడనవచ్చును. శబ్దాలంకారములు పోతన పద్యములలో అప్రయత్నముగనే చోటుచేసికొనును. ఆయనకు కవిత్వముతోబాటు సిద్ధించిన గుణమిది.

వీరభద్రవిజయము నందలి శబ్దాలంకారములు :-

1. "వడవడ వడకుచు నుడుగుచు,జడిముడి మయినొందికలగి చింతాకులమై.... కాంతిదొఱంగన్" (1-07)
2. "దక్షుడు పాపచక్షుడు కర్మ దక్షుడదక్షుడై" (1-95)
3. "పెదవులు దడపుచుఁగొంకుచు, నదరుచు బెగడుచును........వదనము వంచుచు నడగుచు........దొయ్యలి వగతోన్" (1-108) మొదలగు వృత్త్యను ప్రాసాలంకారములు,

"జగములోపలగల జంతురాసులబట్టి మనసులగలచు నీమహిమ మహిమ........" (2-58) మొదలగు లాటానుప్రాసాలంకారములు,

"కుంభినిద్రెంతునో జముని గుండెలు చెందుదునే.... క్రొవ్వణగింతునొ సూర్యచంద్రులన్" (4-64), మరియు,

"కాయజసంహరాయ శశిఖండధరాయ ..నమోస్తుతే"(3-236) మొదలగు అంత్యానుప్రాసాలంకారములు వీరభద్రవిజయమున గలవు.

భోగినీదండకమున

"ఏజాతి యేనాతి యేరీతి నీతింబ్రకాశింపకీభంగి రంజిల్లునే" (పుట 8). మరియు, "చీటికిన్ మాటికిన్ బోటి! యామేటి యిచ్చోటికిన్ రాదు" (పుట 9) మొదలగు వృత్త్యనుప్రాసాలంకారములు గలవు.

నారాయణశతకమున.

"మదనోద్యోగాను రాపంబులన్ చల్లన్ జల్లని చూపుజల్లుమని గోపస్త్రీల పైఁజుల్లుమి, చల్లుంబోరు......" (60ప) మరియు,

"వరదుగ్ధాబ్ధితరంగడోలికలలో వైకుంఠలోకంబులో
వెరపొప్పారనయోధ్యలో మధురలో ద్రేపల్లెలో .. నారాయణా" (59ప)

అను అనుప్రాసాలంకారములు గలవు

భాగవతమున,

1. "హరిహరిసిరియురమునగల హరిహరియు కొఱకు...." (8-526)
2. "నిలింపాహిత జిష్ణువిష్ణుఁ బ్రభవిష్ణుంగృష్ణురోచిష్ణునిన్', మరియు,
3. "అడిగెదనని కడువడిజను, నడిగినదనుమగడునుడువడని నడియుడుగున్, వెడవెడసిడిముడి తడబడ, నడుగిడు నడుగిడదు జడిమనడుగిడునెడలన్"(8-103)

మొదలగు వృత్త్యను ప్రాసాలంకారములు,

"కమలాక్షు నర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ .. " (7-169) మొదలగు లాటాను ప్రాసాలంకారములు,

"మేఘంబుమీది క్రొమ్మెఱుగుకైవడి మేనిపైనున్న పచ్చనిపటమువాడు, గండభాగంబులఁ గాంచనమణిమయ మకర కుండలకాంతిమలయువాడు........"

(1-248ప), మరియు, "కమనీయ శుభగాత్రుఁ గంజాతదళనేత్రు, వసుధా కళ త్రుఁబావనచరిత్రు"(10-358) మొదలగు అంత్యాను ప్రాసాలంకారములు గలవు.

పై శబ్దాలంకారముల పరిశీలనమువలన పోతన కృతులు శబ్దాలంకార యుతములని తెలియుచున్నవి. ఈ శబ్దాలంకారములు సహజసిద్ధములై సందర్భో చితికి, అర్థగాంభీర్యమునకు దోహదపడుచున్నవని చెప్పవచ్చును. వీరభద్రవిజ యమున అంకురించిన శబ్దాలంకార విన్యాసము భాగవతరచననాటికి పెరిగి మహా వృక్షముగ వెలుగొందినది. భోగినీదండకము నందలి ప్రతిపంక్తియు శబ్దాలంకార సహితమని చెప్పవచ్చును.

శబ్దాలంకారములను ప్రయోగించిన ప్రాచీన కవులలో పోతన మహాకవికి అగ్రతాంబూలము లభించునని నుడువవచ్చును.

పై విధముగ పోతనకృతులను అవతారిక ఇతివృత్తము, ఛందస్సు, వర్ణ నలు, ఆత్మీయత, శబ్దాలంకారము అను అంశముల క్రింద తులనాత్మకముగ పరి శీలించుటమైనది.

పరబ్రహ్మ గుణవైశిష్ట్యమును పోతన వేనోళ్లకీర్తించి తానుధన్యుడై, ఆంధ్రలోకమును, ఆంధ్రసాహిత్యమును పునీతము గావించెనని చెప్పవచ్చును.

పోతన ఆంధ్రులకు చిరస్మరణీయుడు.

# ప్రకరణము - 6

## వీరభద్రవిజయము - భక్తితత్త్వము

భక్తి - శాఖలు

మతము

శైవము

శైవము - శాఖలు

శైవ సిద్ధాంతము

వీరశైవము - పుట్టుక - లక్షణములు

వీరశైవము - పేరిణిశివతాండవము

వీరభద్రోత్సవములు

వీరభద్రవిజయము - భక్తితత్త్వము

# వీరభద్రవిజయము - భక్తితత్త్వము

వీరభద్రవిజయములోని భక్తివిధానమును గూర్చి చర్చించుటకు పూర్వము భక్తియననేమోతెల్పి అందలి శాఖలను, మతము, శైవము. వీరశైవము తన్మత లక్షణములను పరిశీలింపవలసి యున్నది.

## భక్తి - శాఖలు :-

భక్తియను పదమునకు నిఘంటువులలో సేవ, స్నేహము, భయముతో కూడినప్రేమ" (విద్యార్థికోశము పుట - 328) మొదలగు అర్థములు కనిపించుచున్నవి. పురుషోత్తమకవీయమున "భక్తి" కి "బత్తి"ని వికృతిరూపముగ జూపి "ప్రీతి" అను అర్థము చెప్పబడియున్నది (పురుషోత్తమకవీయము పుట - 191)

"సాకస్మైచిత్ పరమాప్రేమరూపా"

అమృత స్వరూపాచ" (నారదభక్తిసూత్రములు పుట - 2, 3) అను నారద భక్తిసూత్రముల ననుసరించి "ఎవరిమీదనైన నిర్మలమగు ప్రేమగలిగియుండుటయే భక్తి, అయ్యది అమృత స్వరూపముగూడ" అని నిర్వచింపవచ్చును. "ఈశ్వరునియందు నిర్మలమైన ప్రేమగలిగి యుండుటయే భక్తియని" "భక్తిసోపానము" ననుసరించి చెప్పవచ్చును. (భక్తిసోపానము పుట - 26)

భగవంతుడు పేమస్వరూపుడు, ప్రేమ భగవత్స్వరూపము. ప్రేమ ఒక్కటియే సృష్టి సింహాసనమును అదిరోహించి పాలించుచున్నది. పాలింపగలదని సర్వులవిశ్వాసము. (భక్తిసోపానము పుట - 26) "ఈశ్వరుని అనుగ్రహము కొరకు ప్రార్థించునట్టి, ఆయనయెడ గాఢమైన ప్రేమయే భక్తి పురుషరూపమున భావింపబడిన అనంతత్వము కొఱకైన జీవుని బుభుత్సయే భక్తి. మానవప్రేమ, మానవ సంబంధములు వీటి సాదృశ్యము నండగాగొని పై బుభుత్సకర్థము చెప్పబడినది" (విజ్ఞానసర్వస్వము పుట - 637 పుట - 627) అని విజ్ఞాన సర్వస్వము తెలుపుచున్నది. "ఋగ్వేదమునందు 'యజ్ఞము' అనుపదమునకు భక్తి, స్తోత్రము, నుతి, అను అర్థములుండెడివని శ్రీమేడేపల్లి వరాహ నరసింహస్వామిగారు పేర్కొనిరి. (విజ్ఞానసర్వస్వము పుట-637 పుట627) ఇట్లు పలురకములుగ "భక్తి" ని

నిర్వచించియుండుట గలదు. పూజ్యనీయుడైన ఈశ్వరునియందు అత్యంతాను రాగమును గలిగి యుండుటను భక్తియని నిర్ధారింపవచ్చును

జీవుడు రక్తిని విడచి, తత్త్వమును గుర్తించి, అచంచలదీక్షతో సర్వేశ్వరునికి ఆత్మార్పణము గావించుకొని ముక్తినిసాధించుటకై చేపట్టు సాధనమే భక్తియని తెలియుచున్నది. ఆత్మార్పణమనగ హృదయముద్రుతమై అవిచ్ఛిన్నముగ సర్వేశ్వరునియందు వర్తించుట యనవచ్చును. జీవుడు విరక్తుడగుటకు దేవుని శక్తి పనిచేయును. కనుక ఈశ్వరుని శక్తియే జీవునియందు భక్తియగుచున్నది భక్తియను భావము జీవేశ్వరులను సంతుష్టులుగజేయు దివ్యసాధనమనవచ్చును భక్తునకు భగవంతునకు మధ్య స్నేహబాంధవ్యమును భక్తియే క్రమవృద్ధినొందించును. ఈ భక్తిని నవరసములలో ఒకరసముగ జేర్చి రూపగోస్వామి, మధుసూదన సరస్వతి మొదలగు అలంకారికులు రసత్వమును స్థాపించిరి.

"కాంతాది విషయావాయే రసాద్యాస్తత్ర నేదృశం
రసత్వం పుష్యతే పూర్ణసుఖాస్పర్శిత్వ కారణాత్
పరిపూర్ణ రసాక్షుద్ర సేభ్యో భగవద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్య ప్రభేవ బలవత్తరా" (కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానమువారివాఖ్యానము - పు 305) అను శ్లోకమునననుసరించి కాంతాదివిషయకములగు ఏరసములందును భగవద్రతియందువలె పూర్ణసుఖములేక ఆనందము గలుగదు. కానవాని యందు తగిన రసపుష్టిలేదు. అవి క్షుద్రరసములు. భగవద్రతి పూర్ణరసము. అది మిణుగురు పురుగులకన్న సూర్యకాంతి యెట్లుబలవత్తరమో, అట్లే మిగిలినరసములకన్న శ్రేష్ఠతరము, బలవత్తరము అని తెలియుచున్నది. భక్తిరసమునకు భగవదాకారచిత్తవృత్తి స్థాయిభావము. అదియే భగవద్రతి. భగవంతుడు ఆలంబనవిభావము. తచ్చరిత్రలు ఉద్దీపన విభావములు. అప్పట్టున జీవికికలుగు నేత్రది వికారములు అనుభావములు. హర్షాదులు వ్యభిచారులు వీనితో పుష్టమై పరమానంద స్వరూపమగు భక్తిరససిద్ధి కలుగును. మోక్ష సాధనమైన ఈ భక్తి,

శ్రవణం కీర్తనం విష్ణోస్స్మరణమ్ పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్" (మహాభాగవతము 7-5

శ్లోకము - 21) అను శ్లోకముననుసరించి నవవిధమార్గములుగ పేర్కొనబడియున్నది. "భక్తిసోపానము" అను భక్తిగ్రంథము ద్వాదశభక్తిమార్గములను తెలుపుచున్నది. అవి :- 1. అహేతుకభక్తి 2. రాగాత్మకభక్తి 3. వైధభక్తి 4. సహేతుకభక్తి 5. జిజ్ఞాసాభక్తి 6. మాతృభక్తి 7. పితృభక్తి 8. పతిభక్తి 9. దాస్యభక్తి 10 సేవాభక్తి 11 గౌణభక్తి 12. ఆర్తభక్తి (భక్తిసోపానము పుట - 32) ఇవిగాక నిఘంటువులలో త్రివిధ భక్తిమార్గములు గలవు. అవి 1. బాహ్యము (పరోక్షము) 2. అనన్యము (అపరోక్షము), 3. ఏకాంతము (నిశ్చయజ్ఞానమున గల్గు నిత్యానందము) (విద్యార్థికల్పతరువు పుట-31) ఇట్లు భక్తిశాఖలు విభిన్నములుగ ప్రవర్తిల్లియున్నవి. మార్గములు భిన్నమైనను గమ్యస్థానము మాత్రము అభిన్నమనుట సత్యసమ్మతము.

**మతము :-**

భక్తితత్త్వము నాధారముగనే ప్రపంచమానవులు మతములను కల్పించుకొనిరనవచ్చును ధర్మార్థకామమోక్షములలో మోక్షము ఉత్కృష్టమైనదని ఎఱిగి మానవులు భక్తిమీద శ్రద్ధాసక్తులు కనపరచిరి దీనికిగాను వీరు మతమును సాధనముగ గ్రహించిరి. ఫలితముగ లోకమున జాతికొక మతమేర్పడినది.

సువిశాల ప్రపంచమున ఎందరో మహానుభావులుదయించి కొన్ని సంప్రదాయములను, ధర్మములను, నీతులను ప్రబోధించి ప్రజలకొక వినూత్నమార్గమును చూపెట్టిపోవుటజరిగినది. ఆ మార్గములే కాలక్రమమున విభేదించి విభిన్న మతములుగ రూపుదాల్చుట సంభవించెను.

"మతము" అనగ జ్ఞానము. జ్ఞానమనగ "తత్త్వత్రయ జ్ఞానము", "అర్థపంచకజ్ఞానము" అని చెప్పనుప్పను. చిదచిదీశ్వరుల తత్త్వములే అర్థత్రయము స్వరూప, పరస్వరూప, ఉపాయస్వరూప, పురుషార్థస్వరూప, విరోధిస్వరూపములు అర్థపంచకములు. సకల వేద ఇతిహాస పురాణచోదితమగు జ్ఞానమే అర్థపంచక జ్ఞానము. ఇట్టి జ్ఞానమే ముముక్షువునకు పరమావశ్యకము" (గోల్డెన్‌జుబిలీ సావనీర్

టి.టి డి పుట - 171) అని శ్రీ యన్.కె. భాష్యకాచార్యులవారు వివరించిరి. ఇట్టి మతజ్ఞానమును బోధించినవారు లెక్కకు మిక్కిలిగ యున్నను ఆరుగురు మహనీయుల మార్గములే ప్రజలనెక్కువగ ఆకర్షించుట జరిగెను "1. న్యాయము, 2 వైశేషికము, 3. సాంఖ్యము. 4. యోగము, 5. మీమాంస, 6. వేదాంతము" అనునవియే "షడ్దర్శనముల"ని ప్రసిద్ధినందినవి. వీనికి గౌతముడు, కణాదుడు మొదలగువారు కర్తలై భాసిల్లిరి. ఇందు మొదటి ఐదు మతములు వేదప్రామాణ్యమునంగీకరించలేదు. మంచిచెడ్డలే జీవుల రక్షణశిక్షణలను నిర్వహించునని తెల్పినవి. ఈశ్వరుడులేడు, అహింస పరమధర్మమని కొన్ని వివరించగ, జన్మరాహిత్యమునకు కర్మసన్యాసము మూలమని మరికొన్ని ఉద్ఘాటించినవి. ఆరవది యైన వేదాంతమునకు వేదమే ప్రామాణ్యము ఇందునను విభిన్నాభిప్రాయముల తోడ ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము అను త్రివిధములుగ మూడు తత్త్వములను ఆమోదించుట జరిగినది. శ్రీశంకర భగత్పాదులు ఈశ్వరుడొక్కడే సత్యమని భావించి, జైన బౌద్ధమతములను ఖండించి, శైవవైష్ణవాది మతములను స్వీకరించి, జగన్మిథ్యావాదముతో కూడుకొనిన అద్వైతమతమును ప్రబోధించిరి. ఆ స్థితిలోనే బసవేశ్వరుడు వీరశైవమును పునరుద్ధరించుట జరిగెనవచ్చును.

## శైవము :-

శైవమతము అతిప్రాచీనకాలము నుండియు భారతదేశమున నున్నదని చెప్పవచ్చును. "ఋగ్వేదమునందే ప్రకృతిదేవతారూపమున రుద్రుడు స్తుతింపబడినాడు శ్వేతాశ్వత రోపనిషత్తులలో, శివపర్యాయ శబ్దములు ఒకమూర్తిపరముగ వాడబడి, శివుడు పరబ్రహ్మస్వరూపముగ కూడ వర్ణింపబడెను" (తెలుగుసాహిత్యముపై వీరశైవ ప్రభావము పుట - 11) అని డా॥ జీరెడ్డి చెన్నారెడ్డిగారు చెప్పియున్నారు. మరియు, ఋగ్వేదము, ప్రథమమండలము, 14వ అనువాకము 114వ సూక్తమునగల, "ఇమారుద్రాయ తవసేకపర్దినేక్షయ ద్వీరాయప్రభరామహేమతీః

యథాశమసద్ద్విపదే చతుష్పదే విశ్వంపుష్టంగ్రామే అస్మిన్ననాతురమ్"

"మానస్తోకే తనయేమాన ఆ యౌవమానొ గోషుమానొ అశ్వేషురీరిషః

వీరాన్మానోరుద్ర భామితోవధీర్హ విష్మంతస్సద మిత్త్వాహ వామహే" (ఋగ్వే

దము - ప్ర॥ మం॥ - 14 అను 114సూ - 1,8 మంత్రములు) అను మంత్రముల వలన మనుష్యులకు, పశువులకు సుఖమును కల్గించునట్టి, జటాజూటము కల్గినట్టి, తేజోవంతుడైన రుద్రుని స్తుతించినటుల తెలియుచున్నది. మరియు వీని తోనున్న ఇతరమంత్రము లందును మనుష్యపశు రక్షణము పలుమారులు కోరుట జరిగినది. ఇట "పశు" శబ్దము "జీవు"లను అర్థమున వాడబడినదనిన పశుపతియే ఈరుద్రుడని చెప్పవచ్చును. శిష్టారామకృష్ణశాస్త్రిగారు, "వేదమంత్రోపస్థితుడైన రుద్రుడే వేదాంతమందు శివపరిణామ మొందినాడు" (వీరశైవంధ్రవాఙ్మయము పుట - 17) అనిఅనిరి. శైవాగమములు శివుని పరబ్రహ్మముగ నిరూపించినవి. అవియును రుద్రాగమములనుపేర 18, శివాగమములని 10 మొత్తము ఇరువది ఎనిమిదిగ భాసిల్లుచున్నవి.

"సింధులోయలోని "హరప్పా," "మొహంజొదారో"లలో త్రవ్వకములు సాగించినపుడు కొన్ని ఆశ్చర్యకరమైన విషయములు వెల్లడియైనవి. అందు చిన్న వి, పెద్దవి లింగములు, పాణివట్టములు మొదలగు శివచిహ్నములు బయల్పడినవి. వృషభచిహ్నములు గల ముద్రలుగూడ లభించినవని హెరాస్ పండితుడు వివరించినాడు. అర్యులు భారతావని అడుగిడి గంగాసింధూ పరీవాహ ప్రదేశము నాక్రమించుకొనుటకు పూర్వమే సింధూలోయలో చక్కని నాగరికత వెలసినట్లు గుర్తింపబడినదని చారిత్రకులు తెల్పుచున్నారు. కనుక ఆర్యుల ఆగమమునకు ముందే ఉత్తర భారతదేశమున శైవముండెనని తెలియుచున్నద" (గోల్డెన్ జుబిలీ సావనీర్ - టి టి డి - పుట 45)ని డా॥ జీరెడ్డి చెన్నారెడ్డిగారు పేర్కొనిరి. ఆర్యులప్రవేశమునాటికి పరిఢవిల్లిన నాగరికత ద్రావిడులదేననియు డా॥ రెడ్డిగారు తెల్పిరి కావున శైవము అతిప్రాచీనమనుటలో విప్రతిపత్తిలేదు. ఆశైవమునే ఆర్యులు అనుసరించిరి అని చెప్పవచ్చును.

## శైవము - శాఖలు :-

ఆగమ పురాణాదులవలన శైవమున నాలుగు శాఖలున్నటుల తెల్లమగు చున్నది. అవి 1. సామాన్యశైవము 2 మిశ్రశైవము 3. వీరశైవము (అనాదిశైవము; ఆదిశైవమనియు వ్యవహారము). 4 వీరశైవము ఆర్యులనుసరించినశైవము - పూరాతనశైవము. శుద్ధశైవము. ఇందు మరల ఐదుశాఖలు కనవచ్చుచు

న్నవి. అవి 1. పాశుపతము 2. కాపాలిక (మహావ్రత), 3. కాలాముఖము, 4. గోరక్షనాథము, 5. రసేశ్వరము,

"కలియుగమున పాశుపత శైవమును వ్యాప్తిలోనికి దెచ్చినవాడు లకులీశ శివాచార్యుడు. ఇతడు లాటదేశము నందలి నర్మదాతీరవాసి. ఇతనికి కుశిక, గార్గ్యా, కారుహ, మైత్రేయులనువారు నల్వురు శిష్యులుండిరి. వీరు శైవమతములను స్థాపించి మఱి నాలుగు శైవశాఖలకు కర్తలైరి. అవియే, 1.కారోహణము, 2. ఆమర్ధకము, 3. తెరంబి, 4. కదంబగుహ అనునామముల తోడ విరాజిల్లిన" (విజ్ఞానసర్వస్వము - సం. 3 – పుటలు 553, 554)వని విజ్ఞానసర్వస్వము నందు గలదు.

డా॥ పులుల శ్రీరామచంద్రుడుగారు, "క్రి శ ఒకటవ శతాబ్దము నుండియు ఆంధ్రదేశమున శైవము ప్రచారములో నుండినట్లు అనాటి ప్రాకృతశాసనాద్యాధరములున్నవి. హలుని గాథాసప్తశతిలోని పద్యములను బట్టి నాడు శైవగాథలు దేవాలయములు ఉన్నయటుల తెలియుచున్నది." (మఠములు - సంప్రదాయములు – పుటలు 23, 24) అని తెల్పియున్నారు. "'పతి' అనగ ఈశ్వరుడు 'పశు' అనగ 'ఆత్మ' లేక 'ప్రాణి' 'పాశ' మనగ 'సంసారము' లేక 'పదార్థము'. వీని తత్త్వాన్వేషణే ఇందలి సూత్రము" (తెలుగు సాహిత్యముపై వీరశైవప్రభావము - పుట 5) అని డా॥ జీరెడ్డి చెన్నారెడ్డిగారు నుడివియున్నారు. కావున ఈశ్వరుడు సమస్త ప్రాణికోటికిని పాశచ్ఛేదము గావించి, ముక్తి నొసగునని ఈ శైవశాఖల సారాంశమని భావింపవచ్చును.

కాలాముఖ, కాపాలికాది శైవములుకూడ చాళుక్యుల కాలములో తెలుగు దేశమున వ్యాపించినవి. క్రీ.శ ఏడవశతాబ్దమున పల్లవరాజు మహేంద్రవర్మ తన "మత్తవిలాసము"లో కాపాలిక, కాలాముఖ, పాశుపతులను పేర్కొనియున్నాడు. చైనాబౌద్ధ యాత్రికుడు యువాన్చ్వాంగ, తలచుట్టును, మెడలోను ఎముకలు దండలు ధరించి బిలములలోను, శైలవివరములలోను, సమాధులలోను నిత్యని వాసముచేయు యకులవంటివారని వర్ణించిచెప్పినవారు కాపాలిక శైవులనుటలో

సందియములేదు" అని విజ్ఞానసర్వస్వమునుబట్టి (పుట 556) తెలియుచున్నది. "కాలాముఖశాఖ క్రీ.శ. 12వ శతాబ్దములో తమిళ కర్ణాటాంధ్రములలో మిక్కిలి గౌరవస్థానము నాక్రమించెను" (తెలుగు సాహిత్యముపై వీరశైవప్రభావము - పుట - 53) అని జీరెడ్డి చెన్నారెడ్డిగారనిరి. "కాలాముఖులు శాశ్వతబ్రహ్మచర్యము ననుష్ఠింతురని నన్నెచోడుని "కుమారసంభవము" వలన తెలియుచున్నద"ని (వీరశైవాంధ్రవాఙ్మయము - పుట 19) శిష్టారామకృష్ణశాస్త్రిగారు పేర్కొనిరి. వీరి శక్త్యారాధన అహింసారూపమైనది

## శైవ సిద్ధాంతము :-

"త్రికమనబడు పశుపతి పాశములలో అనగ జీవేశ్వరులు, ప్రపంచము నొక్కటొక్కటియు ప్రత్యేకస్థానమును కలిగి శాశ్వతమై యున్నవి. జీవుడు బద్ధుడైన దశలో ప్రపంచముతో వీడని సంబంధము కలిగి దానితో అద్వైత సిద్ధిని పొందును. ఇదియే శైవసిద్ధాంత స్థూలరూపము" (తెలుగు సాహిత్యముపై వీరశైవ ప్రభావము - పుట 74) అని డా॥ జీరెడ్డి చెన్నారెడ్డిగారు తెల్పిరి. శైవసిద్ధాంతమున సాయుజ్యమనగ ద్వైతాద్వైత పద్ధతిలో జీవేశ్వరులు అభిన్నులైనను గుర్తించరానంతగ ప్రత్యేక ప్రతిపత్తి, తెలియరానంతగ కలసిపోవుట అనిభావము.

## కాశ్మీరశైవము :-

"కాశ్మీరమున 'ప్రత్యభి జ్ఞానదర్శనమ్ము' అను నామాంతరమున వేరొక శైవము అవిర్భవించినది. ఇదియేకొంచెము మార్పును సంతరించుకొని క్రీ శ. 9 వశతాబ్దమున వీరశైవముగ ఆవిర్భవించినదని" (విజ్ఞాన సర్వస్వము - పుట 19) విజ్ఞానసర్వస్వమునందు చెప్పబడియున్నది. కాని డా॥ జీరెడ్డిచెన్నారెడ్డిగారు ఈ వాక్యములను తమపరిశోధన సిద్ధాంతవ్యాసమైన "తెలుగు సాహిత్యముపై వీరశైవ ప్రభావము"న ఖండించి, ప్రాచీనశైవమే వీరశైవముకు మూలమని వివరించిరి. మరియు, "శివుడు లీలగ స్వేచ్ఛావశుడై విశ్వసృష్టిచేయు చున్నాడు. ప్రపంచ మంతాతానే. జీవులు పరమేశ్వరునికంటె భిన్నులుకారు. ప్రత్యభిజ్ఞయనగ జీవుడు తన్ను ఈశ్వరాధీనముగా గుర్తించెడు నిశ్చయజ్ఞానము" అని వివరణనిచ్చిరి. (తెలుగుసాహిత్యముపై వీరశైవ ప్రభావము - పుట74, 87)

## వీరశైవము - పుట్టుక

వీరశైవమునకు ప్రవర్తకుడు మహామహిమాన్వితుడు బసవేశ్వరుడు కాని, "ఈతనివలననే ఈశైవముద్భవించినదని చెప్పఁదగదు. అంతకుపూర్వమే లింగపూజ మొదలగు వీరశైవలక్షణములుగల ధర్మము, మతము ప్రవర్తిల్లినటుల గ్రంథాధారములున్నవ"ని (తెలుగు సాహిత్యముపై వీరశైవ ప్రభావము - పుట - 74, 87) డా॥ జీరెడ్డిచెన్నారెడ్డిగారు తెల్పుచున్నారు. కావున బసవేశ్వరుడు కేవలము మతవ్యాపకుడు మాత్రమే. ఈ బసవేశ్వరుని గూర్చి శ్రీశిష్టారామకృష్ణ శాస్త్రిగారు కొన్నివిషయములను క్రిందివిధముగ తెల్పియున్నారు.

"పశ్చిమచాళుక్య దేశమున త్రైలోక్యమల్లుని సేనాపతియగు బిజ్జలుడు ఇతర మండలేశ్వరుల సహాయముతోడ క్రీ.శ. 1157వ సంవత్సరములో చాళుక్య సామ్రాజ్యము నాక్రమించి క్రీ.శ. 1167 వరకు కల్యాణపురాధీశ్వరుడిగ రాజ్యపాలన గావించినాడు. ఈతని మంత్రి బలిదేవుడు. బలిదేవుని మేనల్లుడు బసవేశ్వరుడు. బసవేశ్వరుడు ఎనిమిదేండ్ల ప్రాయములోనే సకల విద్యల నందెనఘనుడు ఈతడు సంపూర్ణ వీరశైవమతజ్ఞానమునొంది, మేనమామ కుమార్తెను వివాహమాడి వీరశైవమును ప్రచారము చేయసాగెను. మరియు మేనమామ మరణానంతరము బిజ్జలునికడ మంత్రిపదవి నందియుండెను. ధనాగారము నంతటిని వీరశైవమత వ్యాప్తికి వినియోగించి, రాజుతోడ విరోధమును దెచ్చుకొనియెను. చివరకు శిష్యుల సహాయమున బిజ్జలుని చంపించెను. అంత్యదశలో బసవన్న సంగమేశ్వర క్షేత్రములో శివైక్యమునందినాడు" (వీరశైవాంధ్రవాఙ్మయము - పుట 24)

పాల్కురికి సోమన బసవనికి శివునితోడ అభేదమును కల్పించినాడు. "బసవపురాణము"న బసవేశ్వరుని యందు భక్తి పరాకాష్ఠనొందినట్లు స్పష్టపడుచున్నది.

ద్విపద "వడిఁబారు జలమునకొడలెల్ల కాళ్లు
వడిఁగాలు చిచ్చునకొడలెల్ల నోళ్లు
వడివీచు గాల్పునకొడలెల్లఁ దలలు
వడిఁజేయు బసవన కొడలెల్ల భక్తి" (బసవపురాణము - ఆ॥ 2 - ద్విప

దలు 391-92) అని సోమన చిత్రించియున్నాడు. ఈతని కాలములోనే ఆంధ్ర దేశమున అమరావతిలో మల్లికార్జున పండితుడు శైవమత ప్రచారము గావించు చుండెను. బసవని అనంతరము అతని మేనల్లుడు చెన్నబసవడును, ఈతని అనంతరము అల్లమప్రభుడును ఏతన్మతవ్యాప్తికి కంకణము గట్టుకొనిరి. ఇటుల క్రీ.శ. 12వ శతాబ్దమున కల్యాణపురమున భాసిల్లిన ప్రాచీనశైవమే వీరశైవముగ పరిణమించి బసవన్న, చెన్నబసవడు, అల్లమప్రభువు అను ముప్వురు భక్తాగ్రేస రులవలన నలుచెఱగులకు వ్యాపించి పారుగునున్న ఆంధ్రమునకు విస్తరించిన దని చెప్పవచ్చును.

## వీరశైవము - లక్షణములు :-

మతమునకు విశ్వాసము మూలాధారము. స్వమతాభినివేశము, పరమత ద్వేషము అధికమై, ఆవేశప్రధానమైన వీరశైవ భక్తిమార్గమావిర్భవించినది. "సం పూర్ణశివభక్తి, జంగమభక్తి, దీక్షాపూర్వక లింగధారణము, విభూతిరుద్రాక్షధార ణము, పంచాక్షరీమంత్రము, యజ్ఞయాగాది కర్మలను తిరస్కరించుట, వర్ణాశ్ర మవిభాగ తిరస్కారము, స్త్రీపురుష పండిత పామర బేదములేక శివభక్తి కలిగి యుండుట, భవులను తిరస్కరించుట (భవులు - లింగధారణలేనివారు), లింగ పసాయితశస్త్రధారణము" (వీరశైవాంధ్రవాఙ్మయము - పుట 18-19) వీరశైవ మతలక్షణములుగ తెలియుచున్నవి. అష్టావరణములు, పంచాచారములు, షట్ స్థల సిద్ధాంతము వీరశైవమున ప్రముఖస్థానము నందియున్నవి. దేహమే దేవాలయ మను భావము వీరిలో స్పష్టపడుచుండును.

## అష్టావరణములు :-

గురువు, లింగము, జంగముడు, విభూతి, రుద్రాక్షప్రసాదము, పాదోక ము, పంచాక్షరీమంత్రము అను ఎనిమిదియును అష్టావరణములని వ్యవహరింప బడుచున్నవి. వీనిలో గురు, లింగ, జంగములను మూడింటినుండి తనువు, మ నము, భావము శుద్ధినొందుట జరుగును. పరమశివుడే యీ మూడింటికిని మూ లమని ఈశైవుల విశ్వాసము. విభూతిధారణవలన పాపపరిహారపూర్వక శుద్ధికల్గు

గును. "రుద్రాక్షంముక్తి మూలంచ" అని ఆర్యోక్తికలదు. అందునను గురులింగ జంగములు అనుగ్రహించిన రుద్రాక్షశ్రేష్ఠము. జంగములిచ్చు ప్రసాదమే శుద్ధ ప్రసాదము. ఇయ్యది సర్వశ్రేయములకు మూలము. అటులనే గురువులైన జంగముల అంఘ్రిస్పర్శజలమే "పాదోదక" మనబడుచున్నది. ఇయ్యది జీవికి ముక్తిని ప్రసాదించును. "ఓంనమశ్శివాయ" అను మంత్రమేషడక్షరీ మంత్రము ఇందలి సర్వవర్ణములు శివాత్మకములని పెద్దల విశ్వాసము. పంచమహాపాతకములను పటాపంచలుచేసి శంభుకొల్వునకు జీవాత్మను చేర్చు దివ్యసాధనమిది.

## పంచాచారములు :-

సదాచారము, లింగాచారము, గణాచారము, భృత్యాచారము, శివాచారము అను ఐదు ఆచారములు పంచాచారములుగ ప్రసిద్ధి వహించియున్నవి. గురువునేర్పిన శివాద్వైత తత్త్వమునను సరించి భక్తుడు తన లౌకిక వ్యవహారమును నడుపుకొనుటను సదాచారమనియు, గురువువలన సంపాదించుటను లింగాచారమనియు, లింగస్వరూపుడైన తననుజూచి ఎవరైన తెలియక దూషించుచుండ ఊరకొనక వారికి శైవసిద్ధాంతమును తెలియజెప్పుట, ఆసామర్థ్యము లేనియెడల శివనింద వినకుండ వేరొకచోటకు పోవుటను గణాచారమనియు, శివాద్వైత నిష్ఠయందుతాను సమర్థుడైనను, అట్టినిష్ఠగల శరణులకు తాను దాసుడు లేక భృత్యుడను భావముతో నడచుకొనుటను భృత్యాచారమనియు, వర్ణాశ్రమ ధర్మములను పాటించక శివాచార పరాయణులైన వారి నందరిని సమ భావముతోడ గౌరవించుటను శివాచారమనియు అందురని "సాధనామృతము" అను గ్రంథమువలన తెలియుచున్నది. (సాధనామృతము – పుట 88)

## షట్స్థలములు :-

భక్తి, మహేశ్వర, ప్రసాద, ప్రాణలింగ, శరణ, ఐక్యస్థలములని భక్తియుతజ్ఞాన సోపానములారింటిని శైవసిద్ధులు ఆనుపూర్వకముగ నిర్ణయించి షట్స్థలములని వానిని వ్యవహరించిరి. శైవసిద్ధాంతములకు ఈ షట్స్థల విచారమే ప్రాణము. క్రమముగ వానిని గురించి స్థూలముగ క్రింది విధముగ చెప్పవచ్చును

భ క్తస్థలము :- సదా అష్టవిధార్చనయు, షోడశోపచారములను లింగమునకు చేయుటయు, శివసాన్నిధ్యము నానందించుటయు, శివశరణుల సంగమునను న్కి యు, సత్కర్మాచరణమును సుచిత్తముతో లింగార్పణము చేయుటయు, కడకు. శివనిష్ఠదృఢపడుటయే భ క్తస్థలమందురు. దీనిలోదేహమును శివాచారముచేయుటయే ముఖ్యము.

మహేశ్వరస్థలము :- దుర్గుణములను వదలి శుద్ధజీవితమును గడుపుట మహేశ్వరస్థలము. త్యాగబుద్ధియిందు ప్రముఖస్థానము వహించుచుండుచు. మౌనముతో అవధానభక్తిని సంపాదించుటతో నీమెట్టుముగియును. దీనితోబహిర్ముఖేంద్రియములు అంతర్ముఖము లగును.

ప్రసాదిస్థలము :- సర్వమును పరమేశ్వరకృతముగ తెలియుట ఎచ్చట మొదలగునో యదప్రసాదస్థలము. ఇప్పట్టున త్రికరణములు లింగార్పితము లగును. "యత్రజీవోతత్రశివః" అను విధముగ లింగదేహిగభక్తుడు ఈ అవస్థలో మారును.

ప్రాణలింగ స్థలము :- ప్రాణముకూడ లింగమే యగుట ప్రాణలింగస్థలము. ఈ అవస్థలో జీవుడు స్వరూపాత్మను నిశ్చయించుకొనుటకు, తెలియుటకుశక్తివంతుడగును. స్వాత్మజ్ఞాన నిర్ధారణము లభించును.

శరణస్థలము :- జీవుడు సర్వమోహ నిర్ముక్తుడై తెఱపిలేని జ్ఞానముతో పృథివ్యప్తేజోవాయ్వాకాశ ప్రకృతి పురుషుడుపైనుండు శుద్ధ స్వయమునందు స్నేహము నెరపుట శరణస్థలము. ఇప్పట్టున తనువే ముక్తిసెజ్జయగు కైలాసము. మనస్సే లింగరూపము. ప్రాణమే తేజస్సు. లోకము మఱపులోనికి దిగిపోయినది ఇచ్చట చైతన్యచిత్తులు (శివశక్తులు) ఒకటి యైనవి.

ఐక్యస్థలము :- బయలులో బయలుచేరినట్లు జీవుడు శివునిలో బెరసి పోవుటయే ఐక్యస్థలము. నాఽహం, కోఽహం, సోఽహం సాధనలుదాటిపోయి, జ్యోతిమాత్రుడై జీవుడు నిరంతరాంతర్ముఖుడై పోవును. ఇంక అర్చనాదు లేమియులేవు. కేవల

మానందస్థితి. (సాధనామృతము – పుట 87)

ఈషట్స్థల సిద్ధాంతము కేవలము యోగాభ్యాస సంప్రదాయమునకు చెందినది. 'బలవత్ప్రేరణ ఫలితముగ నాడీసంధులలో చెలరేగు సంక్షోభములను క్రమక్రమముగ నిగ్రహించుకొనుచు ఆత్మపూర్ణ జ్ఞానమునుపొంది చివరకు శివుని లో ఐక్యము కావలెను''. (విజ్ఞానసర్వస్వము – పుట 700 – సం. 7) షట్స్థల ములందలి మొదటి ఐదు సోపానముల మెట్టువరకు జీవుడు ద్వైతియే. ఆరవ సోపానమున శివునియందైక్యమై అద్వైతియగుచున్నాడు. ఇట్లు ద్వైతము, అద్వైతములు వీరశైవమున సమన్వయింపబడినవి." (తెలుగుసాహిత్యముపై వీరశైవ మత ప్రభావము – పుట 133). అని డా॥ జీరెడ్డిచెన్నారెడ్డిగారు పేర్కొనిరి.

శ్రీశిష్టారామకృష్ణశాస్త్రిగారు వీరశైవమును గురించి. "ఈమతమున పరబ్రహ్మమె శివతత్త్వమై 'స్థల' మనుపేరబరగును. శివతత్త్వమున సకల పదార్థ ములు నిలచి తుదకుదానియందే లీనమగును. కాని స్థలమనబడినది. 'స్థ' అనగ స్థానమనియు, 'ల' అనగ 'లయ' మనియు నిరూపితము. అంతరంగశక్తి సంచాలనము వలన స్థలము అంగ, లింగములని రెండువిధములైనది. అందు లింగ మగు శివుడు పూజ్యనీయుడును, రెండవది జీవాత్మ పూజించునదియైనది. అట్లే శక్తికూడ ద్వివిధమై కళశివాశ్రయమును, భక్తిజీవాశ్రయమునొందినది భక్తివలన జీవునకు శివునితో ఐక్యము కలుగును. శివలింగమనగ శివుడేగాని తదీయ బాహ్యాకారమెన్నడునుకాదు. లింగస్థలము భావలింగము, ప్రాణలింగము, ఇష్టలింగము అని మూడు విధములు. అందుమొదటిది నిరాకారమగు కళయై భావైకమాత్ర గోచరమగును. అది దేశకాలాతీత సత్తును, మహోత్తమమైనది. రెండవది మానసగోచరమై సాకారమును నిరాకారమునై యున్నది. మూడవది సాకారమై నయన గోచరమగు చున్నది. ఇదియిష్టార్థదాయకమును, అనిష్టనివారకమును నైయిష్ట ముతో భజింపబడు నదికాన నాపేరు పొందినది. ప్రాణలింగమన పరమాత్మ యొక్కచిత్తు ఇష్టలింగమన ఆనందము. ఈలింగత్రయములలో మొదటిది మహోన్నతము. రెండవది సూక్ష్మము. మూడవది స్థూలమునై ఆత్మ ప్రాణ శరీర ములను సంధించి, ప్రయోగ మంత్రక్రియా గుణములుకలిగి, కళానాద బిందు రూపముల నొందును.

జీవుడు మోక్ష మొందుటకుగాను భక్తిపూర్వకసాధనమగు స్థలములో యోగాంగ, భోగాంగ, త్యాగాంగములని మూడు భాగములు. మొదటిదానిమూలమున జీవుడు శివునియందైక్యమై సుఖముగానుండును. రెండవ దానివలన శివునితోగూడి యానందించును. మూడవ దానివలన ప్రపంచము మాయయని అనిత్యమని గ్రహించి దానిని వర్జించును" (వీరశైవాంధ్ర వాఙ్మయము – పుట 20-21) అని వివరించిరి. ఈవివరణ సమగ్రమై శైవసిద్ధాంతమును ప్రస్ఫుటము గావించుచున్నది. కావున షట్స్థలమను అభ్యాసయోగము వలన శివతత్త్వ మొందుటయే వీరశైవమతసిద్ధాంతమని తెలియుచున్నది.

## వీరశైవము - పేరిణిశివతాండవము :-

వీరశైవము, పశుపతి సాంప్రదాయము ఆంధ్రావనిలో విజయవిహారము చేయు కాలమున వీరరస ప్రాధాన్యతగల పేరిణిశివతాండవమను నాట్యము ప్రదర్శింపబడు చుండెడిది, "పల్నాటి సీమలోమాచెర్ల చెన్నకేశవస్వామి ఆలయము లోను, ఆలయ ప్రాంగణములో వెలసిన వీరభద్రుని ఆలయమందును యీ తాండవమాడెడివారు. కాకతీయుల దేవాలయములలో మాత్రము మూలవిరాట్టు కెదురుగనిర్మితమైన 'బలిపీఠము'పై పేరిణి ప్రత్యేకముగ ప్రదర్శింపబడెడిది" (గోల్డెన్ జుబిలీ సావర్ - టి.టి.డి. - పుట 191) అని నటరాజ రామకృష్ణగారు పేర్కొనిరి. ఈ నర్తన శివపరమై, ఆకాలములో వీరులు, మాహేటులు మొదలగు తెగల వారుచే ప్రత్యేకముగ శివుని ప్రేరణ చేయ బడుచుండెను. ప్రేరణతాండవమె పేరిణితాండమని పిలువబడు చున్నది.

ప్రారంభమున శివు ప్రేరణచేయుచు నర్తకులు మేళప్రాప్తి చేయుదురు గనుక "ప్రేరణ" లేక "పేరిణి" అని ఈ నర్తనము పిలువబడుచున్నది. సహజముగ వీరమాహేశ్వరాచార పరులు యీ నాట్యప్రక్రియను మిక్కిలిగ అభిమానించెదరు. నటరాజమూర్తియై పరమశివుడు తాండవమాడి పురుషనర్తకులకెట్లు ఆదర్శప్రాయుడయ్యెనో ఈనాట్యము స్పష్టముచేయుచున్నది. పూర్వము ఆంధ్రకోస్తా ప్రాంతమున యీనర్తన లెక్కువగ సాగెడివి. వీరభద్రుని సంబరములలో యీ నృత్యప్రదర్శన జరిగెడిది .వీరశైవులకు ఆరాధ్యదైవమైన వీరభద్రుని జాత్రర

సమయములలో యీనృత్యప్రదర్శనను నిర్వహించుట ఔచిత్యశోభితము.

## వీరభద్రోత్సవములు (Veerabhadra Cult)

శైవమనిన వీరశైవము, వీరశైవమనిన శ్రీవీరభద్రస్వామి సాధారణముగ స్మృతికివచ్చును. ఆదివీరశైవుడు వీరభద్రమూర్తి, ఈస్వామి వీరేశ్వరుడు భద్రేశుడు, వీరుడు, వీరస్వామి, వీరశేఖరుడు మొదలగు పేర్లతో పిలువబడు చున్నాడు. కన్నడదేశనము "కన్నడిగ" అనియు పిలిచెదరు. 'దక్షాధ్వరధ్వంసానంతరము మహావిష్ణువు వీరభద్రుని అనుదినము సహస్రకమలములచే అర్చించువ్రతమునుపూనెను. భద్రుని పరీక్షవలన ఒకనాడు శ్రీహరికి సహస్రకమలములకు అన్వేషణ ప్రయత్నములు వ్యర్థములయ్యేను. అపుడు హరి తననేత్రకమలమునే శ్రీవీరభద్రస్వామి పాదముల (అడె) చెంతచేర్చెను. కన్నుపాదముల వద్ద కలవాడు (కన్ను+అడిగ) కావున నాటినుండి స్వామి "కన్నడిగ"యని సార్థక నామమొందెనని" (వీరభద్ర - వీరమాచిదేవ - (కన్నడ గ్రంథము) - పుట 28) జగద్గురు చెన్నబసవస్వామి నిడుమామిడి గూళూరు పీఠాధీశ్వరులు వివరించిరి.

"శివమునుండి పుట్టి అశివమును దూరము కావించుటయే వీరభద్రావతారఉద్దేశ్యము. యజ్ఞనెపముచే జరుపబడు పశుహింసను, మానవియమత్సరమును ధ్వంస మొనరించుటయే వీరభద్రావతార విశిష్టకార్యము" (రజకరత్నమాచిరాజు చరిత్ర - పుట 24) అని రజకరత్నమాచిరాజు చరిత్ర తెలుపుచున్నది శివాష్టోత్తరశతనామావళి యందును, శివసహస్రనామావళి యందును "ఓం వీరభద్రాయ నమః" (ఆగమిక – శివార్చనవిధిః – పుటలు 28-49) అనియు, శ్రీవీరభద్రుని సహస్రనామావళియందు "ఓం వీరభద్రాయనమః' (శ్రీవీరభద్ర సహస్రనామాది కదంబమ్ – పుట 5) అనియు ఉండుటచే వీరభద్రరుద్రులకు భేదములేదనవచ్చును. శివశక్త్యంశమే వీరభద్రమూర్తి.

ఆంధ్ర కన్నడదేశములందు వీరభద్రోత్సవములను భక్తులు ఘనముగ నిర్వహించుట జరుగుచున్నది. కొన్ని ప్రాంతములందు శివరాత్రిపర్వదినమునందును, మరికొన్ని ప్రాంతములందు వైశాఖమాసము నందును వీరభద్రోత్సవము

లను జరుపుకొనుచుందురు. ఉత్సవ నిర్వహణమునందు ప్రాంతీయభేదము క న్పట్టుచున్నది. మూడు దినములలో ఉత్సవములను ముగించువారున్నారు. ము ప్పది దినములపాటు మహావైభవముగ జరుపువారునుగలరు. బమ్మెరపోతనగారి జన్మస్థలమైన వరంగల్ జిల్లాయందు "కొఱివి" సుప్రసిద్ధమైన వీరభద్రస్వామి వారి పుణ్యక్షేత్రము. ఇచ్చట నెలరోజులపాటు స్వామివారి జాతర నిర్వహింపబడు చున్నటుల తెలియుచున్నది. వీరభద్రోత్సవ సాంప్రదాయములు విన్నంత, కన్నం త, క్రిందివిధముగ వివరించుట జరుగుచున్నది.

సామాన్యపూజలైన రుద్రాభిషేకము, వీరేశునకు పంచామృతాభిషేకము జరుగును. అనంతరము "ఆనకట్టు" నిర్వహింపబడును. "ఆనకట్టుట" అనగ తాము తలపెట్టిన పూజాకార్యక్రమము సంపూర్ణమగువరకు స్వామివారిని నిజనివా సమున కదల కుండవలసినదిగ ఆననిడుట. భక్తుడు భగవంతునకు ఆజ్ఞయిడు సంప్రదాయము వీరశైవభక్తితత్త్వమున ప్రత్యేకత సంతరించు కొనినదనవచ్చును. ఇదియును "ఆదివారమునాడు ఆనకట్టూగట్టి" (శ్రీవీరభద్ర సహస్రనామాది కదం బమ్ – పుట 73) అని చెప్పుటవలన ఈకార్యము ఆదివారము జరుగునని తెలి యుచున్నది.

"పళ్లెంబు చెల్లించు పర్యంతమునుమీరు నిజనివాసంబున నిలువవలయు.
వేటబోవలెనని వేంచేయగాబోకు దండుఠాణంబునకు తరలబోకు
పోయినమీతండ్రి కాయజుహరునాన మీరినమీయమ్మగౌరియాన" (శ్రీవీరభ, ద్రఖడ్గమాల - 18) అని ఆనకట్టు పద్యము చదువుదురు. అనంతరము "వీర పలకలు" తెచ్చుకొనియెదరు. అనగ వీరభద్రమూర్తి ముద్రితములైన తామ్రఫల కములను సుస్నాతులై తెచ్చుకొని, పూజించి హృదయమున తగిలించు కొందురు అప్పుడు లింగాంగులకు దైవావేశము, వీరవేశముకల్గును. అంత రథోత్సవమారం భమగును. ఇది రాత్రిపూట అరంభమగును. లింగాంగులు వీరాంగవేషులై ఖడ్గపాణులై, డోలుమీద వినవచ్చు వీరంగమునకు ఉద్రేకులై తాండవమాడుచుం దురు. సాముగరిడీలు చేయుదురు. "నందీధ్వజమునెత్తుట" యీ ఊరేగింపులో

మరియొక ప్రత్యేకత దీనినే "నందికోలసేవ" అనియు అందురు. నందికలిగిన ధ్వజమునెత్తుట "నందికోలసేవ" అనబడుచున్నది. ఇందులకు కారణమైన కథ యొకటి అనుశ్రుతముగ వినవచ్చుచున్నది. అది -

ఒకప్పుడు నందీశ్వరుడు శైవమునుగూర్చి వ్యాసునితోడ వాదించి అతనిని ఓడించెనట. అంత నందీశ్వరుడు వ్యాసునిచేతిని ఖండించి ధ్వజస్తంభమునకు కట్టి ఊరేగించెనట. కావున వీరశైవులు నందీశ్వరు విజయమునకు, వ్యాసుని ఓటమికిని సూచకముగ ఈ ఉత్సవమును నిర్వహించుచుడిరి. పదునకొండు మొదలు ఇరువదిరెండు మూరల పొడవువరకుగల మట్టిఊడకుగాని, వెదురుగడకుగాని ఇత్తడి తొడవులు మూగలువేసి, గడచివరి భాగమున కలశమునుంచి, ఆ కలశమునకు తొడవులకు మధ్యభాగమున పట్టువస్త్రమునుజుట్టి, నేలనుండి నాలుగు అడుగుల పైబాగమున ఒక అడ్డపలకపై నంది, శివుడు, నాగపడగ ఉండునట్లు చేయుదురు. పైన కలశమునకు క్రింద వ్యాసునిచేతిని కట్టుదురు. నడుమునకు కట్టియున్న వస్త్రమునకు ముందున్న ఉట్టివంటి సంచిలో గడనువుంచి వీరంగమునకనుగుణముగ ఆడుదురు. మధ్యమధ్యలో "శ్రీవీరభద్ర ఖడ్గము" లను చదువుదురు.

శ్రీవీరభద్రమూర్తి విశిష్టచరిత్రను సంకీర్తనరూపములో చెప్పెడి గేయములనే "ఖడ్గములు" లేక "వీరభద్రఖడ్గములు" అందురు. కన్నడమున వీనిని "వడబులు" అందురు. ఒక్కొక్కగేయము ఒక్కొక్కఖడ్గము. విశ్వవిఖ్యాత పదవాఙ్మయమునకు వినూత్నమైన శైలిని సంతరించిన ఘనతకూడ ఈఖడ్గములకే దక్కును. ఈ ఖడ్గములు వీరరసప్రధానములై, స్థయిర్య, స్ఫూర్తిని కలిగించును. ప్రజలు సుబలులై, వీర్యవంతులై జీవించవలెనని, దుర్బల దుశ్చరితలను దూరీకరించవలెనని చెప్పుట ఈఖడ్గముల ప్రధానధ్యేయము.

"కుడిచేతనఱుకంగ ఫెడబొబ్బపెట్టంగ దక్షయాగంబెల్ల ప్లడిల్లె
దక్షయాగానికి తప్పుదుచేటని దేవతల్ హడలెత్తి దిక్కులురక
కొటానుకోట్లను కోయని నఱుకంగ వరదలైరక్తంబు వాగువారె
శూలమంకించితే సురలుసుండెలువీలి చుక్కలై భువిరాలెనక్కజముగ

నీదుక్రౌర్యంబు శౌర్యంబు నేమనందు
శివ జటాజూట సంభూత! సవనఘాత
ప్రళయశతరౌద్ర! పరమకృపాసముద్ర
వినుత గుణభద్ర! ఉద్ధాన వీభద్ర!" (శ్రీవీభద్రఖడ్గమాల - 12 వఖడ్గము)

ఇత్యాదిగ ఖడ్గములుసాగును. ఆవేశము మిక్కిలియగునెడ కొందరు లింగవీరులు రాగికడ్డీలను దవడలకు, నాలుకలకు, గొంతుకకు, చేతులకు గ్రుచ్చుకొందురు తెల్లవారు ఝామువరకును ఈఊరేగింపుకొనసాగును. లింగవీరులు ముందుగనే "హోమగుండము" నేర్పాటుచేసి యుందురు. వీరేశుని జాతరలో అగ్నిగుండము మిక్కిలి ప్రాధాన్యతనొంది యున్నదని చెప్పవచ్చును.

ఊరేగింపు వచ్చునప్పటికి అగ్నిగుండము కణకణమండు నిప్పులతో నిండియుండును. అగ్నిగుండమున హవిర్భాగముల నర్పించెదరు. అప్పుడు లింగవీరులు ఇద్దరు ఒకరు దక్షప్రజపతిగను, మరియొకరు వీరభద్రునిగను నటించుచు వాదించుకొందురు. ఈసంవాదము రూపకరూపమున జరుగును. వీరఖడ్గములనబడు గేయములతోడనే వాదించుకొనుట జరుగును. చివరకు వీరభద్రవేషధారి దక్షుని ప్రతిమయొక్క శిరస్సును ఖడ్గముతో ఖండించును, అగ్నిగుండమున ఈశాన్యమూల నుండి యజ్ఞనాథుడైన మహేశునకు హవిర్భాగముగ నిప్పులను దోసిలితోడగ్రహించును. అది భిక్షువునకు విజయమును చేకూర్చును. అప్పుడు వీరపలకలు ధరించిన వీరగాసులు దైవావేశులై కలశములను ధరించి పడమర నుండి తూర్పునకు, దక్షిణమునుండి ఉత్తరమునకు గుండమున ప్రవేశించి నిప్పులను త్రొక్కుచు నడచెదరు. శుచిస్నాతులైన భక్తులెల్లరును వారి ననుసరించుచుందురు

ఇటుల హోమగుండమున ప్రవేశించుట నిజమునకు వీరరసప్రధానమైన కళాత్మక ఆరాధనయని చెప్పవచ్చును. "పవిత్రప్రధానమైన జీవనము జ్యోతిర్మయము" అనెడి సత్యసందేశమును చాటుచున్నదనవచ్చును. "తమసోమాజ్యోతిర్గమయ" అనినటుల హోమగుండము "అజ్ఞానాంధకారమును దూరీక

రించి జ్ఞానప్రకాశమును నిలుపును" అను సందేశమును తెలుపుచున్నది. ఈ హోమగుండములే మహమ్మదీయుల పీర్లపండగ (మొహరమ్)లోని అగ్నిగుండములకు మార్గదర్శకములన వచ్చును. వీరగానులు ధరించిన తామ్రఫలకములే మహమ్మదీయులకు "పీర్లు" అయినవనవచ్చును.

అగ్నిగుండమున నడచుటతో జాతర అంత్యదశకువచ్చును. దక్షయాగమును ప్రమథులతోడ వీరుడు నాశమొందించినటుల అగ్నిగుండము చల్లారును.

ఉదయము స్వామివారికి అభిషేకానంతరము "మహానైవేద్యము" ను సమర్పించెదరు. అనగ పెద్దమొత్తములో ఉప్పులేకుండ అన్నముచేయించి, స్వామి ఎదుట పరచిన వస్త్రముపై అన్నమును రాశిగపోయుదురు. ఆరాశిపై ముద్దపప్పు లేదా బియ్యపుపుండితో గురుగు (ప్రమిద)ను చేసి, నెయ్యివేసి, జ్యోతినివెలిగించి ప్రక్కకు తొలగుదురు. అప్పుడద్దానిని స్వామివారు అరగించునని భక్తుల విశ్వాసము. అనంతరము "ఆనకట్టువిడుపు"ను చదువుదురు. "శ్రీవీరభద్ర! యాశ్రితజనావనముద్ర భవ్యవైభవవేష! భక్తపోష . మ్రొక్కుదీరెను జనావన! ముదముతోడ .... ఆయురారోగ్య భాగ్యంబులమరనొసగి రక్షసేయుము మమ్ము సర్వత్రదేవ" అని ఉత్సవారంభమున "ఆనకట్టు" పేరనిండిన ఆజ్ఞను సడలించెదరు. దీనినే "ఆనకట్టువిడుపు" అందురు. ఆనకట్టినది మొదలు ఆనకట్టువిడుపు పద్యము చదువువరకును స్వామివారు భక్తుల భక్త్యావేశనిబద్ధుడని ఎంచవలెను. ప్రతిచిన్న ఉత్సవకార్యమునకు ముందువెనుకల యీ ఆనకట్టువిడుపు పద్యములను చదువుట సర్వసాధారణముగ జరుగుచుండును.

వీరభద్రుని జాతరకు ప్రజలు బండ్లకు ప్రభలుకట్టుకొని తండోపతండములుగ ఆలయప్రాంతమునకు చేరుకొందురు. విశేషమ్రొక్కుబడులు చెల్లించుకొందురు. భక్త్యావేశము కట్టలుత్రెంచుకొని పాఋనీసమయమున కైలాసమున నున్న రుద్రగణములు భువికిదిగివచ్చినటులయుండును. కుల, మత, జాతి భేదము, స్త్రీ, పురుషభేదము, పిన్నపెద్దల భేదములేక ఎల్లరును యీ ఉత్సవము

లయందు పాల్గొనియెదరు. అనాగరిక జాతులు కొందరు గొఱ్ఱెలు, మేకలు, కోళ్ళ నుకూడ స్వామికి బలియిచ్చెదరు. ఈజాతరలోని వీరపలకలు తెచ్చుట, నంది కోలసేవ మొదలగు ఉత్సవములను వివాహాది శుభకార్యములకు ఆయాగృహ యజమానులు ప్రత్యేకముగ నిర్వహించుట గలదు. ఇట్టి ప్రత్యేకపూజోత్సవములు మరికొన్ని ప్రసిద్ధములైనవానిని గూర్చి క్రిందివిధముగ వివరించుటడమైనది.

## పళ్లెరసేవ :-

దీనినే "వీరభద్ర పళ్లెరము" అని అందురు. ప్రత్యేక మ్రొక్కుబడు లప్పుడు, వివాహాదిశుకార్యములలో పూర్వము ఈఉత్సవమును వీరశైవులు విధిగ నిర్వహించెడి వారు. శుచిస్నాతులైన భక్తులు "ఆనకట్టు"నిడి ఈపళ్లెరసేవా కార్యక్రమమును ఆరంభించెడివారు. ఈశాన్యదిశయందు నాలుగు నుండి పం డ్రెండు స్తంభములతో మంటప నిర్మాణమును కావించెదరు. మూడు గజముల తెల్లనివస్త్రమును మూడు సరిమడతలుగమడిచి, మొదటి మడతలో నువ్వులు, మ ధ్యమడతలో నవదాన్యములు, పై మడతలో ఐదుసేర్లు లేదా ఐదుపావులు బియ్య మును ఉంచవలెను. దీనిపై బియ్యముతో నింపిన కలశము, భద్రకాళీవీరభద్ర ప్రతిమలు, ఖడ్గమును ఉంచవలెను, కడిగినరోకలికి కంకణమును కట్టవలెను. ఒకదానికంటె మరొకటి చిన్నదిగక్రమమైన పరిమాణముగల ఐదుమట్టిపాత్రలు ఒకదానిపై ఒకటి పేర్చవలెను. అపుడు అష్టదిక్పాలకులకు, నవగ్రహములకు, రుద్రదేవునికి, వీరభద్రునికి క్రమముగ పూజలుచేయవలెను. అనంతరము విభూతి పండు పళ్లెరమున ఉంచుకొని, మంగళద్రవ్యములతో, మంగళవాద్యములతో బం ధుజనపరివృతుడై యజమాని వీరభద్రస్వామివారి ఆలయమునకుపోయి, "పళ్లెర సమర్పణ సంకల్పము"ను చెప్పిరావలయును.

సాయం సమయమున పైమడతలోని ఐదుశేర్లబియ్యమును బంగారుకడి యమ్ముపొందించి పూజించినరోకలితో సుంకించి, ఐదుకుండలలోపోసి యజమాని భార్యనెత్తిన పెట్టుకొనవలెను. యజమానుడు పళ్లెరములో ఐదు విభూతిపండ్లు, ఐదుపండ్లు, ఐదు టెంకాయలు, ఐదు ఖడ్గములు, ఐదు దక్షిణతాంబూలములు, ఐదు యజ్ఞోపవీతములు, ఐదు వస్త్రములు, గుగ్గిలమును ఉంచుకొని, పళ్లెరమును

ఎడమచేతి యందుంచుకొని, కుడిచేతిలో ఖడ్గమును ధరించి, ఊరేగింపుగ ఖడ్గము లనుచెప్పుచు గుడికిపోయి, స్వామివారిని దర్శించుకొని వచ్చి పళ్లెరసమర్పణము గావింపవలెను. పళ్లెరమున ప్రతివస్తువు ఐదుగ పెట్టుట మహేశుడు పంచాననుడు యగుట కారణమైయుండ వచ్చును. అనంతరము విడుపు పద్యమునుచదివి తీర్థ ప్రసాదములను స్వీకరించవలయును మధ్యరాత్రికి ముందుగానే యీ పళ్ళెరసేవ జరుగును.

## గుగ్గిలసేవ :-

ఈఉత్సవము వివాహాదిశుభకార్యములందే ఒకదినము ముందుగ నిర్వహింపబడును. వధూవరులలో ఏ ఒక్కరుగాని ఇద్దరుగాని గుగ్గిలసేవచేయుదురు ఈసేవచేయువారు ఆదినము ఉపవసించవలెను. ఆవుపేడతోచేసిన పిడకలను కుంపటిలోరగిల్చి, సాంబ్రాణి (గుగ్గిలము) పొడినివేయుచు, ఊరేగింపుగ వీరఖడ్గము లనుచెప్పుచు, నర్తనలుచేయుచు వీరభద్రాలయమునకు పోవుదురు. అచ్చట స్వామిముందు మరల వీరఖడ్గములనుచెప్పుచు ధూపమును వేయుదురు ఈ గుగ్గిలసేవ పరిమళవంతము, నిస్స్వార్థజీవనము, పరోపకారమును నైన జీవితమును గడుపుమని జీవులకు సత్యసందేశము నిచ్చునని చెప్పవచ్చును.

## గండదీపములు మోయుట :-

పుట్టు వెంట్రుకలుదీయుట, ఉపనయనము, వివాహము మొదలగు శుభ కార్యముల సందర్భమున ఈ ఉత్సవమును నిర్వహించెదరు. గండదీపమునగ పెద్దజ్యోతి, పెద్దదీపమని అర్థము. ఒకశేరు గోధుమపిండితో గురుగు (ప్రమిద) చేసి, దానియందు ఆవునేయినిపోసి, క్రొత్తబట్టతో వత్తినిచేసి వెలిగించి, "నెత్తిన గండదీపములు నేర్పునకుదియించి" వీరభద్రమూర్తి సన్నిధికి చేరుదురు. వీర ఖడ్గములను గానముచేతురు.

పై వివరించినవిగాక ఇంకను మరికొన్ని ఉత్సవ సాంప్రదాయములు ప్రాంతీయ భేదములతో, విభిన్నరీతులలో వెల్గొందుచున్నవి. వీరభద్రపూజలు

వీరోత్సవములుగ అభివర్ణింపవచ్చును. ఈ వీరపూజపురాతనము బహుళవ్యాపక మునై అలరారినది ఈవిధముగ వీరశైవులు వీరభద్రోత్సవములను ఉత్సాహ ముతో, నియమనిష్ఠలతో నిర్వహించుకొనుచుండిరని తెలియుచున్నది. వీరశైవు లలో పరమతసహనము శూన్యము.

పైవిధముగ భక్తి, అందలిశాఖలు, మతము దాని అవశ్యకత, పలు మతములు, శైవము దానియందలిశాఖలు, శైవసిద్ధాంతము, వీరశైవము దాని పుట్టుక, లక్షణములు, వీరశైవమతసిద్ధాంతము, వీరభద్రస్వామిపూజ, సంప్రదా యములను వివరించుట జరిగినది.

## వీరభద్రవిజయము - భక్తితత్త్వము :-

వీరభద్రవిజయము వీరశైవమును సంపూర్ణముగ ప్రతిపాదించిన దివ్య ప్రబంధముగ పేర్కొనవచ్చును. ఆవేశపూరితమైన వీరశైవతత్త్వము ఈకావ్య మున ప్రతిసన్నివేశము నందును వ్యక్తమగుచున్నది. వీరశైవమును ఉద్రేకముగ ప్రచారముచేసిన పాల్కురికిసోమనాధుని జన్మస్థానమునకు దగ్గరలో (వరంగల్ జిల్లా పాల్కురికి దగ్గర బమ్మెర) జన్మించిన పోతనగూడ సోమన మార్గమునెన్ను కొని గురునాజ్ఞప్రకారము వీరభద్రవిజయమును రచించెననిచెప్పుట సమంజసము· "సోమనాథుడు విడిచిపెట్టినచోటు నుంచి పోతనరాజుగారందుకొన్నారు. మాన వునిలోని తామసాన్నిసాత్వికంలోకి అనువదించారు."(సమగ్రాంధ్రసాహిత్యం – పుట 5) అని ఆరుద్రగారనిన మాటలు యిప్పట్టున గమనార్హములు. వీరభద్రవిజ యము వీరశైవమత లక్షణములతో సరిపోలుచున్న విధమును క్రింది విధముగ పరిశీలింపవచ్చును.

## జంగమభక్తి :-

వీరశైవము "జంగమభక్తి" ముఖ్యలక్షణముగ కన్పించుచున్నది. పో తన తనవీరభద్రవిజయమునందలి కావ్యావతారికలో వీరశైవభక్తిమార్గమున జీవి తములను సాగించిన, "సిరియాలుడు, బసవరాజు, పండితారాధ్యుడు, కన్నప్ప

కుమ్మరగుండయ్య, కరయూరుచోడయ్య, చిరుతొండనంబి, కేశవరాజు, మాచి రాజు" మొదలగు వీరమాహేశ్వరాచారపరులను, వీరసత్యవ్రతులను, వీరసచ్చరితులను, వీరవిక్రములను భక్తితోడ సంస్తుతించి మ్రొక్కినాడు. మరియు ఆ భక్తాగ్రగణ్యుల 'ప్రసాదకరుణావిశేష ప్రవర్ధమాన కవితామహత్వ సంపన్నుడ"న నిచెప్పుకొని వినయమును చూపినాడు. ఈ భక్తులకథలు "బసవపురాణము "పెరియపురాణము"లలో నుండుట సర్వులు ఎరిగినదేగదా! పాల్కురికి సోమన తన "బసవపురాణము"లో, బసవేశ్వరునకు మహేశునితోడ, "పరమాత్మరూపమా బసవడేయెఱుగు పరమేశుఁడెరుగునా బసవనియనువు" (బసవపురాణము – ఆ॥ 1 221 ద్విపద) అని అభేదమునుచెప్పి యున్నాడు, అటులనే పోతన తన మత గురువు ఇవటూరి సోమనాథుని గూర్చి,

ఆ॥వె॥ "వెలయుశంభుమూర్తి వీరమాహేశ్వరా
చారవిభుడు భక్తి సాగరుండు
యనఘుడివ్వటూరి యారాధ్యచంద్రుండు
సోమనాథసముడు సోమగురుడు" (వీ॥వి - 1-15ప) అని చెప్పి "వెలయుశంభుమూర్తి" అని శివునితోడ అభేదమును ప్రకటించియున్నాడు. ఇట్లు పోతనతనకావ్యమున వీరశైవ లక్షణమైన "జంగమభక్తి"ని ప్రకటించెను.

## భవుల తిరస్కారము :-

వీరశైవమత లక్షణములలో భవుల తిరస్కారము ప్రధానముగ కన్పించుచున్నది. "భవులనగ" లింగధారణలేనివారు. పోతన తన "వీరభద్రవిజయము"న కావ్యాదిలో,

కం॥ "భవిఁజూడక భవిడాయక
భవు పదములుగొల్చి ఘోరభవ భంజనుతై
బవదూరులైన పుణ్యుల
భవునర్చనచేసి వరముపడసినవారిన్" (వీ॥వి॥ ఆ 1 - పద్య 10) అని పలికియున్నాడు లింగధారణ లేనివారిని చూడక, సమీపించక, పరమేశుపద

సేవలో జన్మరాహిత్యమునందినవారిని, శంభుని పూజించివరములు పొందినవారిని స్మరించెను. ఈస్మరణలో స్వమతాభిమానులయెడ ఆదరణ, పరమతాభిమానుల యెడగల తిరస్కారము ప్రకటితము. కనుక వీరభద్రవిజయమున వీరశైవమత లక్షణమైన "భవులతిరస్కారము" దర్శనీయము.

## విభూతి రుద్రాక్షధారణము :-

విభూతి, రుద్రాక్ష ధారణము వీరమాహేశ్వరాచారములలో ఒకటిగను న్నట్లు తెలియుచున్నది. వీరభద్ర విజయమున పోతన ఈ ఆచారమును ప్రకటించియున్నాడు. పార్వతిదేవితపమునకై తపోవనమునకు పోవునపుడు,

సీ॥ హరినీలములఁబోని యలకలజడలల్లి మహితరుద్రాక్షదామములుచుట్టి
బాలచందురుఁబోని ఫాలస్థలంబున భస్మత్రిపుండ్రంబు పరగదీర్చి
తరుణవల్లియుఁబోని తనువల్లినిండారఁ బదనిచ్చిపలుచని భస్మమలది"

(2-237) అను పద్యమున పార్వతికి రుద్రాక్షదామములను చుట్టి, భస్మముతో త్రిపుండ్రము తీర్చి, తనులతకు విబూదినలది, వీరశైవవాతావరణమును పోతన పరికల్పించి యున్నాడు, మరియు తపమాచరించుచున్న పార్వతికడకు మహేశుడు బ్రహ్మచారివేషమున వచ్చినపుడు, ఆబ్రహ్మచారిక, పోతన, నల్లని జింకచర్మమును. భస్మత్రిపుండ్రములను, తెల్లని జన్నిదమును, రుద్రాక్షమాలలను వేసి ఆనందించుట గమనార్హము.

## గాణాచారము :-

పంచాచారములలో "గణాచార"మొకటి. ఈ ఆచారమననుసరించి, శైవమును దూషించువారికి శివతత్త్వమును తెలియజేయవలయును, లేదా ఆశివదూషణమును వినకుండ వేరొకస్థలమునకు పోవలెను. ఈ గణాచారమును పోతన తన "వీరభద్రవిజయము"న పోషించియున్నాడు. వైవస్వతమన్వంతరమున దక్షుడు శివరహితమైన యాగమును ప్రారంభించెను. బ్రహ్మాదిదేవతలు విచ్చేసిరి. మహేశ్వరు నాహ్వానించ నందున దధీచి దక్షునిమందలించెను. దక్షుడు దధీచి హితవును సరకుగొనలేదు. అపుడు దధీచి ఈశునిమాహాత్మ్యమును తెలియజెప్పె

ను. కాని అచ్చటివారలకామాటలు రుచించలేదు. కావుననే దదీచి దక్షుని యజ్ఞ వాటికను వదలి మహేశుని చెంతకువెడలి, సర్వమును వివరించి దక్షయాగమును నాశముచేయుమనికోరెను.

దాక్షాయణి తండ్రి పిలువకున్నను యాగమునకువచ్చి తిరస్కరింపబడె ను. అట్టియెడ ఆమె పరమేశుని మహిమను వివరించెను. దక్షుడు పెడచెవిని పెట్టి, ఈశుని నిందిడీచెను కోపించిన దాక్షాయణి తనతండ్రినిసైతము "ఏరాదక్ష యదక్షమానసవృథాయీ దూషణంబేలరా . నీలకంఠుఁదెగడంగారాదురా దుర్మ తీ" (వీ॥వి॥ 1-146ప) అని నిందించి, తన తనవును దహించుకొనెను. అద్రి రాజతనయ యయ్యెను. ఈపట్టములు గణాచారమునకు దర్పణమువంటివి.

## శివస్తుతి :-

పోతన శివస్తుతితో కావ్యారంభమును గావించి "శివభక్తిదీక్ష" బూనెను. సంపూర్ణశివభక్తిగల్గియుండుటయే వీరశైవతత్త్వము. ఈసంపూర్ణశివభక్తి వీరభద్ర విజయమున ప్రతిపట్టమునందు గోచరమగుచున్నది "శ్రీలలితంపు భూతియును ..... శ్రీమహానగము వేల్పున్" (1-1ప) ప్రసన్నునిగ జేసికొనుటకై పోతన ఆర్తి నందెను. హరివిధిశంభుమూర్తులకు అసలైన మూలవిరాట్టుత్ర్యంబకుడేనని పో తన కీర్తించి ప్రార్థించెను అఖిల దేవగర్వహరణశూరుడైన వీరభద్రేశ్వరుని 'క రుణాజూపుమని అవతారికలో (4ప) ప్రొక్కుకొనియున్నాడు ప్రతిసన్నివేశము నందును పోతన నీలకంఠునిమహిమను కీర్తించి అఖండతర (వీర)శైవభక్తితత్త్వ మును చాటుకొనియున్నాడు

భక్తిప్రతిష్ఠాపనకు కథను అనుకూలముగ మలచుకొని. సన్నివేశముల ను చక్కగ ప్రకల్పనము చేసికొనుటలో పోతన సిద్ధహస్తుడు. సమస్తమునకు పరమేశ్వరుడే మూలమని, ఆభగవానుని ఆశ్రయించినవారికి మోక్షము సులభ సాధ్యమని పోతన వీరభద్రవిజయమున పలుపాత్రల ద్వార నిరూపించి వీరశైవ మతఔన్నత్యమును చాటియుండుట గమనింపవచ్చును.

ఒకపుడు, పరమేశ్వరుడు రజతధరణీధర శిఖరంబున అగణ్యరమ్యతర రత్నసింహాసనంబున కొలువున్నసమయమున దేవతలువచ్చి అంజలులు ఘటించి శంభుని నుతించిరి ఆపట్టమును పోతన,

కం॥ "ముదమున హరియును నజుఁడును
చదువులు మునులాదిగాగ సకల జనంబుల్
మదనారిఁ గొలువవచ్చిరి
పదపడి సంభ్రమము భయముభక్తి యుఁగదురన్" (వీ॥వి॥ - 1-74ప)

అను పద్యమున వివరించెను. భయభక్తివినయ సంభ్రమములతో బ్రహ్మవిష్ణువులును, వేదములును, మహర్షిసంఘమును పరమేశుని కొలుచుటకు వచ్చిరని వర్ణించుట వీరశైవమత పక్షపాతమనియే అనవచ్చును.

దక్షుడు ఆహ్వానింపకున్నను యాగమునకు వచ్చిన దాక్షాయణి తండ్రిచే తిరస్కృతయై, నీలకంఠుని మహిమకొనియాడి, తండ్రిని,

"ఏరాదక్ష యదక్షమానసవృథాయాదూషణంబేలరా
యోరీ పాపములెల్లఁ బోవిడు వరాయుగ్రాక్షుఁజేపట్టరా
వైరంబొప్పదురా శివుందలపరా వర్ణింపరా రాజితో
త్కారాత్ముండగు నీలకంఠుఁదెగడంగా రాదురా దుర్మతీ" (వీ॥వి॥ - 1-146ప)

అని నిందించు ఘట్టమున వీరశైవమతాభిమానియైన పోతనయే మనకు కన్పించునటలో సందేహములేదు.

వీరభద్రవిజయము నందలి దధీచి పాత్రయందును, వీరభద్రుని పాత్రయందును పోతనగారి వీరశైవతత్పరత సంపూర్ణముగ మూర్తీభవించి సాక్షాత్కరించుచున్నదని నుడవవచ్చును.

దక్షుడు వైవస్వతమున శివరహితమైన యాగమును ప్రారంభించెను. బ్రహ్మాదిదేవతలు, మునిగణము విచ్చేసిరి. మహేశ్వరునాహ్వానించ నందులకు దధీచి దక్షునిమందలించి, ఆమహాదేవుని ఆహ్వానించుమని హితవుగరిపెను. దక్షుడామాటలను నిర్లక్ష్యముచేసెను. అపుడు దధీచి ఈశుని మహత్త్వమును తెలియజేసెను. కాని అచ్చటివారల తెలివిని అజ్ఞానము కప్పియుండుటచే వారలకీమాటలు రుచించవేదు అపుడు దధీచి కోపించి,

సీ॥ "నీలకంఠునకు నెచ్చెలిగాడొకో, యటమటీడైన యీ్యాయంబుజాక్షు
డహికంకణునకు మూడవకన్నుగాడొకో, పాటు మాలినయట్టి పావకుండు

గంగాధరునకు సంగడికాడు కాడొకో, వెనుకూళ్లమారైనయని మిషపతి
పురవైరికిని తలపుష్పంబుగాడొకో. నిర్భాగ్యుడైన యీ నీరజారి

తే॥గీ॥ యేమికుడువంగ వచ్చితిరిందు మీరు
తాముపాలించునట్టి లోకములవిడచి
పంచవదనుని కనుజేగురించెనేని
తత్క్షణంబు తమ యాళ్ల త్రాళ్ళుదెగవె" (వీ॥వి॥ - 4-47ప)అని అచటి వారిని తెగడినాడు వీరశైవాచార సంపన్నుడైన పోతనమాటల ఈటెలుపైనిందలు. పిదప దధీచి అటనుండి మహేశుకడకువెళ్లి సర్వమును వివరించి, దక్షయాగమును నాశముచేయుమని కోరెను శివుని తిరస్కరించినవారిని సర్వనాశముచేయవలెనను వీరశైవమతతత్త్వమును పోతన యీ ఘట్టమున ప్రదర్శించి యున్నాడు.

వీరభద్రవిజయకథకు ఆధారము, కల్పనకు మూలము, పుట్టుకలో, ఆకృతిలో, బలసాహసాదులలో వైచిత్రికల్గినపాత్ర వీరభద్రుడు. ఈపాత్ర అపర రుద్రుడిగమనకు కథలో దర్శనమిచ్చును. మహేశునాజ్ఞమేరకు. భద్రకాళీఅనుచరగణముతో వీరభద్రుడు వీరరసావతారమూర్తియై దక్షుని యాగశాలపై విరుచుకపడి దేవాదులను చీల్చిచెండాడెను. నెతురుటేరులు ప్రవహింపజేసెను. ప్రళయకాలరుద్రుడై రణావని విహరించెను. దేవేంద్రుని మట్టికరపించెను సూర్యునిపండ్లురాల్చి రక్తముగ్రక్కించెను. అగ్నిజాల్కలు ద్రుంచెను. యమునిపడవైచి ముష్టిఘాతముల హింసించి, నైరుతి వరుణుల కూల్చి. అసురాదియక్షమూకల కాల్చి. భారతీదేవిముక్కుచిదిమి, అగ్నిదేవుని ఇల్లాలివృత్తస్తన శిఖరములద్రుంచి చంద్రుని భూగతునిగానించి పాదములత్రొమి, యాగభూమియందలి సంబారములచిందర వందరగావించి, దక్షునిశిరః ఖండనగావించెను. శివరహితమైన యాగమునకు విచ్చేసిన సకలదేవగణమును శిక్షించినగాని వీరునకు కసిదీరలేదు కాదు పోతనకు కసిదీరలేదు. ఇట్టియెడ వీరశైవమును విస్పష్టముగావించుటలో పోతన పాల్కురికి సోమనకు సాటిగనిలిచి తనశైవమత పక్షపాతమును ప్రదర్శించినాడని చెప్పవచ్చును పురాణకథకుడైన వాయుదేవునితో మునులు,

కం॥ "శివనిందయు స్మృతినిందయు
శివభక్తులుగాని వారి సేవించుటయున్

భువనమునఁగాదు దక్షుడు
శివనిందను దలచి యిట్లుచెడియెన్ ధరణిన్" (వీ॥వి॥ – 4-167ప) అని పల్కిరి. శివనింద, స్మృతినింద, శైవులుగానివారిని సేవించుటతగదని, అట్టిపని కీడునకు హేతువని, తాననుసరించిన వీరశైవమత లక్షణములను మునులతోడ చెప్పించుట పోతనగారి వీరశైవ మతాభిమానమును తెలుపుచున్నదని నుండువచ్చును.

వీరభద్రవిజయమున భక్తిరససింధువు వెల్లువై ప్రవహించినదనవచ్చును. భక్తిభావమును చెప్పునెడ పోతన తద్భావపారవశ్యమున కావ్యమును విస్తృతము జేయుటజరిగినది. భగవల్లీలా విలాసముల వర్ణనములో పోతన ఏలక్షణమును లెక్కచేయలేదు. అష్టోత్తర, సహస్రనామముల ఆలాపించునటుల పరమాత్మతత్త్వము తడయకుండ కీర్తించియున్నాడు.

వీరభద్రవిజయ కావ్యకథాంతమున, నారాయణ, బ్రహ్మేంద్రాది దేవగణములు ఫాలాక్షునకు అంజలులు ఘటించి,

సీ॥ "భుజగేంద్రభూషాయ భూతాధినాథాయ, నిత్యానురాగాయనిర్మలాయ
గంగావతంసాయఖండేందుజూటాయ, దేవాదిదేవాయ దిక్పటాయ
వేదాంత వేద్యాయ వీరప్రతాపాయ, కైవల్యనాథాయ ఘనఘనాయ
రణరంగవీరాయ రమణీయరూపాయ, భువనాభిరామాయ పురహరాయ

ఆ॥ ఓంనమశ్శివాయ ఓంకారరూపాయ
శంకరాయ రిపు భయంకరాయ
మదన సంహరాయ మానితకైలాస
మందిరాయ నీల కంధరాయ" (వీ॥వి॥ – 4-217ప) అని స్తుతించిరి. ఈ విధమైనరచన గావించుటకు కారణము, పోతన వీరశైవమతాభిమానమేనని చెప్పవచ్చును. ఈశ్వరుని, నారాయణబ్రహ్మేంద్రాదులు స్తుతించుట, శైవాధిక్యమును ప్రదర్శించుటకేనని నుడువవచ్చును.

శంకరుని దేవతలు. "కాయజసంహరాయ శశిఖండ ధరాయనమశ్శివాయ....... మునీంద్రయోగి వరదాయ సురాధిపతేనమోస్తుతే" (3-236ప) అనియు,

"ఆయతమంగళాయ భుజగాధిప రమ్యకరాయ........బ్రహ్మవిష్ణురూపాయ........ శివాయనమోనమోస్తుతే" (3-237ప) అనియు, "కారణకారణాయ భుజగర్వమ దాంధకసంహరాయ........భక్తజనకల్పకుజాయ నమోనమోస్తుతే" (3-238) అని యు, "ఋతు సంవత్సరమాసపక్షజనితారూఢాయ .. .. యోగీశ్వరస్తుత రూపాయ నమోనమోశివనమో సోమార్ధచూడామణే" (3-329ప) అనియు స్తుతించిరి. ఈ స్తుతి పోతనగావించిన స్తుతియేగాని దేవతలదిగాదని చెప్పవచ్చును. స్తుతిపూర్వ కమైనరచనగావించి పోతన తృప్తిపడినాడనవచ్చును. పోతన, సృష్టస్థితిలయలకు మహేశుడే మూలమను విషయమును,

"కం॥ పుట్టింపనీవె నేర్తువు
నెట్టనరక్షింపనీవె నేర్తువు గడిమిం
గిట్టింపనీవె నేర్తువు
యిట్టి దయారసమె చెల్లునీకు మహేశా" (వీ॥వి॥ - 4-194) అను

పద్యమున స్పష్టపరచి సంతుష్టుడాయెను.

పోతన తన వీరభద్రవిజయమునందలి కథలోని ప్రతిపాత్రచేత ఏదో ఒక సందర్భమున శివస్తుతిచేయించుట గలదు ఆవిధముగ శైవభక్తిని ప్రకటించుకొని తృప్తిపడుట పోతన అభిమతముకావచ్చును.

వీరభద్రవిజయ కథను వాయుదేవుడు మునులకు వినిపించుచు, అగ ణిత సంతోషమానసుండై శివుని మాహాత్మ్యమును,

సీ॥ "దేవాదిదేవుని తెఱఁగిట్టిదందుమా, తెఱఁగు లెల్లను బుట్టుతెఱఁగుదాన
మదనమదారాతిఁజదివెదమందమా, చదువులకెల్లను మొదలుదాన
బ్రహ్మాదివంద్యుని బరికింతమందమా, బ్రహ్మాదులకునైన బ్రహ్మదాన
దేవతారాధ్యునిదెలిసెదమందమా, తెలిసినమీఁదటిధృతియుఁదాన

తే॥గీ॥ యెంత యనఁగనేర్తు నేమనివర్ణింతు
నేదియాదయంత్యమేది యరయ

సకలమునకు నతని సంతతానందంబు
నెఱిగి కొలదిసేయ నెట్లువచ్చు" (వీ॥వి॥ – 1-50ప) అను పద్యమున కొనియాడెను.

దేవతలు ఈశ్వరుని మాహాత్మ్యమును,

కం॥ "శరణార్థిభక్తవత్సల, శరణార్థిపురాణయోగి జనమందారా
శరణార్థిదురితసంహర, శరణార్థిమహేశరుద్ర జలజాక్షనుతా" (3-94ప)

అనియు, "దేవామీకృపగలుగఁగ, భావింపగ మాకునెపుడు భద్రముసుమ్మీ,
దేవేశమిమ్ముగంటిమి, కావున ధన్యులముగామె గంగాధిపతీ" (3-95ప)

అనియు కొనియాడిరి. ఈవర్ణన పోతన వీరశైవమతాబిమానమును వ్యక్తముచేయుచున్నది.

దాక్షాయణి తనతండ్రియైన దక్షునకు, దివౌకసులు, మునిబృందము అచ్చెరువడి వినుచుండగ, రుద్రుడు హాలాహలము నఱచేతబట్టి గళములోన ధరించినవాడని, బ్రహ్మాండముల పుట్టుకకు స్థానమైనవాడని, బ్రహ్మాదులు సైతము నెరుగ సాధ్యముకానివాడని, బ్రహ్మాదులచేత కీర్తింపబడెడివాడని, అట్టిశివుడు ఎచ్చటయుండునో అచ్చట శుభములుకలుగునని, అట్టిపరమేశ్వరు శరణువేడికొలు ఎవరికైనను తగినకార్యమని, పరమేశునిమహిమను ప్రశంసించెను.

మన్మథుడు దేవసభలో, ఫాలనేత్రునిమహిమను,

శా॥ "ఓహోయీపని నన్నుఁబంపఁదగవాయూహింపనాకున్ శివ
ద్రోహంబిమ్మెయిఁ జేయగాఁదగునె యీ ద్రోహంబుఁగావింపగా,
నాహావద్దనిమాన్పఁబట్ట కిదిచేయన్మీరు పొమ్మందురే
మోహాతీతుడు శంభుడాతనికి నేమోహంబులేదెమ్మెయిన్" (2-50ప) అను పద్యమున ప్రశంసించి శంభునియెడగల తన భక్తినిప్రకటించుకొనెను.

రతీదేవి మన్మథుని మందలించుచు, శివుని శక్తిని,
"పుటించున్ భువనంబున నల్మొగములన్ బొల్పారగా ధాతయై,

పట్టియిరక్షణసేయుచుండును సుధాపర్యంకుడై రుద్రుడై
కట్టల్క్రందెగటార్చు" (2-76)ననియు, మరియు,

"ఏమనిచెప్పవచ్చు నతఁడెంతటివాఁడని పల్కవచ్చునీ
భూమియునాకసంబు జలపూరము నాత్మయునాగ్నిగాలియున్
సోముడు చండభానుడగు సూర్యుడు నాతడుఁదాను బ్రహ్మయుం
దామరసాక్షుడున్నతని తత్త్వముఁగానరు నీకు శక్యమే" (2-77ప)ననియు,

"చదువుల్ మంత్రములుంబురాణ చయముల్ శాస్త్రంబులుంగూడియ
ఘ్నుదుకం గానఁగలేక తోఁచినగతిం మోదించి వర్ణించునా
చదువుల్ పూర్వులుకన్న విన్నతపసుల్ బ్రహ్మాండముల్ కుక్షిలో
నుదయంబైనవిగాన నమ్మహిమ దానూహింపరాదేరికిన్" (2-78) అనియు
కొనియాడి, శివునితో వైరము తగదని పతికిహితవుగరపెను,

హిమవంతుడు, "విదిత తంత్రమంత్రవాదవేదధర్మమర్మములకు" అం తుబట్టని మహాదేవునకు తానుమామయై నందులకు సంతోషమును వ్యక్తముచే యుచు,

"జగదీశాయనమోనమో నవసుధా సంకాశితాంగాయశ్రీ
నగనాథాయ నమోనమో శుభకరానందాయ వేదార్థపా
రగవంద్యాయ నమోనమో సురనదీ రంగత్తరంగావళీ
మకుటాగ్రాయనమోనమో మునిమనో మందార శర్వేశ్వరా" (3-130) అని
నమస్కారపూర్వకముగ కీర్తించెను. మామయైన హిమవంతుడు అల్లుడైన శివు నకు నమస్కరించినట్లు వర్ణించుట పోతన వీరశైవ మతాభిమానము, శైవాధిక్య నిరూపణము కావచ్చును.

దక్షుని రెండవయాగ నిర్వహణావసరమున, దధీచి శివరహిత యాగము కూడదని దక్షుని మందలించుచు ఎల్లరువినునటుల, "దేవావళికి, నాకమున్ను, నిఖిలలోకములకు దేవుడు ఈశ్వరుడని, ఈశ్వరుడు తప్ప వేరెదైవము లేదని, నారాయణబ్రహ్మాదులు సైతము శంకరుతత్త్వమును గుర్తించియుండలేదని, గౌరి

మలహరునకు బ్రహ్మాదిసురలు దాసులని, రుద్రమహిమ ఎరుగుటకు "ధాతకైన ను అతనితాతకైనను అలవికా"దని శివుని మాహాత్మ్యమును వెల్లడించెను. దధీచి చేయిట్టిమాటలు పల్కించుట పోతన అభిమతమై యుండును.

చతుర్వేదములు సైతము, "నిఖిల తంత్రములకు నీలకంఠుడువేల్పు" అని, సృష్టిలో పరమంబు, పరమాత్మ శివుడనుట నిశ్చయమని ఎలుగెత్తిచాటినవి.

రుద్రహుంకారమున జన్మించిన వీరభద్రుడు, "బ్రహ్మవిష్ణువు, సూర్య చంద్రులు, వరుణవాయు దేవాదులందరును శివుని ఆజ్ఞానిబద్ధు"లని "నీయాజ్ఞఁ గడవి యీనిఖిలంబులకు బ్రహ్మకొన్ని మిక్కిలిసేయుచున్నవాడొ"(4-58ప) అను పద్యమున వివరించెను.

సృష్టికర్తయైనబ్రహ్మ, "పుట్టింపనీవె నీర్తువు, నెట్టనరక్షింప నీవెనేర్తువు, గిట్టింపనీవెనేర్తువు" (4-194) అని పరమేశుని స్తుతించెను.

దక్షప్రజాపతి, "నినుదెలియక మతిమాలితి, నినుదెలియక ఖలుడనైతి నీలగ్రీవా, నినుదెలియక గతిఁదప్పితి, నినుదెలియక మరులుకొంటి నిరుపమమూర్తీ" (4-207) అనియు,

కం॥ "బంధురనానాకల్మష, బంధంబులు చుట్టుముట్టి భావములోనన్
బంధించి బలిసియున్నవి, బంధంబులబాపి కరుణబాటింపుశివా"(4-209
అనియు శివుని ప్రార్థించెను.

పోతన తన వీరభద్రవిజయము నందలి ప్రతి అశ్వాసాంతమున మహేశ్వర సంకీర్తనములనదగు మూడుపద్యములను రచించి తన భక్తిభావమును ప్రదర్శించుకొని యున్నాడు. ఆపద్యములిట్లు గలవు.

ప్రథమాశ్వాసాంతమున గల శివస్తుతిపరమైన పద్యములు :-

మత్తకోకిల : "రాజచందనకుంద శంఖమరాళ హీరపటీరవి
భ్రాజితాంగమునీంద్ర మానసపద్మహంసరమాంగనా
రాజనాయక ధారుణీధర రాజనందన నాయకా
రాజరాజ మవస్సరోజ విరాజితాంబుజ నాయకా" (1-229).

కం॥ "ప్రమథగణ హృదయరంజన
ప్రమథగణాంభోధిచంద్ర ప్రమథాధిపతీ
ప్రమథగణ వినుతపదయుగ

ప్రమథగణాంభోజ బాలభాస్కరమూర్తీ" (1-230).

మాలినీ :- "నిగమభువనదీపా నిర్మలానందరూపా
యగణిత గుణధీరా యప్రతర్క్యప్రకారా
గగనజలధిహారా ఖండరాజద్విహారా
యువతి మదనమూర్తీ యోగిహృద్వ్యాంతవర్తీ" (1-231).

ద్వితీయాశ్వాసాంతమునగల శివస్తుతిపరమైన పద్యములు :-

ఉ॥ "రాజితరాజరాజ దినరాజ భుజంగమరాజభారతీ
రాజనిలింపరాజముని రాజపయోనిధిరాజరాజగో
రాజవిహంగ రాజయమ రాజసరోజనివాసవాహినీ
రాజసురాధిరాజగిరిరాజ నిరంతరవంద్య శంకరా" (2-312).

కం॥ "మదసామజాజి నాంబర
యుదయార్క సహస్రకోటిసూజ్జ్వలతేజా
మదనోన్మద హరలోచన
సదమలయోగీంద్ర హృదయ శరనిధిచంద్రా" (2-313)

మాలినీ :- "ధవళవృషభవాహా తారశైలేంద్రగేహా
భవహరణ గరిష్ఠాపద్మజాండప్రతిష్ఠా
దివిజరిపువిదారా దేవదైత్యాస్థిహారా
దివిజవినుతమూర్తీ దేవతా చక్రవర్తీ" (2-314)

తృతీయాశ్వాసాంతమునగల శివస్తుత్యాత్మక పద్యములు :-

మత్తకోకిల : "నాగవాహనరంజనా మదనాగవిద్విష భంజనా
నాగదానవఖండనా మునినాథ సాగరమండనా
యోగిరాజసమానచిత్త పయోజషట్పదవేషణా
నాగభూషిత భూషణా శరణాగతా మరపోషణా" (3-265).

కం॥ "శ్రీనీలరుచిర కంధర
మానితత్రిపురాంబురాశి మందరగౌరీ
పీనపయోధర యుగళ
స్థానపరీరంభమోద సంరంభశివా" (3-266)

మాలినీ · "కమలనయనబాణా ప్రస్ఫురత్పంచబాణా
యమితగుణకలాపా యచ్యుతానందరూపా
విమలకమలనేత్రా విశ్వతంత్రైకసూత్రా
ప్రమథనుతగభీరా పార్వతీచిత్తచోరా" (3-267).

చతుర్థాశ్వాసాంతమునగల శివస్తుత్యాత్మకమైన పద్యములు :-

లయగ్రాహి : "శంకరహలాహలభయంకర పినాకధర
కింకరదిగీశ యకళంకతరమూర్తీ
పంకజభవాభినుత పంకజభవాండభవ
సంకలితదైత్యకుల సంకట సుధాప
ర్యంకనుతనాగకరకంకణ విరాజితక
ళంకగిరిజాకుచ శుభాంకపరివిలస
త్పంకితనితాంతపులకాంకిత యురస్స్థలమృ
గాంకశతకోటి నిభాపంకజదళాక్షా" (4-233)

కం॥ "త్రిపురాటవీ ధనంజయ
త్రిపురాసుర ఘోరశైల దేవాధిపతీ
త్రిపురాంబుధి బడబానల
విపుల దయాంభోధిచంద్ర విశ్వస్తుత్యా" (4-233).

మాలినీ : "అఖిలభువనపాలా హస్తకాంతత్రిశూలా
శిఖినయనలలాటా శీతధామార్ధజూటా
నిఖిలనిగమసంగా నిర్వికారాంతరంగా
మఖసమయవిజృంభా మంగళస్ఫూర్తిధామా" (4-234).

పైపద్యములన్నియు ఈశ్వరుని మాహాత్మ్యమును, ఔన్నత్యమును ప్రకటించునవిగనున్నవి. ఇటువంటి పద్యరచనగావించి పోతన ధన్యుడైనాడని చెప్పవచ్చును.

భగవంతుని పైగలభక్తి వివిధ భావములలో వ్యక్తము చేయబడుచుండును అందున దాస్య, సఖ్య, వాత్సల్య, మాధుర్యభావములు ప్రముఖములై అలరారుచున్నవి. అంతేగాక వైరిక్రియాసామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్... హరినిజెందిరి" అన్నట్లు శత్రుభావముతో భగవంతునితోడ సంబంధము కల్పించుకొని, భగవంతుని కృపకుపాత్రుడైన దక్షుని పాత్ర ప్రశంసనీయమనవచ్చును.

భక్తి ఒకసంపూర్ణరసము. భగవదాకారచిత్తవృత్తిస్థాయీభావమై విభావాదులవలన పరిపుష్టినంది, బ్రహ్మానందాత్మకమైన భక్తిరసము సహృదయులకు పారవశ్యమును కల్గించుచున్నది. వీరమహేశ్వరాచార కుటుంబమున జన్మించిన పోతన వీరభద్ర విజయమున, తన్మత సంప్రదాయములను చొప్పించుటయేగాక, ప్రతిపాత్రతోడను, శివమహిమనుచెప్పించి, శివస్తుతిగావించి, శైవమతాధిక్యతను పోషించి, శైవమతపక్షపాతమును ప్రదర్శించి, ఈశ్వరునకు మ్రొక్కు చెల్లించుకొని, కావ్యమును భక్తిరసమయము గావించి తాను ధన్యుడయ్యెను.

# ప్రకరణము - 7

## వీరభద్రవిజయము
## సమకాలీన సాంఘిక పరిస్థితులు

# వీరభద్రవిజయము - సమకాలీన సాంఘిక పరిస్థితులు

సంఘము జీవకోటిసమితి సంఘసంబంధమైన ఉనికినే సాంఘికపరిస్థితి యనిచెప్పనగును. అనగ సామాజికస్థితిగతులను అంచనావేయుట అనిఅర్థము చెప్పవచ్చును. కవికూడ సమాజములో నొకవ్యక్తిగనుక నాటి సామాజిక జీవితము తాత్కాల్యమున తప్పక ప్రతిఫలించును. కథాకాలము వేరు కావచ్చునుగాని కవనమున మాత్రము కవికాలమునాటి పరిస్థితులు చోటుచేసికొనుట సర్వసాధారణము కావున కావ్యరచనాకాలములోని ప్రజల ఆచారవ్యవహారములు, విశ్వాసములు, వినోదవిలాసములు, కళలు మొదలగునవెన్నియో మనకు దర్శనమిచ్చును. ఇది మానవజీవితచరిత్ర పరిశీలనఅనవచ్చును. ఇందులకు సాహిత్యము, శాసనములే ముఖ్యాధారములు.

భాషకు సౌందర్యమును, జాతికి సౌశీల్యమును కల్గించు వారు కవులు. కవులు లేనిదే కావ్యములు లేవు. కావ్యములు లేనిదే ప్రాచీనసంస్కృతీ, విజ్ఞానములు లేవు, సాహిత్యమువలననే ప్రాచీన భారతీయతను తెలిసికొను అవకాశ మేర్పడుచున్నది.

"సాంఘికచరిత్ర మానవచరిత్ర ప్రజలచరిత్ర అదిజనుల జీవనమును ప్రతిశతాబ్దము నందెట్లుండెనో తెలుపునట్టిది. అది మన తాతముత్తాతలచరిత్ర వారి యిండ్లు, వారికట్లు, వారితిండి, వారిఆటలు, వారిపాటలు వారు మనకిచ్చిపోయిన మంచిచెడ్డలు ఇవన్నీ తెలిపిమనకు సహాయపడును" (ఆంధ్రుల సాంఘికచరిత్ర పుట 2) అని సురవరము ప్రతాపరెడ్డిగారు పేర్కొనిరి.

వీరభద్రవిజయము నాధారముగ పోతన కాలమునాటి సాంఘికపరిస్థితులను, మతము, రాచమర్యాదలు, సాంఘికపరిస్థితులు, సాంస్కృతిక పరిస్థితులు ఇతరములు అను అంశముల క్రింద పరిశీలించుట జరుగుచున్నది.

**మతము :-**

"మతమ"నగ "అభిప్రాయమి, సమ్మతి, శాస్త్రము" అని అర్థములు గలవు. మతమనగ జ్ఞానమను అర్థమునుచెప్పబడు చున్నది. కొన్ని భారతీయభాషలలో దీనిని సాంప్రదాయమనియు అందుర్రు. భక్తిద్వారా ఈశ్వరునితో నరులను సంబద్ధులను చేయునది మతమనిచెప్పుట సమంజసమని పించును. భారతీయ మతములన్నియు మోక్షమునంగీకరించి యున్నవి. కావున మతసంబంధమైన విశ్వాసములు, ఆచారములు ప్రజాసామాన్యము నందు వ్యాప్తమై విరాజిల్లుచుండుట జరుగుచున్నది. వీరభద్రవిజయమున నాటివీరశైవమత స్వరూపము కొంతవరకు, స్పష్టపడుచున్నది.

క్రీ.శ. 15వశతాబ్దమారంభమున వీరశైవము ఆంధ్రావనిలో వీరవిహారము చేసినదనవచ్చును. పాల్కురికి సోమనాధుడు వీరశైవ వాఙ్మయమును సృష్టించి నాటి సమాజమును ఉత్తేజపరచెను. ఆమతాభినివేశము తోడనే పోతన వీరభద్ర విజయమను కావ్యమును రచించెను. తెలంగాణమున ఇవటూరి వంశమువారు ఈ శైవశాఖప్రవక్తలై, నాడు మతవ్యాప్తినొనరించు చుండిరని వీరభద్ర విజయము నందలి, "వీరవ్రతంబున వీరమాహేశులు వీరమాహేశ్వరవిభుడనంగ ...... శంభు మూర్తి, వీరమాహేశ్వరాచార విభుడు, భక్తిసాగరుండు, అనఘుడివటూరి యారాధ్యచంద్రుండు, సోమనాథసముడు సోమగురుఁడు" (వీ॥వి॥-ఆ 1 పద్య 15) అను పద్యపాదముల ననుసరించి చెప్పవచ్చును.

వీరశైవులు భవులను తిరస్కరించెడివారు. భవులనగ లింగధారణలేని వారు. "భవిచూడక భవిడాయక..."(1-10ప) అను పద్యమువలన మనకీవిషయము తెలియుచున్నది. వీరశైవులకు జంగమభక్తి అధికము. అందులకే పోతన కృత్యాదిలో సిరియాలుడు, కన్నప్ప, కుమ్మరగుండయ్య మొదలగు వీరశైవ భక్తులను స్మరించెను.

"శివనిందయు, స్మృతినిందయు, శివభక్తులుగానివారి సేవించుటయున్" (4-167ప) నాటి వీరశైవులకు కానిపని. వీరభద్ర విజయమున పోతన కాలము నాటి వీరశైవమత ప్రభావము ద్యోతకమగుచున్నదని పై విషయములనుబట్టి తెలియుచున్నది.

### రాచమర్యాదలు :-

వీరభద్రవిజయమును బట్టి నాటి రాచమర్యాదలు కొన్ని తెలియనగును. ఇంద్రాదిదేవతలు పరమశివుని దర్శించిన విధానమునుబట్టి నాటి రాచరికపువ్యవస్థలోని మర్యాదలు తెలియనగును.

పరమశివుడు కొలువైయున్నపుడు దేవతలువచ్చి ద్వారపాలకుల వలన తమరాకను ఎరింగించిరి. దేవదేవుని అనుమతివచ్చువరకును "మొగసాల" నుండిరి. పిలుపు వచ్చినవెంటనే భయభక్తివినయ సంభ్రమముతోడ మహేశు కొలువు ప్రవేశించి సాష్టాంగపడి కార్యవచనములను విన్నవించుకొనిరి. నాడు రాజదర్శనార్థము వచ్చినవాడు అనుమతి వచ్చువరకు మొగసాలలో నుండుట రాచమర్యాదకావచ్చును. ద్వారపాలకులవలన తమరాకను రాజునకు తెలియజేయుటయు నాటి రాచమర్యాదయే. మన్మథుడు దేవేంద్రుని కొలువునకు వెళ్లినపుడు, "వాసవుని శ్రీమొగసాలరథంబుడిగ్గె"ను (2-36) మహర్షులు మహేశుని కడకరుదెంచినపుడు "పెద్దమొగసాల" నిలిచిరి. "మొగసాల" అనగ నగరితలవాకిట నుండుచావడి. పోతన కాలమున మొగసాలకు ప్రాధాన్యత్వగలదని తెలియుచున్నది.

### సాంఘికపరిస్థితులు :-

సాంఘికపరిస్థితులలో, అతిథిమర్యాద, వృత్తి అను అంశములనుగూర్చి పరిశీలింపవచ్చును.

### అతిథిమర్యాద :-

పెండ్లిపెద్దలుగ సప్తర్షులు హిమగిరీంద్రుని మందిరమునకు ఏతెంచినపుడు శైలరాజు గావించిన అతిథిసత్క్రియలు నాటి అతిథిమర్యాదలకు నిదర్శనములుగ గ్రహింపవచ్చును

హిమవంతుడెదురేగి మహర్షులకు వినయముతోడ నమస్కరించి తన గృహమునకు కొనిపోయెను అర్ఘ్యపాద్యాదివిధుల పూజించెను. కనకరత్నపీఠం

బులకూర్చుండబెట్టి, అంజలిపుటించి మధురాలాపముల పల్కరించెను. ఇట్టిది నాటి అతిథిమర్యాదగ తెలియనగును.

**వృత్తి :-**

పోతన కాలమునకొందరు ఎఱుకవృత్తితో జీవించెడివారని తెలియుచున్నది. నాటి ఎఱుకలసాని వీథులవెంట "ఎఱుక, ఎఱుక" అని అరచుచు తిరుగుచుండెడిది, ఎవరైనపిలిచిన వెంటనే వెళ్లి వారికి "ఎఱుక" చెప్పెడిది. వారు సమర్పించిన వస్తువులను గ్రహించెడిది నేడును "ఎఱుకసాని"ని మనము చూచుచునేయున్నాముగదా!

**సాంస్కృతిక పరిస్థితులు :-**

సాంస్కృతికపరిస్థితులలో, ఆచారవ్యవహారములు, వినోదవిలాసములు, విశ్వాసములు, అలంకరణ అను అంశములను గూర్చి పరిశీలింపవచ్చును.

**ఆచారవ్యవహారములు :-**

జాతి సంస్కృతికి ఆచారవ్యవహారములు దర్పణము వంటివి. సమాజ శ్రేయస్సునకు కాలగమనమున పెద్దలుకొన్ని కట్టుబాట్లను, కొన్నినియమములను ఏర్పరచుట జరుగును. అవియేక్రమముగ ఆచారవ్యవహారములుగ పరిణామము నొంది మానవసంస్కృతిని వికసింపజేయచున్నవి. వీరభద్రవిజయమున పోతన నాటి ఆచారవ్యవహారములు ప్రస్ఫుటమగు చున్నవి. వానిని క్రిందివిధముగ పరిశీలింపవచ్చును.

**వివాహము :-**

పార్వతీపరమేశ్వరుల కల్యాణఘట్టమున పోతన నాటి తెలుగువారిపెండ్లి ఆచారవ్యవహారములను చక్కగ వివరించి యున్నాడు. పెండ్లి విషయములను మాట్లాడుటకు, "బలముగలవారు నిపుణత, గలవారును బుద్ధినీతిగల వారును నిర్మలతగలవారును సంపద, గలవారు వివాహతతికి గావలయుధరన్" (3-18) అని పోతన చెప్పియుండుటగమనార్హము:

మగపెండ్లివారు వధువుఇంటికేగి పెండ్లి నిర్ణయమునకు "ఉంకువ"ను బాలికకు (వధువు) ఇచ్చిరావలయును. "శిష్టనైపుణమానసులు" యీ ఉంకువ నిచ్చిరావలయును. "ఉంకువ" అనగ, వరుడు వధువుకొరకు మామకు సమర్పించు ధనము. దీనినే నేడుకొన్నిజాతులలో "ఓలి" అని వ్యవహరించు చున్నారు.

"ఉడురాజవదనకు నుంకువేమడిగిన నెంతైనమైకొని యిచ్చి, మదిరాక్షి నాతండు మనకిచ్చినట్లుగా బెంపార నుంగ్రముబెట్టి, పాలకూళ్లుగుడిచి, బాలను మనసొమ్ము చేసిరండు...." (3-27) అని చెప్పుటతో నేడు కావించు "నిశ్చితార ము" స్ఫురణకు వచ్చుచున్నది.

పోతన వీరభద్రవిజయమున "పెండ్లిచూపుల" కార్యక్రమమును వర్ణించి యున్నాడు. గిరీంద్రుడు సప్తర్షులతో, "అదెమాబాలికవచ్చెను, సదమలహృద యులార సర్వేశునకున్, ముదితకు నీడుజూడుడు, పదపడి శుభలక్షణములు పరి కింపుడొగిన్"(3-53)అని పలుకుట నేటి "పెండ్లిచూపుల" కార్యక్రమము గుర్తున కువచ్చుచున్నది.

నిశ్చితార్థమైన పిదప వరునిపక్షమువారు ముహూర్త నిర్ణయముగావించి వధువుతరపువారికి లేఖలుపంపు ఆచారము "వివాహలగ్నంబు నిర్ణయించి హిమ నగేంద్రుడున్నచోటికి లేఖలు పంపుదురుగాక మహాత్మా" (3-76) అని మునులు ఈశ్వరునితో పలుకుటనుబట్టి. నాడున్నట్లు తెలియుచున్నది.

ఈశ్వరుడు, "దేవిపెండ్లియాడ దినమేది లెస్సయోయెఱుగ వలయునంచు భారతీశుదలచె........తలపుతోనఁగూడ ధాతవచ్చెను" (3-77), బ్రహ్మను శివుడు గారవించి. "విధ్యుక్తప్రకారంబుల వివాహలగ్నంబు నిర్ణయించు"(3-78) మనికోరెను. ఈమాటలనుబట్టి వివాహలగ్న సమయమును విధ్యుక్తప్రకారము నిర్ణయించుట నాటి ఆచారముగ గమనింపవచ్చును. "లగ్ననిర్ణయము" నేడును మనముచూచుచునే యున్నాముగదా! లగ్ననిర్ణయమైనపిదప వధువుతండ్రిలేఖలను వరునికి పంపుఆచారము నాడున్నట్లు," హిమశైలేంద్రుని వీటినుండి వినయమే పారనిచ్చోటికిన్, రమణన్లేఖలువచ్చెఁ బెండ్లికి మిమున్ రమ్మంచు సర్వేశ్వరా"

(3–97) అను వాక్యములను బట్టి తెలియనగును  నాటి శుభలేఖ "నమూనా" ను క్రింది పద్యమునుబట్టి గమనింపవచ్చును

సీ॥ "మలహరుడీశుండు మనపాపనడుగంగఁ, బుత్తెంచుటయు మేమునత్తెరంగు
మహిఁబెద్దలగువారి మన్ననబంధుల, రప్పించితగవిచారంబు చేసి
వామదేవుడు తగువరుడని భావించి, నెలతకునీడుగా నిర్ణయించి
యుంకువగొంటిమి యొనరంగవిటమీదఁ, బెండ్లిలగ్నంబు సంప్రీతితోడఁ

తే॥గీ॥ బేర్మినిశోభనము చక్కఁబెట్టవలయు
గరుణవేంచేసి మీరెల్లఁగలఫలంబు
లీలఁదన్నొంటిజేయక లేఖఁగన్న
యపుడరండని ప్రీతితో నద్రివిభుడు" (3–109).

ఈశుభలేఖల సంప్రదాయము నేడును మనము చూచుచునే యున్నాము వధూవరులపేర్లు, పెండ్లినిర్ణయము, లగ్నములతోగూడిన ఆహ్వానము శుభలేఖలందు నేడును కనిపించుచున్నది

## విడిది :-

వివాహమునకు బంధువర్గముతో తరలివచ్చిన వరుడు విడిదిగృహమున వచ్చి విశ్రాంతితీసికొను సంప్రదాయము నాటినుండి యున్నదని, 'తనకునియమించినవిడిదికి నెయ్యంబుతోడనిట్లువచ్చిన" (3–167వచ) అను మాటలనుబట్టి తెలియుచున్నది

## క్రంతులునడచుట :-

క్రంతలు నడచుటఅనగ, మగపెండ్లివారు మేళతాళములతో ఊరేగుచు పెండ్లికూతునకు చీరెలు, సొమ్ములు మొదలగు కానుకలతోవచ్చు విశిష్టసాంప్రదాయము వీరభద్రవిజయమున, పార్వతీశ్వరుల కల్యాణసమయమున, "మంగళవాద్యములు మ్రోగుచుండగ, పసిడిపళ్లెరములతో పలుపస్తువులనిడుకొని "లక్ష్మి సరస్వతీ అరుంధతి ప్రభృతులు క్రంతలునడిచి"రని(––170) చెప్పబడియున్నది. నేటికిని ఈఆచారము తెలుగుదేశముననున్నది.

**మధుపర్కమిచ్చుట :-**

అద్రిరాజు ఈశ్వరుని పదకమలములను భక్తితో కడిగి, "మధుపర్క" మిచ్చెను (3-174) మధుపర్కమనగ పెరుగుతోకలిపిన నేయి లేదా తేనె లేదా పెండ్లిలో వధూవరులకిచ్చు వస్త్రము. ఈఆచారము నేడును కన్పించు చున్నది నూతనవస్త్ర ధారణానంతరము "తెరవారబంచి"రి (3-175). లగ్నమాసన్నము కాగానే శైలరాజు పరమేశునకు "కన్యాదానము" (3-181)చేసెను. వరునికాళ్లు కడిగి కన్యాదానముచేయు ఆచారము నేడును గలదు.

**తలంబ్రాలు :-**

పార్వతీపరమేశ్వరులు కడువేడుకతో ఒకరి పై మరియొకరు తలంబ్రాలుపోసికొనినటుల వీరభద్ర విజయమున "తలన్ బార్వతి సేసలన్ శివునిమౌళిన్ బోసె . ...శంభుడు బ్రాలుపోసెరపైఁదలబూర్ణేందు బింబాస్యకున్"(3-183)అను పద్యమున వర్ణింపబడియున్నది. వధూవరులు తలంబ్రాలు పోసికొనుట నేడును మనము తిలకించుచున్నాము. తలంబ్రాలు పోసికొనినపిదప "దేవాధిదేవుడు సతి వామహస్తము చక్కబట్టి వేదోక్తవిధినిప్రవేశహోమముచేసి . యొనరలాజకాది హోమంబుగావించ"బడినది (3-174) "నాగధరునిపెండ్లినాలుగు దినములు" (3-184) జరిగినట్లు పోతన చెప్పియున్నాడు

**అప్పగింతలు :-**

వధువునకు, అత్తవారింటిలో నడచుకొనవలసిన తీరును సుద్దులరూపము లోచెప్పి. ఆమెను వరునకు అప్పగించు విధమును "అప్పగింతలు" అందురు. నేడును ఆచారముగానున్నదీనిని పోతనతన వీరభద్రవిజయమున కడుమనోహరముగ వర్ణించియున్నాడు శైలేంద్రుడు పార్వతిని ఈశ్వరునికప్పగించుచు,

సీ॥ "కనుసన్నలాలించి కడునప్రమత్తవై, దెవేశుమనసురాఁదిరుగుమమ్మ
పంపకయుటమున్న భర్తచిత్తములోని, పనులెల్లనాయితపఱుపుమమ్మ
యటవారునిటవారు నయ్యేడుగడయును విభుడుగాఁజూచిసేవింపుమమ్మ
యెన్నెన్నిభంగులనేరూపములయందు, గరళకంధరు కెడగాకుమమ్మ

ఆ॥ యాశ్రవించువారినమ్మ రక్షించుమీ
యలరనత్తమామ గలిగిరేని
యప్పగింపవచ్చు నతనికినెవ్వరు
నెఱుగలేరుగాన జెప్పవలసె" (3-189)నని ఆమె శివునికడ మెలగవలసిన

విధమును తెలిపితీరు ప్రశంసనీయము.

**అరణము :-**

వధూవరులకు సమర్పించు కానుకలనే "అరణ"మందురు అచలేం ద్రుడు గౌరీకుమారికి అరణమిచ్చినట్లు,

సీ॥ "సన్నంబులుగఁజెక్కు వన్నెలచీరెలు, భూరినానాహేమభూషణములు
మత్తగజంబులు నుత్తమాశ్వంబులు, నాతపత్రంబులు నందలములు
పురములు చామరంబులు పుష్పకంబులు, కొలకులుపసములు గోగణములు
భాసిల్లుధనమును దాసీజనంబులు, మణిపీఠములు దివ్యమందిరములు

ఆ॥ పరగపర్వతములు బహుపుణ్యభూములు
వలయునట్టి వివిధవస్తువులును
గరుణతోడ నపుడు గౌరీకుమారికి
నరణమిచ్చెయనిపె నచలవిభుడు"(3-193) అను పద్యమునుబట్టి తెలియు చున్నది. నేటికిని కట్నకానుకల విషయమున్నదిగదా!

పోతన పార్వతీ పరమేశ్వరుల కల్యాణమును వైభవముగ వర్ణించినను' అందులో "మంగళసూత్రధారణ" కార్యక్రమమును పేర్కొనలేదు. కాని, యొన్న రలాజకాది హోమంబు గావించి, మఱియుఁదగిన కృత్యములనొనర్చి. సకలలోక భర్తశంభుడుముదముతో, నచలవృత్తినున్నయవసరమున" (3-184) అని అనెను పోతన, "తగినకృత్యముల నొనర్చి" అనుటలో మంగళసూత్రధారణా కార్యము లున్నవని ఊహింపవచ్చును. కాని మంగళసూత్ర ప్రాధాన్యతను పోతన, మారుని మరణమునకు రతీదేవి విలపించుచు, "తేరెదేవరవేడినా పెనిమిటిన్దీర్ఘాయుషో పేతుగా, నీరేమంగళసూత్ర బంధనము మీకెంతేనిపుణ్యంబగున్" (2-126) అని యు, శివరహితదక్షయాగమున దధీచి సురగణమును మందలించుచు, "తత్క్షణం బునఁదమయాళ్లత్రాళ్లుదెగవె" (4-47) అనియు సూచించి యున్నాడు.

పైవిధముగ పోతన తనవీరభద్రవిజయమున, నిశ్చితార్థము, పెండ్లిరేఖ లు, విడిది, క్రంతలునడచుట, కన్యాదానము, అప్పగింతలు, అరణము మొద లగు తెలుగువారి పెండిఆచారములను వరించియున్నాడు.

## వినోదములు :-

సృష్టిలో ప్రతిజీవియు ఆటలతోడను, పాటలతోడను వినోదముననుభవించుచుండును. ఈవినోదముల వలన నాటి ప్రజల సంస్కృతి సంప్రదాయములు అవగతములగు చుండును.

పోతన వీరభద్ర విజయమున కొన్ని ఆటలప్రసక్తిగలదు. దాక్షాయణి దక్షునియింటి కరుగునపుడు, "పాలతియాడుపసిడి బొమ్మలు నీవుదే పసిడిబొమ్మఁ పోలుపడతి" (1-125) అని చెప్పుటవలన నాడుస్త్రీలు పసిడిబొమ్మలాట ఆడుచుండెడివారని తెలియుచున్నది. వీరభద్రుడు దక్షుని శిరమును ఖండించినపుడు' భద్రకాళి ఆశిరమును గగనమున "కందుకగతిన్ వేభంగులన్, సమ్మదమునఁగేలిసలిపె'ను (1-127-135) అని వర్ణించుటచేత, నాడు కందుకక్రీడ లుండెడివని గ్రహింపవచ్చును.

## విశ్వాసములు :-

విశ్వాసములనగ నమ్మకములు మతముననుసరించిగాని, సమాజనియమముల ననుసరించిగాని యీ నమ్మకములేర్పడు చుండును. ఇవిదేశకాల పరిస్థితులననుసరించి మార్పును సంతరించుకొనును.

వీరభద్రవిజయమున, గౌరీదేవి తనవివాహమునుగూర్చి, ఎఱుకలమ్మను, "నగరాజపురమున నాకెన్నిదినములు నిశ్చయంబుగ నేను నిలువవలయు,. నడమీదఁదడసిన నడవులలోపల శివునికై తపమెంత సేయవలయు, తపముగావించినఁ దాపసాధీశ్వరుండమరంగ నెంతకాలమునమెచ్చు, మెచ్చినపిమ్మట మీనధ్వజారాతికేలిచ్చినన్ను నేక్రియవరించు, దప్పకుండజెప్పు ధర్మదేవతయని" (2-194) అడుగటనుబట్టి, నాడు ఎఱుకలమ్మల "ఎఱుక"మీద ప్రజలకున్న నమ్మకము అవగతమగుచున్నది.

నాటిప్రజలు పిలువని పేరంటమునకు బోవుట అవమానకరముగ భావించెడివారని, "పిలువనిపేరంటము పనిగలవారునుబోలె సిగ్గుగాదెరాఁగన్"(1-141) అను మాటలనుబట్టి తెలియుచున్నది.

**అలంకరణము :-**

అలంకరణమనగ సింగారము. మాల్యాభరణ వస్త్రములను అనేకరీతులలో అంగములందున్నూ, ఉపాంగము లందును యథోచితముగ అలంకరించుకొనుట అలంకారమనబడును. ఈ అలంకరణ విభిన్న సమాజములలో, విభిన్న జాతుల యొక్క సంస్కృతి, సంప్రదాయములకు అద్దముపట్టుచుండును. వీరభద్ర విజయము నందలి అలంకరణ విధానమును క్రిందివిధముగ వివరించవచ్చును.

వీరభద్రవిజయమునందు పోతన గావించిన,

"కలహంసనడలొప్ప మంటరవమొప్ప, రంజిల్లునూపురారావమొప్ప
పాటించికట్టిన పట్టుచెందియమొప్ప, బాలచన్నులమీదపయ్యెదొప్ప
కంఠహారములొప్పఁగరకంకణములొప్ప, గడకఁగేయూరాదితొడవులొప్ప
సన్నపునడుమొప్పసవరైనపిఱుఁదొప్ప, లలితకనక కుండలములునొప్ప

ఆ॥ వాలుఁజూపులొప్ప నీలాలకములొప్ప
భూతితోనుదుటఁద్రిపుండ్రమొప్ప
జిఱుతముద్దులొప్పఁ జెక్కుటమెఱుఁగొప్ప
దరుణి జేరవచ్చె తల్లికడకు"(1-191) అను పద్యమునుబట్టి బాలపార్వతి చిరుమువ్వలను, కరకంకణములను, కేయూరములను (భుజములకు ధరించు ఆభరణములు నేడు "అరవొంకీలు"అనివ్యవహారము), కనకకుండలములములను ధరించినది నుదుట విభూతితో త్రిపుండ్రములను గూడ ధరించినది. త్రిపుండ్రము (వీర)శైవమత సూచకము. పైవర్ణన నాటి బాలికల అలంకరణ విధానమును తెలియజేయుచున్నది.

పోతనగావించిన "ఎఱుకలసాని వర్ణన" సహజసుందరము "ఎఱుకలసాని, శంఖకంకణములను దొడగి, మలినాంబరములుగట్టి, కుఱువెంట్రుకల కొప్పుపెట్టి, నుదుట తిలకముదిద్ది, పసుపుపూసి, చెవులకు తాటంకములనుదట్టించి, శంఖహారములను కంఠమున ధరించి, చంకను గద్దెబుట్టనమర్చుకొని, వీథుల వెంట "ఎఱుక", "ఎఱుక"యని తిరుగుచుండినట్లు పోతన ఎఱుకలసానిని వర్ణించెను. ఈఎఱుకలసాని "పాణిగ్రహణము"చేసి ఎఱుకచెప్పినట్లు వర్ణించిన తీరు పోతన లోకజ్ఞతకు నిదర్శనమనవచ్చును.

## పుర, గృహాలంకరణ :-

పార్వతీపరమేశ్వరుల వివాహసందర్భమును పురస్కరించుకొని హిమవన్నగమును అలంకరించిన విధానమునుబట్టి నాటి పుర, గృహాలంకరణమును తెలియనగును

హిమవన్నగమునందలి పురవీథులందు, రచ్చలయందు, "మణులను గనకంబుల దర్పణముల నవపల్లవముల బహువస్త్రములన్ ప్రణుతగతినెత్తిరి తోరణములను" (3-114) అని పోతన వర్ణించెను. ఇక గృహములను, "మృగనాభిజలముల ముంగిళ్లజల్లి, ముత్యాలలో ముగ్గులుదీర్చి, చిత్తరువుయిువ్రాసి. హేమకుంభములెత్తి, బహుమార్గముల నండపడగలుగట్టి" (3-115) అలంకరించిరి· కలయంపిజల్లుట, ముగ్గులిడుట చిత్తరువులు వ్రాలుంచుట నేటికిని గృహాలంకరణముగయున్నది.

## వధూవరుల అలంకరణ :-

పార్వతీపరమేశ్వరుల వివాహసందర్భమున పోతనగావించిన వధూవరులవర్ణనమునుబట్టి నాటి వధూవరుల అలంకరణ విధానమును గమనింపనగును·

## వధువు అలంకరణ :-

వీరభద్రవిజయమున, పార్వతిని "పసుపుటక్షింతలతో దీవించిరి. తలంట్రతగు మజ్జనములార్చి, బహుళరత్నచయము పొందుగవైని, పట్టుపుట్టములను కట్టనిచ్చి,(3-167)," "మణిసువర్ణ పుష్పవస్త్రగంధముల నలంకరించిరి(3-167)" ఈ అలంకరణ విధానమును నేడును తిలకించుచున్నాము.

## వరుని అలంకరణ :-

శంకరుడు "మకుటమును ధరించి, క్రొత్తమణులనుతొడిగి, ఎద భూతిపూతపూసికొని, క్రొత్తపుట్టములుధరించి, పటికంపు పూససరులువైచి" (3-103) కొని నందికేశ్వరునెక్కి అచలేశ్వరుని పురమునకు పెండ్లికొడుకై బయలుదేరెను.

## బ్రహ్మచారి (వటువు) వేషము :-

తపమాచరించుకున్న పార్వతి కడకు ఈశుడు వటుని వేషమునవచ్చిన విధమును వర్ణించిన తీరు, నాటి వటువు అలంకరణ విధానమును తెలియజేయు చున్నది. నాటి వటువు, "తనరముమ్మారుజుట్టిన దర్భముంజితొ, క్రొమ్మెఱుంగులవలంతి గోచితోడ, మొలనున్న దవళంపు ముద్దుపేలికతోడ, నిమ్మైనకృష్ణాజినమ్ముతోడ, వలపలపెట్టిన వెలిజన్నిదముతోడ, రమ్యభస్మత్రిపుండ్రముతోడ, అక్షమాలికతోడ, చిన్నికూకటి జుట్టుతోడ, మేదావిబొట్టుతోడ, ఎడమకేల పాడవు దండము, వ్రేలనుంగరము, దర్భయునువెలుగ, గొడుగు పట్టుకొని" (2-253) యుండెడివాడని పోతన వర్ణించెను

## తాపసవేషము :-

నాటితపోవృత్తి సంపన్నులైనవారిని దృష్టియందుంచుకొని, పోతన తాపస వృత్తిని గ్రహించిన పార్వతీ వేషవర్ణనము గావించెను దీనినిబట్టి నాటి తాపసులెట్లుండెడివారో తెలియనగును "హరినీలములబోలి యలకలజడలల్లి, మహిత రుద్రాక్ష దామములుచుట్టి, పాలస్థలంబున భస్మత్రిపుండంబు పరగదీర్చి, తనువల్లినిండార పలుచనిభస్మమలది, కాషాయ వస్త్రముగట్టి, కేలకమండలముదాల్చి దండపుండరీక తనుకళాసములుదరించి గౌరి తపసివేషధారియై" (2-237) వనమునకేగెను.

పై విధముగ పోతన వీరభద్రవిజయమునగల నాటి ఆచారవ్యవహారములను, వినోదములను విశ్వాసములను, అలంకరణ విధానమును పరిశీలించుట మైనది.

## రాజుదినచర్య :-

వీరభద్ర విజయమును బట్టి నాటిరాజుల దినచర్యలను పరిశీలింపవచ్చును. "తుషారధరణీధరేంద్రుడు వందిమాగధ మంగళపాఠకాది జనంబులు కల్యాణవాద్యంబులతో అత్యంత శోభనతూర్యంబులవార్యంబులై చెలంగనాలించి,

ప్రాతస్స్నాన ప్రాణాయామసంధ్యాది సముచిత కృత్యంబులు నిర్వర్తించి. గృహ దేవతా ప్రార్థనంబుచేసి, ధనకనకధేనుధాన్యాది మహాదానంబుల ననేక భూసుర నికరంబులకు నుపచరించి తదీయ మంగళాశీర్వాద ప్రమోదమానసుండ "య్యెడి వాడని (3-125) వర్ణింపబడిన విధమునుబట్టి నాటి రాజులదినచర్యలు అవగత ములు.

## రాజలాంఛనములు :-

రాజులు బయలుదేరునపుడు వారికి ఉండవలసిన రాజలాంఛనములు గూడ వీరభద్రవిజయమున వివరింపబడియున్నవని చెప్పవచ్చును. పరమేశ్వరు నకు ఎదురేగుటకై బయలుదేరిన సమయమున శైలవిభుని రాజలాంఛనములు క్రిందివిధముగ వర్ణింపబడియున్నవి.

"గంధమాదనమేరుకైలాసశైలాదికులశైలభర్తలు గొలిచి నడువ
పుణ్యకాహళులునుబుణ్యదుందుభులునుబుణ్యశంఖంబులుపొలిచిమ్రోయ
మంగళపాఠకమగధవందిజనంబులు శుభకీర్తనములు సేయ
కదిసిపేరంటాండ్రు కల్యాణములఁబాడపరిజనంబులు తన్నుఁబలసికొలువ,
లలిత సామ్రాజ్యవైభవలక్ష్మి మెఱసి" (2-128) శైలములకెల్ల రాజగు శైలవిభుడు పరమేశు నెదురుకొనగ ఏతెంచెను. దీనినిబట్టి నాటి రాజుల రాజలాంఛనము లను మనము ఎరుగవచ్చును.

## ఇతరములు :-

ఇతరములు అనుఅంశముక్రింద, నాటి యుద్ధసాధనములు, పక్షులు, జంతువులు, వృక్షములు, పుష్పములు మొదలగువానిని వివరింపవచ్చును.

## యుద్ధసాధనములు :-

వీరభద్రవిజయమున, "నారాచగదాదండఖిండివాల త్రిశూల" (4-81) ములు, "ఖడ్గపరశు" (4-92), "శూలము, కఠారము, కుఠారము, పరశువు చక్రము"(4-108), "ముసలాయుధము, అలుగు, కత్తులు, గదలు, శూలములు

చక్రములు (4-130) మొదలగు యుద్ధసాధనముల ప్రసక్తిగలదు. ఇవిగాక "వజ్రాయుధము, నారాయణబ్రహ్మాస్త్రములు మొదలగు దివ్యాస్త్రముల ప్రసక్తియు వీరభద్ర విజయమునగలదు.

**పక్షులు :-**

నైమిశారణ్య వర్ణనమునుబట్టి నాటిపక్షిజాతులను తెలియనగును గోరువంకలు, చిలుకలు, చక్రవాకములు, నెమళ్లు, నల్లపిచ్చుకలు, భరద్వాజములు (ఏట్రింతలు), చకోరములు, కోయిలలు, మొదలగు పక్షి విశేషముల ప్రసక్తి వీరభద్రవిజయమున గలదు.

**జంతువులు :-**

వీరభద్రవిజయమున, గండబేరుండము, ఏనుగు, సింహము, శరభము పెద్దపులి, ఎఱ్ఱనిజింక, నక్క, అడవి ఎద్దు, వరాహము, కోతి, హరిణము, ఏదుపంది, చమరీ మృగము, తోడేలు, కంచరగాడిద, కణుజు మృగము (డేగజాతి పక్షియనియు చెప్పుదురు), మొదలగు పెద్దమృగములు, పిల్లి, ఎలుక, పాము మొదలగు ముక్కడి మృగముల ప్రసక్తియుగలదు.

**వృక్షములు :-**

వీరభద్ర విజయమున, మధీఫలము, మాందారము, చందనము, మద్ది, జీడిమామిడి, మఱ్ఱి, ఖర్జూరము, అరటి, కడిమి, సంపెంగ, పోక, తాడి, చీకటిమ్రాను, మామిడి, ఇప్పపనస, లవంగ" మొదలగు వృక్షముల ప్రసక్తి గలదు.

**పుష్పములు :-**

పోతనతన వీరభద్రవిజయమున, "ఎఱ్ఱచేమంతి, మొల్ల, శతపత్రతామర ఎఱుపు తెలుపును, పరిమళమును గల కలువ, మల్లె, గన్నేరు, సంపెంగ" మొదలగు పుష్పజాతులను వివరించియున్నాడు.

పై తెల్పినవిగాక, "వీణ, విమానము" (1-125-126), "గొడుగు (1-128) మొదలగు వానిప్రసక్తియు గలదు.

**అలంకరణసామాగ్రి :-**

వీరభద్రవిజయమున, "చిఱుమువ్వలు, అందియలు, పట్టువస్త్రములు, కంఠహారములు, కంకణములు, కేయూరములు, కనకకుండలములు" (1-191) "శంఖకంకణములు, తాటంకములు, శంఖహారములు, పసుపు" (2-170). "మృగనాభి, కప్పురపుతిలకము, పువ్వులు, మణికుండలములు, మాధవీ మల్లికా మాలతీనవకుంద దామములు, తెల్లనిచీరలు" (2-28), "మృగనాభి జలములు, మణులు" (3-103), "జడచొళ్లెములు, పుష్పమాలికలు, ఘనసారముల తిలకములు" (3-154), "కాటుక" (3-148), "(పదములకు) లత్తుక(హత్తుట") (3-149), "అందియలు పుష్పమాల" (3-150), "మణిసువర్ణ వస్త్ర గంధములు" (3-167), మొదలగు అలంకరణసామాగ్రి ప్రస్తావనగలదు.

పైవిధముగ వీరభద్ర విజయము నందలి, మతము, సాంఘికపరిస్థితులు, రాచమర్యాదలు, రాజలాంఛనములు, అలంకరణ సామాగ్రి మొదలగు సమకాలీన సాంఘికపరిస్థితులను పరిశీలించుటమైనది. వీరభద్రవిజయము తెలుగువారి ఆచారవ్యవహారములకు దర్పణము వంటిదని చెప్పవచ్చును. వీరభద్ర విజయము నందు ప్రసక్తమైన సమకాలీన సాంఘిక పరిస్థితులను బటి పోతన లోకజ్ఞత, సూక్ష్మపరిశీలన వ్యక్తమగుచున్నవని చెప్పవచ్చును.

0 — 0 — 0 — 0

# ప్రకరణము - 8

# ఆంధ్ర సాహిత్యమున పోతనకు గల స్థానము

మహిత తపస్సుతో, మధురవచస్సుతో కవితాగంగా ఝరిని పాఱించి, సమస్తాంధ్రమును పునీతము గావించిన మహామనీషి బమ్మెరపోతన మహర్షి. ఈ మహాకవి వెలయించిన కావ్యములు ఆంధ్రసాహిత్య నందనోద్యానవనమున సుమధుర పరిమళముతోడ గుబాళించు నవపారిజాతములు. తెలుగు సాహిత్యచరిత్రలో కవిత్రయమువారి తరువాత మరల అంతటి సుప్రసన్న రచనాపటిమగల కావ్య కర్త పోతనయేనని నుడువచ్చును. తెలుగు నుడికారపు రుచిని అడుగడుగునా చవిచూపిన మధురకవితాస్రష్టయు నీతడే. నన్నయ్యకవితాధారను, తిక్కయజ్వ దేశియతను, ఎఱ్ఱన మహాశయుని సూక్తివైచిత్రిని ఆకళింపు గావించు కొనుటయే గాక, నన్నెచోడుడు, నాచనసోముడు, శ్రీనాథుడు మొదలగు మహాకవుల కావ్య రచనా విధానమును, సరస కథాసంవిధానమును సమగ్రముగ గ్రహించి కావ్య రచన సాగించిన మహామనీషి పోతన.

సంస్కృతభాష అన్నింట అగ్రస్థానము నంది సాహితీ విశ్వమున అధిక ప్రబావమును నెరపుచున్న కాలమున, విశ్వశ్రేయస్సునకై ఆంధ్రభాషలో ఆదిమ కావ్యరచనకు శ్రీకారముచుట్టిన నన్నయ్యభట్టారకుని నాటి విప్లవకవిగ పేర్కొనవచ్చును. సాహిత్యమును నరాంకితము గావించు దినములలో రాజులను "నరాధములని" పలికి, నరాంకితముగ సాహిత్యమును వ్రాయనని ఉద్ఘాటించి, జగద్ధితమునకై రచించిన కావ్యత్రయము "వీరభద్ర విజయము", "నారాయణశతకము", "ఆంధ్రమహాభాగవతము"లను భగవదంకితము గావించిన పోతనను పదునైదవశతాబ్దపు విప్లవకవిగా చెప్పొకొనవచ్చును. నన్నయ్య, పోతనలకు దాదాపు 500 సంవత్సరములు అంతరమున్నది. మరల పోతన తరువాత 500 సంవత్సరములనంతరము ఇరువదవ శతాబ్దమున శ్రామిక సౌభాగ్యమునకు, కార్మిక కల్యాణమునకు కలమునుపట్టి సాహిత్యమును సామాన్యునిదగ్గరకు తెచ్చి (అనాథలు, అశాంతులు) అభాగ్యుల జీవితములను, సమస్యలను కవితాదర్పణమున ప్రతిబింబింప జేసిన శ్రీశ్రీగారు విప్లవకవిగ ఘన యశస్కులైరి. ఆదిమ కాలమున నన్నయ. మధ్యకాలమున పోతన. ఆధునిక కాలమున శ్రీశ్రీ విప్లవాత్మకమైనమార్పులకు ప్రతినిధులుగ నిలిచి సాహిత్యగగనమున ధృవతారలై వెలుగొందిరని చెప్పవచ్చును.

బమ్మెరపోతన, వీరభద్రవిజయము, భోగినీదండకము, నారాయణశతకము, ఆంధ్రమహాభాగవతము అను నాల్గుకృతులను రచించెను. ఈ నాలుగు కృతులును, సాహిత్యప్రక్రియలోను కథావస్తువునందును ఒడుంగడు వైవిధ్యమును కలిగియున్నవి. పోతనకవి శేముషీవైభవమునకు దర్పణములుగ నున్నవి బాల్యకృతియైన వీరభద్ర విజయము వీరశైవమును ప్రబోధించుచు కావ్యమార్గమున సాగినరచన భోగినీదండకము రాజును వలచిన వేశ్యగాథ. దండకరూపమైరచన. నారాయణశతకము స్మరణభక్తిమార్గమున. విష్ణుచింతనతో కూడినరచన. ఆంధ్రభాగవతములు అద్వైత భక్తిధర్మమును ప్రబోధించుచునే శ్రీవైష్ణవమును ప్రతిపాదించి పురాణమార్గమున సాగిన విశిష్టరచన.

వీరభద్ర విజయము, నారాయణశతకము, ఆంధ్రమహా భాగవతములు భక్తితత్త్వముతో నిండియుండి శంభుకొల్వుచేరుటకు, శ్రీకైవల్యసాధనకు, పునర్జన్మరాహిత్యమునకు రచింపబడగ, భోగినీదండకము ఇహలోక సౌఖ్యమునకు ఉద్దేశింపబడినదని చెప్పవచ్చును

కావ్య. దండక, శతక, పురాణములను ఈనాల్గుసాహిత్య ప్రక్రియలును విశిష్టరచనాలక్షణ సమన్వితములై ఒప్పుచున్నను, ఆంధ్రమహాభాగవతముమాత్రమే పోతన కీర్తిభవనమునకు ముఖ్యాధారమై అలరారుచున్నదని చెప్పవచ్చును మిగిలినవి అఖిలాంధ్రలోక మాన్యమునందలేక పోయినవి ప్రక్రియలోను. వస్తువులోను ప్రతిపాదించు విషయములలోను వైవిధ్యమును ప్రదర్శించుట పోతనగారి వైశిష్ట్యమునకు ఒక నిదర్శనముసవచ్చును అందున. అంతరంగమును పరిశుద్ధపరచి, సంస్కారమును బలముగ నైతికవిలువలవైపు మళ్లించు సాధనములుగ కావ్యముల నందించుటలో పోతనగారు అగ్రగణ్యులని చెప్పవచ్చును

పోతన జన్మతః భక్తుడు తత్త్వదర్శనముగల మహాకవి. భరతావనిలో మహమ్మదీయులు అధికారమును చేపట్టియున్న పరిస్థితులలో మత సుస్థిరతకై ప్రజలకు భక్తిని ప్రబోధించవలసిన అవసరము ఏర్పడినది. పోతన హృదయము

ఆర్ద్రమైనది భక్తిభావము అక్షరరూపము ధరించినది. శైవభక్తిలో జన్మించిన పోతన ఆవేశముతోడచేసిన కవితాగానమే వీరభద్ర విజయమైనది. వీరశైవభక్తి తత్త్వమును ప్రబోధించినది.

సంయమనము సమకూరిన కాలములో స్పందించిన పోతనహృదయము నారాయణశతక రూపమును ధరించినది. తలపండిన కాలములో శ్రీవైష్ణవమును ప్రబోధించుచు ఆంధ్రమహా భాగవతమావిర్భవించినది. మానవాళికి నవ చైతన్యమును కలిగించినది. పోతన మహాకవివలె భక్తితత్త్వమును పోషించిన మరొకకవి ఆంధ్రసాహిత్యమున లేడనవచ్చును. భక్తి ప్రాధాన్యతను గుర్తింప జేయుటకై, ప్రకృతి పోతనమహాకవిని తెలుగువారి కందించెనని నుడువవచ్చును. భక్తిరసపూరిత కావ్యనిర్మాణమునందును, భక్తితత్త్వప్రతిపాదనమునందును పోతన ఆంధ్రసాహిత్యమున ఉన్నతమైన స్థానము నాక్రమించి యున్నాడని చెప్ప వచ్చును

పోతన మహాకవి రచనావిధానము గూడ విశిష్టరీతిని సంతరించుకొనిన దనవచ్చును. ఆయనపద్యములు ఖండచక్కెరతునకలు. ఆయన భావములు కమ్మనిపట్టు తేనెలు. ఉభయభాషా ప్రౌఢితో భాషా భావములను సమపాళ్లలో మేళవించి సరసుల నలరించుట పోతన సహజ స్వభావము. మాధుర్యగుణ సమంచితమై యొప్పు పోతన శైలి మంద్రగభీరమై మెల్లగ సాగుచుండును.

పోతన రసపరిపోషణలో అద్వితీయుడు. భక్తి, కరుణ రసముల చిత్రీకరణలో పోతనకు మరెవ్వరు సాటిరారని చెప్పవచ్చును. భక్తి, కరుణములతో బాటు శృంగారమును కూడ పోతన తన కృతులలో మనోజ్ఞముగ పోషించి యున్నాడు. వీరభద్రవిజయమున వీర, రౌద్రబీభత్స, భయానకములను కూడ పోషించిన విధము ప్రశంసనీయము.

పోతన అలంకారములను సమాదరించిన విధము విలక్షణమైనదని చెప్ప వచ్చును. విభిన్న అర్థాలంకారములను తన కైతల దొరసానికి తొడిగినను, ఉప

మాలంకారము మాత్రము వింతసోయగమును సంతరించుకొనినది. అలంకారములను అలంకరణకుగాక, కావ్యసౌందర్యసాధనకు, ఔచితీ పరిపోషణకు పోతన ఉపయోగించెనని వచ్చును. వచనములందును ఉపమాలంకారములనేకములు గలవు. అర్థాలంకారములలో పూర్ణోపమ ప్రయోగమున ఆంధ్రసాహిత్యమున పోతనమహాశయునికి అగ్రస్థానము లభించునని చెప్పవచ్చును.

శబ్దాలంకారములను పోతన పోషించిన విధము అపూర్వమనవచ్చును. ఈయన కృతులన్నింట అను ప్రాసములు అపారముగ నున్నవి. శబ్దాలంకారములను గూడ అర్థవంతముగ సంతరించి కావ్యకన్యల శోభనినుమడింప జేసిన ఘనత పోతనకే దక్కును. భాషాడంబరము కన్నను, భావౌన్నత్యముననే పోతన తన దృష్టిని నిలుపును. ఉదాహరణమునకు,

"కమలాక్షు నర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ" అను భాగవతపద్యము నందు,

"జగములోపలగల జంతురాశులబట్టి మనసులగలచు నీ మహిమ మహిమ" అను వీరభద్రవిజయమునందు గల లాటానుప్రాసలు పోతన కైశల దొరసానికి వెల లేని అలంకారములని చెప్పవచ్చును. కావున శబ్దాలంకారముల ప్రయోగమున ఆంధ్ర సాహిత్యచరిత్రమున పోతనకు అగ్రస్థానముగలదని చెప్పవచ్చును.

పోతన వర్ణనలు బిగువుతో సాగి అర్థవంతములై, అలరారుచుండును. వర్ణనలకు ఔచిత్యమును కల్గించి ప్రకృత వస్తువుతో మేళవింప జేయుట పోతన విశిష్టతయని నుడువచ్చును.

పోతన భోగభాగ్యముల ననుభవించలేదు. విలాస జీవితమును గడుపలేదు. మహారాజ పూజ్యతకూడ పోతనకు పూజ్యమే. అయినను సర్వాంధ్రప్రజా సామాన్యముయొక్క సంపూర్ణ సమ్మాన గౌరవములను పోతన మహాకవి చూరగొని నటుల మరి యే ఆంధ్రకవియు పొందలేదు. సంపూర్ణయశస్సు నార్జించిన ప్రథమాంధ్రకవి పుంగవుడు పోతనమహాకవి.

క్రిందివిధముగ వివరించిన కొందరి వాఙ్మయసాహితీ విమర్శకుల వాక్య రత్నములనుబట్టి ఆంధ్ర సాహిత్యలోకమున పోతనకుగల సమున్నతస్థానమును తెలిసికొనవచ్చును.

శ్రీయుతులు నాగపూడి కుప్పుస్వామయ్య (1905) పోతననుగూర్చి: "ఇతని పదములు కోమలములు, అలంకారములు మనోజ్ఞములు, రచనలు సరసములు, పాకము మధురము, భక్తి అగ్గలము, పాండిత్యము మిక్కుటము, లోకానుభవంబహీనము, వేదాంతార్థచింతనము మెండు" అని వక్కాణించిరి.

శ్రీగురజాడ శ్రీరామమూర్తిగారు, "పోతన పదశయ్యాదులయందుఁదిక్కనతో సరిసేయందగువాఁడు. ఎచ్చోబరిశోధించినను పోతన పాండిత్య విశేషంబుల పూర్వపు కవులవానితో సమానముగను, కొంచెమధికముగ నుండునుగాని న్యూనంబుగ నెన్నండు నుండవు. తిక్కన సంగ్రహశయ్యకును, పోతన యమక కవనంబునకును బ్రసిద్ధులు. తిక్కనరౌద్ర, బీభత్సరస ప్రధానంబులగు నారభటీ వృత్తులును, వీరభయానక రసప్రధాన సాత్వతీ వృత్తులును జెప్పెడి స్వభావముగలవాఁడు. పోతన శృంగార కరుణారసంబులచే నొప్పు కౌశికీవృత్తులును, హాస్యశాంతాద్భుత రసప్రధాన భారతీవృత్తులును జెప్పెడి స్వభావముగలవాఁడు. తిక్కన ప్రత్యక్షశయ్యనుడువ నుత్సహించు పోతన భక్తిరసమొలుక్కనటు పల్కు........ శృంగారవర్ణనలఁదొంటి పురాణకవులలో బోతన కవనంబే మిగులశ్లాఘనీయంబు ....శృంగారవర్ణనలుగాని చోట్లను జూచిన బోతన శంభుదాసునకు నీడగు ననియు, గొంచెమతిశయించు ననియుదోచు"నని తమ "కవిజీవితములు"లో (పుట 620-22) పలికియున్నారు.

తంజనగరము దేవరాజసిధిమణి (తేవప్పెరుమాళ్లయ్య - 1905)గారు, "....మాధురస ఝరీ మధురీ ధురీణ నిరుపమాన నిరర్గళ కవిత్వధారా విరాజితుండగు పోతనామాత్యుండు........, "అది రసోచిత చిత్రవిచిత్ర రచనా చమత్కృతియు, నమేయ వర్ణనాచాతురియుఁదత్త్వార్థ పరిజ్ఞానంబును నిరుపమ ప్రతిభావిస్ఫ

మర దుర్వార కవిత్వ ధారాప్రవాహంబునుంగల మహాకవికిగాక యందఱికలవి గాదు. అట్టి కవి పోతనయేనని యాతని కవిత్వమే చాటుచున్నది. రసవంతము, రచనావైచిత్రి, వేదాంత విషయ వైదుష్యము, తత్త్వార్థనిరూపణ నైపుణ్యము, మాధుర్యము, మృదుత్వము పోతన కవితారీతియందు గలవు. పదలాలిత్యము ప్రసాదవైభవము, సులలిత సరళధార పోతన కవితా కమనీయతకు ముఖ్యహేతువులు. అర్థసారస్యమున బదివాక్య సౌష్ఠవమున తిక్కన యంత ప్రౌఢముగాదు. కాని రసోచిత వైచిత్రి గలదు. తిక్కన కర్థసారస్యమునగన్ను! పోతనకు రస సౌభాగ్యమున దృష్టి" అని చెప్పియున్నారు.

శ్రీరాయదుర్గము నరసయ్యాశాస్త్రిగారు (1915), "ఇమ్మహామహుని కవిత్వ మతి మృదుల మటితంబు గావున కర్ణరసాయనంబై, శబ్దార్థాలంకార భాసమానంబు గావునఁబండిత పామరజన మనోరంజకంబై, యెల్లవారి హృదయార విందంబుల మందానందంబు నొందించు అర్థమాపాత స్ఫూర్తి గలిగియుండు. సమతాప్రసాదమాధుర్యాది కావ్యగుణంబులు నెల్లెడలజూపట్టు"ననిరి.

శ్రీశేషాద్రిరమణకవులు, "అనితర సాధారణ మృదుమధుర చిత్రనిసర్గ నిరర్గళ ధారాధోరణి భాసురుడు పోతన. అతని కవితాధారాశుద్ధంబై సుకుమార భూయిష్టంబై యుండు. కవితావిషయమున దాను చేసిన ప్రతిజ్ఞశ్లాఘనీయముగ నిర్వహించి యజరామరకీర్తి గడించెను" అని పల్కిరి.

శ్రీ ఆంధ్రవేషగిరిరావుగారు, (పదునాల్గవ సంవత్సరాది సంచిక)(1924) "పోతన శబ్దార్థముల రెండింటికి సమాన గౌరవములనిచ్చి, సామర్థ్యాతిశయముతో శబ్దార్థాలంకారములు ప్రయోగించెను" అని చెప్పిరి. "ఆత్మగౌరవముఁగల కవి సత్తముడు" అనికూడవారు నుడివిరి.

శ్రీవిద్యారత్న వేంకటరావు (1956)గారు, "కవితాశిల్పమున సహజపాండిత్యుడు వశ్యవాక్తముడు. ఆబాలగోపాలము నాంధ్రమహాజనుల హృదయములను

మధురభక్తి భావనచే నుఱ్ఱూతలూగించిన మహాకవి. మహాప్రవక్త. ఆంధ్రుల భక్తిమయజీవితమున పోతన స్థానమాకల్పాంతరస్థాయి' అని నుడివిరి.

శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులు (1956) గారు, "ఆంధ్రసాహిత్యములో నాతడొక స్వప్నము వంటివాడు. కవులెందరో పుట్టిరి. పుట్టుదురు. పోతనా మాత్యుని వంటి తపస్వి, ఋషి, కవి పుట్టునని ధైర్యముగఁజెప్పలేము" అని వ్రాకుచ్చిరి.

ఆచార్యపింగళి లక్ష్మీకాంతముగారు, "ఆంధ్రసాహిత్యాకాశమున తిక్కన పోతన లిరువురు సూర్యచంద్రుల వంటివారు" (పోతన - నిడదవోలు వేంకటరావు పుటలు - 224-228) అని నుడివిరి.

భాషాంతరీకరణమున పెంపు, అను ప్రాసలందు ఇంపు, భక్తిరసప్రవాహమున ముంపు, కైతల సొంపు, జీవితమునగల తెంపు బమ్మెర పోతనను ఆంధ్ర సాహిత్యమున అగ్రస్థానమున నిడుచున్నవి. ఈ మహానుభావుని ఆవిర్భావము ఆంధ్రసాహిత్యమునకు వరము, ఆంధ్రుల పూర్వజన్మ తపఃఫలము అని చెప్ప వచ్చును

పోతన, బాల్యమున వీరభద్రవిజయమును, యౌవనమున భోగినీదండకమును, ఆవెనుక నరస్తుతి విముఖుడై నారాయణశతకమును, అపిదప ఆంధ్ర మహాభాగవతమును రచించెను. ప్రథమమున శైవుడైనను, ఆవెనుక విష్ణుభక్తి తత్పరుడై, చివరకు అద్వైతియయ్యెను. శివ, రామ, కృష్ణులయందితనకి అభేద భావముగలదు. పోతన శివుని పూజించెను. శ్రీరామునికీర్తించెను. శ్రీకృష్ణతత్త్వ మును విశదీకరించెను.

పై వివరించిన అంశములనుబట్టి బమ్మెరపోతనకు ఆంధ్రసాహిత్యమున సముచిత స్థానము గలదని చెప్పవచ్చును.

-: స మా ప్త ము :-

# ఉపయుక్త గ్రంథములు


1 అప్పకవీయము - కాకునూరి అప్పకవి - వావిళ్లవారు - 1966.

2. ఆంధ్రకవితరంగిణి - సం 6 - శ్రీచాగంటిశేషయ్య - ఆంధ్రప్రచారిణీలిమిటెడ్ - కపిలేశ్వరపురం - 1949

2. ఆంధ్రకవులచరిత్రము - సం 10 - శ్రీకందుకూరి - శ్రీరామాప్రెస్ - రాజమండ్రి - 1937.

4 ఆంధ్రభాగవతోపన్యాసములు 2 శ్రీమల్లింపల్లి సోమశేఖరశర్మ (ప్రథమవ్యాసము) - సికింద్రాబాద్ - 1957.

5. ఆంధ్రుల సాంఘికచరిత్ర - శ్రీసురవరం ప్రతాపరెడ్డి - సికింద్రాబాద్ 1966.

6. ఆంధ్ర సాహిత్యచరిత్ర సంగ్రహము - ఆచార్యఖండవల్లి లక్ష్మీరంజనము - వేంకటరమణపబ్లికేషన్స్ - హైదరాబాద్ - 1958.

7. ఆంధ్రమహాభారతము - ఛందఃశిల్పము - డా॥ పాటిబండ మాధవశర్మ - సికింద్రాబాద్ - శివాజీప్రెస్ - 1966.

8. ఆన్ధ్రచంద్రాలోకము - అక్కిరాజఉమాకాన్తమ్ - వావిళ్లవారు - 1970.

9. కవిజీవితములు - గురజాడశ్రీరామమూర్తి - వావిళ్లప్రతి - 1955,

10. కావ్యాలంకార సంగ్రహము - (నరసభూపాలీయము) - సన్నిధానమువారి వ్యాఖ్య - హిందూప్రెస్ - మచిలీపన్నం 1959

11. కుమారసంభవము - నన్నెచోడుడు - సాహిత్యఅకాడమీ - 1968.

12. కాశీఖండము - శ్రీనాథుడు - వావిళ్లప్రతి - 1933.

13. తాళ్లపాకచిన్నన్నకృతులు - సవిమర్శకపరిశీలనము - డా॥ సి. రమణయ్య. పద్మబాలపబ్లికేషన్స్ - మదనపల్లి - 1984.

14. తెలుగు కావ్యావతారికలు - డా॥జి నాగయ్య - ఫ్రీడంప్రెస్ - మద్రాస్ 1968

15. తెలుగు జానపదగేయ సాహిత్యము - డా॥బి. రామరాజు - జానపదవిజ్ఞాన ప్రచురణలు - హైదరాబాదు - 1978.

16. తెలుగుసాహిత్యముపై వీరశైవమతప్రభావము - జీరెడ్డిచెన్నారెడ్డి - 1965.

17. తెలుగువిజ్ఞానసర్వస్వము - సం. 3 - పింగళి లక్ష్మీకాంతము - హిందీప్రచార్ ముద్రణాలయము - మద్రాసు - 1959.

18. తెలుగు సామెతలు - జనజీవనం - డా॥ పి. నరసింహారెడ్డి - శ్రీనివాసమురళీ పబ్లికేషన్స్ - తిరుపతి - 1983.

II

19. తెలుగు సామెతలు - దివాకర్లప్రభృతులు - ఆం. ప్ర. సా అకాడమీ 1974

20. ప్రతాపరుద్రీయమ్ - విద్యానాథుడు - వావిళ్లప్రతి - మద్రాసు - 1965.

21. ప్రబంధములలో ప్రకృతివర్ణనలు - డా॥ అంతటి నరసింహం - చారీ అండ్ కంపెనీ - సికింద్రాబాద్ - 1979.

22. పోతన - శ్రీనిడదవోలు వెంకటరావు - భారతప్రభుత్వసమాచార రేడియో మంత్రిత్వశాఖప్రచురణ విభాగం-1962

23. పోతనగారి వైచిత్రి - డా॥ కే రామకోటిశాస్త్రి - క్వాలిటీపబ్లికేషన్స్ - విజయవాడ - 1981-82

24. పోతన - శ్రీవెంపరాల సూర్యనారాయణశాస్త్రి - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ - హైదరాబాద్ 1975

25. పోతనచరిత్రము - శ్రీవానమామలై వరదాచార్యులు - శ్రీరామాపవర్ ముద్రణాలయము - సికింద్రాబాద్ - 1966

26. భక్తిరసశతకసంపుటము - 3 వావిళ్లముద్రణ - చెన్నపురి - 1923

27. భోగినీదండకము - బమ్మెరపోతన - వావిళ్లప్రతి - 1949

28. మన మతములు - సంప్రదాయములు - డా॥ పులుల శ్రీరామచంద్రుడు - ఆం ప్ర సా అకాడమీ - హైదరాబాద్ - 1975

29 రామచరితమానస్ -(తులసీదాస్) - తెలుగు అనువాదము - ముంగరశంకర రాజు - విక్టరీప్రెస్ - విజయవాడ 1965

30 వీరభద్రవిజయము - పోతన - వావిళ్లముద్రణ - 1924, 1948, 1960

31. వీరశైవాంధ్రవాఙ్మయము - శిష్టారామకృష్ణశాస్త్రి తి.తి దే - తిరుపతి 1952

32 శివపురాణము - శ్రీముదిగొండ నాగవీరేశ్వరకవి - శ్రీరామాబుక్ డిపో - సికింద్రాబాద్ - 1947

33 శివతత్త్వసారము - మల్లికార్జునపండితుడు - ఆం సా. పరిషత్తు - 1922

34 శ్రీమదాంధ్రమహాభాగవతము - పోతన - సాహిత్యఅకాడమి - హైదరాబాద్ 1968

35. శ్రీమదాంధ్ర మహాభాగవతము - పోతన - వేంకట్రామాఅండ్ కో - విజయవాడ - 1974

36 శ్రీమదాంధ్ర మహాభాగవతము – వావిళ్ళవారిముద్రణ – విమర్శ నేలటూరి – పీఠిక – శేషాద్రిరమణకవులు – 1968

37. శ్రీమదాంధ్రమహాభారతము – శాంతిపర్వము – తిక్కన – రామాఅండ్‌కో – ఏలూరు – 1939

38. శ్రీమద్భాగవతానుశీలనము – డా॥ ధూళిపాళ శ్రీరామమూర్తి – గ్రామస్వరాజ్య ప్రెస్ – విజయవాడ – పరీధావి – ఫాల్గుణ 23

39 శ్రీవాయుమహాపురాణమ్ – వ్యాసుడు – నాగ్ పబ్లికేషన్ – 11 – U.A. పోస్ఆఫీస్ బిల్డింగ్స్ – జవహర్ నగర్ – డిల్లీ

40 శ్రీ వీరభద్ర ఖడ్గమాల – సంకలనం – రేవణసిద్ధాంతి – వీరశైవ సంక్షేమ సమాజము–శ్రీ బసవేశ్వర దెవస్థానము–నంద్యాల–1986

41 శ్రీ వీరభద్ర సహస్రనామాది కదంబం – బుల్లాసుబ్బారెడ్డి – ఇందుకూరుపేట దేవాలయముల యాజమాన్యము – నెల్లూరు ఆగష్టు–1959

42 శ్రీ కురవి వీరభద్రమాహాత్మ్యము – శ్రీ ఎం సచ్చిదానందామూర్తి – సాహిత్య రంజని – నాగలక్ష్మి ఆర్ట్ప్రింటర్స్ – హైదరాబాద – 1977

43 సమగ్రాంధ్రసాహిత్యము – ఆరుద్ర సం 5 వెల్డన్‌ప్రెస్–మద్రాస్–1965 ఆగష్టు

44 సాహిత్యశిల్పసమీక్ష పింగళిలక్ష్మీకాన్తమ్ పేపర్ & పేపర్ ప్రాడక్ట్స్ 1981


45. సాధనాపమృతము – శ్రీ కల్లూరు వెంకటనారాయణరావు –శ్రీ సాధన ప్రింటింగ్ లిమిటెడ్ – అనంతపురం – క్రోధి – వైశాఖ – పూర్ణిమా

46. తంజావూరు తెలుగుకవులు – శిష్టా లక్ష్మీకాంతశాస్త్రి – శ్రీ అరుణా బుక్‌హౌస్ మద్రాసు – 1931

47. విజ్ఞాన సర్వస్వము – సం 7 –తెలుగు భాషాసమితి – క్రొత్త సచిదానంద మూర్తిగారి వ్యాసములు – హిందీప్రచార్ ముద్రాణాలయము – మద్రాసు – 1962

48. Glden Jubile Celebrations Souvenior – T T.D. – 1984.


TIRUPATI
55667



గ్రంథకర్త :

**డా॥ కె. వి. రాజేంద్రప్రసాద్**

వయస్సు : 36 సం॥లు.

తల్లిదండ్రులు : శ్రీకొల్లి వీరభద్రరావు సత్యవతమ్మగార్లు

జన్మస్థలము : కాకులపాడు, బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా ఆం. ప్ర.

విద్యాభ్యాసము : హైస్కూల్ విద్య - కానుమోలు, కృష్ణాజిల్లా

కళాశాల విద్య - **S.M.O** కళాశాల, ఆగిరిపల్లి, కృష్ణాజిల్లా

**P.O.L** (సంస్కృతం) } ఆంధ్రావిశ్వవిద్యాలయం,
**M.A.,** (తెలుగు) } విశాఖపట్నం

**Ph.D.,** (తెలుగు) - శ్రీవేంకటేశ్వరా విశ్వవిద్యాలయం, తిరుపతి

ఉద్యోగము : సీనియర్ తెలుగుపండిట్ - **SERM** జూనియర్ కళాశాల గుడ్లవల్లేరు, కృష్ణాజిల్లా.

2. జూనియర్ లెక్చరర్ (తెలుగు) పుంగనూరు, పెనుమూరు, ప్రభుత్వజూనియర్ కళాశాలలు

ఇతర రచనలు : నివేదనము (శతకరూపపద్యకృతి)

భోగినీదండకము - విమర్శనాత్మక సమీక్ష

పృథ్వీభాగవతము - ఒకసమీక్ష

శ్రీశైలప్రభ, (శ్రీశైలదేవస్థానం), తొలిప్రొద్దు (జాతీయపక్ష పత్రిక) లలో సీరియల్ వ్యాసములు

స్రవంతి, సప్తగిరి, తెలుగువైజ్ఞానిక మాసపత్రికలలో వ్యాసములు, రేడియో కథానికలు ఉపన్యాసములు.

హాబీలు : భాషాబోధన - సాహిత్యశోధన.